అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
గురువారం 12-12-2024
సంపుటి : 10 సంచిక : 343 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50



అదానీ లంచాలపై చర్చించాలి

జాతీయ జెండాలతో ప్రతిపక్షాల వినూత్న నిరసన

పార్లమెంటు ఆవరణలో బీజేపీ నేతలకు త్రివర్ణ పతాకం, గులాబీలు అందజేత

సభను సజావుగా నడపండి : లోక్‌సభ స్పీకర్‌కు రాహుల్ గాంధీ వినతి

రైల్వే సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంటు సమావేశాల్లో అదానీ ముడుపుల వ్యవహారంతోపాటు పలు అంశాలపై ప్రతిపక్షాలు చర్చకు పట్టుబట్టాయి. దీంతో ప్రతిపక్ష సభ్యులకు, బీజేపీకి మధ్య ప్రతిష్టంభన కొనసాగుతోంది. మరోవైపు పార్లమెంటు ఆవరణలో కాంగ్రెస్ నేతలు 'అదానీ' అంశంపై చర్చ జరపాలంటూ వినూత్న రీతిలో ఆందోళనలు కొనసాగిస్తున్నారు. అందులో భాగంగా బుధవారం పార్లమెంటు ఆవరణలో నిలబడి సభలకు హాజరవుతున్న బీజేపీ నేతలకు త్రివర్ణ పతాకం, గులాబీలు అందించారు. ఆ సమయంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అక్కడకు రావడంతో రాహుల్‌గాంధీ వేగంగా వెళ్లి ఆయన చేతికి త్రివర్ణ పతాకం, గులాబీ ...3లో

రాజ్యసభ ఛైర్మెన్‌ది పక్షపాత ధోరణి

నిబంధనలకు విరుద్ధంగా రాజకీయాలు నడుపుతున్నారు

ఆయనను తొలగించేందుకే అవిశ్వాసం : ఇండియా బ్లాక్

3లో..

ఉన్నా లేనట్టే..!

ఉనికిని కోల్పోతున్న మానవ హక్కుల కమిషన్లు

ఇబ్బంది పెడుతున్న సిబ్బంది కొరత

- హరించుకుపోతున్న ప్రజల స్వేచ్ఛ
- చోద్యం చూస్తున్న పాలకులు

మానవహక్కులను కాపాడాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాటిని బేఖాతరు చేస్తున్నాయి. పేదలు, కార్మికులు తమ హక్కుల కోసం రాజీలేని పోరాటం చేయటానికి, కనీసం తమ గోస వినిపించుకోవడానికి సరైన వేదిక అంటూ లేకుండా చేస్తున్నాయి ప్రభుత్వాలు. హక్కుల కమిషన్లు ఉన్నా వాటిని నిర్వీర్యం చేసే దిశగా వ్యవహరిస్తున్నాయి. హక్కుల కమిషన్లలో ఉన్న ఖాళీలను భర్తీ చేయకుండా గాలికొదిలేస్తున్నాయి. దేశవ్యాప్తంగా సుమారు 23 లక్షలకు పైగా పిటీషన్లు కమిషన్ కార్యాలయాల్లో పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నాయి.



న్యూఢిల్లీ : వివిధ రాష్ట్రాల్లో మానవ హక్కుల కమిషన్లు క్రమేపీ ఉనికి కోల్పోతున్నాయి. నామమాత్రపు సంస్థలుగా వ్యవహరిస్తూ ప్రజల హక్కులను పరిరక్షించడంలో దారుణంగా విఫలమవుతున్నాయి. హరించబడుతున్న ప్రజల హక్కులు, స్వేచ్ఛ పట్ల ఏ మాత్రం శ్రద్ధ లేని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి, సిబ్బంది కొరత దీనికి ప్రధాన కారణాలు. దేశంలోని 28 రాష్ట్రాల్లో కనీసం 16 రాష్ట్రాల్లో మానవ హక్కుల కమిషన్లు ఉన్నా లేనట్లుగానే కన్పిస్తున్నాయి. 1993వ సంవత్సరం నాటి మానవ హక్కుల పరిరక్షణ చట్టం నిర్దేశించిన మేరకు కమిషన్లలో నియామకాలు జరగడం లేదు. హక్కుల కమిషన్‌లను పటిష్టం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలది. కానీ స్వయంగా ప్రభుత్వాలే ఒకవైపు ప్రజల హక్కులను హరిస్తూ, మరోవైపు కమిషన్‌లను నిర్వీర్యం చేస్తుండటం ఆందోళనకరంగా మారింది.

చట్టం ఏం చెబుతోంది?

మూడు రాష్ట్రాల్లో కమిషన్లకు ఛైర్‌పర్సనే లేరు. ఏడు కమిషన్లకు శాశ్వత ఛైర్‌పర్సన్ల నియామకం జరగలేదు. తెలంగాణ, మిజోరం రాష్ట్రాల కమిషన్లలో కనీసం ఒక్కరంటే ఒక్క ఆఫీస్ బేరర్ కూడా లేడు. మానవ హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం రాష్ట్ర కమిషన్లకు ఛైర్‌పర్సన్ ఉండాలి. ఆయన హైకోర్ట్ ప్రధాన న్యాయమూర్తి లేదా జడ్జి అయి ఉండాలి. కమిషన్‌లో ఇద్దరు సభ్యులు కూడా ఉండాలి. ఒకరు కనీసం ఏడు సంవత్సరాల అనుభవం కలిగిన హైకోర్టు లేదా జిల్లా కోర్టు జడ్జి అయి ఉండాలి. మానవ హక్కులకు సంబంధించిన వ్యవహారాలలో అనుభవం కలిగిన వ్యక్తిని రెండో సభ్యుడిగా నియమించాల్సి ఉంటుంది. అయితే 12 రాష్ట్రాల్లో ఒకరు లేదా ఇద్దరు సభ్యులూ లేరు.

ఎన్‌హెచ్‌ఆర్‌సీకి అక్రెడిటేషన్ వాయిదా

ఐరాస గుర్తింపు పొందిన గ్లోబల్ అలయన్స్ ఆఫ్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ఇన్‌స్టిట్యూషన్స్ (జీఏఎన్‌హెచ్‌ఆర్‌ఐ) ఈ ఏడాది ఎన్‌హెచ్‌ఆర్‌సీకి తన అక్రెడిటేషన్‌ను వాయిదా వేసింది. అనేక దశాబ్దాల కాలంలో ఇలా జరగడం ఇది రెండోసారి మాత్రమే. నియామకాలలో రాజకీయ జోక్యం, మానవ హక్కుల ఉల్లంఘనలపై జరిగే విచారణలో పోలీసుల ప్రమేయం, పౌర సమాజానికి పేలవమైన సహకారం వంటి అంశాలను ఇందుకు కారణంగా చూపింది. ప్రపంచంలోని 16 మానవ హక్కుల సంస్థలతో జీఏఎన్‌హెచ్‌ఆర్‌ఐ ఏర్పడింది. ప్రస్తుతం దేశంలోని అనేక రాష్ట్రాలు తాత్కాలిక నియామకాలతో కాలం గడిపేస్తున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో అవసరమైన మేరకు సభ్యులు కూడా ...13లో

వివిధ రాష్ట్రాల్లో...

తెలంగాణతో పాటు పంజాబ్, జార్ఖండ్, హిమాచల్ ప్రదేశ్, బీహార్, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల మానవ హక్కుల కమిషన్లలో ఒక్క సభ్యుడు కూడా లేడు. గుజరాత్, త్రిపుర, కర్నాటక, నాగాలాండ్, మణిపూర్, సిక్కిం రాష్ట్రాల్లో పరిస్థితి కొంత మెరుగ్గా ఉన్నప్పటికీ కనీసం ఒక సభ్యుని పోస్టు ఖాళీగా ఉంది. ఛత్తీస్‌గఢ్, గోవా, అరుణాచల్ ప్రదేశ్, జార్ఖండ్, కర్నాటక, సిక్కిం కమిషన్లలో శాశ్వత ఛైర్‌పర్సన్లు లేరు. అనేక రాష్ట్ర ప్రభుత్వాల అజెండాల్లో మానవ హక్కులకు స్థానమే లేదని హక్కుల కార్యకర్తలు పెదవి విరుస్తున్నారు. అందుకే కార్మిక చట్టాలు, పేదలు-అట్టడుగు వర్గాల ప్రజల హక్కుల విషయంలో రాజీ పడాల్సిన పరిస్థితి దాపురించిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

జాతీయ కమిషన్‌లోనూ...

జాతీయ మానవ హక్కుల కమిషన్‌లోనూ ఇదే పరిస్థితి కన్పిస్తోంది. జూన్ నుండి శాశ్వత ఛైర్‌పర్సన్ నియమకం జరగలేదు. అరుణ్ మిశ్రా పదవీకాలం ముగియడంతో జూన్‌లో విజయ భారతి సయానీని తాత్కాలిక ఛైర్‌పర్సన్‌గా నియమించారు. ఇప్పుడు సయానీ మాత్రమే జాతీయ కమిషన్‌లో పూర్తి స్థాయి సభ్యుడిగా కొనసాగుతున్నారు. సభ్యుల పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. ఈ ఏడాది మార్చిలో అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థలు ఐరాస మానవ హక్కుల మండలికి ఓ లేఖ రాస్తూ దేశంలో నెలకొన్న హక్కుల పరిస్థితిపై దృష్టి సారించాలని కోరాయి.

కాంగ్రెస్‌ది ద్రోహుల చరిత్ర

డిసెంబర్ 9 ప్రకటన పోరాట ఫలం

ఎవరో దయ తలచింది కాదు

తెలంగాణ ద్రోహి రేవంత్‌రెడ్డి

వక్రీకరిస్తే తెలంగాణ చరిత్ర, కేసీఆర్ కీర్తి చెదరదు

2015లోనే సంగారెడ్డి కలెక్టరేట్‌లో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ : మాజీమంత్రి హరీశ్‌రావు



వివరాలు 5లో



పకడ్బందీగా ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల

ప్రక్రియ చేపట్టాలి

500 మందికి ఒక సర్వేయర్

31 నాటికి పరిశీలన పూర్తి చేయాలి

13లోపు సామాజిక సర్వే తుది గడువు

14న సంక్షేమ హాస్టల్ విద్యార్థులతో సహపంక్తి భోజనం

15,16 తేదీల్లో జరిగే గ్రూప్-2 పరీక్షలకు విస్తృత ఏర్పాట్లు : కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పొంగులేటి

వివరాలు 6లో

సివిల్స్ మెయిన్స్‌లో తెలంగాణ అభ్యర్థుల సత్తా

అర్హత పొందిన వారికి సీఎం రేవంత్‌రెడ్డి అభినందనలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) మెయిన్స్-2024 ఫలితాల్లో తెలంగాణ అభ్యర్థులు సత్తా చాటారు. ఈ ఏడాది తొలి సారిగా రాష్ట్రం నుంచి సివిల్స్ మెయిన్స్ పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. సివిల్స్ మెయిన్స్‌కు హాజరైన అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందించిన విషయం తెలిసిందే. సివిల్స్ సాధించే లక్ష్యంతో సన్నద్ధమయ్యే పేద కుటుంబాలకు అండగా నిలిచేందుకు రాజీవ్ సివిల్స్ అభయ హస్తం పథకాన్ని ఈ ఏడాది తొలిసారిగా ప్రభుత్వం అమలు చేసింది. సింగరేణి సంస్థ అధ్వర్యంలో 135 మందికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించింది. ఈ ఏడాది ఆగస్ట్ 26న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వారికి చెక్కులను పంపిణీ చేశారు. రాజీవ్ సివిల్స్ అభయ హస్తం సాయం అందుకున్న అభ్యర్థుల్లో ...13లో





13లో

ఆన్‌లైన్ బెట్టింగ్‌కు

బానిసై..

అందినకాడికల్లా అప్పులు

వేధింపులు తాళలేక

కుటుంబం ఆత్మహత్యాయత్నం

పరిస్థితి విషమించి నలుగురి మృతి

మంచిర్యాల జిల్లా కాసిపేట

గ్రామంలో విషాదం

ఉత్తమ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు అవార్డులిస్తాం

ప్రజల మనస్సు చదివితేనే రాజకీయ నేతలవుతారు

బోడేపూడి, నర్రా రాఘవరెడ్డి,

రజబ్ అలీ, వైఎస్ఆర్, ఓంకార్,

జైపాల్‌రెడ్డి స్ఫూర్తి : ప్రజాప్రతినిధుల

శిక్షణ కార్యక్రమంలో శ్రీధర్‌బాబు,

మండలి ఛైర్మెన్

గుత్తా సుఖేందర్‌రెడ్డి,

అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రానున్న కాలంలో ప్రతి ఏటా ఉత్తమ పార్లమెంటేరియన్ తరహాలో ఉత్తమ ఎమ్మెల్యే, ఉత్తమ ఎమ్మెల్సీలకు అవార్డులు ఇచ్చేందుకు నిర్ణయం తీసుకుంటామని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. గత పదేండ్ల కాలంలో ఎప్పుడు కూడా ఇలాంటి అవగాహన కార్యక్రమాలను నిర్వహించలేదని తెలిపారు. శాసనసభ సమావేశాలకు, రాజకీయ పార్టీలకు సంబంధం లేదని స్పష్టం చేశారు. అయినా బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు రాకపోవడం శోచనీయమన్నారు. శిక్షణా కార్యక్రమాలకు హాజరు కావాలని ఆయన కోరారు. బుధవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్ ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలో తెలంగాణ రాష్ట్ర ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు రెండ్రోజులపాటు నిర్వహించనున్న శిక్షణా కార్యక్రమాన్ని మండలి ఛైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, స్పీకర్ ...13లో

రాజ్యాంగ ప్రతిమ ధ్వంసం

పర్భని జిల్లాలో పరిస్థితి ఉద్రిక్తం

ముంబయి: మహారాష్ట్రలోని పర్భని వద్ద రాజ్యాంగం ప్రతిమను గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. దీంతో అక్కడి పరిస్థితి ఉద్రిక్తంగా ...6లో



పెరిగిన మానవ అక్రమ రవాణా

ప్రధాన బాధితులు బాలికలు, మహిళలే : యూఎన్ నివేదిక వెల్లడి

వియన్నా : అంతర్జాతీయంగా మానవుల అక్రమ రవాణా పెరిగిందని ఐక్యరాజ్య సమితి సంస్థ యుఎన్‌ఓడిసి పేర్కొంది. ఈ మేరకు బుధవారం ఒక నివేదికను ...13లో



బియ్యం కుంభకోణం

ప్రభుత్వానికి రూ. 217 కోట్ల కస్టమ్ మిల్లింగ్ రైస్ ఎగవేత

దిర్శంచర్ల తిరుమల కార్పొరేషన్ రూ.107 కోట్ల బియ్యం ఎగవేత

గరిడేపల్లిలో రూ.110 కోట్ల బియ్యం భాగోతం వెలుగులోకి..

రెండు మిల్లుల నిర్వాహకులు తండ్రీకొడుకులే..

సూర్యాపేట జిల్లాలోని నేరేడుచర్ల, గరిడేపల్లిలో కేసుల నమోదు

13లో..



శాంతి భద్రతలకు విఘాతం కలిగించను

సీపీకి బాండ్ రాసిచ్చిన నటుడు మంచు మనోజ్

విచారణకు హాజరు

మా నాన్న దేవుడు : మనోజ్

విష్ణు ప్రధాన అనుచరుని అరెస్ట్





నవతెలంగాణ-సిటీబ్యూరో/బడంగ్‌పేట్

శాంతి భద్రతలకు విఘాతం కలిగించనని, తనంతట తాను గొడవలకు దిగనని ప్రముఖ సినీ హీరో మంచు మనోజ్ రాచకొండ సీపీ సుధీర్‌బాబుకు బాండ్ రాసిచ్చారు. మోహన్‌బాబు, మంచు మనోజ్ మధ్య ఆదివారం మొదలైన వివాదం తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపింది. మంగళవారం మోహన్‌బాబు ఇంటి వద్ద మనోజ్‌ను సెక్యూరిటీ అడ్డుకోవడంతో వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో ఓ జర్నలిస్టుపై మోహన్‌బాబు దాడి చేసిన విషయం విదితమే. దాంతో రాచకొండ సీపీకి ఫిర్యాదులు రావడంతో 126 బీఎస్ ప్రకారం జిల్లా అదనపు మెజిస్ట్రేట్ హోదాలో రాచకొండ సీపీ సుధీర్‌బాబు.. మోహన్‌బాబు, అతని కుమారులు విష్ణు, మనోజ్ విచారణకు రావాలని నోటీసులు పంపించారు. బుధవారం మంచు మనోజ్ రాచకొండ సీపీ సుధీర్‌బాబు ముందు హాజరయ్యారు. సీపీ అడిగిన పలు ప్రశ్నలతోపాటు, ఘటనపై మనోజ్ వివరించినట్టు ...6లో

బీజేపీది వక్రీకరణే

ఫ్రాన్స్ సంస్థ మీడియాపార్ట్

తాను ప్రచురించిన వార్తా కథనాన్ని భారత్‌లోని బీజేపీ ప్రభుత్వం వక్రీకరించిందని ఫ్రాన్స్‌కు చెందిన పరిశోధనాత్మక జర్నలిజం సంస్థ మీడియాపార్ట్ ఆరోపించింది. అమెరికా ప్రభుత్వం, కోటీశ్వరుడైన జార్జ్ సొరస్, కాంగ్రెస్ పార్టీ కలిసి కుట్రకు పాల్పడ్డాయంటూ ఆ పార్టీ ఓ వాదనను ముందుకు తెచ్చిందని ఎద్దేవా చేసింది. వ్యవస్థీకృత నేరం, అవినీతికి సంబంధించి మీడియాపార్ట్ జరిపిన పరిశోధనను బీజేపీ ఇటీవల ప్రస్తావించింది. మోడీ ప్రభుత్వాన్ని అస్థిరపరచేందుకు జరుగుతున్న ప్రచారానికి సొరోస్, అమెరికా విదేశాంగ శాఖ మద్దతు ఇస్తున్నాయని మీడియాపార్ట్ కథనం చెబుతోందని ఆరోపించింది. వాస్తవానికి అదానీ గ్రూప్ పాల్పడిన అనేక ఆర్థిక అవకతవకలపై మీడియాపార్ట్ పలు పరిశోధనాత్మక కథనాలు ప్రచురించింది.

న్యూఢిల్లీ : 'వ్యవస్థీకృత నేరం, అవినీతిపై ఇటీవల మేము ప్రచురించిన పరిశోధనాత్మక వ్యాసాన్ని బీజేపీ తనకు అనుకూలంగా మార్చుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. బీజేపీ ఆరోపణలు దాని రాజకీయ అజెండాను ముందుకు తీసికెళ్లేందుకు, పత్రికా స్వేచ్ఛపై దాడికి మాత్రమే ఉపయోగపడతాయి' అని మీడియాపార్ట్ ప్రచురణకర్త, డైరెక్టర్ కరైన్ ఫాటియూ విమర్శించారు. మీడియాపార్ట్ వ్యాసాన్ని బీజేపీ తనకు అనుకూలంగా, తప్పుగా ఉపయోగించుకున్నదని, తప్పుడు వార్తలను ప్రచారం చేసేందుకు ఈ చర్యకు పాల్పడిందని ఆయన చెప్పారు. ఇలాంటి వార్తలను తాము ఎప్పుడూ ప్రచురించ బోమని స్పష్టం చేశారు. బీజేపీ ముందుకు తెచ్చిన కుట్ర కోణాన్ని సమర్థించేందుకు ఎలాంటి ఆధారాలు అందుబాటులో లేవని ఆయన చెప్పారు. భారత్‌లో వార్తలు రాస్తూ, పరిశోధనలు నిర్వహిస్తున్న భారతీయ, అంతర్జాతీయ పాత్రికేయులను ఫాటియూ అభినందిం చారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై విమర్శలు సంధించడానికి బీజేపీ ఎంపీలు పార్లమెంటులో మీడియా పార్ట్ వ్యాసాన్ని ప్రస్తావించారు. సొరస్, ఇతరులతో కలిసి రాహుల్ కుట్ర పన్నారని ఆరోపించారు. మీడియాపార్ట్ చేపట్టిన ప్రాజెక్టుకు యూఎస్ఏఐడీ అనే ...13లో

రఫేల్ ఫైటర్ జెట్ల కొనుగోలులో అవినీతి

ఫ్రాన్స్ ఉత్పత్తిదారు దస్సాల్ట్ ఏవియేషన్ నుంచి మోడీ ప్రభుత్వం జరిపిన 36 రఫేల్ ఫైటర్ జెట్ల కొనుగోలులో అవినీతి జరిగిందంటూ 2018 నుండే మీడియాపార్ట్ అనేక నివేదికలు ప్రచురించింది. అవినీతి వ్యవహారంపై ఫ్రాన్స్ న్యాయ వ్యవస్థ జరుపుతున్న విచారణకు కేంద్ర ప్రభుత్వం అడ్డంకులు సృష్టిస్తోందని మీడియాపార్ట్ తాజాగా 2023 డిసెంబరులో ఓ కథనాన్ని అందించింది. కాగా అదానీ గ్రూప్ వ్యవస్థాపకుడు గౌతమ్ అదానీని కాపాడేందుకు జరిగిన కుట్రలో భాగంగా అమెరికాతో ద్వైపాక్షిక సంబంధాలకు బీజేపీ విఘాతం కలిగిస్తోందని కాంగ్రెస్ నాయకుడు పవన్ ఖెరా విమర్శించారు.



వేసవికి ముందస్తు ప్రణాళిక

- భగీరథను వేధిస్తున్న బకాయిలు
- క్షేత్రస్థాయి పరిస్థితిపై శాఖాపరమైన తనిఖీలు
- రూ.1450 కోట్లు అవసరం
- ప్రతియేటా నిర్వహణకు కనీసం రూ.200 కోట్లు కావాల్సిందే





నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

వచ్చే వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా మిషన్ భగీరథ శాఖ తంటాలు పడుతున్నది. క్షేత్రస్థాయిలో పరిస్థితులను అంచనా వేసేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నది. శాఖా ఉన్నతా ధికారులు కిందిస్థాయి అధికార యంత్రాంగం వెంటపడుతూ సన్నాహాలు చేస్తున్నది. ఇందుకు అవసరమైన గట్టి చర్యలు తీసుకునేందుకు సమీక్షలు, వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తున్నది. ఎప్పటి కప్పుడు పంచాయతీరాజ్ శాఖ నుంచి వచ్చే ఆదేశాలను అమలు చేసే ప్రయత్నం చేస్తున్నది. ఇదంతా ఒక పార్శ్వం. మరో వైపు పరిస్థితి భిన్నంగా కనిపిస్తున్నది. నిధుల కొరత మిషన్ భగీరథను వేధిస్తున్నది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 42 వేల కోట్లతో భగీరథ పథకాన్ని అమల్లోకి తెచ్చింది. ప్రధాని మోడీ రాష్ట్రానికి వచ్చి ఉమ్మడి మెదక్ జిల్లా కోమటిబండలో ఈ పథకాన్ని ప్రజలకు అంకితం చేశారు. ఈ ప్రాజెక్టు దేశవ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన మాట వాస్తవమే. అలాగే ఆయా రాష్ట్రాలకు డీపీఆర్ పంపి ఈ తరహా ప్రాజెక్టులు నిర్మించాలని కేంద్రం సూచించింది. అయితే ఈ ప్రాజెక్టుకు రూ. 17 వేల కోట్ల ఆర్థిక సాయం చేయాలని నిటిఆయోగ్ చెప్పినా పట్టించుకోకపోవడం గమనార్హం.

రూ.1250 కోట్లు పెండింగ్‌లో

ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉంది. బీఆర్ఎస్ ప్రాజెక్టును చేపట్టినా, పెండింగ్ బిల్లులను మాత్రం క్లియర్ చేయలేదు. దీంతో వర్కింగ్ ఏజెన్సీలు, కాంట్రాక్టర్లు ఏండ్ల తరబడి బిల్లుల కోసం తిరగాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రధాన పనులతోపాటు ఇంట్రా నెట్‌వర్క్ పనులకు ఇంకా బిల్లుల చెల్లింపులు కొనసాగుతూనే ఉన్నాయి. అసలు బిల్లులతోపాటు నిర్వహణకు సంబంధించిన సాధారణ నెలవారీ బిల్లులు కోట్లాది రూపాయలు సైతం పెండింగ్‌లోనే ఉన్నాయి. వచ్చే వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చేయాలంటే కనీసం నిర్వహణకు రూ. 200 కోట్లు అవసరమని సమాచారం. పాత బిల్లుల బకాయిలు సైతం మరో రూ.750 కోట్లతోపాటు నిర్వహణకు సంబంధించి పాత బకాయిలు రూ.500 కోట్లు చెల్లించాల్సి ఉంది. మొత్తంగా రూ. 1450 కోట్లు అవసరం కానున్నాయి. ఈ ఏడాదికిగాను ఇప్పటివరకు రూ. 198 కోట్లు చెల్లించినట్టు సమాచారం. పాత బిల్లులు చెల్లిస్తేనే భగీరథ సాధారణ నిర్వహణ వ్యవహారం సాఫీగా సాగే అవకాశాలు ఉంటాయి.

వేసవి ప్రణాళిక

ఎండాకాలంలో తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు సన్నాహాలు చేస్తున్నారు. సమీక్షలు, వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తున్నారు. క్షేత్రస్థాయి ఇంజినీర్లు, అధికారులను గ్రామాల్లో పర్యటించేలా ఉన్నతాధికారులు ప్రయత్నిస్తున్నారు. క్షేత్రస్థాయిలో భగీరథ ప్రాజెక్టు తాజా పరిస్థితిని అంచనా వేసి అవసరమైతే మరమ్మతులు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో 24 గ్రామాల్లో భగీరథ ద్వారా తాగునీటి సరఫరా చేస్తున్నారు. వీటిలో ఆయా గ్రామాలు, మండలాలు, జిల్లాల్లో బోర్లు, ట్యాంకులు, వాటర్ ట్రీట్‌మెంటు ప్లాంట్లు, పైపులైన్ల పరిస్థితిని తనిఖీ చేస్తున్నారు. ఈ పని డిసెంబరు నుంచి జనవరి నెలాఖరు వరకు పూర్తి చేయాలనే లక్ష్యంతో భగీరథ శాఖ పనిచేస్తున్నది. ఫీల్డ్‌లో ఉన్న జేఈ, ఏఈలు, ఈఈ, ఎస్ఈతోపాటు సీఈలకు టార్గెట్లు పెట్టి ప్రాజెక్టుకు తనిఖీలు చేయిస్తున్నట్టు సమాచారం. ఫిబ్రవరి నుంచి ఎలాంటి తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఉన్నతాధికారులు రోజుకు మూడు నియోజకవర్గాల చొప్పున వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షలు చేస్తున్నారు. మొత్తం పరిస్థితిని సమీక్షించి మార్చి, ఏప్రిల్, మే అవసరాలకు అనుగుణంగా తాగునీటి యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేయనున్నట్టు తెలిసింది. వీటి నిర్వహణ అవసరాల కోసం ప్రతినెలా రూ. 50 కోట్లు అవసరమని అధికారులు చెబుతున్నారు. ఇవి సాధారణంగా ప్రభుత్వ నుంచి వస్తున్నాయని అంటున్నారు. కాగా పెండింగ్ బిల్లుల నేపథ్యంలో మిగతా పనులు పూర్తి చేయలేని పరిస్థితి ఉంది. దీంతో అక్కడక్కడా నిర్వహణ లోపాలు బయటపడుతున్నా యి. గత నెలలో సురక్షిత నీరందక ఇద్దరు వ్యక్తులు చనిపోయిన విషయం విదిత మే. ఈనేపథ్యంలో ఈతరహా ఘటనలు వేసవిలో జరగకుం డా చూసుకోవాలని ప్రభుత్వం భగీరథ శాఖ ఉన్నతాధి కారులను ఆదేశించింది.

ప్రపంచ ఆవిష్కరణల కేంద్రంగా తెలంగాణ

- ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణను ప్రపంచ ఆవిష్కరణల కేంద్రంగా, ఆధునిక సాంకేతికతకు చిరునామాగా అభివృద్ధి చేయడంలో తమ ప్రభుత్వం నిరంతరం పాటుపడుతోందని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. కృత్రిమ మేధ, జీవ శాస్త్రాలు, టెక్నాలజీ రంగాల్లో దిగ్గజ సంస్థలను ఆకర్షించడం ద్వారా ఇప్పటికే పెట్టుబడుల ఆకర్షణ కేంద్రంగా నిలిచిందని ఆయన తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో న్యూజెర్సీ ఇన్నోవేషన్స్ ఇన్‌స్టిట్యూట్, న్యూజెర్సీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలతో, టీ-హబ్ ఫౌండేషన్ వాణిజ్య, సాంకేతిక ఆవిష్కరణల భాగస్వామ్యంపై అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిభావంతులను ప్రోత్సహించడంలో సానుకూల వాతావరణాన్ని సృష్టించడం ద్వారా భారతీయ అమెరికన్లు, వృత్తి నిపుణులకు న్యూజెర్సీ అవకాశాలను కల్పిస్తోందని అన్నారు. ఈ భాగస్వామ్యం ద్వారా రాష్ట్రం ఇతోధిక అభివృద్ధిని సాధిస్తుందన్న ఆశాభావం తమకుందని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. అవగాహన ఒప్పంద కార్యక్రమంలో న్యూజెర్సీ లెఫ్టినెంట్ గవర్నర్ తాహెషా వే రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, టీ హబ్ సీఇఓ సుజిత్ జాగిర్దార్ తదితరులు పాల్గొన్నారు.

స్కిల్స్ వర్సిటీలో నాస్కామ్ భాగస్వామి కావాలి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో నాస్కామ్ భాగస్వామి కావాలని శ్రీధర్‌బాబు కోరారు. బుధవారం సచివాలయంలో తనను కలిసిన నాస్కామ్ అధ్యక్షులు రాజేశ్ నంబియార్‌తో పలు అంశాలపై చర్చించారు. కృత్రిమ మేధ వేగంగా విస్తరిస్తున్న తరుణంలో ఐటీ ఉద్యోగులు, ఇంజినీరింగ్ పట్టభద్రులకు శిక్షణ ఇవ్వడంలో నాస్కామ్ కీలక పాత్ర పోషించాలని సూచించారు. రానున్న రోజుల్లో ఐటీ రంగంలో తెలంగాణ దేశంలోనే అగ్రగామిగా వృద్ధి చెందుతుందని ఆకాంక్షించారు.


శ్రవణ్‌కుమార్ కేసులో ముగిసిన వాదనలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఆర్ఎస్ పాలనలో జరిగిన ఫోన్‌ట్యాపింగ్ కేసులో 6వ నిందితుడైన ఓ టీవీ ఛానల్ ఎండి. శ్రవణ్ కుమార్‌రావు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో వాదనలు ముగిశాయి. తీర్పును తర్వాత చెబుతామని జస్టిస్ రాధారాణి ప్రకటించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రి హరీష్‌రావు ఆదేశాలతో శ్రవణ్ ఫోన్‌ట్యాపింగ్ చేయించారని పోలీసుల వాదించారు. ప్రణీత్‌రావును అరెస్ట్ చేయగానే శ్రవణ్ పారిపోయారన్నారు. ఈకేసుతో తనకు సంబంధం లేదనీ, జర్నలిస్ట్‌గా విశ్లేషణలు చేయడమే తన విధి అని శ్రవణ్ లాయర్ వాదించారు. తీర్పును రిజర్వులో ఉంచినట్టు న్యాయమూర్తి తెలిపారు.

జస్టిస్ పర్వతరావు మృతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉమ్మడి ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్. పర్వతరావు (89) హైదరాబాద్‌లో బుధవారం కన్నుమూశారు. జుబ్లీహిల్స్ మహాప్రస్థానంలో అంత్యక్రియలను పూర్తి అయ్యాయి. మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పలువురు ప్రముఖులు జస్టిస్ పర్వతరావును కడసారి దర్శించి నివాళి అర్పించారు.

అదానీ లంచాలపై చర్చించాలి

సభను సజావుగా నడపండి : లోక్‌సభ స్పీకర్‌కు రాహుల్ వినతి • రైల్వే సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

అందజేశారు. అయితే రక్షణ మంత్రికి రాహుల్ గాంధీ గులాబీ ఇవ్వడం పట్ల అందరూ ఆసక్తిగా వీక్షించారు. కాగా జాతీయ జెండా, గులాబీలతో నిరసన తెలపడంపై ప్రతిపక్ష నేతలు వివరణ ఇచ్చారు. ఇతర విషయాల కంటే దేశం చాలా ముఖ్యమైనదని బీజేపీ నేతలకు తెలియజెప్పేందుకే వారికి జాతీయ జెండాలు ఇచ్చినట్టు తెలిపారు. 'అదానీ' అంశంపై పార్లమెంటులో చర్చకు కాంగ్రెస్ పట్టుబడుతుండగా, కాంగ్రెస్-సోరోస్ సంబంధాలను బీజేపీ తీసుకొస్తోంది. దీంతో సభా కార్యక్రమాలు సజావుగా ముందుకు సాగడం లేదు. ఉభయ సభలూ వాయిదాల పర్వం తొక్కాయి.



ప్రతిపక్షాల ఆందోళనల నడుమే రైల్వే సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

ప్రతిపక్షాల ఆందోళనల నడుమే లోక్‌సభలో రైల్వే సవరణ బిల్లు మూజువాణి ఓటుతో ఆమోదం పొందింది. ఈ ఏడాది ఆగస్టు 9న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సందర్భంగా రైల్వే సవరణ బిల్లును రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఆ బిల్లుకు బుధవారం ఆమోదం లభించింది. రైల్వే సవరణ బిల్లు చట్టంగా మారితే రైల్వేల ప్రయివేటీకరణకు దారితీస్తుందని ప్రతిపక్ష పార్టీల ఎంపీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ బిల్లుతో రైల్వేల ప్రయివేటీకరణ జరగదని, రైల్వే బోర్డు పనితీరు మెరుగుపడుతుందని మంత్రి అశ్వినీ వైష్ణవ్ అన్నారు.

ఆ వ్యాఖ్యలను తొలగించాలి : రాహుల్ గాంధీ

పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో బీజేపీ ఎంపీలు తనపై చేసిన అవమానకర వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ కోరారు. బుధవారం పార్లమెంట్‌లో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాతో ఆయన సమావేశమయ్యారు. అనంతరం రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడారు.

'నేను స్పీకర్‌తో సమావేశమయ్యా. నాపై చేసిన అవమానకర వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని విజ్ఞప్తి చేశా. ఆ విషయాన్ని పరిశీలిస్తామని ఆయన చెప్పారు. సభ సజావుగా జరగాలన్నదే మా లక్ష్యం. చర్చ జరగాలి. బీజేపీ నాయకులు నాకు వ్యతిరేకంగా ఏమైనా చెప్పనీయండి.

డిసెంబర్ 13న రాజ్యాంగ చర్చ జరగాలని మేము కోరుకుంటున్నాం. వాళ్లు అదానీపై చర్చను కోరుకోవడం లేదు. ఆ విషయాన్ని మేము విడిచిపెట్టం. వాళ్లు మాపై ఆరోపణలు చేసుకోనీయండి, సభ మాత్రం జరగాలి" అని అన్నారు.

'ద్రోహి' వ్యాఖ్యలపై ప్రియాంక ఫైర్

రాహుల్ గాంధీని 'ద్రోహి' అంటూ సంబిత్ పాత్రా సంబోధించడాన్ని ప్రియాంకా గాంధీ తప్పుపట్టారు. జవహర్ లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీలను సైతం ద్రోహులని మాట్లాడిన వ్యక్తులు రాహుల్ గాంధీని విడిచిపెడతారని తాము అనుకోలేమని, వాళ్లకు ఇదేమీ కొత్త కాదని అన్నారు. రాహుల్ గాంధీకి అన్నింటి కంటే దేశమే ఎక్కువని, ఆయనను చూసి తాను గర్విస్తున్నానని పేర్కొన్నారు. ఇది సిగ్గుపడాల్సిన విషయమని, ప్రభుత్వమే (పార్లమెంటు కార్యకలాపాలకు) అంతరాయం కలిగించడం నేను మొదటిసారి చూస్తున్నానని తెలిపారు.



హామీలు అమలుచేసే వరకూ పోరాటం

- వాగ్దానాలు తుంగలో తొక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం : వైరాలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

నవతెలంగాణ-కొణిజర్ల

ప్రతి సీపీఐ(ఎం) నాయకుడు, కార్యకర్త.. నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలపై పోరాడాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం సింగరాయపాలెం గ్రామంలో పార్టీ వైరా డివిజన్ మహాసభ సీతారాం ఏచూరి నగర్, సురభి వెంకటేశ్వరావు, లింగారావు ప్రాంగణంలో బుధవారం జరిగింది. మండల నాయకులు తాళ్లపల్లి కృష్ణ, కొండెబోయిన నాగేశ్వరరావు, దుగ్గి కృష్ణ, మచ్చా మణి అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో తమ్మినేని వీరభద్రం మాట్లాడారు. కష్టాలను ఎదుర్కొని నిలబడే శక్తి కమ్యూనిస్టులకే ఉందని, పదవుల కోసం పాకులాడే చరిత్ర సీపీఐ(ఎం)కు ఎప్పుడూ లేదన్నారు. ఓట్లు, సీట్లు లేకపోయినా లగచర్లలో ఫార్మాసిటీ ప్రాజెక్టును వెనక్కి తిప్పికొట్టిన ఘనత కమ్యూనిస్టులకే దక్కిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను తుంగలో తొక్కి ఏదో సాధించినట్టు కోట్లు ఖర్చుపెట్టి కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది విజయోత్సవ సభలు నిర్వహించి గొప్పలు చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. ఎన్నికల హామీలు అమలు చేసే వరకు పోరాడుతూనే ఉంటామని తెలిపారు. మనుధర్మ శాస్త్రం పేరుతో దేశంలో మత విద్వేషాలు పెంచి పైశాచికంగా ఆనందం పొందుతున్న బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ మత రాజకీయలను అడ్డుకుంటామని స్పష్టం చేశారు.

దేశంలో కమ్యూనిస్టులు లేకపోతే దేశ భవిష్యత్తు అగమ్యగోచరంగా మారుతుందని, అదే కమ్యూనిస్టులు బలపడితే దేశంలో ఉన్న ప్రజలకు చక్కటి విద్య, వైద్యంతోపాటు సమానత్వం, మత ఘర్షణలు లేని దేశం ఏర్పడుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, యర్రా శ్రీకాంత్, పి.సోమయ్య, మాచర్ల భారతి, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, కార్యదర్శి వర్గ సభ్యులు బుగ్గవీటి సరళ, బొంతు రాంబాబు, భూక్యా వీరభద్రం, బండి రమేష్, సీనియర్ నాయకులు కొప్పుల క్రిష్ణయ్య, మధిర, ఖమ్మం డివిజన్ కార్యదర్శులు ఎం.గోపాల్‌రావు, వై.విక్రమ్, నాయకులు కళ్యాణం వెంకటేశ్వరరావు, యర్రా శ్రీనివాస్ రావు, దొంగల తిరుపతిరావు, మెరుగు సత్యనారాయణ, రమణ, చింత నిప్పు చలపతి, నవీన్‌రెడ్డి, బషీర్, బండారు రమేష్, మాజీ ఎంపీపీలు వడ్లమూడి ఉమారాణి, బొంతు సమత, మండల కార్యదర్శి చెరుకుమల్లి కుటుంబరావు పాల్గొన్నారు.

కామ్రేడ్ కెఎం తివారీకి తుది వీడ్కోలు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కార్మికవర్గం కోసం జీవిత చరమాంకం వరకు త్యాగం చేసిన పోరాట యోధుడు, కామ్రేడ్ కెఎం తివారీకి తుది వీడ్కోలు పలికారు. సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యుడు, ఢిల్లీ రాష్ట్ర మాజీ కార్యదర్శి కెఎం తివారీ మరణం పట్ల పలువురు బుధవారం సంతాపం తెలిపారు.

సీపీఐ(ఎం) పార్టీ ఘజియాబాద్ జిల్లా కమిటీ కార్యాలయం, ఢిల్లీలోని హరికిషన్ సింగ్ సూర్జిత్ భవన్‌లో ఆయన పార్థివదేహాన్ని ప్రజల సందర్శనార్థం ఉంచారు. ఈ సందర్భంగా అన్ని వర్గాల ప్రజలు వందలాది మంది తరలొచ్చి ఆయనకు నివాళులర్పించారు.

అనంతరం భౌతికకాయానికి నిగంబోధ్ ఘాట్‌కు తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు. సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్, తపన్ సేన్, అశోక్ ధావ్లే, నీలోత్పల్ బసు, కేంద్ర కమిటీ సభ్యులు కె హేమలత, మరియం ధావలే, కె. రాధాకృష్ణన్ (ఎంపీ), ఆర్ అరుణ్ కుమార్, బి. వెంకట్, మురళీధరన్, ఎఆర్ సింధు, ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శి అనురాగ్ సక్సేనా, ఎంపీ వి. శివదాసన్ అంత్యక్రియల్లో పాల్గొన్నారు. సీఐటీయూ, ఏఐకేఎస్, ఏఐఎడబ్ల్యూయూ, ఐద్వా, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, డీఎస్ఎంఎం, సీపీఐ, సీపీఐ ఎంఎల్, ఆర్ఎస్‌పి ప్రతినిధులు నివాళులర్పించారు.


(ఫైల్)

సీఐటీయూ, ఏఐకేఎస్ సంతాపం

సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యుడు, సీనియర్ ట్రేడ్ యూనియన్ నాయకుడు కెఎం తివారీ మృతికి సీఐటీయూ, ఏఐకేఎస్ సంతాపం తెలిపాయి. కెఎం తివారీ నిబద్ధత కలిగిన విప్లవకారుడని, ఆయన జీవితం యువతరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నాయి. కెఎం తివారీ మృతి దేశ రాజధానిలో విప్లవోద్యమానికి తీరని లోటని సీఐటీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.హేమలత, తపన్ సేన్, ఏఐకేఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్ ధావ్లే, విజూ కృష్ణన్ తమ సంతాప సందేశంలో పేర్కొన్నారు.

'ఓట్ జిహాద్'పై ఈసీ దృష్టి



ముంబయి : ఇటీవల మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచార సమయంలో కొన్ని రాజకీయ పార్టీలు ఉపయోగించిన 'ఓట్ జిహాద్' వంటి వివాదాస్పద పదబంధాలను కేంద్ర ఎన్నికల సంఘం పరిశీలిస్తుంది. ఈ విషయాన్ని ఒక వార్తా సంస్థకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో మహారాష్ట్ర అదనపు ఎన్నికల ప్రధాన అధికారి డాక్టర్ కిరణ్ కులకర్ణి వెల్లడించారు. ఈ ఎన్నికల్లో 650కు పైగా నిబంధనల ఉల్లంఘన కేసులు నమోదయ్యాయని చెప్పారు. ఈ కేసులను దర్యాప్తు సంస్థలు విచారణ చేస్తాయని తెలిపారు. 'ఓట్ జిహాద్' గురించి అడిగినప్పుడు 'వీటిపై తదుపరి చర్యలు తీసుకునే ముందు చట్టపరమైన, భాషపరమైన, సామాజిక పరమైన చిక్కులను విశ్లేషించాలి. ఓటు జిహాద్ వంటి పదాలతో జాగ్రత్తగా ఉండాలి, ఎందుకంటే ఇవి తీవ్రమైన పరిణామాలకు కారణమవుతాయి' అని చెప్పారు. వీటిపై ప్రధాన ఎన్నికల అధికారితో సహా తాను, ఇతర అధికారులు పరిశీలన చేస్తున్నామని, అన్ని అంశాలను సమగ్రంగా సమీక్షించిన తరువాత తగిన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో పోలింగ్ బూత్‌ల క్యాప్చరింగ్ జరిగిందే వార్తలను కులకర్ణి ఖండించారు. 'మహారాష్ట్రలో ఈవీఎంల సహాయంతో బూత్ క్యాప్చరింగ్ జరిగిందనడం అర్థ రహితం. ఎందుకంటే ఈవీఎంలు పటిష్టమైనవి, వీటి నుంచి సమాచారాన్ని పొందడం దుర్లభమని కులకర్ణి తెలిపారు.

అరుదైన లోహాలను కొల్లగొట్టేందుకు
మోడీ సర్కార్ కసరత్తు

తమిళనాడు దిండిగల్ జిల్లా సభలో ప్రకాశ్ కరత్ విమర్శ



చెన్నై: దేశ ప్రజలపై భారాలు మోపుతూ, ప్రకృతి సంపదను ధ్వంసం చేస్తూ దేశంలోని బడా కార్పొరేట్లకు అనుకూలమైన విధానాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమల్జేస్తోందని సీపీఐ(ఎం) సమన్వయకర్త, పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్ కరత్ విమర్శించారు. దేశంలో అత్యంత అరుదైన ఖనిజాలను కూడా భూగర్భం నుంచి వెలికి తీసి ఆ సంపదనంతా కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు మోడీ సర్కార్ సిద్ధమైందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

తమిళనాడులోని దిండిగల్ జిల్లాలో నిర్వహించిన బహిరంగసభలో ఆయన ప్రసంగించారు. మదురైలో టంగ్‌స్టన్ సహా దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో అత్యంత అరుదైన ఖనిజాలను తవ్వితీసి బడా కార్పొరేట్లకు కోట్లవర్షం కురిపించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల కార్యాచరణ ప్రకటిం చిందని, ఈ దుర్మార్గమైన విధానాన్ని ప్రజలందరూ తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. మదురైలో అరుదైన టంగ్‌స్టన్ ఖనిజ తవ్వకాలను చేపట్టాలనే నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల శాసనసభలో తీర్మానాన్ని ఆమోదించడాన్ని కరత్ ఈ సందర్భంగా స్వాగతించారు.

కేంద్రం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను ఇతర రాష్ట్రా ల్లోని ప్రభుత్వాలు కూడా వ్యతిరేకిస్తూ తీర్మానాలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు జి రామకృష్ణ, కేంద్ర కమిటీ సభ్యులు యు వాసుకి నాయకులు పాల్గొన్నారు.

పంజాబ్, హర్యానాల్లో
ఎన్ఐఏ సోదాలు

న్యూఢిల్లీ : జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లో బుధవారం సోదాలు నిర్వహించింది. స్థానిక రౌడీ మూకలకు ఉగ్రవాదులకు మధ్య సన్నిహిత సంబంధాలున్నాయనే అభియోగాలకు సంబంధించిన కేసు (గ్యాంగ్‌స్టర్-టెర్రర్ నెక్సస్ కేసు) దర్యాప్తులో భాగంగా ఈ సోదాలు చేపట్టారు. పంజాబ్‌లో 8 ప్రదేశాల్లో, హర్యానాలో ఒక చోట ఎన్ఐఏ ఈ సోదాలు నిర్వహించింది. కేంద్ర హోంశాఖ ఆదేశాల మేరకు ఎన్ఐఏ దర్యాప్తు కొనసాగిస్తోంది. పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో టెర్రర్ గ్యాంగ్‌స్టర్ దవీందర్ బాంబిహా సిండికేట్ సహచరులతో సంబంధమున్న వారి ఇండ్లల్లోనూ ఎన్ఐఏ గత నెలలో సోదాలు నిర్వహించిన సంగతి తెలిసిందే.

'సంభాల్' బాధితులతో రాహుల్ సమావేశం

న్యూఢిల్లీ : సంభాల్ హింసాకాండ బాధితులు, వారి కుటుంబాలతో లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సమావేశమయ్యారు. న్యూఢిల్లీలోని రాహుల్ నివాసం 10 జన్‌పథ్‌లో ఈ సమావేశం జరిగింది. వాయనాడ్ ఎంపీ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేసింది. బీజేపీ విద్వేష రాజకీయాల ఫలితంగానే సంభాల్ ఘటన జరిగిందని, ఇలాంటి ఘటనలు శాంతియుత సమాజానికి ప్రాణాంతకమని విమర్శించింది. ఇలాంటి హింసాత్మక, ద్వేషపూరిత మనస్తత్వాన్ని మనమంతా కలిసికట్టుగా ప్రేమ, సోదరభావంతో ఓడించాలని పిలుపునిచ్చింది. బాధితులందరికీ తాము అండగా ఉంటామని, వారికి న్యాయం కోసం పోరాడతామని స్పష్టం చేసింది.



కాబూల్‌లో ఆత్మాహుతి పేలుడు

- తాలిబన్ మంత్రి సహా ముగ్గురు మృతి

కాబూల్ : ఆఫ్ఘన్ రాజధాని కాబూల్‌లో బుధవారం ఆత్మాహుతి బాంబు దాడి జరిగింది. ఈ ఘటనలో తాలిబన్ శరణార్థుల వ్యవహారాలు చూసే మంత్రి, మరో ఇద్దరు మరణించారని హోం శాఖ అధికారులు తెలిపారు. శరణార్థుల మంత్రిత్వ శాఖ కార్యాలయంలోనే ఈ పేలుడు చోటు చేసుకుందని, మంత్రి ఖలీల్ హక్కాని చనిపోయారని తెలిపారు. అంతకుమించి వివరాలు వెల్లడించలేదు. మూడేళ్ళ క్రితం తాలిబన్ అధికారంలోకి వచ్చిన తర్వాత బాంబు దాడితో ఉన్నత స్థాయిలోని వ్యక్తి మరణించడం ఇదే. ఈ పేలుడుకు కారణమెవరనేది వెంటనే తెలియరాలేదు. తాలిబన్‌లో శక్తివంతమైన నెట్‌వర్క్‌కు సారథ్యం వహించే తాత్కాలిక హోం మంత్రి సిరాజుద్దీన్ హక్కానికి ఖలీల్ హక్కాని బంధువే.

గాజాలో నివాస ప్రాంతాలపై దాడులు

30 మందికి పైగా మృతి

గాజా : ఇజ్రాయిల్ అరాచక దాడులు నిరవధికంగా కొనసాగుతూనేవున్నాయి. గాజా స్ట్రిప్‌లో నివాస ప్రాంతాలపై తాజాగా బుధవారం ఉదయం జరిపిన దాడిలో 30 మంది పైగా పౌరు లు చనిపోయారు. ఈ ప్రాంతం లో ఏడాదిగా ఇజ్రాయిల్ సైన్యం దాడులకు తెగబడుతూనేవుంది. ఇప్పటికే వేలాది మంది పాలస్తీ నియన్లు మృతి చెందారు. బుధ వారం నాటి దాడిలో ఉత్తర గాజా లోనూ, గాజాస్ట్రిప్ సెంటం లోనూ పౌరుల నివాస భవనాలపై బాంబుల వర్షం కురిపించింది. ఈ దాడిలో మహిళలు, చిన్నారు లతో సహా కనీసం 30 మంది పైగా మరణించి వుంటారని ఆ ప్రాంత వైద్య బృందం వెల్లడించింది.

రాజ్యసభ చైర్మెన్‌ది పక్షపాత ధోరణి

- నిబంధనలకు విరుద్ధంగా రాజకీయాలు నడుపుతున్నారు
- ఆయనను తొలగించేందుకే అవిశ్వాసం : విలేకరుల సమావేశంలో ఇండియా బ్లాక్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

రాజ్యసభ చైర్మెన్ జగదీప్ ధన్కర్ పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని ఇండియా బ్లాక్ పార్టీలు విమర్శించాయి. నిబంధనలకు విరుద్ధంగా ఆయన రాజకీయాలు నడుపుతున్నారని ధ్వజమెత్తాయి. అందుకే జగదీప్ ధన్కర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టామని ప్రతిపక్షాలు పేర్కొన్నాయి. బుధవారం నాడిక్కడ కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో రాజ్యసభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ.. ధన్కర్ ప్రభుత్వ అధికార ప్రతినిధిగా పని చేస్తున్నారని, పాఠశాల ప్రధానోపాధ్యాయుడిలా వ్యవహరిస్తున్నారని, అనుభవజ్ఞులైన ప్రతిపక్ష నేతలను సభలో మాట్లాడకుండా తరచూ అడ్డుకుంటున్నారని విమర్శించారు. ఆయన ప్రతిపక్షం పట్ల పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. సభను నియమ నిబంధనలతో కాకుండా రాజకీయాలతో నడిపిస్తున్నారని ధ్వజమెత్తారు.

"ఉపరాష్ట్రపతి పదవి రాజ్యాంగ బద్ధంగా రెండోది. ఇప్పటి వరకు ఆ పదవి నుంచి తొలగించే తీర్మానం ఎన్నడూ రాలేదు. ఎందుకంటే గతంలో అధికారంలో ఉన్న వారందరూ ఎప్పుడూ రాజకీయంగా లేరు. కానీ నేడు పార్లమెంటులో రాజకీయాలు జరుగుతున్నాయని చెప్పవలసి వచ్చింది. అధికార పార్టీ సభ్యులు మాట్లాడినప్పుడు జోక్యం చేసుకోరు. అదే ప్రతిపక్ష సభ్యులు మాట్లాడితే వెంటనే జోక్యం చేసుకుంటారు. స్వాతంత్ర్యం వచ్చిన 75వ సంవత్సరంలో పక్షపాతంతో కూడిన వైఖరి వల్ల అవిశ్వాస తీర్మానం తీసుకురావాల్సి వచ్చింది. చైర్మెన్ కొన్నిసార్లు ప్రభుత్వాన్ని పొగిడేవారు. మరి కొన్నిసార్లు తనను తాను ఆర్‌ఎస్‌ఎస్‌కు చెందిన వ్యక్తినని పేర్కొనేవారు. నేతలపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసేవారు" అని ఖర్గే అన్నారు.



"సభా నాయకుడు మాట్లాడినప్పుడు ఎంత అవకాశం ఇస్తారో, ప్రతిపక్షనేతగా తాను మాట్లాడినప్పుడు కూడా అంతే అవకాశం ఇవ్వాలి. అదే రూల్ చెబుతోంది. కానీ చైర్మెన్ అలా చేయరు. అతని ప్రవర్తన దేశ గౌరవాన్ని దెబ్బతీసింది. పార్లమెంటరీ ప్రజాస్వామ్య చరిత్రలో ఆయన అలాంటి పరిస్థితిని తెచ్చిపెట్టారు. అందుకే అవిశ్వాసం తీర్మానం తీసుకురావాల్సి వచ్చింది. రాజ్యాంగం గురించి చాలా ఆలోచించిన తర్వాత ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకే మేము ఈ చర్య తీసుకున్నాం. అదే దేశ ప్రజలకు చెప్పాలనుకుంటున్నాం" అని అన్నారు.

"రాజ్యాంగం, రాజ్యాంగ సంప్రదాయానికి బదులు ఆయన తన తదుపరి పదోన్నతి కోసం ప్రభుత్వ ప్రతినిధిగా పనిచేస్తున్నారు. సభకు సంరక్షకుడిగా, ప్రతి సభ్యుని హక్కుల పరిరక్షకుడిగా చైర్మెన్ రాజకీయాలకు అతీతంగా ఉండాలి. కానీ ప్రతిపక్ష పార్టీలను బహిరంగంగా విమర్శించే అధికార పక్షానికి అధికార ప్రతినిధిలా ప్రవర్తించే ఉపరాష్ట్రపతిని మన చరిత్రలోనే తొలిసారి చూస్తున్నాం. ఈ నోటీసుతో ముందుకు వెళ్లడం తప్ప మాకు వేరే మార్గం లేకుండా పోయిందని చెప్పడానికి నేను చాలా బాధపడ్డా. గత మూడేండ్లుగా క్లిష్టమైన సమస్యలను లేవనెత్తడానికి సమయం ఇవ్వకుండా, సీనియర్ సభ్యులను సైతం తక్కువ చేసి మాట్లాడారు" అని ఖర్గే అన్నారు.

ఆయన రాజ్యసభను కాదు.. సర్కస్‌ను నడుపుతున్నారు : సంజయ్ రౌత్

చైర్మెన్ ధన్కర్ నడుపుతున్నది రాజ్యసభను కాదని, సర్కస్‌ని అని శివసేన ఎంపీ సంజయ్ రౌత్ ధ్వజమెత్తారు. "ప్రజాస్వామ్యం, రాజ్యాంగాన్ని కాపాడటానికి కలిసి వచ్చిన నాయకులందరూ ఇక్కడ ఉన్నారు. నా పదవీకాలంలో నేను నలుగురు చైర్మెన్లను చూశా. కానీ ఇంతకు ముందెన్నడూ ఇలాంటి పరిణామాలను చూడలేదు. ఎవరైనా ఈ విధంగా సభను నడిపితే, ప్రజాస్వామ్యం, రాజ్యాంగం రెండూ ఉండవు" అని ఆయన అన్నారు.

ఇది పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి దెబ్బ : డీఎంకే ఎంపీ తిరుచ్చి శివ

"గత వారం రోజులుగా పార్లమెంటులో ఏం జరుగుతుందో అందరూ చూస్తున్నారు. పార్లమెంటులో ఈ దేశ ప్రజాస్వామ్యంపై అధికార పక్షం కఠోరమైన దాడి చేస్తోంది. వారికి చైర్మెన్ రక్షణ కల్పించడం శోచనీయం. పార్లమెంట్‌లో సభానాయకుడు, ప్రతిపక్ష నేత రెండూ ప్రధాన స్తంభాలు. గతంలో బీజేపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు, కాంగ్రెస్ కూడా ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మనకు అనుభవం ఉంది. ప్రతిపక్ష నాయకుడు మాట్లాడేందుకు లేచి నిలబడినప్పుడల్లా లేదా మాట్లాడమని ప్రతిపాదించినప్పుడల్లా ప్రతిపక్ష నాయకుడికి అనుమతి ఇస్తారు. కానీ నేడు, రాజ్యసభలో ప్రతిపక్షనేత ఖర్గే మాట్లాడేందుకు లేచి నిలబడితే అధికార పక్షం అడ్డుతగిలి మైక్ స్విచ్ ఆఫ్ చేస్తోంది. దీనికి విరుద్ధంగా, అధికార పార్టీ నుంచి మాట్లాడాలనుకునే ఎవరికైనా మాట్లాడే అవకాశం ఇస్తోంది. వాళ్లు ఏం మాట్లాడినా రికార్డు అయిపోతుంది. మీడియా ముందుంటుంది. ఈ విధంగా మా గొంతులను నొక్కేస్తున్నారు. మాకు మాట్లాడేందుకు అనుమతి లేదు. అంటే అది పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి, ఈ దేశ ప్రజాస్వామ్యానికి దెబ్బ. పార్లమెంటు కార్యక్రమాలను ప్రసారం చేయడానికి ఏకైక మూలమైన సంసద్ టివి అధికార పక్షాన్ని మాత్రమే చూపుతుంది. కాబట్టి పార్లమెంటులో ఏమి జరుగుతుందో ప్రజలకు తెలియక పోవచ్చు" అని తిరుచ్చి శివ అన్నారు. ఈ సమావేశంలో ఫౌజియాఖాన్ (ఎన్‌సిపి), జావేద్ అలీఖాన్ (ఎస్‌పీ), సర్ఫరాజ్ అహ్మద్ (జెఎంఎం), నదిముల్ హక్ (టీఎంసీ), సంతోష్ కుమార్ (సీపీఐ), కె.ఎం మణి (కేరళ కాంగ్రెస్), జాన్ బ్రిట్టాస్ (సీపీఐ(ఎం) మాట్లాడారు.

"1952 నుండి ఉప రాష్ట్రపతి ఎన్నడూ రాజకీయాలలో పాల్గొనలేదు. అందుకే ఉప రాష్ట్రపతిని తొలగించే తీర్మానాన్ని ఆర్టికల్ 67 కింద తీసుకురాలేదు" అని అన్నారు.

చైర్మెన్ నిష్పాక్షపాతంగా వ్యవహరించాలి : బికాష్ రంజన్ భట్టాచార్య

చైర్మెన్ నిష్పాక్షపాతంగా వ్యవహరించాలని సీపీఐ(ఎం) రాజ్యసభ ఎంపీ బికాష్ రంజన్ భట్టాచార్య పేర్కొన్నారు. రాజ్యాంగ పరిషత్ చర్చలో కూడా ఇదే స్పష్టం చేశారని తెలిపారు. చైర్మెన్ ప్రతిపక్షాలను విమర్శిస్తున్నారని, ఆర్‌ఎస్‌ఎస్‌ను కీర్తిస్తున్నారని విమర్శించారు. ఈ అవిశ్వాస తీర్మానాన్ని సంతోషంగా తీసుకురావటం లేదని, దుఃఖంతోనే తీసుకు వస్తున్నామని అన్నారు. అయితే రాజ్యాంగం దాడికి గురవుతున్న పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో కీలకమైన తరుణంలో తాము అలా చేయవలసి వచ్చిందని తెలిపారు. చైర్మెన్ అధికార పక్షం వైపు మొగ్గు చూపుతున్నారని, అందుకే ఈ తీర్మానానికి సీపీఐ(ఎం) మద్దతు ఇచ్చిందని తెలిపారు. దేశ ప్రజలు తమ వైఖరిని మెచ్చుకుంటారని, ఈ తీర్మానంతో ముందుకు సాగడానికి మమ్మల్ని ప్రోత్సహిస్తారని తాము నమ్ముతున్నామని అన్నారు.

ప్రజాస్వామ్యం ప్రధాన సూత్రం పునరుద్ధరణకు సంబంధించినది : ఆర్‌జేడీ ఎంపీ మనోజ్ ఝా

"ఇది ఒక వ్యక్తికి, ఆయన గౌరవానికి సంబంధించినది కాదు. ప్రజాస్వామ్యం ప్రధాన సూత్రాన్ని పునరుద్ధరించడానికి సంబంధించినది. అధికారంలో ఉన్న వ్యక్తులు వాడుతున్న భాష, పదజాలం బాధించడమే కాదు.. రేపు అధికార మార్పిడి జరిగినప్పుడు, పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించగలమా? అని కూడా మేము భావిస్తున్నాము. ప్రధానికి సన్నిహితుడైన అదానీ కేసు అయినా, సంభాల్ హింస అయినా, మణిపూర్ అయినా, నిరుద్యోగం అయినా... అన్ని పక్కకు నెట్టబడ్డాయి. మా ఈ ప్రయత్నం ఏ వ్యక్తికి వ్యతిరేకం కాదు. కానీ ఒక సంస్థ ఆలోచనలు, మాటలు, చర్యలలో దాని ప్రవర్తనను పునరుద్ధరించే ప్రయత్నం" అని మనోజ్ ఝా అన్నారు.

సంపాదకీయం

రైజింగ్ తెలంగాణ...



రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి సరిగ్గా ఏడాది పూర్తయింది. ఈ క్రమంలో ఆ సర్కారుకు, దాని సారధి రేవంత్‌కు, ఆయన మంత్రివర్గ సహచరులకు అభినందనలు, శుభాకాంక్షలు. ఈ ఏడాది కాలంలో తెలంగాణలో ప్రజాస్వామిక వాతావరణాన్ని కల్పించటం ద్వారా ప్రజా పాలనను తీసుకొచ్చామంటూ ప్రభుత్వం చెబుతోంది. కొన్ని విషయాల్లో ఇది వాస్తవమే. వారంలో మూడు నాలుగు రోజులు ముఖ్యమంత్రి సచివాలయంలో కార్యకలాపాలు, సమీక్షలు నిర్వహించటం, ప్రజా ప్రతినిధులు, ప్రతిపక్షాలను కలవటం, హైదరాబాద్‌తోపాటు జిల్లాల్లోనూ ప్రజావాణిని నిర్వహించి, అర్జీలు స్వీకరించటం, ధర్నాచౌక్‌లో ఆందోళనలకు అవకాశమివ్వటం తదితరాంశాలు ఈ కోవలోనివే. లగచర్ల భూ సేకరణ నిర్ణయం నుంచి ప్రభుత్వం వెనక్కి తగ్గటం కూడా హర్షించదగ్గదే. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీన్నే జీతాలు, 50 వేలకు పైబడి ఉద్యోగ నియామకాలు, రైతు రుణమాఫీకి పూనుకోవడం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలు ప్రభుత్వానికి సానుకూలాంశాలు. ఈ ఏడాది కాలంలో స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు సన్నాహాలు, పలు కంపెనీలతో ఒప్పందాలు, పెట్టుబడులను ఆహ్వానించటం, తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ మొదలైనవి తమ ఘనతలుగా సీఎం రేవంత్ చెబుతున్నారు. ఇవన్నీ నాణేనికి ఒకవైపు.

> 'రైజింగ్ తెలంగాణ' అంటూ ఏడాది పాలన పూర్తి చేసుకున్న రేవంత్ ప్రభుత్వానికి ఆ పరిస్థితి రాకూడదని కోరుకుందాం. ఈ కోరిక నెరవేరాలంటే కాంగ్రెస్ సర్కారు పెద్దలు... తామిచ్చిన హామీల అమలుపై దృష్టి పెట్టి, వ్యక్తిగత విమర్శలు, దూషణలు, భాషణలను తగ్గించాలి. అప్పుడే 'రైజింగ్ తెలంగాణ...' అనే టైటిల్‌కు నిజమైన సార్థకత చేకూరుతుంది. అలా చేసినప్పుడే కాంగ్రెస్ ప్రభుత్వానికి రెండో ఏడాది ఉత్సాహంగా ప్రారంభమవుతుంది.

ఇక రెండో వైపు చూస్తే గ్రూప్-1 అభ్యర్థుల ఆందోళనలు, సర్పంచుల ధర్నాలు, ఆశాల ముట్టడులు, విద్యార్థుల ఆత్మహత్యలపై విద్యార్థి సంఘాల గర్జనలు... సర్కారును కొంతలో కొంత ఇరకాటంలో పెట్టాయని చెప్పక తప్పదు. వీటిలో కొన్ని రాజకీయ ప్రేరేపితం వల్లే సంభవించాయన్న ఆరోపణలూ ఉన్నాయి. గురుకులాల్లో కొనసాగుతున్న ఫుడ్ పాయిజన్ ఘటనలపై ప్రభుత్వం ఓ ఉన్నతస్థాయి కమిటీ వేసింది, దాని రిపోర్టు వస్తేగానీ నిజానిజాలు నిగ్గుతేలవు.


కానీ ఆరు గ్యారెంటీల అమలుపై తగినంత శ్రద్ధ పెట్టకపోవటం, నిధుల్లేవనే సాకుతో వాటిపై కాలయాపన చేయటాన్ని రాష్ట్ర ప్రజానీకం నిశితంగా గమనిస్తోంది. 'నిధుల్లేవనే సాకుతో ఆరు గ్యారెంటీల అమలును విస్మరించబోం, వాటిని కచ్చితంగా అమలు చేసి తీరతాం...' అంటూ మంత్రి పొంగులేటి స్పష్టం చేసినా...'వాటిని ఎప్పటిలోగా, ఎలా అమలు చేస్తారు...' అనే ప్రశ్న ఉదయించక మానటం లేదు. ఏడాది కాలంగా ప్రభుత్వం చెబుతున్న అప్పులు, వాటికి వడ్డీలు, వాటిపై శ్వేతపత్రాల నేపథ్యంలో... ఇన్ని అప్పులున్నప్పుడు సంక్షేమ పథకాలను ఎలా నిర్వహిస్తారనే సందేహం వ్యక్తమవుతోంది. దీనిపై స్పష్టతనిచ్చి, సమాధానం చెప్పాల్సిన బాధ్యత సర్కారుదే.

పదేండ్ల బీఆర్ఎస్ పాలనను చూసి, విసిగిపోయిన తెలంగాణ ప్రజానీకం... అనేక ఆశలు, ఆకాంక్షలతో కాంగ్రెస్‌కు పట్టంగట్టింది. ఏడాది వరకూ వాటిపై ఓపిక పట్టిన వివిధ తరగతులు...మెల్లగా ఆందోళనల బాట పడుతున్న వైనాన్ని మనం విస్మరించకూడదు. డీఎస్సీ-2008 బాధితులు, పోడు రైతులు, చేనేత కార్మికులు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులు, ఆశాలు, అంగన్‌వాడీలు, మధ్యాహ్న భోజనం కార్మికులు, వికలాంగులు, మహిళలు తమ సమస్యలను పరిష్కరించాలని సర్కారుకు మొరపెట్టుకుంటున్నారు. వీరేగాక ఇతర అనేక సెక్షన్ల ప్రజానీకం డిమాండ్ల సాధన కోసం గొంతెత్తుతున్నారు. తమది ప్రజాపాలన అని చెప్పుకుంటున్న రేవంత్ ప్రభుత్వం... వీటిపై తక్షణం దృష్టి సారించాలి. అన్నప్రాసన్నాడే శిశువు ఆవకాయ పచ్చడి తినలేదు.. కానీ తొలి జన్మదినోత్సవం జరుపుకునే నాటికి కనీసం గోరు ముద్దలైనా తినాలి కదా..? ఇప్పుడిదే ప్రశ్న తెలంగాణ జనాల మదిలో మెదులుతోంది.

ఈ వాస్తవాన్ని గమనించి, కాంగ్రెస్ సర్కారు అర్థవంతమైన చర్చలు, సంప్రదింపులు, సమాలోచనలతో సహేతుకమైన ప్రణాళికలు వేసుకుని ముందుకు సాగాలి. అన్నింటికన్నా ముఖ్యమైనది ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరించడం అవసరం.

'అధికారపక్షంగా మేం విజ్ఞతతో, బాధ్యతతో, దక్షతతో వ్యవహరిస్తాం...' అంటూ 2014లో అధికారంలోకి వచ్చిన కొత్తలో ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఉద్ఘాటించారు. కానీ ఆచరణలో దాన్ని అమలు చేయని కారణంగా ఆయన ఇప్పుడు ఫామ్‌హౌస్‌కే పరిమితం కావాల్సిన దుస్థితి. 'రైజింగ్ తెలంగాణ' అంటూ ఏడాది పాలన పూర్తి చేసుకున్న రేవంత్ ప్రభుత్వానికి ఆ పరిస్థితి రాకూడదని కోరుకుందాం. ఈ కోరిక నెరవేరాలంటే కాంగ్రెస్ సర్కారు పెద్దలు... తామిచ్చిన హామీల అమలుపై దృష్టి పెట్టి, వ్యక్తిగత విమర్శలు, దూషణలు, భాషణలను తగ్గించాలి. అప్పుడే 'రైజింగ్ తెలంగాణ...' అనే టైటిల్‌కు నిజమైన సార్థకత చేకూరుతుంది. అలా చేసినప్పుడే కాంగ్రెస్ ప్రభుత్వానికి రెండో ఏడాది ఉత్సాహంగా ప్రారంభమవుతుంది.

నయా ఉదారవాదం, అంతకు మునుపు కాలం



ప్రభాత్ పట్నాయక్

అన్ని విమర్శలూ మత విమర్శతో ప్రారంభం కావాలని మార్క్స్ ఒక సందర్భంలో అన్నాడు. అదే మాదిరిగా ఆర్థికాంశాలకు సంబంధించి ప్రస్తుత కాలంలో విమర్శ జీడీపీతో మొదలు కావాలి. జీడీపీ అనే భావనతో సహా, దానికి సంబంధించిన గణాంకాలు మొత్తం బూటకమే. ఆ ప్రాతిపదిక దోపిడీ అనే ఒక లక్షణాన్ని గుర్తించదు. ఉదాహరణకు: మొఘల్ చక్రవర్తి, అతడి అధికార గణం పొందే ఆదాయాన్ని దేశానికి వాళ్లు అందించిన సేవలకు ప్రతిఫలం అని జీడీపీ అంటుంది. వాళ్లు పొందే మొత్తాన్ని దేశపు మొత్తం చేసిన ఉత్పత్తికి అదనంగా కలిపి జీడీపీని లెక్కిస్తుంది. నిజానికి అది దేశ ఉత్పత్తి నుండి ఆ మొఘల్ చక్రవర్తి, తదితరులు చేజిక్కించుకున్న భాగమే. కాని దానిని కూడా ఉత్పత్తిలో భాగం అని లెక్కించడం ద్వారా రెండింతలుగా చూపిస్తుంది. ఇది తప్పు. కాని నయా ఉదారవాద సమర్థకులు ఆ విధంగానే లెక్కించి ఆ కాలం చాలా గొప్పగా అభివృద్ధి చెందినట్టు చిత్రిస్తారు.అదే విధంగా నయా ఉదారవాద విధానాలకు పూర్వం ఉనికిలో ఉండిన (ప్రభుత్వ నియంత్రణలో ఆర్థిక వ్యవస్థ నడిచిన) కాలంలో కన్నా నయా ఉదారవాద కాలంలో జీడీపీ వృద్ధిరేటు చాలా ఎక్కువగా ఉందని, అంతకు పూర్వపు కాలంలోని 40 ఏండ్లలో భారత దేశ ఆర్థిక పురోగమనం చాలా మందకొడిగా సాగిందని చెప్తూ నయా ఉదారవాద విధానాల కాలం లోనే దేశాభివృద్ధి వేగం పుంజు కున్నట్టు చెప్పుకుంటారు.

ఒకానొక కాన్ఫరెన్సులో నేను, నా సహచరుడు సంయుక్తంగా సమర్పించిన పత్రాన్ని విమర్శిస్తూ ఐఎంఎఫ్ డైరక్టర్ ఇదే విధంగా నయా ఉదారవాద కాలంలోనే మన దేశ ఆర్థికాభివృద్ధి వేగంగా జరిగిందంటూ వ్యాఖ్యానించాడు. అయితే ఆ సందర్భంలో ఆయన జీడీపీ గురించి ప్రస్తావించలేదు. 1960, 70 దశకాల్లో మన దేశంలో ఎక్కడ చూసినా ఎంతసేపూ అంబాసిడర్ కార్లు లేదా ఫియట్ కార్లు మాత్రమే కనిపించేవని, అదే నయా ఉదారవాద విధానాలు అమల్లోకి వచ్చాక చాలా స్టైలిష్‌గా ఉంటూ వేగంగా దూసుకుపోయే కార్లు కనిపిస్తున్నాయని అన్నారు. ఒక పేరున్న ఆర్థికవేత్త అయినప్పటికీ, ఆ ఐఎంఎఫ్ డైరక్టర్ సాంఘిక సంక్షేమం అంటే ఏమిటో అర్థం చేసుకోలేక పోయాడని నాకర్థమైంది.

అయితే జీడీపీ ప్రమాణాన్ని సమర్థించే వాదనలను అంత తేలికగా తీసిపారేయకూడదు. ఉత్పత్తి అయిన సంపద ఏ విధంగా పంపిణీ అవుతోందన్న అంశాన్ని కాని, సాంఘిక సంక్షేమం ఎలా అమలౌతోందన్న అంశాన్ని కాని జీడీపీ సూచించదు. అందుచేత కేవలం జీడీపీనే కొలబద్దగా తీసుకుని నయా ఉదారవాద విధానాలు మెరుగైనవా లేక వాటికన్నా అంతకు మునుపు అమలు జరిగిన విధానాలే కాస్త నయమా అన్నది నిర్ధారించకూడదని నా అభిప్రాయం. నయా ఉదారవాద కాలంలో ఆదాయాల్లో అసమానతలు తగ్గకపోగా మరింత పెరిగాయని, దిగువ స్థాయి ప్రజల పరిస్థితులు మరింత దిగజారాయని మనకి ఇప్పటికే స్పష్టంగా తెలుసు. అందుచేత ఇక్కడ ప్రశ్న ఏమంటే నయా ఉదారవాద కాలంలో అత్యధిక ప్రజానీకం జీవన స్థితిగతులు అంతకు మునుపటి కాలంలో కన్నా మెరుగు పడ్డాయా లేక దిగజారాయా అన్నదే. నా అభిప్రాయం దిగజారాయనే. అంతేకాక, నయా ఉదారవాద కాలంలో జీడీపీ వృద్ధిరేటు నమోదైనదానిని కూడా అతిగా చేసి చూపించారు. చాలా మంది పరిశోధకులు సైతం ఈకాలంలో జీడీపీ వృద్ధిరేటును అతిగా అంచనాలు వేశారని, అందుచేత ఆర్థికవృద్ధి రేటును కూడా అతిగా అంచనా వేశారని వాదిస్తు న్నారు. కేంద్ర ప్రభుత్వానికి గతంలో ముఖ్య ఆర్థిక సలహాదారుడిగా పని చేసిన అరవింద్ సుబ్రమణియన్ వారిలో ఒకరు. 2011 -12 నుంచి 2016-17 మధ్య కాలంలో భారతదేశపు వృద్ధి రేటు ప్రతీయేటా కనీసం 2.5 శాతం అదనంగా లెక్కించారని ఆయన అన్నారు. 2011-12లోనే జీడీపీ అంచనాలకు కొత్త ప్రాతిపదికను ఉపయోగించడం మొదలు పెట్టారు. ఇప్పటిదాకా అదే ప్రాతిపదికను కొనసాగిస్తున్నారు. అందుచేత అంతకు ముందు కాలంతో పోల్చితే నయా ఉదారవాద కాలంలో జీడీపీ వృద్ధిరేటు వాస్తవానికి 1 శాతం లేదా 1.5 శాతానికి మించదు. మరోపక్క ఆదా యాలలో అసమానతలు నిస్సందేహంగా పెరిగిపోయాయి. అంటే సామాన్య ప్రజల ఆదాయాలలో పెరుగుదల ఏమీ లేదన్నట్టే. అందుచేత ఆ సామాన్య ప్రజల కోణం నుంచి చూసినప్పుడు నయా ఉదారవాద కాలం సాధించిన విజయం ఏమీ లేదు. పైగా పెరిగిన అసమానతలు దేశంలోని ప్రజాతంత్ర వ్యవస్థల్ని, సమానత్వ విలువల్ని దెబ్బతీశాయి.



అంతేకాదు. ప్రజల జీవన పరిస్థితులు దిగజారిపోయాయన్న విషయాన్ని ధృవపరిచే ప్రత్యక్ష ఆధారాలు మన దగ్గర ఉన్నాయి. 20వ శతాబ్దపు తొలి సంవత్సరాలలో (1900 తర్వాత) బ్రిటిష్ వారి పెత్తనంలో భారతదేశం ఉన్నప్పుడు తలసరి ఆహార ధాన్యాల లభ్యత 200 కిలోలు. మనకు స్వతంత్రం వచ్చేనాటికి అది కాస్తా 137 కిలోలకు పడిపోయింది. వలస పాలన కొనసాగిన ఆ 50 సంవత్సరాల కాలంలో ఏకంగా 31 శాతం పడిపోయింది! నయా ఉదారవాద పండితులు ప్రస్తుతం తూర్పారబడుతున్న కాలంలో (అంటే ప్రభుత్వ నియంత్రణతో ఆర్థిక వ్యవస్థ 1960 -1980 కాలం) ఇది 186.2 కిలోలకు పెరిగింది. ఇది తప్పకుండా గణనీయమైన పెరుగుదల. కాని 20వ శతాబ్దపు ప్రారంభ సంవత్సరాల నాటి స్థాయికి చేరలేదు. నయా ఉదారవాద విధానాలు అమలవడం తర్వాత 2008 వరకూ దీర్ఘకాలం పాటు తలసరి ఆహారధాన్యాల లభ్యత పడిపోతూ వచ్చింది. ఆ తర్వాత కొంతపెరిగి, 2019-20లో 183.14 కిలోలకు చేరింది. 1991 నాటి స్థాయిని 2020-21లో మాత్రమే దాటి 186.77 కిలోలకు చేరింది. 2021-22లో కాస్త పెరిగి 187.13 కిలోలకు చేరింది. ఆహారధాన్యాల లభ్యత అనేది అభివృద్ధిని మదింపు చేసే ఒక ముఖ్యమైన ప్రమాణం. ఆ ప్రమాణం రీత్యా చూస్తే ఎదుగూ బొదుగూ లేకుండా నయా ఉదారవాద కాలంలో స్తంభించి పోయింది. 2022-23లో కోవిడ్ సహాయం కింద తలా ఐదు కిలోలు అందించిన కారణంగా తలసరి ఆహార ధాన్యాల లభ్యత మరికాస్త పెరిగింది. అయితే దీనిని వృద్ధికి సంకేతంగా పరిగణించలేం. ఎందుకంటే ఉన్న ఆహార ధాన్యాల నిల్వలను కరగబెట్టి ప్రజలకు పంచారే తప్ప అదనపు ఉత్పత్తి ఏమీ సాధించలేదు.

ఇప్పటివరకూ మనం ఆహారధాన్యాల సగటు లభ్యత ఆధారంగానే చర్చించాం. అందులో ఏ యే తర గతులకు ఎంతెంత అందుతోంది అన్నది చూడాలి. ఒకపక్క ఆదాయాల్లో అసమానతలు పెరుగుతున్నప్పుడు అధి కాదాయ వర్గాల్లో ఆహారధాన్యాల లభ్యత, వినియోగం పెరుగుతుంది. అదే విధంగా అల్పాదాయ వర్గాల్లో ఆ లభ్యత, వినియోగం తగ్గుతాయి. ఫలితంగా అల్పాదాయ వర్గాల ప్రజలకు పౌష్టికాహారం అందకుండా పోతుంది. ఈ విష యాన్ని ధృవీకరించే ఆధారాలు ఉన్నాయి. 1970 దశకంలో అప్పటి ప్లానింగ్ కమిషన్ గ్రామీణ ప్రాంతాలలో 2200 క్యాలరీలు, పట్టణ ప్రాంతాలలో 2100 క్యాలరీలు శక్తిని ఇచ్చే ఆహారాన్ని ప్రతీ ఒక్క వయోజనులూ పొందగలిగి వుండాలని కనీస ప్రమాణాన్ని నిర్ణయించారు. అంతకు తక్కువ మోతాదులో పొందుతున్న వారంతా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నట్టే పరిగణించారు. 1973-74 లో గ్రామీణ ప్రాంతాలలో ఆ కనీస ప్రమాణం ప్రకారం ఆహారం పొందలేక పోతున్నవారు 56.4 శాతం ఉండేవారు. 1993-94 నాటికి వారు 58 శాతం అయ్యారు. అంటే నయా ఉదారవాద విధానాలు అమలు అవడానికి మునుపు గ్రామీణ పేదరికం స్థాయిలో పెద్దగా మార్పు లేదు. పేదరికం పెరగనూ లేదు, తగ్గనూ లేదు అని చెప్పవచ్చు.

దాని పూర్తి భిన్నంగా 1993-94 నుండి 2017-18 మధ్య కాలంలో కనీస స్థాయిలో పౌష్టికాహారాన్ని పొందలేకపోయినవారు గ్రామీణ ప్రాంతాల్లో 58 శాతం నుండి 80 శాతానికి పెరిగారు (2017-18 నేషనల్ శాంపిల్ సర్వే గణాంకాలను మోడీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ప్రజలకు అందుబాటులో లేకుండా చేసింది. అందు చేత ఉజ్జాయింపుగానే లెక్కించాల్సి వచ్చింది)! పేదరికం పరిస్థితి ఎంత దిగజారిందంటే ఆ గణాంకాల్ని ప్రభుత్వం తొక్కిపట్టడమే కాకుండా, పేదరికపు కొలమానాలనే మార్చివేసి కొత్త పద్ధతిలో శాంపిల్ సర్వే మొదలుపెట్టింది. దీనిని బట్టి నయా ఉదారవాద కాలంలో జీడీపీ ప్రమాణ సమర్థకులు చెప్తున్న దానికి భిన్నంగా గ్రామీణ పేదరికం పెరిగిపోయిందని స్పష్టమౌతోంది. అయితే నయా ఉదారవాద సమర్థకులు దీనికి జవాబుగా ఒక వాదనను ముందుకు తెస్తున్నారు. ఇప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువమంది తమ బిడ్డల్ని స్కూళ్లకి పంపుతున్నారని, ఆధునిక వైద్య సౌకర్యాలు పొంద గలుగుతున్నారని, సెల్‌ఫోన్లను అందరూ వాడగలుగుతున్నారని, గ్రామీణుల జీవనశైలి మారిపోయిందని, ఆహార ధాన్యాల కన్నా తక్కిన విషయాల మీద ఎక్కువ దృష్టి పెడుతున్నారని, వారి అభిరుచులు మారిపోయాయని అంటూ, ఈ కారణాల వలన వారు తీసుకునే పౌష్టికాహారపు క్యాలరీల విలువ తగ్గిపోయిందని అంటున్నారు. దాన్నిబట్టి వారి పేదరికం పెరిగిపోయిందని నిర్ధారించకూడదంటున్నారు.

వాళ్లు ఇక్కడ విస్మరిస్తున్న అంశం ఒకటుంది. ప్రజలు వినియోగించే పలు రకాల సరుకుల్లో కొన్ని రకాల సరుకుల వినియోగాన్ని తగ్గించుకోవడం సాధ్యపడదు. మరికొన్ని సరుకుల వినియోగాన్ని తగ్గించుకోవడం వలన వారికి వెనువెంటనే ఇబ్బందులు రానప్పుడు అటువంటి సరుకుల వినియోగాన్ని వారు తగ్గించుకుంటారు. ఆహార ధాన్యాలు ఈరెండో కోవకు చెందుతాయి. వాటి వినియోగాన్ని తగ్గించుకుంటే వెనువెంటనే ఇబ్బందులు తలెత్తక పోవచ్చు కాని దీర్ఘకాలంలో నష్టం కలుగుతుంది. ఒక ఆపరేషన్ అవసరమైనప్పుడో, లేదా క్యాన్సర్ లాంటి రోగం సోకినప్పుడో చేయవలసిన ఖర్చు తగ్గించనూ లేరు, వాయిదా వేయనూలేరు. ఇటువంటి అనుకోని ఖర్చులు వస్తూనే వుంటాయి. అదే విధంగా సాంకేతిక పురోగతి కారణంగా కొన్ని కొత్తరకాల సరుకుల వినియోగం మొదలౌతుంది. కొన్ని పాత రకపు సరుకుల వినియోగం నిలిచిపోతుంది.


> నయా ఉదారవాద కాలంలో అత్యధిక ప్రజానీకం జీవన స్థితిగతులు అంతకు మునుపటి కాలంలో కన్నా మెరుగు పడ్డాయా లేక దిగజారాయా అన్నదే. నా అభిప్రా యం దిగజారాయనే. అంతేకాక, నయా ఉదారవాద కాలంలో జీడీపీ వృద్ధిరేటు నమోదైనదానిని కూడా అతిగా చేసి చూపించారు. చాలా మంది పరిశోధకులు సైతం ఈకాలంలో జీడీపీ వృద్ధిరేటును అతిగా అంచనాలు వేశారని, అందుచేత ఆర్థికవృద్ధి రేటును కూడా అతిగా అంచనా వేశారని వాదిస్తు న్నారు. కేంద్ర ప్రభుత్వానికి గతంలో ముఖ్య ఆర్థిక సలహాదారుడిగా పని చేసిన అరవింద్ సుబ్రమణియన్ వారిలో ఒకరు. 2011 -12 నుంచి 2016-17 మధ్య కాలంలో భారతదేశపు వృద్ధి రేటు ప్రతీయేటా కనీసం 2.5 శాతం అదనంగా లెక్కించారని ఆయన అన్నారు. 2011-12లోనే జీడీపీ అంచనాలకు కొత్త ప్రాతిపదికను ఉపయోగించడం మొదలు పెట్టారు. ఇప్పటిదాకా అదే ప్రాతిపదికను కొనసాగిస్తున్నారు. అందుచేత అంతకు ముందు కాలంతో పోల్చితే నయా ఉదారవాద కాలంలో జీడీపీ వృద్ధిరేటు వాస్తవానికి 1 శాతం లేదా 1.5 శాతానికి మించదు.

ప్రమాదకరమైన రోగం ప్రబలినప్పుడు ఒక వ్యక్తి తన గ్రామంలో ఉండే భూతవైద్యుడి మీద ఆధారపడలేడు. ఆధునిక వైద్యాన్ని ఆశ్రయించక తప్పదు. ఆ సందర్భంలో రోజువారీ ఆహారం మీద పెట్టే ఖర్చు తగ్గించుకోవడం అనివార్యం. అతడు ఆధునిక వైద్యం మీద ఖర్చు చేయగలుగుతున్నాడు గనుక అతని ఆర్థిక స్థితి మెరుగుపడిందని నిర్ధారించలేం కదా. పైగా ఆధునిక వైద్యపు ఖర్చులు విచ్చలవిడిగా పెరిగిపోయే ప్రమాదం కూడా ఉంటుంది. ఇంగ్లాండ్ చక్రవర్తి 7వ హెన్రీ ఒక గాయం అల్సర్‌గా మారి సెప్టిక్ అయినందువలన మరణించాడు. అప్పటికి యాంటీ బయాటిక్స్ ఇంకా కనుగొనలేదు. ఇప్పుడు ఒక సామాన్యుడు ఆ యాంటీ బయాటిక్స్‌ను వాడగలుగు తున్నాడు. కాబట్టి ఈ సామాన్యుడు ఆనాటి 7వ హెన్రీ చక్రవర్తి కన్నా మెరుగ్గా జీవిస్తున్నాడని ఎవరైనా అనగలరా? తన జీవితంలో ఎప్పటికప్పుడు మారుతూ వుంటే పరిస్థితులను బట్టి తన వినిమయాన్ని మార్చుకోవడం అనివార్యం. అయితే, ఆ క్రమంలో ఆహారధాన్యాల వంటి కనీస అవసరాల వినిమయాన్ని సైతం తగ్గించుకోవలసిన పరిస్థితి ఉందా? లేదా? అన్నదానిని బట్టి అతడి జీవన స్థాయి మెరుగు పడిందో లేదో నిర్ధారించగలం. ఇలా నిర్ధారించే క్రమానికి ఆహారధాన్యాల లభ్యత అన్నది ఒక స్పష్టమైన ప్రమాణం. ఆ లభ్యత తగ్గుతోందీ అంటే సామాన్యుల జీవన ప్రమాణాలు మెరుగుపడడం లేదనే లెక్క.

నయా ఉదారవాద విధానాలకు పూర్వపు కాలంలో సామాన్యుల జీవన స్థితిగతులు ఎంతో కొంత మెరుగు పడ్డాయి. ఒకవైపు వారికి ఆహారధాన్యాల లభ్యతా పెరిగింది. మరోవైపు ఆధునిక సరుకులను వారు పొందగలగడం కూడా పెరిగింది. అయితే ఇదేమీ చాలా గొప్ప అభివృద్ధి అని చెప్పలేం. కాని, నయా ఉదారవాద కాలంలో మాత్రం పౌష్టికాహార లేమీ పెరిగిపోతోంది. జీవన పరిస్థితులూ దిగజారిపోతున్నాయి. జీడీపీ గణాంకాలను చూపిస్తూ ఈ మౌలిక సత్యాన్ని మరుగుపరచలేరు.

(స్వేచ్ఛానుసరణ)

మతతత్వ విభజన రాజకీయాలొద్దు..



బంగ్లాదేశ్‌లో హిందువులపైనా, బౌద్ధులు తదితర ఇతర మైనారిటీలపైన నిరంతరాయంగా సాగుతున్న దాడులు ఎంతో ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రజా వెల్లువ కారణంగా ఆగష్టు నెల మొదటి వారంలో షేక్ హసీనా ప్రభుత్వం కూలిపోయిన తర్వాత ఆమె నిరంకుశ పాలన ముగిసింది గనక బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామిక వ్యవస్థ ఉదయిస్తుందని ఆశించారు. కాని మొదటి రోజులలో కల్లోలం హిందూ దేవాలయాలపై దాడులు దేశవ్యాపితంగా మైనారిటీలపై దాడుల వార్తలు వచ్చాయి.

తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన సలహాదారుడుగా వున్న మహ్మద్ యూనస్ ఆ సమయంలో మైనార్టీలకు రక్షణ కల్పిస్తామని హామీ ఇచ్చారు. కానీ అప్పటినుంచి ఆ సంఘటనలు సాగుతూనే వున్నాయి. ఇప్పటికి చూస్తే మొత్తం 2వేల హింసా ఘటనలు ఆధారాలతో సహా నమోదైనాయి. మైనార్టీ వర్గాలకు చెందిన తొమ్మిది మంది వరకూ చంపబడ్డారు

చిన్మయ కృష్ణదాస్ అనే హిందూ సన్యాసి అరెస్టు దేశద్రోహ నేరం బనాయింపు జరిగాక ఈ దఫా పరిస్థితి మరింత క్లిష్టతరమైంది. ఇదివరలో హరేకృష్ణ ఉద్యమం ఇస్కాన్‌తో ముడిపడివున్న ఈయన దాని నుంచి తొలగించబడి సమ్మిళిత సనాతని జాగరణ్ జోతే అనే సంస్థతో పనిచేస్తున్నారు. ఆయన తీవ్రమైన భావాలు వెలిబుచ్చిన మాట నిజమే. అయినా బంగ్లాదేశ్ జాతీయ పతాకాన్ని కించపర్చిన కారణంగా అరెస్టు చేసి దేశ ద్రోహం ఆరోపణలు బనాయించడం అధికార దుర్వినియోగంతో చేసిన పని మాత్రమే. దాస్‌ను కోర్టులో హాజరుపర్చినప్పుడు బెయిలు లభించకపోవడంతో పోలీసులకు, ఆయన అనుయాయులకు మధ్య ఘర్షణ జరిగింది. ఒక అసిస్టెంటు పబ్లిక్ ప్రాసిక్యూటర్ దాడికి గురై మరణించారు. ప్రస్తుతం మత పరిస్థితి ఎంత ప్రమాదకరంగా వుందో దీన్ని బట్టే తెలుస్తుంది.

బంగ్లాదేశ్ ప్రభుత్వ తప్పిదం

తాత్కాలిక ప్రభుత్వం దాని ప్రతినిధులు ఈ దాడుల ఘటనలను తేలిగ్గా తీసేయ జూస్తున్నారు. ఇవన్నీ అతిశయోక్తిగా చెబుతున్నవని కొట్టి పారేస్తున్నారు. అవామీ లీగ్ కార్యకర్తలపైన, వారి మద్దతుదారులపైన ప్రజాగ్రహం ఫలితమే ఇవన్నీ అన్నట్టు చిత్రిస్తున్నారు. బంగ్లాదేశ్‌కు వ్యతిరేకంగా సాగుతున్న ఈ ప్రచారం వెనక భారత ప్రభుత్వ హస్తం వుందన్నట్టు మాట్లాడుతున్నారు. మైనారిటీలపై ఇస్లామిక్ శక్తులు ఈ దాడులకు పాల్పడుతున్నాయనే వాస్తవాన్ని విస్మరించడం ద్వారా యూనస్ నాయకత్వంలోని ప్రభుత్వం తప్పు చేస్తున్నది.

> ఈ పరిస్థితిలో భారతదేశంలో బీజేపీ-ఆరెస్సెస్ ఇంకా అనేక ఇతర హిందూత్వ సంస్థల ధోరణి ఈ సమస్య పరిష్కార కృషికి సహాయపడేదిగా లేదు. హిందువుల దుస్థితి అంటూ ఈ సంస్థలు సరిహద్దు పొడుగునా విశృంఖలంగా రెచ్చగొట్టే ప్రచారం సాగిస్తున్నాయి. నూతనంగా ఏర్పడిన తమ రాజకీయ వ్యవస్థను దెబ్బతీసే ప్రయత్నంగా అక్కడ బంగ్లాదేశ్‌లో అధికారులు, ప్రజాస్వామిక శక్తులు పరిగణిస్తున్నాయి. కోల్‌కతా, అగర్తలా, గౌహతిలలో బంగ్లాదేశ్ దౌత్య కార్యాలయాల ముందు కవ్వింపు భాషతో హిందూ తీవ్రవాద బృందాలు ప్రదర్శనలు జరపడం పరిస్థితి మరింత దిగజారడానికి కారణమైంది.

షేక్ హసీనా ప్రభుత్వానికి మోడీ సర్కారు మద్దతునివ్వడం వల్ల నెలకొన్న భారత వ్యతిరేక భావనను మైనార్టీలపై దాడికి ఒక కవచంగా ఇస్లామిక్ చాందస శక్తులు ఉపయోగించుకుంటున్నాయి. జమాతే ఇస్లామీపై నిషేధం తొలగించడం, దాని నాయకులు జైళ్ల నుంచి బయటికి రావడంతో హిఫాజాతె ఇస్లాం వంటి మత చాందస సంస్థలు హిందువులను లక్ష్యంగా దాడులు చేయడానికి మత విభజన తీసుకురావడానికి పూర్తి స్వేచ్ఛ లభించింది. షేక్ హసీనా పాలన కాలంలో కూడా ఇలాంటి చాందస శక్తులు మైనార్టీలపై దాడులకు పాల్పడుతూనే వున్నారు. తమ ఒంటెత్తు విధానాలు రుద్దడానికి ఇదే సరైన సమయంగా భావిస్తున్న ఇలాంటి శక్తులను కఠినంగా అణచివేయడం అవసరం. బంగ్లాదేశ్‌లో తాత్కాలిక ప్రభుత్వం, ప్రజాస్వామిక శక్తులు కూడా ఈ సమయంలో నిలదొక్కుకోవడం అవసరం.

హిందూత్వ సంస్థల కవ్వింపు

ఈ పరిస్థితిలో భారతదేశంలో బీజేపీ-ఆరెస్సెస్ ఇంకా అనేక ఇతర హిందూత్వ సంస్థల ధోరణి ఈ సమస్య పరిష్కార కృషికి సహాయపడేదిగా లేదు. హిందువుల దుస్థితి అంటూ ఈ సంస్థలు సరిహద్దు పొడుగునా విశృంఖలంగా రెచ్చగొట్టే ప్రచారం సాగిస్తున్నాయి. నూతనంగా ఏర్పడిన తమ రాజకీయ వ్యవస్థను దెబ్బతీసే ప్రయత్నంగా అక్కడ బంగ్లాదేశ్‌లో అధికారులు, ప్రజాస్వామిక శక్తులు పరిగణిస్తున్నాయి. కోల్‌కతా, అగర్తలా, గౌహతిలలో బంగ్లాదేశ్ దౌత్య కార్యాలయాల ముందు కవ్వింపు భాషతో హిందూ తీవ్రవాద బృందాలు ప్రదర్శనలు జరపడం పరిస్థితి మరింత దిగజారడానికి కారణమైంది. అగర్తలాలో బంగ్లాదేశ్ సహాయ హైకమిషనర్ కార్యాలయ ఆవరణలోకి చొచ్చుకు వెళ్లి ఆస్తుల విధ్వంసానికి పాల్పడటం ఆ దేశంలో భారత వ్యతిరేకతను మరింత ముదిరిపోయేలా చేయడానికే కారణమవుతుంది. బంగ్లాదేశ్‌కు వ్యతిరేకంగా తీవ్ర భాషలో దండకం చదవడం అక్కడ మైనార్టీల భద్రతకు ముప్పుగా తయారవుతుంది.

ద్వంద్వనీతి

భారత దేశంలో మైనారిటీలపై వేధింపులు, విద్వేష ప్రచారం సాగించే పాలకులు అదే మైనారిటీల రక్షణ గురించి నీతి బోధ చేస్తుంటే బంగ్లాదేశ్ ప్రజలు విస్తుపోతున్నారు. అగ్రశ్రేణి భారతీయ నేతలు, బంగ్లాదేశ్‌కు వ్యతిరేకంగా తీవ్రభాషలో పల్లవి ఆలపిస్తున్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా జార్ఖండ్‌లో ఎన్నికల ప్రచారంలో బంగ్లాదేశీయుల భారీ చొరబాటును గురించి అసత్యపూరితంగా తీవ్ర హెచ్చరికలు చేశారు. గతంలో ఆ చొరబాటుదారులనే 'దేశ దిమ్మరులు' అని ఆయన మాట్లాడారు.

మతతత్వ విభజన రాజకీయాలు ఇరు దేశాల ప్రయోజనాలకు నష్టదాయకంగా పరిణమిస్తాయని ఉభయ దేశాలలోని లౌకిక, ప్రజా స్వామిక శక్తులు నొక్కిచెప్పడం అవసరం. బంగ్లాదేశ్‌లో మైనారిటీల భద్రతను కాపాడటం కోసం, పౌరులుగా వారి హక్కులను పూర్తిగా రక్షిం చడం కోసం గట్టిగా నిలవాల్సిన బాధ్యత షేక్ హసీనా నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన లౌకిక, ప్రజాస్వామిక శక్తులపై వుంది.

(డిసెంబర్ 4 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

'సమూహ'శక్తే.. సమాజానికి రక్ష

- కె. రూప రుక్మిణి

ఒంటరిగా నిలిచి ఎప్పుడూ ఏ విజయాన్ని కాంక్షించలేము. సమూహమే బలమైన గొంతుకను ఇస్తుంది. మన చుట్టూ ఎన్నో వేల గొంతుకల మధ్య ఏ సమూహాలు ఉన్నాయో ఎటువంటి సఅజన చేస్తున్నాయో నిరంతరం అప్రమత్తులమై ఉండాలి. ఎన్నో విరుద్ధ గొంతుకుల మధ్య ఓ దారి చేసుకుని నిజమైన ప్రజల గొంతుకను వినిపించడానికి ప్రజల చైతన్య ధారను తిరిగి ఉత్తేజపరిచేలా భావజాల రంగంలో ప్రజాస్వామిక దఅక్పథాన్ని పెంచడానికి నిరంతరం కఅషి చేసే మహత్కార్యాన్ని 'సమూహ' సెక్యులర్ రైటర్ ఫోరమ్ తీసుకున్నది. నియంతఅత్వానికీ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్యవేత్తలు రాజకీయ ఆలోచనాపరులు నిత్యం జరుగుతున్న అన్యాయాల పై నిరసన తెలుపుతూనే ఉంటారు, ఓ దఅక్పథాన్ని వెల్లడి చేస్తూనే ఉంటారు అనడానికి 'సమూహ' సరైన ఉదాహరణ.

లౌకిక ప్రజాస్వామిక జీవ సంస్కఅతి విలువలు పెంపొందించాల్సిన సాహిత్యం పై యువతరం ఆలోచనల తీరును వారి దఅక్కోణాలను శైలిని సానబెట్టి పదును తీర్చడానికి భిన్న సాహిత్య అస్తిత్వాలకు చెందిన రచయితలు ఉమ్మడి కార్యాచరణతో పరిశీలనాత్మక నిర్దేశకాలను అందించడానికి పోయిన సంవత్సరం సమూహ రూపంలో ఐక్యవేదిక ఏర్పరచి రాజ్యాంగ బద్ధంగా లౌకిక స్ఫూర్తిని పెంచడానికి ముందుకు వచ్చారు. దేశంలో మాట్లాడే శక్తిని , మాట్లాడే మనుషుల్ని వెతికి మరీ జైళ్ళ పాలు చేస్తుందీ మతస్వామ్య ప్రభుత్వం. ప్రజా సంక్షేమం మరచి కార్పొరేట్ ప్రయోజనాలకు



మాత్రమే ప్రాధాన్యం ఇస్తున్నది. ప్రజాస్వామ్య దేశంలో ప్రజలపై జరుగుతున్న అన్యాయాలని ప్రశ్నించే గొంతుకలు లేకుండా చేయాలనుకుంటున్నాయి. ఈ ఫాసిస్టు భావజాలానికి కూకటి వేళ్ళతో ముగింపు పలకలేని నిస్సహాయతలను సృష్టిస్తోంది.

దేశంలోనే అనేక చోట్ల సీఆర్పీ సెక్షన్ 144 నుంచి ఉపా వరకు పెక్కు నిర్బంధ చట్టాలను హింసాత్మకంగా ఉపయోగిస్తున్నారు. కనీసం రైతులు చేసే శాంతియుత కార్యక్రమాలపై కూడా నిర్బంధం అమలు చేస్తున్నారు. దూకుడుగా అణిచివేతలకు పాల్పడుతున్న పాలకవర్గం గాంధేయ మార్గంలో తెలిపే నిరసనలను సైతం గౌరవించే చోటు నేడు మన దేశంలో ఎక్కడా లేకుండా పోతుంది. కనీసం అంబేద్కర్ జయంతి ఇలాంటి కార్యక్రమాలను అంబేద్కర్ విగ్రహం వద్ద పుస్తకాల ఆవిష్కరణను కూడా అడ్డుకుంటుంది. సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం వరంగల్ లో జరిపిన సభపై మతవాద శక్తులు చేసిన దాడులు మన కళ్ళ ఎదురుగా జరిగిన ఒక ప్రత్యక్ష సాక్ష్యం. ఒక విద్యాత్మక చర్చావేదికని ఎలా నిర్వహిస్తారు అనే ప్రశ్నలతో చల్లాచెదురు చేయాలని చూసింది., కేసులు వేసింది. శాంతియుత బౌద్ధిక చర్చలే అయినా అవి ప్రజల ఆలోచనలపై ప్రభావాన్ని చూపిస్తాయేమో అన్న భయంతో ఈ పాలకుల వెన్ను జలదరించింది. ప్రత్యామ్నాయ ఆలోచనల కేంద్రాలు కావలసిన విశ్వవిద్యాలయాల్లో ఈనాటి మత రాజకీయాలు అదఅశ్య శక్తులు చాప కింద నీరులా మనుధర్మాలని చొప్పిస్తూ ఇదే మన సంస్కఅతి ఇదే మన జీవన విధానం అంటూ ప్రచారం చేస్తోంది. ప్రజా స్వామిక విలువలపై చట్టసభల్లో బయటా మెరుపు దాడులకు దిగుతుంది. వాక్ స్వాతంత్రాన్ని లేకుండా దిగమింగుతున్న సందర్భంలో ప్రశ్నించే గొంతుకగా నిలబడే సమయాన్ని నిర్ణయించుకుని అంతరంగాల ఆవిష్కరణలను సామూహిక గొంతును వినిపించడానికి మరోసారి సమూహ సిద్ధమైంది. ఇది మన సమూహ రచయితలు అందరూ కలిసి నిర్మించుకోవాలనుకుంటున్న లౌకిక ప్రజాస్వామ్య విలువలు ప్రజల్లోకి తీసుకొని వెళ్లే ఓ అవగాహన సదస్సు మాత్రమే ఇది.. ఇలా ఓ సదస్సుని జరుపుకోవడానికి రచయితలు అందరూ కూడా ఈనెల 14వ తారీకున మహబూబ్ నగర్లో తొలి రాష్ట్ర మహాసభలని నిర్వహించుకుంటున్నారు.ఈ సభలో రచయితలు అందరు పాలు పంచుకోవాలని కోరుతున్నాను. ■

అర్ధాకలితో పుస్తకాలపై కుస్తీ

ఆల్పాహారం, స్నాక్స్ ఇవ్వాలని విజ్ఞప్తి

- టెన్త్ విద్యార్థులకు కొనసాగుతున్న ప్రత్యేక తరగతులు
- ఉదయం 8.30 నుంచి సాయంత్రం 5.30 వరకు బడిలోనే
- రెండేండ్ల క్రితం దాతల సాయంతో స్నాక్స్ ఇప్పించిన కలెక్టర్
- సీఎస్ఆర్ నిధుల్ని కేటాయించాలి : ఎస్ఎఫ్ఐ
- అధికారులకు నివేదించాం : డీఈఓ



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

పదో తరగతిలో వంద శాతం ఫలితాలు సాధించాలి. అందరూ ఉత్తీర్ణత సాధించడమే కాదు 10 జీపీఏ సాధించేలా పరీక్షలకు సిద్ధం చేయాలి. పదో తరగతి సిలబస్‌ను పూర్తి చేయడమే కాకుండా రివిజన్స్ చేయించడం, పరీక్షలకు సంసిద్ధం చేయడం కోసం అదనపు తరగతులు నిర్వహించాలని విద్యాశాఖ నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో నవంబర్ 1 నుంచే ప్రత్యేక తరగతులు కొనసాగుతున్నాయి. అయితే చలి తీవ్రత కూడా పెరుగుతుండడంతో ఉదయం పూట ఆకలితో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం లేదంటే దాతల ద్వారా పదో తరగతి విద్యార్థులకు స్నాక్స్ లేదా అల్పాహారం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఈ విద్యా సంవత్సరంలో రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షల మంది పదో తరగతి వార్షిక పరీక్షలు రాయనుండగా అందులో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న వాళ్ల సగం మంది వరకు ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో పేద, మధ్యతరగతి వాళ్లే అధికంగా ఉన్నారు. గతేడాది కంటే ఈ సారి ఉత్తమ ఫలితాలు సాధించడంతో పాటు అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోనూ 100 శాతం ఉత్తీర్ణత వచ్చేలా చూడాలని విద్యాశాఖ జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేసింది అయితే దానికి తగ్గట్టుగా తరగతులు నిర్వహి స్తున్నా విద్యార్థులకు అల్పాహారం అందక మధ్యాహ్నం వరకు ఖాళీ కడుపుతో ఉండాల్సి వస్తోంది.

ఆకలితో విద్యార్థుల చదువులు

ఉదయం 7.30 గంటలకే ఇంటి నుంచి బయలుదేరి పాఠశాలకు వస్తున్న విద్యార్థులు సాయంత్రం 5.30 వరకు పాఠశాలలోనే ఉండాల్సి ఉంది. దాంతో రోజులో వారు భోజనం చేసేది మధ్యాహ్నం మాత్రమే. ఉదయం, సాయంత్రం ఖాళీ కడుపులతో అలాగే చదువులు సాగిస్తున్నారు. పొద్దున ఇంటి వద్ద భోజనం తయారు కాకపోవడం, హడావుడిగా రెడీ అయ్యి స్కూల్‌కు వస్తుండటంతో భోజనం చేయకుండానే వస్తున్నారు. సాయంత్రం వరకు స్కూల్‌లో ఉండే విద్యార్థులు ఇంటి నుంచి స్నాక్స్ తెచ్చుకునే పరిస్థితి లేదు. ప్రత్యేక తరగుతుల్లో మైండ్ పెట్టి చదువుకోవాల్సి ఉంటుంది. కానీ ఒక పక్క చలి ప్రభావం, మరో పక్క ఆకలి మంటతో విద్యార్థులు చదువులపై ఆసక్తి చూపని పరిస్థితి ఉంటుందని ఉపాధ్యాయులు వాపోతున్నారు.

ప్రత్యేక తరగతులు

పదో తరగతి విద్యార్థుల్ని వార్షిక పరీక్షలకు సిద్ధం చేసేందుకు ఉదయం పూట గంట, సాయంత్రం పూట మరో గంట ప్రత్యేక క్లాసులు బోధిస్తున్నారు. ఉదయం పూట 8.45 గంటల వరకు పదో తరగతి విద్యార్థులు స్కూల్‌లో ఉంటున్నారు. దాంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు ఇంటి నుంచి ఉదయం 7.45 నుంచే బయలుదేరి స్కూల్‌కు వస్తున్నారు. సాయంత్రం పూట స్కూల్ సమయం ముగియగానే 4.15 నుంచి 5.15 వరకు పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల్ని గ్రూపులుగా విభజించి ఒక్కో గ్రూప్‌నకు ఒక టీచర్‌ను కేటాయించారు. ప్రతి వారం సైకిలింగ్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నారు. డిసెంబర్ 31 వరకు 100 శాతం సబ్జెక్ట్ పూర్తి చేయాలని విద్యా శాఖ ఆదేశించింది. సబ్జెక్ట్ వారీగా మాడ్యూల్ రూపొందించి జనవరి నుంచి రివిజన్స్ నిర్వహిస్తారు. బోధన పూర్తికాగానే పాఠ్యాంశానికి సంబంధించిన ఉపాధ్యాయులు ప్రశ్నలు అడిగి ఆ తరగతి గదిలోనే నివృత్తి చేస్తారు. ప్రత్యేక తరగతుల నిర్వహణ ఫొటోలను విద్యా శాఖ వాట్సప్ గ్రూపులో సెండ్ చేస్తారు.

గతంలో స్నాక్స్ పెట్టించిన వైనం

రెండేండ్ల క్రితం పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించిన సమయంలో అక్కడక్కడ కొంతమంది జిల్లా అధికారులు చొరవ చూపి దాతల సహాయంతో అల్పాహారం, స్నాక్స్ అందించేవారు. కొంతమంది ప్రజాప్రతినిధులు కూడా సహకరించారు. అప్పటి సంగారెడ్డి జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ ప్రత్యేక చొరవ చూపి దాతల నుంచి ఆర్థిక సహకారం తీసుకుని సాయంత్రం పూట స్నాక్స్ ఇప్పించారు. సంగారెడ్డి జిల్లాలో అత్యధికంగా పరిశ్రమలున్నాయి. పరిశ్రమల యాజమాన్యాలకు స్థానిక గ్రామ పంచాయతీలు, పిల్లల తల్లిదండ్రుల నుంచి విజ్ఞప్తుల్ని ఇప్పించి పిల్లలకు స్నాక్స్ పెట్టేలా ప్రయత్నం చేశారు. రెండేండ్లుగా పట్టించుకున్నవారే లేరు.

సీఎస్ఆర్ నిధులతో సమకూర్చాలి

పదో తరగతి విద్యార్థులకు కంపెనీల నుంచి సేకరించే సీఎస్ఆర్ నిధుల్ని కేటాయించి స్నాక్స్ ఇప్పించాలి. కంపెనీల నుంచి సేకరించే సీఎస్ఆర్ నిధుల్ని మంత్రి, కలెక్టర్, ప్రజా ప్రతినిధులు ఇతర అభివృద్ధి పనులకు కేటాయించడంతో పాటు విద్యార్థులకు స్నాక్స్ అందించేందుకు కూడా కేటాయించాలి. కలెక్టర్, జిల్లా మంత్రులు చొరవ తీసుకోవాలి.

- ఎర్రోళ్ల మహేశ్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి

నిధుల కోసం ప్రతిపాదనలు పంపాం

పదో తరగతి విద్యార్థులకు స్నాక్స్ ఇచ్చేందుకు అవసరమైన నిధుల్ని సమకూర్చాలని కోరుతూ ఉన్నతాధికారులకు నివేదిక పంపాం. జిల్లాలో 203 ఉన్నత పాఠశాలల్లో 12825 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయబోతున్నారు. వారికి స్నాక్స్ అందించేందుకు ఏర్పాట్లు చేస్తాం.

- వెంకటేశ్వర్లు, డీఈఓ

చెరువు సర్వే సమగ్రంగా చేయండి

- లేదంటే ఎన్జీఆర్ఐతో రీసర్వే చేయాల్సి వస్తుంది : హైడ్రా కమిషనర్ రంగనాథ్
- చెరువు స్థలంలో రోడ్డు వేసేందుకు ఎజెండా ఎలా పెట్టారని కమిషనర్‌పై ఆగ్రహం



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

రంగారెడ్డి జిల్లా కుంట్లూర్ గ్రామ రెవెన్యూ సర్వే నెం.185లోని పెద్ద చెరువును సమగ్రంగా సర్వే చేయాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అధికారులను ఆదేశించారు. లేదంటే ఎన్జీఆర్ఐతో రీసర్వే చేయాల్సి వస్తుందన్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు హైడ్రా అధికారులు రెండ్రోజులుగా సర్వే చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ స్థలాన్ని బుధవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. చెరువు స్థలంలో మున్సిపల్ నిధులతో రోడ్డు నిర్మాణానికి తీర్మానం చేయడంపై పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌన్సిల్ ఎజెండాలో ఎలా పెడతారని, నిధులు ఎలా ఇస్తారని, రోడ్డు ఎలా వేస్తారని ప్రశ్నించారు. థర్డ్ పార్టీ అంటూ ఆయన సమాధానం చెబుతుండగా.. థర్డ్ పార్టీ ఎవరంటూ వారిపై కేసు పెట్టాలని ఆదేశించారు. అధికారులు సర్వే త్వరగా పూర్తి చేసి చెరువు, సమీపంలో ఉన్న పట్టా భూమి బౌండరీని ఫిక్స్ చేయాలన్నారు. సర్వే నెం.185లోని చెరువు విస్తీర్ణం 95 ఎకరాలకు సంబంధించిన హద్దులు గుర్తించి బౌండరి ఫిక్స్ చేయాలన్నారు. చెరువుకు సరిహద్దుల్లో మాత్రమే రోడ్డు వేసుకోవాలన్నారు. చెరువులో ఉన్న రోడ్డును తొలగించాలని ఆదేశించారు.

బిగ్‌సీ వార్షికోత్సవ వినూత్న ఆఫర్లు

నవ తెలంగాణ - హైదరాబాద్

ప్రముఖ మొబైల్ రిటైల్ చెయిన్ బిగ్ సీ తన 22వ వార్షికోత్సవం సందర్భంగా వినూత్న ఆఫర్లను అందిస్తున్నట్టు ఆ సంస్థ ఫౌండర్, సీఎండీ ఎం బాలు చౌదరి తెలిపారు. ఈ ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని అనవాయితీగా ఆకర్షణీయ ఆఫర్లను ప్రకటిస్తున్నామన్నారు. స్మార్ట్‌ఫోన్ కొనుగోలుపై రూ.5,999 విలువగల స్మార్ట్‌వాచ్ లేదా రూ.1,799 విలువ గల ఇయర్‌బర్డ్స్‌ను కేవలం రూ.22కే అందిస్తున్నామన్నారు. అదే విధంగా 10 శాతం వరకు తక్షణ క్యాష్ బ్యాంక్, జీరో డౌన్‌పేమెంట్‌తో నో కాస్ట్ ఈఎంఐ ఆఫర్లు అందుబాటులో ఉంటాయన్నారు. సామ్‌సంగ్ మొబైల్స్ కొనుగోలుపై రూ.20వేల వరకు తక్షణ క్యాష్‌బ్యాక్, ఐఫోన్‌పై రూ.7,000 వరకు తక్షణ డిస్కౌంట్ పొందవచ్చన్నారు. ఏటీఎం కార్డుపై ఎలాంటి వడ్డీ, డౌన్ పేమెంట్ లేకుండానే మొబైల్, స్మార్ట్ టీవీ, ల్యాప్‌టాప్, ఏసీలు కొనుగోలు చేసే ఆకర్షణీయమైన సదుపాయాన్ని కూడా అందిస్తున్నామన్నారు.

ఘనంగా క్రెడాయ్ రజతోత్సవ వేడుకలు

నవ తెలంగాణ - హైదరాబాద్



నగర రియల్ ఎస్టేట్ రంగాన్ని ఒక వ్యవస్థీకృత, నగర స్వరూపాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్న వినూత్నమైన డెవలపర్‌ల సంస్థగా ఉన్న క్రెడాయ్ హైదరాబాద్‌లో తన 25 ఏండ్ల రజతోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటున్నట్టు ప్రకటించింది. 1997లో ప్రారంభమైనప్పటి నుంచి 28 మంది సభ్యులతో కూడిన బిల్డర్స్ ఫోరమ్ నుండి 330 సభ్యులతో నిలవటం వరకు క్రెడాయ్ హైదరాబాద్ నిర్మాణ పద్ధతులను పెంచడంలో ముందంజలో ఉందని క్రెడాయ్ హైదరాబాద్ ప్రెసిడెంట్ వి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. జీఓ-86 వంటి కార్యాచరణలతో సహా భవిష్యత్ ఆలోచనా విధానాలను ముందుకు తీసుకువెళ్లటానికి ప్రభుత్వంతో కలిసి పనిచేస్తోందన్నారు. రియల్ ఎస్టేట్ రంగానికి ఖ్యాతిని తెచ్చిపెట్టిన మా వ్యవస్థాపక సభ్యులు, గత నాయకుల స్ఫూర్తిదాయకమైన, దృఢమైన సహకారాన్ని మేము గుర్తించడం సముచితమన్నారు. నగరం వృద్ధికి తోడ్పడే అనేక ఇతర కార్యక్రమాలను సమర్థించడం ద్వారా నగర పెరుగుదలలో కీలక పాత్ర పోషించిందన్నారు. గడిచిన 25 ఏండ్లలో నగరంలోని కొన్ని సరస్సులను దత్తత తీసుకుని వాటిని నిర్వహించడం ద్వారా మిషన్ కాకతీయకు చురుకుగా సహకరించామని.. నగరంలో పచ్చదనాన్ని మెరుగుపరచడానికి దోహదపడిందని క్రెడాయ్ హైదరాబాద్ జనరల్ సెక్రెటరీ బి జగన్నాథరావు అన్నారు. హెచ్‌సియు క్యాంపస్‌లో లక్ష మొక్కలు నాటామన్నారు.

అనారోగ్యంతో దంపతుల ఆత్మహత్య

- ఉప్పల్ సాయిరాం కాలనీలో విషాదం



నవతెలంగాణ-ఉప్పల్

అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న దంపతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ విషాద ఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..ఉప్పల్ సాయిరాం కాలనీలో సూర్యనారాయణ శాస్త్రి(60), అతని భార్య జగదీశ్వరి(56) నివాస ముంటున్నారు.వీరి కుమారుడు గచ్చిబౌలిలో ఉంటున్నాడు. దంపతులిద్దరూ కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. బుధవారం ఇంటి నుంచి దుర్వాసన రావడంతో పక్కింటి వారు ఉప్పల్ పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని ఇంటి తలుపు పగలగొట్టి చూడగా దంపతులిద్దరూ చనిపోయి కనిపించారు. "అనారోగ్యం కారణంగా ఆత్మహత్య చేసుకుంటున్నాం.. మా చావుకి ఎవరూ కారణం కాదు" అని రాసిన సూసైడ్ నోట్ అక్కడ లభ్యమైంది. కాగా మూడు రోజుల కిందటే వారు విషం తాగి ఆత్మహత్య చేసుకున్నట్టు తెలుస్తోంది. ఉప్పల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సులు పెంచాలి

బస్ భవన్ వద్ద సీపీఐ (ఎంఎల్)మాస్‌లైన్ ధర్నా

- ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మునిశేఖర్‌కు వినతి



నవతెలంగాణ-ముషీరాబాద్

ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ బస్సులు పెంచాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని బస్‌భవన్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మునిశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.రమ మాట్లాడుతూ ఉచిత ప్రయాణం బడుగు, బలహీన వర్గాలకు ఉపయోగకరమని, కానీ, బస్సుల సంఖ్యను కుదించడం, కొత్తవి మంజూరు చేయకపోవడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఉచిత ప్రయాణం వల్ల కొంత రద్దీ పెరిగిందని, స్త్రీ పురుషుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. స్త్రీలు ఉచితంగా ప్రయాణిస్తున్నట్టు.. పురుషులు డబ్బులతో ప్రయాణిస్తున్నట్టు దెప్పిపొడవడం ఏహ్యాభావంతో చూడటం లాంటివి జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వం కొత్త బస్సులను ఏర్పాటు చేయడమే మరిచిందని, దాంతో ప్రభుత్వాన్ని విమర్శించాల్సిన ప్రయాణికులు మహిళలను అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది సరైనది కాదన్నారు. చిన్న చంద్రన్న మాట్లాడుతూ.. మహిళలను ఉచితంగా తీసుకుపోతున్నట్టు కొందరు కండక్టర్లు అవమానకరంగా మాట్లాడటం సరికాదన్నారు. చంద్ర అరుణ మాట్లాడుతూ.. సిబ్బంది తక్కువగా ఉండటం వల్ల కండక్టర్, డ్రైవర్లపై ఒత్తిడి పెరిగిందన్నారు. అందువల్ల సిబ్బందిని కూడా నియమించాలని కోరారు. ఉచిత ప్రయాణం వల్ల ఆర్టీసీ ఆక్యుపెన్సీ పెరిగిందన్న విషయాన్ని గుర్తించాలన్నారు. ఇప్పటికైనా రద్దు చేసిన పాత బస్సులను పునరుద్ధరించాలని, ప్రయాణికులకు అనుగుణంగా బస్సులను కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ఎల్.పద్మ, ఆవుల అశోక్, సి.వైపుల్లయ్య, గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి ఎం.హన్మేష్, టీయూసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం, పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షులు స్వరూప, పీవైఎల్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు అజయ్, కెఎస్.ప్రదీప్, పీడీఎస్‌యూ అధ్యక్ష కార్యదర్శులు రామకృష్ణ, ఆజాద్, శిరోమణి, ప్రవీణ్ పాల్గొన్నారు.

రైతులను ఉద్యాన పంటల వైపు మళ్లించేలా కృషి చేయాలి

- ఉద్యానవన శాఖ అధికారులకు కోదండరెడ్డి సూచన



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రైతులను ఉద్యాన పంటల వైపు మళ్లించేందుకు కృషి చేయాలని రాష్ట్ర వ్యవసాయ కమిషన్ ఛైర్మెన్ కోదండరెడ్డి సభ్యులు భవానీరెడ్డి సూచించారు. బుధవారం హైదరాబాద్‌లోని బీఆర్‌కే భవన్‌లో ఉద్యాన శాఖ అధికారులతో వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సమావేశమైంది. ఈ సందర్భంగా కోదండరెడ్డి మాట్లాడుతూ రైతు తన కాళ్లపై తాను నిలబడేలా అందరం కలిసి పని చేద్దామని అభిప్రాయపడ్డారు. డ్రిప్ ఇరిగేషన్‌పై చాలా మంది రైతులు ఆధారపడి ఉద్యానవన పంటలు సాగుచేస్తున్నారని గుర్తు చేశారు. వారికీ ఆ పథకం అందుబాటులో లేదనీ, దాన్ని అందేలా చూడాలన్నారు. కేంద్రం నుంచి ఉద్యాన శాఖ రావాల్సిన నిధులను రాబట్టేలా ఎంపీ ఒత్తిడి తేవాలని కోరారు. మిర్చి, పసుపు పంట సాగుచేసే రైతులు గిట్టుబాటు ధర వచ్చే వరకు నిల్వ చేయడం వల్ల ఆర్థిక భారం అవుతుందని చెప్పారు.

విజయోత్సవాల ఖర్చులపై శ్వేతపత్రం విడుదల చేయాలి

- కాంగ్రెస్ సర్కారు ప్రజలకు బాకీపడ్డ పైసలు చెల్లించాలి : బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన విజయోత్సవాల ఖర్చుల వివరాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఓవైపు రాష్ట్రం అప్పుల్లోకి కూరుకుపోయిందని సీఎం, మంత్రులే చెబుతూ మరోవైపు ఈ వృథా ఖర్చులేంటని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర ప్రజలకు బాకీపడ్డ డబ్బులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఇస్తామన్న రూ.2,500 ఏమైందని ప్రశ్నించారు. అన్నీ కలిపి రూ.30 వేల చొప్పున మహిళ ఖాతాల్లో వేయాలని డిమాండ్ చేశారు. పింఛన్ పెంపు హామీ మేరకు ప్రతి వృద్ధునికి రూ.24 వేలు, వికలాంగులకు రూ.36 వేలు బాకీపడ్డదని చెప్పారు. ఒక్కో నిరుద్యోగికి రూ.48 వేలు, కౌలు రైతులకు రూ.15 వేలు, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు, అమరవీరుల కుటుంబాలకు రూ.3 లక్షల చొప్పున బాకీపడ్డదని వివరించారు. పెండ్లి కుమార్తెకు తులం బంగారం, లక్షల రూపాయలతో ఇందిరమ్మ కానుకలేమయ్యాయని నిలదీశారు.

విద్యార్థునులకు ఇస్తామన్న హామీ మేరకు స్కూటీల కోసం రూ.90 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీ ప్రకారం రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేసిన ఆశా వర్కర్లపై పోలీసుల దాడిని ఖండించారు. బెల్టుషాపులను మూసేస్తామని హామీనిచ్చి ఇప్పుడు వాటిని అనధికారికంగా ప్రోత్సహిస్తోందని విమర్శించారు. ఆర్థిక వ్యవస్థను మెరుగుపర్చే ఆలోచన చేయకుండా కోట్ల రూపాయల ప్రజాధనాన్ని విజయోత్సవాల పేరిట రేవంత్ రెడ్డి సర్కారు వృథా చేసిందని విమర్శించారు. రాష్ట్రంలో మీడియా ప్రతినిధులపై రోజురోజుకీ దాడులు పెరిగిపోతుండటంపై ఆందోళన వ్యక్తం చేశారు.

కాంగ్రెస్‌ది ద్రోహుల చరిత్ర

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

వంద ఎలుకల్ని తిన్న రాబంధు తీర్థయాత్రలకు పోయినట్టు, దయ్యాలు వేదాలు వల్లించినట్టుగా రేవంత్ రెడ్డి వైఖరి ఉందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. గురువారం సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి, అమరవీరుల స్థూపం వద్ద నివాళ్లర్పించారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమవేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్ ఒక్కనాడు కూడా జై తెలంగాణ అనలేదని, అమరవీరులకు పువ్వుపెట్టి నివాళ్లు అర్పించిన పాపాన పోలేదని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఏనాడూ పాల్గొన్న వ్యక్తికాదని విమర్శించారు. డిసెంబర్ 9న తెలంగాణ ప్రకటన వచ్చిందంటే కేసీఆర్ చేసిన అమరణ దీక్ష ఫలితం తప్ప ఎవరో దయాదాక్షిణ్యాల వల్ల వచ్చింది కాదని తెలిపారు.

సోనియమ్మ దయ దలచి ప్రకటన చేశారని రేవంత్‌రెడ్డి చెప్పడమంటే తెలంగాణ ఉద్యమకారుల్ని, అమరవీరుల్ని అవమానపర్చడమే అవుతుందన్నారు. కాంగ్రెస్‌ది ద్రోహుల చరిత్ర అని, అనాడు ఆంధ్రా లాబీయింగ్‌కు తలొగ్గి ఉన్న తెలంగాణను ఆంధ్రాలో కలిపిందే కాంగ్రెస్ పార్టీ అని చెప్పారు. ఫజల్ అలీ కమిషన్ సిఫార్సులను తుంగలో తొక్కింది నెహ్రూ కాదా అని ప్రశ్నించారు. 1969 ఉద్యమాన్ని ఇనుప కాళ్లతో తొక్కింది ఇందిరమ్మ రాజ్యం కాదా అని అన్నారు. కాంగ్రెస్ పొట్టనబెట్టుకున్న అమరులకు అసెంబ్లీ ముందు ఉన్న అమరవీరుల స్థూపమే నిదర్శనమని అన్నారు. 2001లో కేసీఆర్ పార్టీ పెట్టి పోరాటం చేయకపోతే అసలు తెలగాణ మాటే లేదని అన్నారు. 2004లో హామీ ఇస్తే కేంద్ర కేబినెట్‌లో చేరామన్నారు. తెలంగాణ ఇవ్వకపోగా ఆనాడు టీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకునే ప్రయత్నం చేశారని తెలిపారు. కేంద్రంలో మంత్రిగా ఉండి ఆర్ఎస్ఎస్ ఆఫీస్ నుంచి ఆర్ఎస్‌యూ కార్యాలయం వరకు తిరిగి దేశంలో 32 రాజకీయ పార్టీలను ఒప్పించి, మెప్పించి ప్రణబ్ ముఖర్జీకి లేఖ తెచ్చి ఇచ్చింది కేసీఆర్ అని చెప్పారు. విద్యార్థుల ఆత్మబలిదానాలకు కారణం కాంగ్రెస్ పార్టీయే అని అన్నారు. జయశంకర్, కేసీఆర్ రాసి ఇచ్చిన లేఖనే చిదంబరం చదివి తెలంగాణ ప్రక్రియ ప్రారంభమైందని ప్రకటించారని తెలిపారు. నవంబర్ 29 లేకున్నా డిసెంబర్ 9 లేదని, ఆ రెండు లేకుంటే జూన్ 2న తెలంగాణ ఏర్పాటు లేదన్నారు. చంద్రబాబును ఎవరు నిలదీస్తున్నరు అంటూ రైఫిల్ పట్టుకుని ఉద్యమకారుల మీదికి వెళ్లింది ఈ రైఫిల్ రేవంత్‌రెడ్డి కాదా అని ప్రశ్నించారు. 2004లో తెలంగాణ ఇచ్చి ఉంటే ఒక్క బిడ్డ ప్రాణం పోయి ఉండేది కాదన్నారు.

15 ఏండ్ల కింద చిదంబరం ప్రకటన వచ్చిందంటే కేసీఆర్ దీక్షాఫలమేనని అన్నారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఎక్కడా పెట్టలేదని రేవంత్ మాట్లాడటం సిగ్గు చేటన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లోనే 2015 జూన్ 2న అప్పుడు తనతో పాటు ఎమ్మెల్యేలు, కలెక్టర్ రాహుల్ బొజ్జ కలిసి తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించామన్నారు. మార్పు అంటే కేసీఆర్ కిట్, రైతు బంధు, న్యూట్రిషన్ కిట్స్, దళిత, బీసీ బంధు బంద్ చేయడం తప్ప మరోటి లేదన్నారు. 49 మంది గురుకుల విద్యార్థుల చావుకు సీఎం రేవంత్‌రెడ్డియే కారణమన్నారు. సాగునీటికి నోచని జహీరాబాద్, నారాయణఖేడ్ ప్రాంతాలకు లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించేందుకు చేపట్టిన బసవేశ్వర, సంగమేశ్వర ప్రాజెక్టులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే చింత ప్రభాకర్, డీసీసీబీ వైస్ చైర్మెన్ పట్నం మాణిక్యం, రాష్ట్ర నాయకులు ఆకుల రాజేందర్, మందుల వరలక్ష్మి, మనోహర్‌గౌడ్, నాగరాజు గౌడ్ పాల్గొన్నారు.

ఢిల్లీకి అందే మూటలపై తప్ప.. మీరిచ్చిన మాటపై శ్రద్ధ లేదా ?

గ్యారెంటీలకు దిక్కులేదు

- 420 హామీలకు పత్తాలేదు
- డిక్లరేషన్లకు అడ్రస్ లేదు : కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లేఖ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఢిల్లీకి అందే మూటలపైనే తప్ప కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి ఇచ్చిన హామీలు అమలు చేయించడంపై శ్రద్ధ లేదా? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. బుధవారం ఆయన కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి లేఖ రాశారు. రాష్ట్రంలో గ్యారంటీలకు దిక్కులేదనీ, 420 హామీలకు పత్తా లేదనీ, డిక్లరేషన్‌కు అడ్రస్ లేదనీ విమర్శించారు. తాము అధికారంలో ఉన్నప్పుడు పేదల బతుకులు మార్చామే తప్ప పేర్లు కాదని గుర్తు చేశారు. తాము తలుచుకుంటే రాష్ట్రంలో రాజీవ్ గాంధీ, ఇందిరాగాంధీ పేర్లు, విగ్రహాలు ఉంటాయా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో పేర్లు, విగ్రహాలు మార్చే నీచ సంస్కృతిని ఆపకపోతే రాబోయే కాలంలో జరగబోయేది కూడా అదేనని హెచ్చరించారు.

గ్యారంటీలన్ని గారడీలేనని ఏడాది పాలనలో స్పష్టమైందని ఎద్దేవా చేశారు. మోసం, అవినీతి, నియంతృత్వమే కాంగ్రెస్ విధానమని దుయ్యబట్టారు. ఇంత జరుగుతున్నా రాహుల్ గాంధీ ప్రేక్షకపాత్ర పోషించడంపై ప్రజల్లో ఆగ్రహం వెల్లువెత్తుతోందని తెలిపారు. రుణమాఫీకి రూ.49,500 కోట్లు అవసరమైతే తూతూ మంత్రంగా ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. 620 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నా కాంగ్రెస్ సర్కారులో చలనం, మానవత్వం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతుభరోసా రూ.15 వేలు, రైతు కూలీలకు రూ.12 వేల హామీకి అతీగతీ లేదని తెలిపారు. వడ్లకు రూ.500 బోనస్ అని సన్నాలకే పరిమితం చేసిన తీరును రైతులు అర్థం చేసుకున్నారని హెచ్చరించారు. ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాల భర్తీ అని కేవలం 12,527 పోస్టులు భర్తీ చేసి 1,87,473 ఉద్యోగాలు బాకీ పడ్డారనీ, యువతకు ఇస్తామన్న రూ.10 లక్షల వడ్డీ లేని రుణాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. 18 ఏండ్లు నిండిన ప్రతి ఆడబిడ్డకు నెలకు రూ.2,500కు మోక్షం లేదనీ, కళ్యాణలక్ష్మి అందడం లేదని పేర్కొన్నారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు ఇచ్చే పెన్షన్లను రూ.4 వేలకు పెంచుతామని, వికలాంగుల పింఛన్‌ను రూ.ఆరు వేలు చేస్తామని ఇచ్చిన హామీ ఏడాదైనా అమలు చేయలేదని తెలిపారు.

హైడ్రా ప్రాజెక్టు రూ. లక్షన్నర కోట్ల లూటిఫికేషన్ కోసమేనని కేటీఆర్ విమర్శించారు. ఆటోడ్రైవర్ల నుంచి మూసీ బాధితుల వరకు అందరినీ తెలంగాణ భవన్ కాపాడుతుందని స్పష్టం చేశారు. ఓవైపు అల్లుడి ఫార్మా కంపెనీ కోసం, మరోవైపు అదానీ సిమెంట్ ఫ్యాక్టరీ కోసం సొంత నియోజకవర్గం కొడంగల్‌లో సీఎం బలవంతంగా భూములు లాక్కునే కుట్రను దళిత, గిరిజన మహిళలు ఢిల్లీ వేదికగా ఎండగట్టినా కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి రాలేదని తప్పుపట్టారు. సీఎం బావమరిదికి కట్టబెట్టిన అమృత్ టెండర్ నుంచి మొదలుకుంటే.. రూ.1,100 కోట్ల పౌరసరఫరాల స్కామ్, మంత్రి పొంగులేటి కుమారునికి అప్పజెప్పిన కొడంగల్ లిఫ్ట్ పనుల వరకు, గోదావరి జలాలను మూసీకి తరలించే అంచనాలను రూ.1,100 కోట్ల నుంచి రూ.5,500 కోట్లకు అమాంతం పెంచేయడం మీ దోపిడీకి పరాకాష్ట అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్ నిబంధనను ఉల్లంఘించి తన బావమరిదికి లబ్ధి చేకూర్చిన సీఎంను తప్పించే దమ్ముందా అని కేటీఆర్ రాహుల్‌ని ప్రశ్నించారు. తెలంగాణ తల్లిని, తెలంగాణ అస్థిత్వ ఆనవాళ్లను మార్చే కుటిల యత్నాలకు సీఎం రేవంత్ రెడ్డి తెరలేపారని చెప్పారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయం-అమరవీరుల స్థూపం మధ్య తెలంగాణ తల్లి కోసం కేటాయించిన స్థలంలో రాజీవ్ గాంధీ విగ్రహాన్ని బలవంతంగా ప్రతిష్ఠింపజేశారని పేర్కొన్నారు. మాజీ ప్రధానులు ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ అంటే గౌరవం ఉన్నప్పటికీ కేవలం రేవంత్ రెడ్డి చేసిన ఈ వికృత రాజకీయ క్రీడకు ప్రతి స్పందనగా అసలైన తెలంగాణ చరిత్రను, సంస్కృతిని, ఔన్నత్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత తమపై ఉందని తెలిపారు. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ, ఇతర కాంగ్రెస్ నాయకుల పేర్లతో ఉన్న ప్రతి సంస్థ పేరును మార్చడంతో పాటు తెలంగాణ సచివాలయం ముందు ఏర్పాటు చేసిన కాంగ్రెస్ తల్లి విగ్రహాన్ని, రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని గాంధీభవన్‌కు సకల మర్యాదలతో సాగనంపుతామని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వ చేతకానితనాన్ని కప్పిపుచ్చుకోవడానికి ఇలాంటి అటెన్షన్ డైవర్షన్ పాలిటిక్స్‌ను ముఖ్యమంత్రి ఇకనైనా మానుకుంటే కాంగ్రెస్ పార్టీకే మంచిదని అభిప్రాయం వ్యక్తం చేశారు. చేతనైతే హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రజల ముందు లెంపలేసుకుని క్షమాపణలు కోరాలని సూచించారు. . మళ్లీ తెలంగాణను దశాబ్దాల సంక్షోభంలోకి నెట్టివేసి చేతులు దులుపుకుంటామంటే మాత్రం చూస్తూ ఊరుకోవడానికి రాష్ట్ర ప్రజలు సిద్ధంగా లేరని హెచ్చరించారు.

మోడల్ స్కూల్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

- నేటినుంచి దశలవారీ నిరసన కార్యక్రమాలు : పీఎంటీఏటీఎస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని పీఎంటీఏటీఎస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తరాల జగదీశ్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సమస్యల పరిష్కారం కోసం గురువారం నుంచి దశలవారీ నిరసన కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. గురువారం నుంచి ఈనెల 17 వరకు నల్లబ్యాడ్జీలు ధరించి భోజన విరామ సమయంలో ప్లకార్డులతో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొన్నారు. 18న మండలస్థాయి అధికారులకు వినతిపత్రాలను అందించాలని సూచించారు. 19,20 తేదీల్లో భోజన విరామ సమయంలో ప్లకార్డులతో నిరసన చేపట్టాలని తెలిపారు. డీఈవో, డీఐఈవోలకు వినతిపత్రాలను సమర్పించాలని పేర్కొన్నారు. ఈనెల 21 నుంచి 23 వరకు స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, మంత్రులకు వినతిపత్రాలను అందించాలని సూచించారు. 28న ఉమ్మడి జిల్లా కేంద్రం కలెక్టరేట్ వద్ద దీక్ష చేపట్టాలనీ, కలెక్టర్లకు వినతిపత్రాలను అందించాలని కోరారు. వచ్చేనెల నాలుగో తేదీన హైదరాబాద్‌లో ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా కార్యక్రమం నిర్వహిస్తామని వివరించారు. మోడల్ స్కూల్ టీచర్లకు 010 పద్దు కింద వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఒకే నోటిఫికేషన్ కింద ఎంపికైన మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు నోషనల్ సర్వీస్ కల్పించాలని కోరారు. హెల్త్‌కార్డులు ఇవ్వాలనీ, మరణించిన ఉపాధ్యాయుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు చేపట్టాలని తెలిపారు. పదోన్నతులు చేపట్టాలని పేర్కొన్నారు.

నాలెడ్జ్ హబ్ సెంటర్లతో అద్భుత విజయాలు

- శ్రీచైతన్య విద్యా సంస్థల డైరెక్టర్ సుష్మ వెల్లడి

నవ తెలంగాణ బ్యూరో - హైదరాబాద్



తమ నాలెడ్జ్ హబ్ సెంటర్‌లతో అద్భుత విజయాలను సాధిస్తున్నామని శ్రీచైతన్య విద్యా సంస్థల అకాడమిక్ డైరెక్టర్ సుష్మ తెలిపారు. చైతన్య నాలెడ్జ్ హబ్‌ల్లో విద్యార్థుల ఆకాంక్షలను విజయాలుగా మార్చడానికి తాము కట్టుబడి ఉన్నామన్నారు. బోర్డు, పోటీ పరీక్షల్లో విద్యార్థులు రాణించడానికి ఉత్తమ విద్యాపరమైన పునాదిని అందించడమే తమ లక్ష్యమని సుష్మ ఓ ప్రకటనలో తెలిపారు. 40 ఏండ్లుగా తమ విద్యార్థులు ఎన్నో విజయాలు సాధించారన్నారు. ఇంజనీర్లు, డాక్టర్లుగా జాతికి అందించిన ఘనచరిత్ర కలిగి ఉన్నామన్నారు. నాలెడ్జ్ హబ్ ఐఐటీ, జేఈఈ, నీట్, ఒలింపియాడ్స్, ఇతర జాతీయ, అంతర్జాతీయ పోటీ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయడంపై దృష్టి పెడుతుందన్నారు. విద్యార్థుల విలువైన సమయాన్ని వృథా కాకుండా పటిష్టమైన కార్యాచరణ రూపొందిస్తుందన్నారు.

రాజ్యాంగ ప్రతిమ ధ్వంసం

(మొదటిపేజీ తరువాయి)

మారింది. స్థానికుల సమాచారం పర్భినిలోని రైల్వేస్టేషన్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం ముందు గాజు పెట్టెలో ఉన్న రాజ్యాంగ ప్రతిమను మంగళవారం సాయంత్రం కొంత మంది ధ్వంసం చేశారు. ఈ విషయం తెలిసివెంటనే వందలాది మంది అక్కడకు చేరుకున్నారు. ఆందోళనకు దిగారు. రైల్ రోకోతో రైల్వే స్టేషన్లల్లో రైళ్లను నిలిపివేశారు. బుధవారం కూడా ఆందోళనలు కొనసాగాయి. పర్భిని జిల్లా బంద్‌కు నిర్వహించారు. రాజ్యాంగం ప్రతిమను ధ్వంసం చేయడం సిగ్గు చేటని, దోషులను తక్షణమే అరెస్టు చేయాలని వంచిత్ బహుజన్ ఆఘాడి (వీబీఏ) అధ్యక్షులు ప్రకాశ్ అంబేద్కర్ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగించను

(మొదటిపేజీ తరువాయి)

తెలిసింది. ఈ వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించుకోవాలని, రోడ్డుకెక్కొద్దని మనోజ్‌కు సీపీ సూచించినట్టు సమాచారం. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించినట్టు తెలిసింది. కమిషనర్ ఇచ్చిన ఆదేశాల మేరకు మంచు మనోజ్ సంవత్సరంపాటు ఎలాంటి ప్రతికూల చర్యలకు దిగకుండా ప్రజాశాంతికి భంగం కలిగించకుండా ఉంటానని రూ.లక్ష విలువగల బాండ్‌ను సీపీకి సమర్పించారు. ఇదిలా ఉండగా మంచు విష్ణు రాత్రి సీపీ ఎదుట హాజరై జరిగిన ఘటనను వివరించారు. విష్ణును కూడా పోలీసులు వ్యక్తిగత బాండ్ ఇవ్వాలని అడిగినట్టు తెలిసింది. సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దని సీపీ సూచించినట్టు సమాచారం.

మా నాన్న దేవుడు : మంచు మనోజ్

మంచు మోహన్ బాబు మీడియాపై చేసిన దాడి నేపథ్యంలో జల్‌పల్లిలోని మంచు టౌన్ వద్ద బుధవారం జర్నలిస్టు సంఘాలు ధర్నాకు దిగాయి. ఈ ధర్నాకు మంచు మనోజ్ మద్దతు తెలిపి తన తండ్రి తరపున క్షమాపణ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మా నాన్న దేవుడని, ఇప్పుడున్న నాన్న నాన్నకాదని, ఆయనను ఎవరో మార్చేశారని కన్నీటి పర్యంతమయ్యారు. తాను ప్రేమించి పెండ్లి చేసుకున్నానని, అందులో తప్పేముందని అన్నారు. తన భార్య, కుటుంబాన్ని అవమానపరిచారని, ఆస్తి కోసం తాను ఎప్పుడూ ఆశ పడలేదని, సొంత వ్యాపారం చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నానని అన్నారు. తన మీద ఆరోపణలు చేయడం సరికాదన్నారు. తమ కుటుంబంలో గొడవలకు కారణం వినయ్ అనే వ్యక్తి అని ఆరోపించారు. మూడ్రోజుల కిందట పోలీస్ సపోర్ట్ అడిగినప్పుడు వారు తనకు మద్దతు తెలపలేదని, తాను డయల్ 100కి ఎందుకు ఫోన్ చేశాను అనే వివరాలు మీడియా మిత్రులు తెలుసుకోవాలని కోరారు. ఇంట్లో పది బండ్లు ఉన్నా అంబులెన్స్‌లో హాస్పిటల్‌కి వెళ్లే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇంట్లో సీసీ కెమెరాల రికార్డును కిరణ్, విజయ్ దొంగిలించారని, ఆ రికార్డులను చూస్తే మీకు అర్థమవుతుందన్నారు. ఆ దొంగలు తమ ఇంట్లోనే తిరుగుతూ, ఓ అమ్మాయిని ఇంటి నుంచి పరిగెత్తేలా చేశారన్నారు. తన కూతురు బట్టలు సర్దే ప్రయత్నం చేశారని, కంగారుగా డీజీపీ ఆఫీస్‌కు వెళ్లానని, పిల్లల జోలికొస్తే భయమేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తాను అబద్ధాలు ఆడే వ్యక్తిని కాదన్నారు. విద్యానికేతన్‌లో జరిగిన అక్రమాలపై ప్రశ్నించడంతోనే తనను టార్గెట్ చేశారని, వేరే వాళ్ల కడుపులు కొట్టి తన పిల్లలకు పెట్టలేనని, తన పిల్లలు పెద్దయ్యాక వారికి సమాధానం చెప్పలేనని అన్నారు. మా అమ్మ హాస్పిటల్‌లో ఉందని అబద్ధాలు చెప్పారని, తన భార్యకు తల్లి తండ్రి లేరనీ, ఆమెకు అన్నీ నేనేనని అన్నారు. శాంతియుతంగా సమస్యను పరిష్కారం చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నానని మనోజ్ మీడియాకు తెలిపారు.

విష్ణు ప్రధాన అనుచరుని అరెస్ట్

మంచు మనోజ్‌పై దాడి కేసులో విష్ణు ప్రధాన అనుచరుడు కిరణ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. తనపై దాడి చేశారని మనోజ్ చేసిన ఫిర్యాదుపై దర్యాప్తు చేపట్టిన పహాడీషరీఫ్ పోలీసులు బుధవారం కిరణ్‌ను అరెస్టు చేశారు. మరో నిందితుడు వినయ్‌రెడ్డి కోసం గాలిస్తున్నారు. జల్‌పల్లిలో తనపై దాడి చేయడమే కాకుండా సీసీటీవీ ఫుటేజ్‌ను మాయం చేశారని మనోజ్ ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

మోహన్‌బాబు, విష్ణులకు ఊరట పోలీసుల ముందు హాజరయ్యేందుకు 24వరకు మినహాయింపు

కుటుంబ వివాదంలో నటుడు మంచు మోహన్‌బాబు, ఆయన కుమారుడు విష్ణులకు పోలీసులు ఇచ్చిన విచారణ నోటీసుల అమలును ఈనెల 24 వరకు హైకోర్టు నిలిపివేసింది. నోటీసుల ఆధారంగా విచారణకు హాజరు కానవసరం లేదని చెప్పింది. పహాడీషరీఫ్ పోలీసులకు మంచు మనోజ్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదైంది. ఈ కేసులో విచారణకు హాజరుకావాలని మోహన్‌బాబు, విష్ణులకు నోటీసులు జారీ అయ్యాయి. వీటిని రద్దు చేయాలంటూ లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి విచారణ జరిపి పోలీసుల విచారణపై స్టే విధించారు. కుటుంబంలో నెలకొన్న వివాదాన్ని వారే పరిష్కరించుకునేందుకు గడువు ఇవ్వాలని పోలీసులకు సూచన చేసింది. కుటుంబ వ్యవహారాల్లో మీడియా, పోలీసులు అత్యుత్సాహం పనికిరాదని వ్యాఖ్యానించింది.

ఎర్నేని వర్సెస్ నందిని

- భద్రాద్రి ఆలయ కమిటీ చైర్మెన్ పదవికి పోటా పోటీ
- రామారావు పేరు దాదాపు ఖరారు..!
- చివరి నిమిషంలో డిప్యూటీ సీఎం సతీమణి ఆసక్తి
- రాష్ట్రవ్యాప్తంగా ఆలయ కమిటీ పదవుల భర్తీకి సన్నాహాలు

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి



దేవాదాయ శాఖలోని ఆలయాలకు పాలకవర్గాలను నియమించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. దీనిలో భాగంగా పలు ఆలయ కమిటీల నియామకానికి నోటిఫికేషన్ జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 546 కమిటీలు ఉండగా దేవాదాయ శాఖ కమిషనర్ పరిధిలోని 340 ఆలయ కమిటీలకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 76 ఆలయ కమిటీలు ఉండగా దీనిలో 16 కమిటీలకు గత నెల నోటిఫికేషన్ వెలువడింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఆలయాలు నాలుగు యాజమాన్యాల పరిధిలో కొనసాగుతున్నాయి. భద్రాద్రి జిల్లాలోని భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి, పాల్వంచలోని పెద్దమ్మ గుడి (శ్రీ కనకదుర్గ), ఖమ్మం జిల్లాలోని జమలాపురం శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయాలు ప్రభుత్వ పరిధిలో ఉన్నాయి. ఈ ఆలయాలకు చైర్మెన్‌తో పాటు 14 మంది చొప్పున పాలక వర్గ సభ్యులను నియమించాల్సి ఉంది. వీటిలో భద్రాచలం ఆలయ చైర్మెన్ పదవికి కీలక నేతలు పోటీ పడుతున్నారు.

మూడు ప్రధాన ఆలయాలకు తీవ్ర పోటీ

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మూడు ప్రధాన ఆలయాల చైర్మెన్ పదవులతో పాటు పాలకవర్గంలో చోటు కోసం పలువురు తహతహలాడుతు న్నారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి, పాల్వంచలోని పెద్దమ్మ గుడి (శ్రీ కనకదుర్గ), ఖమ్మం జిల్లాలోని జమలాపురం శ్రీ వెంకటేశ్వరస్వామి ప్రధాన ఆలయాల పాలకవర్గం చైర్మెన్ లేదంటే కనీసం డైరెక్టర్ స్థానం దక్కించుకునేందుకు ఆశావహులు ఎదురుచూస్తున్నారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ పరిధిలో ఖమ్మం జిల్లాలో 36, భద్రాద్రి జిల్లాలో 15 దేవాలయాలు కొనసాగుతున్నాయి. ఈ 51 ఆలయాల పాలకవర్గ పదవులు ఖాళీగా ఉన్నాయి. అలాగే, ధార్మిక పరిషత్ పరిధిలో ఖమ్మం జిల్లాలో 12 ఆలయాలు, భద్రాద్రి జిల్లాలో మూడు ఆలయాల నిర్వహణ కొనసాగుతోంది. ఇక వరంగల్ దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ పరిధిలో ఖమ్మం జిల్లాలో ఐదు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లో రెండు దేవాలయాలు ఉన్నాయి.

రాష్ట్రవ్యాప్తంగా 340 కమిటీలకు నోటిఫికేషన్!

ప్రభుత్వ పరిధిలో 56 కమిటీలు, ధార్మిక పరిషత్ (రెనోవేషన్ కమిటీ) పరిధిలో 118, కమిషనర్ పరిధిలో 372 కమిటీలు ఉండగా.. గవర్నమెంట్ పరిధిలోని 27 కమిటీలు, ధార్మిక పరిషత్ పరిధిలో 41, కమిషనర్ పరిధిలో 340 ఆలయ కమిటీలకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. కోర్టు స్టేలో ఉన్న 10 కమిటీలకు మినహాయింపు ఇచ్చింది. 81 కమిటీలను ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టింది. అందులో గవర్నమెంట్ పరిధిలో 22 ఉండగా, ధార్మిక పరిషత్ పరిధిలో 59 ఉన్నాయి. కాగా, ఇప్పటికే 408 కమిటీలకు నోటిఫికేషన్‌ను ప్రభుత్వం ఇవ్వడంతో సగానికి పైగా కమిటీలను నియమించినట్టు అవుతోంది.

ఎర్నేనికి ఖాయమనుకుంటున్న దశలో..

కమ్మ మహాజన సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అనుచరుడు ఎర్నేని రామారావుకు భద్రాచలం దేవాలయ కమిటీ చైర్మెన్ పదవి దాదాపు ఖాయం అనుకుంటున్న దశలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సతీమణి నందిని ఆ పదవిపై ఆసక్తి చూపుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. చిన్న జీయర్‌స్వామి ఆశీస్సులు రామారావుకు మెండుగా ఉండటం కలిసి వచ్చే అంశం. ఆయన గతంలో పలు ధార్మిక సంస్థలకు ప్రాతినిధ్యం వహించారు. జీయర్ స్వామి ట్రస్ట్ బోర్డు మెంబర్‌గా కూడా ఉన్నారు. ఈ నేపథ్యంలో రామారావుకు పదవి ఖాయం అనుకుంటున్న దశలో నందిని పోటీకి వచ్చారని సమాచారం. రామారావును డైరెక్టర్‌గా నియమించి తనకు చైర్మెన్ పదవి ఇవ్వాల్సిందిగా ఆమె కోరుతున్నట్టు తెలుస్తోంది. గత పార్లమెంట్ ఎన్నికల్లో ఆమె ఖమ్మం ఎంపీ టికెట్ ఆశించి భంగపడిన దృష్ట్యా కాంగ్రెస్ పెద్దల ఆశీస్సులు నందినికి ఉండవచ్చనే టాక్ నడుస్తోంది. ఎర్నేనికి రాష్ట్ర, జాతీయ స్థాయిలో హిందూ మత ప్రచారకులు, ధార్మిక సంస్థల పెద్దలతో సత్సంబంధాలు ఉండటం కలిసి వచ్చే అంశంగా చెబుతున్నారు.

పకడ్బందీగా ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల ప్రక్రియ చేపట్టాలి

మంత్రి పొంగులేటి వెల్లడి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన దరఖాస్తుల పరిశీలనను పకడ్బందీగా చేపట్టాలని రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన, గ్రూప్-2 పరీక్షల నిర్వహణ, మెస్ చార్జీలపెంపు, సామాజిక సర్వే తదితర అంశాలపై బుధవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయం నుంచి ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల కోసం ప్రజాపాలనలో వచ్చిన 80 లక్షల దరఖాస్తుల పరిశీలనను ఈనెల 31 లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం ఈ సర్వే వివరాలను మొబైల్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. ప్రతి ఐదు వందల మందికి ఒక ఉద్యోగి (సర్వేయర్)ని నియమించుకోవాలని సూచించారు. సర్వేలో ఇందిరమ్మ కమిటీ సభ్యులను కూడా భాగస్వామ్యం చేయాలన్నారు. రాష్ట్రంలో ఎక్కడైనా ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు కాకపోతే వెంటనే ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. ఏ గ్రామంలో సర్వే నిర్వహిస్తారో ఆ ముందు రోజు రాత్రి గ్రామంలో చాటింపు వేయించాలని సూచించారు. అంతేగాక స్థానిక పరిస్థితులను బట్టి కలెక్టర్లు ప్రణాళికలు రూపొందించుకోవాలని అన్నారు. ఏ ఒక్క దరఖాస్తును విడిచిపెట్టకుండా చిన్న చిన్న పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా పకడ్బందీగా సర్వే నిర్వహించా లన్నారు. సర్వే వివరాలపై ప్రతి రోజు కలెక్టర్లు సమీక్షించుకోవాలని కోరారు. ప్రతి జిల్లా కేంద్రంలో ఫిర్యాదులు, సలహాల కోసం టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ఓ నిరంతర ప్రక్రియ అని ఈ ఏడాది 4.5 లక్షల ఇండ్లను నిర్మించబోతున్నట్టు తెలిపారు.

గత ప్రభుత్వం పదేండ్లలో ప్రభుత్వ వసతి గృహాల్లో చదువుకునే విద్యార్థుల మెస్ చార్జీలను ఒక్కసారి కూడా పెంచలేదన్నారు. తమ ప్రభుత్వం ఏడాది లోపే 40శాతం మెస్ చార్జీలు పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుందని గుర్తు చేశారు. ఈ నిర్ణయం వల్ల 7.65 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం కలిగిందనీ, కలెక్టర్లు తరచూ హాస్టళ్లను తనిఖీ చేసి విద్యార్థులకు అందించే సరుకుల క్వాలిటీ, క్వాంటిటీపై ప్రధానంగా దృష్టి సారించాలని సూచించారు. ఈనెల 14న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్లమెంటు సభ్యులు స్థానికంగా ఉన్న సంక్షేమ హాస్టళ్లను సందర్శించి అక్కడే విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పాల్గొనాలని సూచించారు.

సామాజిక సర్వే

రాష్ట్రంలో కోటి 16 లక్షల కుటుంబాలకుగానూ కోటి 12 లక్షల కుటుంబాల సామాజిక సర్వే (99.09 శాతం) పూర్తి చేసినట్టు తెలిపారు. ఇందుకు కృషి చేసిన అధికారులకు అభినందనలు తెలిపారు. ఈనెల 13న సామాజిక సర్వేకు తుదిగడువన్నారు. ఆ తర్వాత ప్రజాపాలన సేవా కేంద్రాలలో కూడా కుటుంబ సర్వే వివరాలను నమోదు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 15, 16 తేదీల్లో జరిగే గ్రూప్-2 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

తెలంగాణలో గంగాజమున సంస్కృతి

- మినీ ఇండియాగా పేరొందిన హైదరాబాద్ ప్రతిష్టను పెంచుతాం : సికింద్రాబాద్‌లో ముత్యాలమ్మ విగ్రహ పున:ప్రతిష్టలో మంత్రి కొండా సురేఖ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్/బేగంపేట

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అన్ని మతాల ప్రజల మనోభావాలకు ప్రాధాన్యమిస్తూ గంగా జమున సంస్కృతి మరింత పరిఢవిల్లేలా పాలన చేపడుతున్నదని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. భిన్న మతాలు, భిన్న సంస్కృతుల సమ్మేళనంతో మినీ ఇండియాగా గుర్తింపు పొందిన హైదరాబాద్ నగర ప్రతిష్టను తమ ప్రభుత్వం మరింత పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నదని చెప్పారు. బుధవారం సికింద్రాబాద్ కుమ్మరిగూడలో ముత్యాలమ్మ దేవాలయంలో విగ్రహ పున:ప్రతిష్ట కార్యక్రమంలో హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఆమె పాల్గొన్నారు. దేవాలయ నిర్వాహకులు ఆలయ లాంఛనాలతో మంత్రికి స్వాగతం పలికారు. అమ్మవారికి పట్టువస్త్రాలను మంత్రి సమర్పించారు. ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం మంత్రి సురేఖ మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం ప్రజల నమ్మకాలు, మనోభావాలను గౌరవిస్తూ ఇచ్చిన మాటకు కట్టుబడి ధ్వంసమైన ముత్యాలమ్మ విగ్రహం స్థానంలోనే 250 కిలోల పంచలోహాలతో కూడిన విగ్రహాన్ని ప్రతిష్ఠించిందని చెప్పారు. దేవాలయంలో కూడా ఆధునీకరణ పనులు చేపట్టినట్టు తెలిపారు. స్థానిక ప్రజలు, భక్తులు ఎంతో సంయమనంతో వ్యవహరించి విగ్రహ పున:ప్రతిష్ఠకు సహకరించినందుకు ధన్యవాదాలు చెప్పారు. ఆ రోజు జరిగిన ఘటనకు కారకులైన వ్యక్తులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు చేపట్టిన విషయాన్ని గుర్తుచేశారు. రాజకీయ లబ్ది కోసం కొంతమంది విద్వేషాలను రెచ్చగొట్టడం మానుకోవాలని హితవు పలికారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ..గతంలో ముత్యాలమ్మ గుడిలో జరిగిన ఘటన దురదృష్టకరమన్నారు. దేవాలయాలను అందరూ కాపాడుకోవాలనీ, విద్రోహ చర్యలు జరిగినప్పుడు ప్రజలంతా కలిసి ఎదుర్కోవాలి తప్ప రాజకీయాలు చేయడం తగదని చెప్పారు. ప్రజల విశ్వాసాలను కాపాడేలా తమ ప్రభుత్వం ముందుకు వెళున్నదన్నారు. ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేశ్, దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ కృష్ణవేణి, అసిస్టెంట్ కమిషనర్ సంధ్యారాణి, కార్పొరేటర్ దీపిక, నార్త్‌జోన్ డీసీపీ సాధన రష్మిపెరుమాల్, సనత్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కోట నీలిమ, మాజీ కార్పొరేటర్ రూపహరికృష్ణ, తదితరు పాల్గొన్నారు.

తెలంగాణలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు సాధ్యం కాదు

- లోక్ సభలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు సాధ్యం కాదని కేంద్రం మరోసారి స్పష్టం చేసింది. తెలంగాణ లో స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సెయిల్) ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ స్థాపనకు అవకాశం లేదని పరోక్షంగా బయ్యారం స్టీల్ ప్లాంట్ ఏర్పాటు పై కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ మేరకు బుధవారం లోక్ సభలో బయ్యారంలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు, తెలంగాణ మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ కు ముడి ఇనుము నిల్వల కేటాయింపు అంశాన్ని పెద్దపల్లి గడ్డం వంశీకృష్ణ లేవనెత్తారు. ఈ ప్రశ్నకు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి రాతపూర్వక సమాధానం ఇచ్చారు. తెలంగాణలోని మహబూబాబాద్, వరంగల్, కరీంనగర్, జగిత్యాల, మంచిర్యాల, భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాలలో తెలంగాణ స్టేట్ మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(టీఎస్ఎండీసీఎల్) కు ఎలాంటి ముడి ఇనుము, ఖనిజ నిల్వలు కేటాయించలేదని వెల్లడించారు. స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు వీలుగా తెలంగాణ స్టేట్ మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ కు 65.20 చదరపు కిలోమీటర్ల పరిధిలో ముడి ఇనుము, ఖనిజ నిల్వల కోసం 2019లో తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిందన్నారు. తెలంగాణ ప్రభుత్వ ప్రతిపాదనను కేంద్ర ఉక్కు శాఖ తో పాటు ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ పరిశీలించాయని తెలిపారు. ఈ పరిశీలనలో తెలంగాణలో స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా(సెయిల్) ఆధ్వర్యంలో సమీకృత స్టీల్ ప్లాంట్ సాధ్యం కాదని పరిశీలనలో స్పష్టమైందని చెప్పారు. ముడి ఇనుము, ఖనిజ ఏరియా ను రిజర్వు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనను 2021లో రాష్ట్రానికి తిరిగి పంపించినట్టు సమాధానంలో స్పష్టం చేశారు. కాగా... ఏపీ విభజన చట్టం -2014 లో పొందుపరిచినట్టు తెలంగాణ లో బయ్యారం స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెస్తోన్న విషయం తెలిసిందే. ఇదే దిశలో ఏడాది క్రితం సీఎంగా బాధ్యతలు చేపట్టిన రేవంత్ రెడ్డి... ప్రధాని మోడీ, కేంద్ర మంత్రులను కలిసి విభజన చట్టంలోని హామీలు అమలు చేయాలని కోరారు. అలాగే బయ్యారం స్టీల్ ప్లాంట్ విషయాన్ని కేంద్రం దృష్టికి తెచ్చారు. అయితే... ఎంపీ గడ్డం వంశీ కృష్ణ అడిగిన ప్రశ్నకు మరోసారి బయ్యారం స్టీల్ ప్లాంట్ ఏర్పాటు పై విముఖతనే చూపింది.

విద్యార్థులకు నూతన పరిజ్ఞానంతో బోధించాలి

- స్వచ్ఛంద సంస్థల సహకారంతో జిల్లాను అభివృద్ధి చేస్తా : పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క
- మంత్రి సీతక్కకు సమగ్ర శిక్షా ఉద్యోగుల వినతి
- ట్రాన్స్‌జెండర్ల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత

నవతెలంగాణ-ములుగు



రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కేటాయించే నిధులతో సరిపోదని, స్వచ్ఛంద సంస్థలు, పలు కార్యక్రమాల ద్వారా అభివృద్ధి సాధించుకోవాలని పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. బుధవారం ములుగు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ హాల్‌లో క్వాల్ కమ్ కంపెనీ, పాఠశాలల యాజమాన్యం సంయుక్తంగా 9, 10వ తరగతి విద్యార్థులకు ఇంగ్లీష్, గణితం, సైన్స్ పాఠాలను బోధించే అధ్యాపకులకు, ప్రధానోపాధ్యాయులకు బుధవారం శిక్షణా తరగతులను నిర్వహించారు. జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, అదనపు కలెక్టర్ జి.మహేందర్, ఐటీడీఏ పీవో చిత్రా మిశ్రా, ప్రిన్సిపాల్ ఎస్‌కైనర్, క్వాల్‌కామ్ సుధీర్‌కుమార్ సుంకర, ప్రోగ్రామ్ డైరెక్టర్ శ్రద్ధా ఝా, హెడ్-ప్రోగ్రామ్ క్వాలిటీ ఇంప్లిమెంటేషన్ స్పెషలిస్ట్ నేహారాణతో కలిసి సీతక్క పుస్తక ఆవిష్కరణ చేసి తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన చేసే ఉపాధ్యాయులు నూతన పరిజ్ఞానంతో విద్యా బోధన చేస్తే విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని సూచించారు. గ్రామీణ ప్రాంతంలోని విద్యార్థులకు నూతన పరిజ్ఞానంతో విద్యను బోధించడానికి ఉపాధ్యాయులకు స్వచ్ఛంద సంస్థల వారు శిక్షణా శిబిరం ఏర్పాటు చేయడం ఆశించదగ్గ విషయమని అన్నారు. మూడు రోజులపాటు జరిగే ఈ తరగతులను ములుగు మండలంలోని బండారుపల్లి, మదనపల్లి, వెంకటాపూర్ మండలంలోని జవహర్ నగర్ గ్రామాల్లోని పాఠశాలల్లో గణితం, ఇంగ్లీష్, సైన్స్ పాఠ్య పుస్తకాలపై ఢిల్లీ అధికారులు శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మెన్ బానోతు రవి చందర్, డిఈఓ పాణిని, మేనేజర్ లీడర్‌షిప్, కమ్యూనిటీ ప్రోగ్రామ్ హితేష్ దశభయ, టెక్నికల్ ప్రాజెక్ట్ ఆఫీసర్ మిహిర్ పాండా,20 పాఠశాలలు చెందిన ప్రధానోపాధ్యాయులు, ఆయా పాఠ్యపుస్తకాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్షా ఉద్యోగులు మంత్రి సీతక్కను జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. వెంటనే తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని కోరారు.

ట్రాన్స్‌జెండర్ల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత

ములుగు జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రిలో ట్రాన్స్ జెండర్‌లకు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన మైత్రి ట్రాన్స్ ఉమెన్ క్లినిక్‌ను జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓ, గ్రంథాలయ సంస్థ చైర్మెన్‌లతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఐటీడీఏ ఏటూరునాగారం ద్వారా మంజూరైన (6) ఈఎంఆర్ఐ 108 సర్వీస్ అంబులెన్స్‌లనూ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. టాన్స్‌జెండర్ల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారి అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు తెలిపారు.

రాష్ట్రాన్ని ఆరోగ్యవంతమైన తెలంగాణ సమాజంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో వైద్య రంగానికి ప్రభుత్వం ఎనలేని ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ దివాకర టీఎస్, డీఎంఅండ్‌హెచ్‌ఓ గోపాలరావు, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ జగదీశ్వర్ , జిల్లా సంక్షేమ శాఖ అధికారి శిరీష, ఐటీడీఏ జిల్లా ఉప వైద్యారోగ్య అధికారి డాక్టర్ కె. క్రాంతి కుమార్, ఐటీడీఏ స్టాటిస్టికల్ ఆఫీసర్ రాజ్ కుమార్, ప్రోగ్రామ్ మేనేజర్ మహేందర్, ట్రాన్స్ జెండర్ సంఘం జిల్లా నాయకురాలు కల్పన, ఇందు ట్రాన్స్ జెండర్ ప్రతినిధులు, మైత్రి ట్రాన్స్ క్లినిక్ డాక్టర్లు పాల్గొన్నారు.

హైకోర్టులో అల్లు అర్జున్ పిటిషన్

- సంధ్య థియేటర్ కేసు కొట్టేయాలని వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పుష్ప-2 సినిమా విడుదల సందర్భంగా సంధ్య థియేటర్‌కు వెళ్లినప్పుడు జరిగిన తొక్కిసలాట ఘటనపై నమోదు చేసిన కేసును కొట్టేయాలంటూ హీరో అల్లు అర్జున్ హైకోర్టులో పిటిషన్ వేశారు. అరెస్టు చేయకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. తొక్కిసలాటకు తాను బాధ్యుడ్ని కాదన్నారు. తొక్కిసలాటలో రేవతి అనే వివాహిత మరణించింది. ఆమె కొడుకు, కూతురు గాయపడ్డారు. దీంతో తన భార్య మృతికి అల్లు అర్జున్ రాక కారణమంటూ ఎం.భాస్కర్ ఫిర్యాదు మేరకు చిక్కడపల్లి పీఎస్‌లో ఎఫ్ఐఆర్ దాఖలైంది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న తనపై నమోదైన కేసును కొట్టేయాలంటూ హైకోర్టును ఆశ్రయించారు. తాను థియేటర్‌కు వెళ్లే ముందు థియేటర్ మేనేజిమెంట్‌కు, ఏసీపీకి సమాచారం ఇచ్చానన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఎల్బీనగర్ - మహేశ్వరం
గురువారం డిసెంబర్ 12, 2024 www.navatelangana.com

నాణ్యమైన ఆహారాన్ని అందించాలి



ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

నవతెలంగాణ - దిల్‌సుఖ్‌నగర్

భోజన ప్రియులకు శుచి శుభ్రతతో కూడిన నాణ్యమైన ఆహారాన్ని అందించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సూచించారు. ఆర్కే పురం డివిజన్ గ్రీన్ హిల్స్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ది ఓజి మండి రెస్టారెంట్‌ను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ వీరమళ్ల రామ్ నర్సింహా గౌడ్, మండీ నిర్వాహకులు అశ్విత్ రెడ్డి, వరుణ్, చైతన్య, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

'పిల్లలతో స్నేహం చేద్దాం రండి' పుస్తకావిష్కరణ

నవతెలంగాణ-దిల్‌సుఖ్‌నగర్



ఆర్కేపురం డివిజన్ ఆధ్యాత్మిక కేంద్రంలో పిల్లలతో స్నేహం చేద్దాం రండి పుస్తకావిష్కరణ జరిగింది. ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా వాసవి కాలనీలో బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి పలువురు సాహితీవేత్తలు, ప్రముఖులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు విశ్రాంతి న్యాయమూర్తి చల్లా కోదండరాం, సివిల్ జడ్జి పి. శ్రీదేవి, షేక్ మదార్, ఫౌండర్ చైర్మెన్, అష్ట లక్ష్మీ దేవస్థానం వాసవి హాస్పిటల్స్ చంద్రశేఖర్ గుప్త, శ్యామలా దేవి తెలంగాణ యువజన కాంగ్రెస్ నేత చిలుక ఉపేందర్ రెడ్డి, పుస్తక రచయిత కె. శాంతరావులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనల అమలు కఠినం



ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు

నవతెలంగాణ - దిల్‌సుఖ్‌నగర్

ట్రాఫిక్ నిబంధనలను కఠినంగా అమలు చేస్తామని ఎల్బీనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు. కొత్తపేట చౌరస్తా వద్ద ఇన్‌స్పెక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనాలను బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ నాగరాజు మాట్లాడుతూ ముఖ్యంగా శబ్ద కాలుష్యాన్ని పెంచుతున్న ద్విచక్ర వాహనాలను తనిఖీ చేసి.. 12 వాహనదారులకు కౌన్సెలింగ్ ఇవ్వడం జరిగిందని వివరించారు. కొత్తగా కొనుగోలు చేసిన ద్విచక్ర వాహనాల సైలెన్సర్లను మార్చి వింత వింత శబ్దాలు వచ్చే సైలెన్సర్లను కృత్రిమంగా ఏర్పాటు చేసుకున్న వాహనాలను తనిఖీ చేసినట్టు పేర్కొన్నారు. శబ్ద కాలుష్యం అధికంగా ఉండే ఇటువంటి వాహనాల కారణంగా ప్రమాదాలు కూడా ఎక్కువగా జరుగుతున్నాయని వెల్లడించారు.

కంపెనీల నుంచి వాహనాలకు వచ్చే సైలెన్సర్లను తొలగించి వింత వింత శబ్దాలు వచ్చే వాటిని ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. అటువంటి వాహనాలను గుర్తించి.. మెకానిక్‌లద్వారా కృత్రిమంగా ఏర్పాటు చేసుకున్న వాటిని తొలగించడం జరిగిందన్నారు. స్పెషల్ డ్రైవ్ ద్వారా ప్రధాన కూడళ్లలో తనిఖీలు నిర్వహించి.. శబ్ద కాలుష్యం నివారణ మరియు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని ఇన్‌స్పెక్టర్ నాగరాజు వివరించారు.

ఆదర్శ మార్కెట్‌గా అభివృద్ధి చేస్తాం

- పెండింగ్‌లో ఉన్న హామాలీలకు గుర్తింపు, లైసెన్సులు అందజేత
- రైతు బజార్లను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తాం
- పాలక వర్గ సమావేశంలో చైర్మెన్ చిలుక మధుసూదన్ రెడ్డి



నవతెలంగాణ - అబ్దుల్లాపూర్‌మెట్

గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని, పాలకవర్గం, అధికారులు, రైతులు, వర్తకులు, హమాలీలందరు కలిసి ఒక కుటుంబంలా పనిచేస్తామని ఏఎంసీ చైర్మెన్ చిలుక మధుసూదన్ రెడ్డి అన్నారు. బుధవారం బాటసింగారంలోని పండ్ల మార్కెట్ కార్యాలయంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ చిలుక మధుసూదన్ రెడ్డి అధ్యక్షతన 2వ పాలకవర్గం సాధారణ సమావేశం నిర్వహించారు.. ఇందులో పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా చిలుక మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న హమాలీలకు గుర్తింపు, లైసెన్సులు అందజేశామన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నదే పాలకవర్గం ఉద్దేశమన్నారు. మార్కెట్‌ని అందరి సహకారంతో అభివృద్ధి పథంలో నడిపిస్తూ ఆదర్శ మార్కెట్‌గా తీర్చిదిద్దుతామన్నారు. కొహెడ రెవిన్యూ పరిధిలోని సుమారుగా రూ.2 వేల కోట్ల నిధులతో నూతన సమీకృత మార్కెట్‌ను నిర్మించేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడం హర్షనీయమన్నారు. అలాగే రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావుకి పాలకవర్గం ధన్యవాదములు తెలియచేస్తూ తీర్మానం చేశామన్నారు. మార్కెట్ పరిధిలోకి వచ్చే రైతు బజార్లను, ఎన్టీఆర్ నగర్ మార్కెట్ లను ఎప్పటికప్పుడు తనిఖీ నిర్వహించి సమస్యలు లేకుండా చూస్తామని తెలిపారు. రైతుల సలహాలు, సూచనలు పరిగణలోని తీసుకుంటామన్నారు. రైతులకు పాలకవర్గం నిరంతరం అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం వ్యవసాయ పండ్ల మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ భాస్కర చారి, డైరక్టర్లు మచ్చేందర్ రెడ్డి, అంజయ్య, మేకం లక్ష్మి, రఘుపతి రెడ్డి, గణేష్ నాయక్, నరసింహ, నవరాజ్, గోవర్ధన్ రెడ్డి, వెంకట్ గుప్త, ఇబ్రహీం, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్, అధికారులు హర్షవర్ధన్, రాజ్ కుమార్, విజయ్, మురళి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



- లార్డ్స్ ఒలింపియాడ్ పాఠశాలలో వైభవంగా 'క్రీడో' కార్యక్రమం
- చైర్మెన్ సిద్దాల బీరప్ప

నవతెలంగాణ-బడంగ్‌పేట్

విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని లార్డ్స్ విద్యా సంస్థల చైర్మెన్ సిద్దాల బీరప్ప అన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్ పేటలోని లార్డ్స్ ఒలింపి యాడ్ పాఠశాలలో ప్రాథమిక పాఠశాల విద్యార్థుల ప్రత్యేక శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. 'క్రీడో' ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రీ ప్రైమరీ విద్యార్థులు చేసిన ప్రయోగాలు, ప్రదర్శనలు చూపరులను విశేషంగా ఆకర్షించాయి. ఈ సందర్భంగా పాఠశాల చైర్మెన్ సిద్దాల బీరప్ప, వైస్ చైర్మెన్ బెర్లు శ్రీనివాస్ రెడ్డిలు మాట్లాడుతూ.. ప్రీ ప్రైమరీ విద్యార్థులకు చిన్ననాటి నుండి చదువు మీద సంపూర్ణ అవగాహన, ఆసక్తి కలుగజేస్తేనే ఆ విద్య నిరంతరం ఎదుగుతుందని, ఆ విద్యను విద్యార్థులు మరచిపోవడం జరగదని, అందుకే లార్డ్స్ విద్యా సంస్థ ప్రీ ప్రైమరీ చిన్నారులకు వినూత్న విద్యా విధానాన్ని (క్రీడో) అవలంబి స్తుందని వివరించారు. తర్వాత పిల్లల తల్లీదండ్రులు మాట్లాడుతూ లార్డ్స్ ఒలింపియాడ్ పాఠశాలలో నేర్పే చదువును చూస్తే పిల్లల భవిష్యత్ మీద సంపూర్ణ నమ్మకం కలుగుతుందన్నారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సిద్దాల శ్రీలత, డీన్ సతీష్, ప్రిన్సిపాల్ బానూరు శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరో మహాసభలను విజయవంతం చేయాలి

జిల్లా కార్యదర్శి కిషన్ చౌహాన్



నవతెలంగాణ-తుర్కయంజాల్

తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా ఆరోవ మహాసభలను విజయవంతం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కిషన్ చౌహాన్ బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఉపాధ్యాయుల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న ఉపాధ్యాయ సంఘంగా యూటీఎఫ్‌కు రాష్ట్రంలో మంచి పేరు ఉన్నదని పేర్కొన్నారు. నిజాయితీకి నిబద్ధతకు నిలువెత్తు రూపం యూటీఎఫ్ కార్యకర్తలని తెలిపారు. సమాజ సంక్షేమం కోసం కూడా నిరంతరం కృషి చేస్తారని పేర్కొన్నారు. ఆరోవ మహాసభలను షాద్‌నగర్‌లో ఈ నెల 14, 15 తేదీలలో జరుగుతున్నాయని, జిల్లాలోని ఉపాధ్యాయులు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి మహాసభలను విజయవంతం చేయగలరని కోరారు.

క్రీడలతో మానసికోల్లాసం, మనోధైర్యం

మేయర్ పారిజాత నర్సింహారెడ్డి



నవతెలంగాణ- బడంగ్ పేట్

క్రీడలతో మానసికోల్లాసం, మనోధైర్యం కలుగుతుందని మేయర్ పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మున్సిపల్ గ్రౌండ్‌లో బుధవారం నిర్వహించిన సీఎం కప్ కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్ క్రీడా పోటీలను బుధవారం డిప్యూటీ మేయర్ ఇబ్రం శేఖర్‌తో కలిసి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహా రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించి..ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో కృష్ణయ్య, కమిషనర్ పి.సరస్వతి, కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్ రెడ్డి, పెద్దబావి సుదర్శన్ రెడ్డి, నాయకులు రాళ్లగూడెం శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ బొర్ర జగన్ రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుభాన్ యాదవ్, నాయకులు గుర్రం లక్ష్మారెడ్డి, జక్కిడి విష్ణువర్ధన్ రెడ్డి, లక్కీశెట్టి మనోహర్, క్యారగారి శ్రీధర్, రమేష్ గౌడ్, వెంకటేష్ గౌడ్ సిబ్బంది పాల్గొన్నారు.





క్రిస్మస్ వేడుకల్లో మేయర్..

అదే విధంగా మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బడంగ్‌పేట్ ఐక్య పాస్టర్స్ అసోసియేషన్ బీయూపీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రి క్రిస్టిమస్ వేడుకలకు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్ రెడ్డి, నాయకులు రాళ్లగూడెం శ్రీనివాస్ రెడ్డి,మాజీ సర్పంచ్ బొర్ర జగన్ రెడ్డి,మహేశ్వరం నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుభాన్ యాదవ్, నాయకులు లక్కీశెట్టి మనోహర్, క్యారగారి శ్రీధర్, గిరి ముదిరాజ్, పాస్టర్లు ఇమాన్యుయల్, శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన బాలికల హాస్టల్‌లో అన్ని సమస్యలే

తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ధర్మనాయక్

నవతెలంగాణ - చంపాపేట్

చంపాపేట్‌లోని గిరిజన బాలికల హాస్టల్‌లో అన్ని సమస్యలే ఉన్నాయని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం ధర్మానాయక్ అన్నారు. ఈ మేరకు బుధవారం గిరిజన బాలికల హాస్టల్‌ను జిల్లా కార్యదర్శి ఎం. బాలు నాయక్‌తో కలిసి బుధవారం ఆయన సందర్శించారు. తర్వాత విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హాస్టల్‌లో ఉన్న అనేక సమస్యల వలన విద్యార్థులు విద్యకు దూరమయ్యే పరిస్థితి ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టల్‌లో విద్యార్థులకు గదులు సరిపోవడం లేదన్నారు. ముఖ్యంగా మౌలిక వసతులు లేవని మండిపడ్డారు. తాగునీటి, బాత్రూమ్ సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని



ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి.. సంక్షేమ హాస్టళ్లకు వచ్చే నిధులను సక్రమంగా విడుదల చేయాలని కోరారు. హాస్టల్స్‌లో అన్ని రకాల సౌకర్యాలు కల్పించకపోతే రాబోయే కాలంలో పోరాటం, ఆందోళన చేస్తామని హెచ్చరించారు. వారి వెంట సరిత, నాయకులు తదితరులు ఉన్నారు.

జిల్లా స్థాయి గణిత ప్రతిభ పోటీ పరీక్షలు



నవతెలంగాణ-హయత్ నగర్

తెలంగాణ మాథ్స్ ఫోరం రంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి గణిత ప్రతిభ పోటీ పరీక్షలు స్థానిక NVYNYSY జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హయత్ నగర్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ పోటీ పరీక్షలో జిల్లా వ్యాప్తంగా 27 మండలాల నుంచి ప్రతి మీడియా నుంచి ముగ్గురేసి విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే రెసిడెన్షియల్ కేజీబీవీ మోడల్ స్కూల్ విద్యార్థులు కూడా ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. తెలుగు, ఇంగ్లీష్ మీడియాలలో ప్రతిభ కనబరిచి తొలి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇంగ్లీషు మీడియంలో బహుమతులు గెలిచిన విద్యార్థులు కార్తిక్, నీరజ్, శివ చరణ్. తెలుగు మీడియంలో బహుమతులు గెలిచిన విద్యార్థులు పవన్ కుమార్, సంజన, స్మోహిత్.

అదేవిధంగా రెసిడెన్షియల్‌లో బహుమతులు పొందిన విద్యార్థులు సంకేతన, సింధు, పల్లవిలు. నక్క శ్రీనివాస్ యాదవ్ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో టిఎంఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు యాదగిరి రెడ్డి, ప్రధాన కార్యదర్శి కాశమల్ల శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, డిసివి సెక్రటరీ అరుణ్, జిల్లా సైన్స్ అధికారి వై. శ్రీనివాస్ రావు, జిల్లా కార్యవర్గం తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ ఏనుగు రాంరెడ్డికి మాతృవియోగం

కుటుంబ సభ్యులను ఓదార్చిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, మేయర్ పారిజాత నర్సింహారెడ్డి



నవతెలంగాణ-బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడలో 24వ డివిజన్ కార్పొరేటర్ ఏనుగు రాంరెడ్డి మాతృమూర్తి ఏనుగు పద్మమ్మ మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అక్కడికి చేరుకొని..ఏనుగు పద్మమ్మ పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తర్వాత కార్పొరేటర్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు రామిడి రాంరెడ్డి, సంరెడ్డి వెంకట్ రెడ్డి, దీపికా శేఖర్ రెడ్డి, ముత్యాల లలిత కృష్ణ ,తుపాన్ రెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని అల్మాస్ గూడలో 24వ డివిజన్ కార్పొరేటర్ ఏనుగు రాంరెడ్డి మాతృమూర్తి మరణించారు. ఈ విషయం తెలుసుకున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహా రెడ్డి అక్కడికి చేరుకుని ఆమె పార్థివ దేహానికి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబం సభ్యులను ఓదార్చారు. మేయర్ వెంట కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, నాయకులు బోయపల్లి రాఘవేందర్ రెడ్డి, దిండు శ్రీనివాస్ గౌడ్ తదితరులు ఉన్నారు.



ప్రగతి పథంలో ముందుకెళ్తున్న బడంగ్‌పేట్

మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి

నవతెలంగాణ - బడంగ్‌పేట్

కోట్లాది రూపాయల నిధులతో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తూ బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రగతి పథంలో ముందుకు సాగుతున్నట్లు మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 19వ డివిజన్‌లోని మల్లికార్జున కాలనీలో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ రామోజీ అమిత శ్రీశైలం చారీతో కలసి బుధవారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇవ్వటం జరుగుతుందని తెలిపారు.



ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వల్లపు సుభస్ యాదవ్, గుర్రం లక్ష్మారెడ్డి, జక్కిడి విష్ణువర్ధన్ రెడ్డి, లక్కీశెట్టి మనోహర్, బలవంత్ రెడ్డి, క్యారగారి శ్రీధర్, శివ కుమార్, గిరి ముదిరాజ్, భాస్కర్ గౌడ్, శశిధర్ రావు, భాను తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
8
మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్
గురువారం | డిసెంబర్ 12, 2024 | www.navatelangana.com

మహనీయుల స్ఫూర్తితో సమాజ సేవ చేయాలి: గడ్డం వివేక్



నవతెలంగాణ-అల్వాల్

మహనీయుల స్ఫూర్తితో సమాజ సేవ చేయాలని చెన్నూరు శాసనసభ్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. అల్వాల్ సర్కిల్ పరిధిలోని వెంకటాపురంలో హైదరాబాద్ అంబేద్కర్ బి.ఎస్. వెంకట్రావు 126వ జయంతి వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. నిజాం రాజ్యంలో మాదరి భాగ్యరెడ్డి వర్మ, బి.ఎస్. వెంకట్రావు వంటి మహనీయులు చేసిన సేవలను గుర్తు చేశారు. ఇటీవల కాలంలో దళిత సమాజంలో చీలికలు తెచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తమ తండ్రి గడ్డం వెంకటస్వామి అడుగుజాడల్లో సేవ చేస్తానన్నారు. మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి, కేంద్ర ప్రభుత్వ ఆధార్ సంస్థ మాజీ డైరెక్టర్ పి.ఎస్.ఎన్. మూర్తి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ చైర్మెన్ డాక్టర్ వెన్నెల గద్దర్ తదితరులు బీ.ఎస్. వెంకట్రావు సేవలను గుర్తు చేస్తూ ప్రసంగించారు.

జర్నలిస్టులపై మోహన్‌బాబు దాడి హేయం

- తెలంగాణ రైతు హక్కుల రాష్ట్ర నాయకులు మచ్చ పాండు గౌడ్

నవతెలంగాణ-కాప్రా

జర్నలిస్టులపై సినీ నటుడు మోహన్ బాబు దాడి చేయడం దారుణమని తెలంగాణ రైతు హక్కుల రాష్ట్ర నాయకులు మచ్చ పాండు గౌడ్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ..ప్రపంచంలో జర్నలిస్టులు, జర్నలిజం, మీడియా ప్రతినిధులు లేనిది శూన్యం అన్నారు. ప్రపంచానికి, రాష్ట్రాలకు వెలుగు జర్నలిజం అన్నారు. అన్ని రంగాల్లో అన్యాయాన్ని, అక్రమాలను అడ్డుకట్ట వేయడానికి కృషి చేసే మీడియాపై ఇలాంటి దాడులు చేయడం సిగ్గు చేట్టన్నారు. న్యాయాన్ని గెలిపించడానికి మీడియా పాటుపతుందని తెలిపారు. ఎంత పెద్ద వారైనా సరే అందరికీ ఒకే న్యాయమని చాటి చెప్పే మీడియా మిత్రులకు, పేపర్ మిత్రులకు, జర్నలిస్టులకు అన్యాయం జరిగితే తెలంగాణ రైతాంగం తరపున ఊరుకోబోమని తెలిపారు. ప్రాణాలకు తెగిర్చి కుటుంబాలను వదులుకొని సమస్యల మీద ఎంత దూరమైనా ప్రయాణిస్తూ సమస్యలు వెలుగులోకి తీసుకొచ్చే జర్నలిజానికి తెలంగాణ రైతు హక్కుల రాష్ట్ర నాయకుల తరపున మద్దతు తెలిపారు.

మీడియా ప్రతినిధులపై దాడిని నిరసిస్తూ ధర్నా



నవతెలంగాణ-కాప్రా

సినీ నటుడు మోహన్ బాబు మీడియా ప్రతినిధులపై దాడి చేయడాన్ని ఖండిస్తూ కాప్రా జర్నలిస్టులు బుధవారం ఈసీఐఎల్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఈ సంధ్బంగా టీయూడబ్ల్యూజే-ఐజేయూ రాష్ట్ర కోశాధికారి మోతే వెంకటరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకట్రామిరెడ్డిలు మాట్లాడుతూ.. మోహన్‌బాబు విచక్షణ కోల్పోయి మీడియా ప్రతినిధులపై దాడి చేయడం దారుణం అన్నారు. బజారు రౌడీలా వ్యవహరించిన మోహన్ బాబుపై పోలీసులు వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దాడిలో తీవ్రంగా గాయపడ్డ జర్నలిస్టులను ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కాప్రా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఉల్లోజు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వేముల శంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ కుమార్, ఉపాధ్యక్షులు ఆదిమూలం శ్రీనివాస్, అక్బర్, నటరాజ్ కోశాధికారి రుద్రగోని నర్సింగ్ గౌడ్, జర్నలిస్టులు దాచేపల్లి రమేష్, రమేష్, శ్రీనివాస్ తదితులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండూ ముఖ్యమే..

- మేయర్ తోటకూర అజయ్ యాదవ్
- పలు అభివృద్ధి పనులు ప్రారంభం



నవతెలంగాణ-బోడుప్పల్

తమకు అభివృద్ధి, సంక్షేమం రెండూ సమ ప్రాధాన్యతలని బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ అన్నారు. బుధవారం కార్పొరేషన్ పరిధిలోని 1వ డివిజన్‌లో రూ.135.50 లక్షలతో, 15వ డివిజన్‌లో రూ.48 లక్షల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను డిప్యూటీ మేయర్ కొత్త శ్రవంతి కిషోర్ గౌడ్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ..బోడుప్పల్ కార్పొరేషన్ అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహారెడ్డి, కార్పొరేటర్లు కుంభం కిరణ్ కుమార్ రెడ్డి , బింగి జంగయ్య యాదవ్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

శాలివాహన ఎన్‌క్లేవ్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులకు శుభాకాంక్షలు



నవతెలంగాణ-కాప్రా

కాప్రా డివిజన్‌లోని శాలివాహన ఎన్‌క్లేవ్ కాలనీ నూతనంగా ఎన్నికైన రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులను కాప్రా కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి అభినందించారు. బుధవారం శాలివాహన ఎన్‌క్లేవ్ కాలనీవాసులు ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరయ్యారు. ముందుగా కార్పొరేటర్‌కు కాలనీ వాసులు స్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాటాడుతూ..డివిజన్ అభివృద్ధికి నిర్విరామంగా కృషి చేస్తున్నానని తెలిపారు. శాలివాహన ఎన్‌క్లేవ్ కాలనీలో కూడా రెండు పార్కుల సుందరీకరణ పనులు చేపట్టానని గుర్తు చేశారు. కాలనీవాసులకు షటిల్, వాలీబాల్, ఇండోర్ క్రీడా సామగ్రి అందిస్తామని తెలిపారు. శాలివాహన ఎన్‌క్లేవ్ కాలనీలో భూగర్భ డ్రయినేజీ వ్యవస్థ ఏర్పాటు, అంతర్గత రోడ్ల నిర్మాణం చేయాలని కాలనీవాసులు కార్పొరేటర్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో శాలివాహన ఎన్‌క్లేవ్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డి.ఎమ్ శంకర్, సెక్రటరీ సామ శ్రీలత, వైస్ ప్రెసిడెంట్ సయ్యద్ వలీ, కార్యవర్గ సభ్యులతో పాటు డివిజన్ కాంగ్రెస్ నాయకులు పవన్ కుమార్, పడమటి మల్లారెడ్డి, సంతోష్ చారి, జి. సత్యనారాయణ , ఆకుల సంతోష్, రిజ్వాన్ ఖాన్, రాజు , సత్తిరెడ్డి ఉన్నారు.

బీరప్పగడ్డలో సీసీ కెమెరాల ఏర్పాటు



నవతెలంగాణ-ఉప్పల్

చిల్కానగర్ డివిజన్‌లోని బీరప్ప గడ్డ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు జగన్, రాంచందర్, అసోసియేషన్ సభ్యులు జీవీపీ పాయింట్ వద్ద సీసీ కెమెరాను ఏర్పాటు చేయాలని కార్పొరేటర్‌కు విన్నవించారు.వెంటనే స్పందించిన కార్పొరేటర్ గీతా ప్రవీణ్ కాలనీ అసోసియేషన్ సభ్యులు, బస్తీ వాసులతో మాట్లాడి వారికి సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తే కలిగే ఉపయోగాలను వివరించారు. దీంతో కాలనీవాసులందరూ తమ సొంత డబ్బులు జమ చేసుకొని జీవీపీ పాయింట్ వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా బన్నాల ప్రవీణ్ మాట్లాడుతూ.. చిల్కానగర్ డివిజన్‌లో ఇప్పటికీ సుమారు 8 కెమెరాలు కాలనీ సంక్షేమ సంఘాల వారి సౌజన్యంతో ఏర్పాటు చేసుకున్నట్టు తెలిపారు. బస్తీ బాగుండాలంటే తల ఒక చెయ్యి వేయాలని బస్తీ బాగోగులలో మన వంతు సహకారం ఉండాలనే సంకల్పంతో బీరప్పగడ్డ బస్తీవాసులు ముందుకు వచ్చినందుకు వారిని ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఏఎంహెచ్‌వో మైత్రి మాట్లాడుతూ.. బస్తీలలో జీవీపీ పాయింట్ల వద్ద కెమెరాలకు కాంట్రిబ్యూషన్ ఇవ్వడం చాలా గొప్ప విషయమని అభినందించారు. బీరప్ప గడ్డలో జీవీపీ పాయింట్ వద్ద త్వరలో కెమెరాను ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీరప్ప గడ్డ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జగన్ కార్యదర్శి రాంచందర్, అసోసియేషన్ సభ్యులు సభ్యులు, సానిటరీ ఇన్‌చార్జి జగన్, తదితరులున్నారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



- కాంగ్రెస్ నాగారం మున్సిపల్ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ-కీసర

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని నాగారం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని సెరినిటి స్కూల్ గ్రౌండ్‌లో సీఎం కప్ క్రీడా పోటీల కార్యక్రమంలో పాల్గొని ఆటలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులను, యువకులను క్రీడల్లో ప్రోత్సాహించేందుకు ప్రభుత్వం సీఎం కప్ ప్రారంభించిందన్నారు. ఈ కార్యక్రమంలో రాంగోనీ శ్రీనివాస్ గౌడ్, ప్రవీణ్ యాదవ్, షేక్ గౌస్ పాల్గొన్నారు.

17 నుంచి 21 వరకు రాష్ట్రపతి పర్యటన

- అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శీతాకాల విడిది నేపథ్యంలో హైదరాబాద్ రానున్న దృష్ట్యా జిల్లాలోని అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలనీ, ఏమాత్రం నిర్లక్ష్యం పనికిరాదని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. రాష్ట్రపతి బొల్లారంలో ఉన్న రాష్ట్రపతి నిలయంలో ఈ నెల 17 నుంచి 21వ తేదీ వరకు ఉండనున్నందున, అందుకు సంబంధించిన వివిధ ఏర్పాట్లపై ఆయా శాఖల అధికారులతో కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతియేడు మాదిరిగా రాష్ట్రపతి శీతాకాల విడిదికి ఈనెల 17వ తేదీన హకీంపేట ఎయిర్ పోర్టులోకి వచ్చి అక్కడ నుంచి బొల్లారం చేరుకుంటారనీ, 21వ తేదీ వరకు రాష్ట్రపతి నిలయంలో ఉంటారని తెలిపారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు బాధ్యతాయుతంగా తమ విధులను నిర్వహించాలని సూచించారు. ఈ విషయంలో ప్రతి ఒక్కరూ తమకు అప్పగించిన బాధ్య టతలను సక్రమంగా నిర్వహించాలనీ, అందుకు అనుగుణంగా ఎలాంటి ఇబ్బందులు, లోటుపాట్లు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో రాష్ట్రపతి పర్యటనను విజయవంతం చేయడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. రాష్ట్రపతికి ఆహ్వానం పలికేందుకు వీఐపీలు వస్తారనీ, అందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. రోడ్లు గుంతల్లేకుండా చూడాలనీ, అందుకు అవసరమైన మరమ్మతులు చేపట్టి రోడ్లను బాగు చేయడంతోపాటు షామియానాలు (టెంట్లు), కుర్చీలు, వేదికకు సంబంధించిన అన్ని రకాల ఏర్పాట్లను చేయాల్సిందిగా రోడ్లు, భవనాల శాఖ అధికారికి సూచించారు. ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలనీ, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అన్ని రకాల ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. మున్సిపల్ అధికారులు సైతం ఎక్కడా చెత్త కనబడకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సంబంధిత కమిషనర్‌కు సూచించారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా ఉండేందుకుగాను అవసరమైన మరమ్మతులు, చర్యలు తీసుకుని నిరంతరాయంగా 24 గంటల పాటు విద్యుత్ సరఫరాను అందించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, మల్కాజిగిరి, కీసర ఆర్డీఓలు శ్యాంప్రకాష్, సైదులు, ఏసీపీ రాములు, ఆయా శాఖల జిల్లా అధికారులు, పోలీసు, రెవెన్యూ, విద్యుత్ శాఖల అధికారులు, తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు రూ.26వేల వేతనం ఇవ్వాలి

- సీఐటీయూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కోశాధికారి కే.ఉన్నికృష్ణ
- సమస్యల పరిష్కారానికి నేడు చలో హైదరాబాద్
- టీచర్‌కు రూ.2 లక్షలు, ఆయాలకు రూ.లక్ష రిటైర్‌మెంట్ బెనిఫిట్ ఇవ్వాలి
- తెలంగాణ అంగన్‌వాడీ టీచర్లు అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి బి. శోభారాణి



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

అంగన్‌వాడీలకు రూ.26వేల వేతనం ఇవ్వాలని సీఐటీయూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కోశాధికారి కే.ఉన్నికృష్ణ అన్నారు. తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మల్కాజిగిరి సెక్టార్ మీటింగ్‌ను బుధవారం వినాయకనగర్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యతిథిగా సీఐటీయూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కోశాధికారి కె.ఉన్నికృష్ణన్ హాజరై మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పెట్టిన విధంగా ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా విజయవంతం కావడానికి అంగన్‌వాడీ కేంద్రాలను మూసి ఉంచుతామన్నారు. అంగన్‌వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిసెంబర్ 12న జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమానికి టీచర్లు, హెల్పర్లు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఐసీడీఎస్ ప్రయివేటీకరణ ఆలోచనను ఉపసంహరించుకోవాలని, నూతన జాతీయ విద్యా విధానం రద్దు చేయాలని, క్రచ్ సెంటర్స్ ఆలోచనను వెనక్కి తీసుకోవాలని, గ్రాట్యుటీ, పీఎఫ్, ఈఎస్ఐ ఇతర సమస్యలను పరిష్కరించాలన్నారు. చివరి జీతంలో సగం పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం యూనియన్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి బి.శోభారాణి మాట్లాడుతూ మినీ టీచర్స్ రాష్ట్రంలో 4,000 మంది ఉన్నారని వారిని మెయిన్ టీచర్‌గా ప్రమోషన్ ఇస్తూ ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. కానీ ప్రభుత్వం వారికి నేటికీ హెల్పర్ వేతనాలు ఇవ్వడం అన్యాయమన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ప్రమోషన్ల ప్రకారం మెయిన్ టీచర్ వేతనం ఇవ్వాలన్నారు. మినీ సెంటర్లకు హెల్పర్ల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్ టీచర్‌కు రూ.2 లక్షలు, హెల్పర్‌కు రూ.1లక్ష ఇస్తామని హామీ ఇచ్చి జీవోలు ఇవ్వలేదని, ఇప్పటికీ టీచర్లకు రూ.1లక్ష, హెల్పర్‌కు రూ.50 వేలు ఇవ్వడం అన్యాయమన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలే అమలు కాకపోతే ఎవరిని నమ్మాలన్నారు.10 నెలల రూమ్ రెంట్లు, సెంటర్ అద్దెలు ఇవ్వలేదని, గ్యాస్ సిలిండర్, కూరగాయల బిల్లు ఇతర బిల్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. జిల్లా అధికారులు చొరవ చేసి ఇవ్వాల్సిన బిల్లులను పెండింగ్‌లో పెట్టడం అన్యాయమన్నారు. టీచర్ పోస్టులుకే ఖాళీగా ఉన్న దగ్గర ఇతర టీచర్లకు ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చిన ఇన్‌చార్జి అలవెన్స్ ఇవ్వకపోవడం సరికాదన్నారు. ఇన్‌చార్జి అలవెన్సులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడీ జిల్లా నాయకులు రాణి, షాహిద్, దేవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రార్థనా మందిరం ఏర్పాటుకు కృషి : ఎమ్మెల్యే మర్రి



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

క్రిస్టియన్లు ప్రార్థన చేసుకోడానికి ప్రార్థనా మందిరం ఏర్పాటుకు కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని జ్యోతి నగర్ కమ్యూనిటీ హాల్‌లో అగాపె ఫెలోషిప్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన క్రిస్మస్ వేడుకలకు గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రిస్మస్ వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. క్రిస్టియన్ సోదరులకు ప్రభుత్వ స్థలంలో ప్రార్థనా మందిరం ఏర్పాటు కొరకు కృషి చేస్తున్నానని తెలిపారు. త్వరలోనే శుభవార్త వింటారని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్, రావుల అంజయ్య, సిద్ధి రాములు, బైరు అనిల్, పాస్టర్ బక్క ఎలియా, పాస్టర్ డా. ఎమాన్యూల్, సామ్యూల్, పాస్టర్ ఆనంద్, వివిధ చర్చిల పాస్టర్లు, స్థానిక బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నాగారం, దమ్మాయిగూడ మెడికల్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



నాగారం ,దమ్మాయిగూడ మెడికల్ అసోసియేషన్ కార్యవర్గం



అధ్యక్షుడు
ఎం.భీంరావు
పాటిల్

నవతెలంగాణ-కీసర

నాగారం, దమ్మాయిగూడ మెడికల్ అసోసియేషన్ కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం.భీంరావు పాటిల్, ఉపాధ్యక్షుడిగా మహేష్, ప్రధాన కార్యదర్శిగా బి.శ్రీనివాస్ గౌడ్, సంయుక్త కార్యదర్శిగా ఎన్. నరేష్, కోశాధికారిగా ఎం.వెంకటేష్, సలహదారులుగా దశరథ్ గౌడ్, సతీష్ కుమార్, సభ్యులుగా కరుణాకర్, నవీన్, రాజేష్ కుమార్, రాహుల్, కమలాకర్, రాజలింగం, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఎన్నికయ్యారు.

కబ్జా కోరల్లో బీర్లకుంట చెరువు

- 24 ఎకరాల విస్తీర్ణంలో చెరువు .. 10 ఎకరాలు కబ్జా
- చెరువు బఫర్ జోన్‌లో అక్రమ నిర్మాణాలు
- శ్రీరంగవరంలో ప్రభుత్వ స్థలాలకు రక్షణ కరువు



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మండలం శ్రీరంగవరం గ్రామంలోని బీర్లకుంట చెరువు రోజురోజుకు ఆక్రమణకు గురవుతుంది. దాదాపు 24ఎకరాల విస్తీర్ణంలో కలిగి ఉన్న ఈ చెరువు కబ్జా కోరల్లో చిక్కుకుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దాదాపు 10ఎకరాల వరకు బీర్లకుంట చెరువు ఆక్రమణకు గురైందని ఆ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. శ్రీరంగవరం గ్రామానికి సాగునీరు అందించే బీర్లకుంట చెరువుకు రక్షణ లేకుండా పోయింది. ఇష్టారాజ్యంగా ఎవరికి తోచిన విధంగా వారు చెరువు సమీప స్థలాలను కబ్జాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. 166 సర్వే నెంబర్‌లో 24 ఎకరాల విస్తీర్ణంలో ఈ చెరువు ఉండేది. ఇరిగేషన్ అధికారులు కానీ అటు రెవెన్యూ అధికారులు కానీ బీర్లకుంట చెరువును పట్టించుకోకపోవడంతో చెరువు అన్యాక్రాంతం అవుతోంది. చెరువుకు సంబంధించిన ప్రభుత్వ స్థలాలను ఇష్టా రాజ్యంగా కబ్జాలకు పాల్పడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. చెరువును ఇలానే వదిలేస్తే రాబోయే రోజుల్లో ఇక్కడ ఒక చెరువు ఉండేదని చెప్పుకునే పరిస్థితి ఏర్పడుతుందని ఆ గ్రామానికి చెందిన సీనియర్ నాయకురు ఒకరు తెలిపారు. ఈ విషయంలో ఇరిగేషన్ అధికారులు, రెవెన్యూ అధికారులు సమగ్ర విచారణ జరిపి బీర్లకుంట చెరును కాపాడాలని శ్రీరంగవరం ప్రజలు కోరుతున్నారు.

బఫర్ జోన్‌లో అక్రమ కట్టడాలు

బఫర్ జోన్‌లో అక్రమ కట్టడాలు కట్టవద్దంటూ ప్రభుత్వం హెచ్చరిస్తున్న ప్పటికీ యథేచ్ఛగా అక్రమ కట్టడాలు సాగుతున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. ఒకపక్క చెరువు ఆక్రమణలకు గురైందని ఆరోపణలు వినిపిస్తుంటే మరోపక్క బఫర్ జోన్‌లో అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి.

విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న శ్రవణ్



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

సికింద్రాబాద్ ముత్యాలమ్మ దేవాలయంలో బుధవారం నిర్వహించిన అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అమ్మవారిని దర్శనం చేసుకుని ఆశీస్సులు తీసుకున్నానని తెలిపారు. విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మొండా కార్పొరేటర్ దీపిక, నరేష్, శరత్ ఠాకూర్, సుభాష్, కిరణ్, రోమిట్ అగర్వాల్, రవి తదితరులు పాల్గొన్నారు.

యువకుడు దారుణ హత్య



నవతెలంగాణ-కీసర

జవహర్ నగర్ డంపింగ్ యార్డు సమీపంలో ఉన్న హరిదాస్ పల్లి శివారులో ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన మంగళవారం అర్ధరాత్రి కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. కీసర సీఐ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం హరిదాస్ పల్లి నుంచి దమ్మాయిగూడకు వేళ్లే రోడ్డు పక్కన రక్తపు మడుగులో ఓ వ్యక్తి మరణించి ఉండటాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెంటనే అక్కడకు చేరుకున్నారు. మృతుడు సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి మండలం లకడారం గ్రామానికి చెందిన చిరమైన మహిపాల్ యాదవ్ (26)గా గుర్తించారు. మృతుడు 15 ఏండ్ల క్రితం బతుకుదెరువు నిమిత్తం తన తండ్రి కనకయ్య, తల్లి లక్ష్మీనర్సమ్మతో వలస వచ్చి కాప్రా ఎల్లారెడ్డిగూడలో అద్దె ఇంట్లో నివసిస్తున్నారు. మహిపాల్ యాదవ్ డీజే ఈవెంట్ మేనేజ్మెంట్‌గా పని చేస్తున్నాడు. మృతుడు మంగళవారం రాత్రి దమ్మాయిగూడలోని ఓ మద్యం దుకాణం వద్ద స్నేహితులతో మద్యం కొనుగోలు చేసి హరిదాస్‌పల్లి సమీపంలోని నిర్మానుష ప్రదేశానికి వెళ్లినట్లు తెలిసింది. అక్కడ అందరూ కలిసి మద్యం సేవిస్తుండగా జరిగిన ఘర్షణలో అతడిని కత్తితో ఛాతిపై దాడి చేశారు. ప్రేమ వ్యవహారమే అతడి హత్యకు దారి తీసి ఉండొచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నగరంలోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా



- కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా విధిస్తామని కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి అన్నారు. వినాయక్ నగర్ డివిజన్ ఈస్ట్ కాకతీయ నగర్ రోడ్డు నెంబర్-3లో వినాయక్ నగర్ డివిజన్ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరా మైక్‌సెట్‌ను హెల్త్ ఆఫీసర్ మంజుల, నేరేడ్‌మెట్ సీఐ సందీప్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ..పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి పారిశుధ్యం మెరుగుపరిచేందుకు కాలనీవాసులు సహకరించాలన్నారు. బహిరంగా ప్రదేశాల్లో చెత్త వేయకుండా జీవీపీ విధానంతో సీసీ కెమెరాలు ద్వారా హెచ్చరిక మైక్ అనౌన్స్‌మెంట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బహిరంగా ప్రదేశాల్లో చెత్త వేస్తే రూ. వెయ్యి జరిమానా విధిస్తునట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు దశరథ్, సీత, రామరావు, రామ్ సింగ్, హనుమంత్ రావు, రాజిరెడ్డి, దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

వినాయక్ నగర్ డివిజన్ పరిధిలోని వినాయక్ నగర్ రోడ్డు నెంబర్-24లో రూ.25 లక్షల వ్యయంతో నూతనంగా జరగబోతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ఓం ప్రకాష్, ఉపాధ్యక్షులు సాయి సురేష్, శ్రీకాంత్ యాదవ్, జగదీష్ చారి, స్థానిక కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

చర్లపల్లి రెడ్డి కాలనీలో అయ్యప్ప పడిపూజ



నవతెలంగాణ - చర్లపల్లి

చర్లపల్లి డివిజన్ రెడ్డి కాలనీలో బుధవారం అయ్యప్ప పడిపూజ ఘనంగా నిర్వహించారు. ప్రముఖ వ్యాపారవేత్త శ్రీరామ్ బేకర్స్ అండ్ స్వీట్స్ యజమాని కట్కూరి విజయ కుమార్ రెడ్డి నివాసంలో జరిగిన అయ్యప్ప పడి పూజలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. అయ్యప్ప శరణు ఘోషతో కాలనీ మారు మోగింది. భక్తులు స్వామి శరణం అయ్యప్ప శరణం... అంటూ స్వామి వారిని ఘనంగా పూజలు అర్పించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో కట్కూరి బుచ్చిరెడ్డి, కె.యాదిరెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, పణీరాజు, ముకుందరెడ్డి, బద్దం ప్రవీణ్ రెడ్డి, సాంబశివుడు రమేష్, మహిపాల్ రెడ్డి, నాగరాజు, గోవిందాస్, శ్రీనివాస్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



నాగారం మారుతీ కన్వేషన్ హాల్‌లో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వ్యవసాయ కమిటీ చైర్మెన్ నాగిళ్ళ బాల్‌రెడ్డి బంధువుల వివాహ వేడుక బుధవారం జరిగింది. ఈ వివాహ వేడుకకు హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, బీఆర్ఎస్ పార్టీ మాజీ రాష్ట్ర కార్యదర్శి గొల్లూరి అంజయ్య, తదితరులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. -నవతెలంగాణ,కాప్రా

వేర్వేరు చోట్ల ఇద్దరు వ్యక్తులు అదృశ్యం

నవతెలంగాణ-జవహర్‌నగర్

ఇద్దరు యువకులు ఇంటి నుంచి అదృశ్యమైన సంఘటన జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. జవహర్ నగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సైదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. దమ్మాయిగూడలో మశోత్ రమేష్ అనే వ్యక్తి తన భార్య ఇద్దరు పిల్లలతో దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని సాయి సిద్ధార్థ కాలనీలో నివాసముంటున్నారు. మంగళవారం రమేష్ భార్య పిల్లలు రాత్రి భోజనం చేసి పడుకున్నారు. బుధవారం ఉదయం నిద్రలేచి చూసేసరికి తన కొడుకు అఖిల్ ఇంట్లో లేడు. అఖిల్ సాయి సిద్ధార్థ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. అఖిల్ బట్టలు రూ.3000 నగదు తీసుకొని ఇంటి నుండి బయట వెళ్లిపోయాడు. అఖిల్ తన సోదరితో ఇంట్లో గొడవలు చేసేవాడని తల్లి ఫిర్యాదులో పేర్కొంది. దీంతో రమేష్, తన కొడుకు అఖిల్‌ను మందలించి కౌన్సిలింగ్ ఇచ్చాడని, దీంతో మనస్థాపం చెందిన అఖిల్ ఇంటి నుండి వెళ్లిపోయి ఉంటాడని అనుమానిస్తున్నారు. ఈ మేరకు తల్లిదండ్రులు చుట్టుపక్కల వెతికినా బంధువుల వద్ద వెతికినా సమాచారం లభించకపోవడంతో బుధవారం జవహర్ నగర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బాలాజీ నగర్ లో...

బాలాజీ నగర్ చంద్రపురి కాలనీలో కత్తి స్వర్ణలత అనే మహిళ తన ఇద్దరు కొడుకులు ఇద్దరు కూతుర్లతో బాలాజీ నగర్‌లో నివాసముం టుంది. స్వర్ణలత తన ఇద్దరు కూతుర్ల పెళ్లి చేసి కుమారులతో బాలాజీ నగర్‌లో నివాసం ఉంటుంది. ఈనెల 8న సాయంత్రం ఐదు గంటల సమయంలో స్వర్ణలత చిన్న కుమారుడు కత్తి సాయి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఇంటి నుండి బయటకి వెళ్ళిపోయాడు. సాయి ఆచూకీ కోసంతల్లి చుట్టుపక్కల వెతికినా బంధువుల వద్ద వెతికినా సమాచారం లభించలేదు. అనంతరం స్వర్ణలత జవహర్ నగర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



అంగన్‌వాడీలకు రూ.26వేల వేతనం చెల్లించాలి

- 10 నెలల స్కూల్ కిరాయి వెంటనే ఇవ్వాలి
- బకాయి కూరగాయలు, ఇతర బిల్లులు వెంటనే చెల్లించాలి
- అంగన్‌వాడీల డిమాండ్ల సాధనకు నేడు చలో హైదరాబాద్
- టీచర్‌కు రూ.2లక్షలు, ఆయాలకు రూ.లక్ష రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలి
- రిటైర్మెంట్ పెన్షన్ రూ.1000 చెల్లించాలి
- తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి బి.శోభారాణి



నవతెలంగాణ-సిటీబ్యూరో/అల్వాల్

అంగన్‌వాడీ ఉద్యోగులకు రూ.26వేల జీతం ఇవ్వాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి బి.శోభారాణి డిమాండ్ చేశారు. బుధవారం యూనియన్ అల్వాల్ సెక్టార్ మీటింగ్ అల్వాల్ ప్రాజెక్ట్ కన్వీనర్ శివరణి అధ్యక్షతన మచ్చబొల్లారంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బి.శోభారాణి మాట్లాడుతూ.. మినీ టీచర్స్ రాష్ట్రంలో 4వేల మంది ఉన్నారనీ, వారిని మెయిన్ టీచర్స్‌గా ప్రమోషన్ ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చినా నేటికీ హెల్పర్ జీతాలు ఇవ్వడం అన్యాయం అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ప్రమోషన్ల ప్రకారం మెయిన్ టీచర్ వేతనం ఇవ్వాలనీ, మినీ సెంటర్లకు హెల్పర్ల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రిటర్మెంట్ బెనిఫిట్ టీచర్‌కు రూ.2లక్షలు, హెల్పర్‌కు రూ.లక్ష ఇస్తామని హామీ ఇచ్చి జీవోలు ఇవ్వలేదనీ, ఇప్పటికీ టీచర్లకు రూ.లక్ష, హెల్పర్స్‌కు రూ.50వేలు ఇవ్వడం అన్యాయం అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలే అమలు కాకపోతే ఎవరిని నమ్మాలని ప్రశ్నించారు. 10 నెలలుగా రూమ్ రెంట్లు, సెంటర్ అద్దెలు ఇవ్వలేదనీ, గ్యాస్ సిలిండర్, కూరగాయలు, ఇతర బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయనీ, జిల్లా అధికారులు చొరవ చూపకుండా ఇవ్వాల్సిన బిల్లులను పెండింగ్‌లో ఉంచడం సరికాదన్నారు. టీచర్ పోస్టులకు ఖాళీగా ఉన్న దగ్గర ఇతర టీచర్లకు ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చినా, ఇన్‌చార్జి అలవెన్స్ ఇవ్వకపోవడం సరికాదన్నారు. ఇన్‌చార్జి అలవెన్సులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కోశాధికారి కె.ఉన్నికృష్ణన్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చిన విధంగా ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా విజయవంతం కావడానికి అంగన్‌వాడీ కేంద్రాలను మూసి ఉంచుతామని చెప్పారు. యూనియన్ అల్వాల్ ప్రాజెక్ట్ కన్వీనర్ శివరాణి మాట్లా డుతూ.. అంగన్‌వాడీల సమస్యలను వెంటనే పరిష్కరిం చాలని డిమాండ్ చేస్తూ నేడు చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి టీచర్లు, హెల్పర్లు పెద్ద సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు.

అంగన్‌వా డీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలనీ, ఐసీడీఎస్ ప్రయివేటీకరణ ఆలోచనను ఉపసంహరి ంచుకోవాలనీ, నూతన జాతీయ విద్యా విధానం రద్దు చేయాలనీ, క్రష్ సెంటర్స్ ఆలోచనను వెనక్కి తీసుకోవా లనీ, గ్రాట్యూటీ, పీఎఫ్, ఈఎస్ఐ ఇతర సమస్యలను పరిష్కరించాలనీ, చివరి జీతంలో సగం పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు స్వరూప, పద్మ ఇంద్ర, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

జీడిమెట్లలో మహిళ దారుణ హత్య

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

దేశానికి స్వాతంత్రం వచ్చి 77 ఏండ్లు గడుస్తున్న మహిళలకు ఇంకా స్వేచ్ఛ, స్వాతంత్రం రాలేదు. ఒంటరి మహిళల మీద అత్యాచారాలు, మహిళల హత్యలు జరుగుతూనే ఉన్నాయి. రేపిస్టులు, అంతకులు ఏమాత్రం భయపడకుండా దారుణలకు తెగబడుతున్నారు. జీడిమెట్ల పోలీసు స్టేషన్‌కు కూత వేటు దూరంలో కూడా మహిళలకు రక్షణ కరువైంది. ఎక్కడో నిర్మానుష ప్రాంతంలో ఇలాంటి అమానుష సంఘటనలు జరగడం మామూలే. కానీ కుత్బుల్లాపూర్ జంట సర్కిల్ కార్యాలయాల కూడలిలో గల ఫుట్ పాత్‌పై పోలీస్ స్టేషన్‌కు కూత వేటు దూరంలో తీవ్రగాయాలతో గుర్తుతెలియని ఓ మహిళ మృతదేహం కలవరపరిచింది. మహిళపై అత్యాచారం, హత్య చేసి ఫుట్ పాత్‌పై పడేసి ఉంటారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సంఘటనతో నగర శివారు ప్రాంతం ఉలిక్కిపడింది. నర్సాపూర్ ప్రధాన రహదారి, కుత్బుల్లాపూర్ సర్కిల్ చౌరస్తా అయినప్పటికీ పోలీస్ పెట్రోలింగ్ ఏమైందని పలువురు వాపోయారు. ప్రధాన రహదారిలోనే పోలీసులు పెట్రోలింగ్ ఈ విధంగా ఉంటే ఇక జీడిమెట్ల పీఎస్ పరిధిలోని కాలనీల పరిస్థితి ఏమిటని పలువురు ఆవేదన చెందుతున్నారు. ఈ ఘటనపై జీడిమెట్ల పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మహిళ ఎవరు, ఎక్కడ నుంచి వచ్చిందని ఆరా తీస్తున్నారు. క్లూస్ టీంను క్లూస్ టీం వచ్చి ఘటన స్థలాన్ని క్షుణంగా పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని చేదించే పనిలో నిమగ్నం అయ్యారు



జగద్గిరిగుట్టలో గ్రంథాలయం నిర్మించాలి

- ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గూడ ఐలయ్య గౌడ్
- జిల్లా గ్రంథాలయ చైర్మెన్ శ్రీనివాస్ రెడ్డికి వినతి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

జగద్గిరిగుట్ట ప్రాంతంలో గ్రంథాలయం నిర్మించాలని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్య గౌడ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మేడ్చల్ జిల్లా గ్రంథాలయ చైర్మెన్ బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డిని బుధవారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐలయ్య మాట్లాడుతూ.. జగద్గిరిగుట్టలో గ్రంథాలయం లేక ఎంతోమంది ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. స్పందించిన చైర్మెన్ జగద్గిరిగుట్టలో బడుగు బలహీన వర్గాల వారు పేదలు అధికంగా ఉన్నారని ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి గ్రంథాలయం తప్పక ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం నిరంతరం పాటుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు యం.జనార్ధన్ ఫన్నీ యాదవ్, సందీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడిదారులకు లాభాలు.. పని చేసే కార్మికులకు కష్టాలు



- ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి బాలరాజ్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

పెట్టుబడి దారులకి లాభాలు, పని చేసే కార్మికులకి కష్టాలు ప్రపంచీకరణ, ప్రయివేటీకరణ వల్లేనని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి బాలరాజ్ అన్నారు. షాపూర్ నగర్ ఏఐటీయూసీ కార్యాలయంలో రెండవ రోజు జరుగుతున్న మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఏఐటీయూసీ రాజకీయ శిక్షణ తరగతులకు ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి బాలరాజ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. బుధవారం ప్రపంచీకరణ దాని దుష్ఫలితాలపై సింగు నర్సింగరావు, కమ్యూనిస్టు ప్రణాళిక పై పానుగంటి పర్వతాలు బోధించారు. రెండవ ప్రపంచ యుద్ధం అనంతరం ప్రపంచంలో ఒక వైపు పెట్టుబడిదారి వ్యవస్థ మరో వైపు సోషలిస్టు వ్యవస్థ ఉన్న సందర్భంలో అప్పుడే స్వాతంత్రం పొందిన భారతదేశం లాంటి దేశాలు మూడవ ప్రపంచ దేశాలుగా ఉండి వారికి సోషలిస్టు దేశాలు ఆండగా నిలిచి అనేక ప్రభుత్వ రంగా వ్యవస్థలను ప్రజల అవసరార్థం నెలకొల్పడానికి సహాయం అందించడం జరిగిందన్నరు. ఇలా అనేక దేశాలు రష్యా సహకారంతో నడుస్తున్న సందర్భంలో అమెరికా నాయకత్వంలోని ప్రపంచ బ్యాంకు ఏదైనా దేశానికి ఆర్థిక అవసరం కావాలంటే కొన్ని షరత్తులతో సహాయం చెయ్యడం జరిగిందని, రష్యా తన ప్రభావం కోల్పోయి, అభివృద్ధి చెందుతున్న దేశాలు తమ ఆర్థిక అవసరాల కోసం ప్రపంచ బ్యాంకుపైన ఆధారపడటం వల్లే నేడు ప్రభుత్వరంగా వ్యవస్థలు ప్రయివేటుపరం అయ్యాయి అన్నారు. పెట్టుబడిదారులు లాభం పొందటం, ప్రజలు గత పోరాటాల వల్ల కలిగి ఉన్న కనీస వేతనం, 8 గంటల పనిదినాలు, ఉద్యోగ భద్రత, మద్దతు ధర లాంటి అనేక హక్కులను కోల్పోవడం జరిగిందన్నారు. పెట్టుబడి దారులకి లాభాలు, పని చేసే కార్మికులకి కష్టాలు. ఇలా కష్టాలు పడటానికి గల కారణం ప్రపంచికరణ, ప్రయివేటీకరణ వల్లేనని నేడు అధికారంలో ఉన్న బీజేపీ గతంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, అధికారంలో ఉన్న బూర్జువా పార్టీలు పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తూ, వారికి అనేక సౌకర్యాలు కల్పిస్తాయని, పేద ప్రజలకు మాత్రం ఎలాంటి సదుపాయం కల్పించవని, అది ప్రస్తుతం మన కండ్ల ముందు కనిపిస్తుందన్నారు. కావున వీటికి సమాధానం కేవలం కమ్యూనిస్టు వ్యవస్థనేని, పెట్టుబడిదారి వ్యవస్థ అంతం అయ్యి సోషలిస్టు వ్యవస్థ వచ్చి చివరగా కమ్యూనిస్టు వ్యవస్థ రాక తప్పదని కార్లమర్క్స్ యెంగెల్స్ 1857 లోనే కమ్యూనిస్టు ప్రణాళిక ద్వారా శాస్త్రీయంగా వివరించారని దాని కోసం కార్మికులు సిద్ధం కావాలని కోరారు. నేడు పెట్టుబడిదారులు, మత, రౌడీలు ప్రజాప్రతినిధులుగా ఎన్నికవడం వల్ల వాళ్ళ ప్రజల కోసం కార్మికుల కోసం ఏమిచేయ్యరని, కార్మికుల బాధలు, కష్టాలు కార్మికులకే తెలుస్తుందని కావున కార్మికరాజ్యం ఏర్పాటు కోసం ఏఐటీయూసీ నిర్వహించే కార్యక్రమాలలో పాల్గొని ఆ రాజ్యం కోసం కృషి చెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమనికి ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్ ముఖ్యఅతిథిగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు స్వామి ప్రిన్సిపల్‌గా వ్యవహరించగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్, ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు ఏసురత్నం, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రామస్వామి, మేడ్చల్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, అధ్యక్షుడు హరినాథ్, ఏఐటీయూసీ నాయకులు పరమేష్, కృష్ణమూర్తి, శ్రీనివాస్, కృష్ణ, వెంకటరమణ, బాలాజీ, కమలమ్మ, నిర్మల, దావీద, ప్రజానాట్యమండలి అధ్యక్షుడు భాస్కర్, సహాయ్ కార్యదర్శి దుర్గయ్య, సామెల్, నర్సింహరెడ్డి, యాదగిరి, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రెస్టారెంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి పాపారాయుడు నగర్‌లో స్వరుచి రెస్టారెంట్‌ను ప్రారంభోత్సవం చేసిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఈ సందర్భంగా నాణ్యమైన ఆహార పదార్థాలు విక్రయిస్తూ వ్యాపారం అభివృద్ధి చేసుకోవాలని యాజమాన్యానికి సూచిస్తూ శుభాకాంక్షలు తెలిపారు, ఈ కార్యక్రమములో రాగిడి లక్ష్మా రెడ్డి, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ సంతోష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



కూకట్ పల్లిలోని సుమిత్ర నగర్‌లో నూతనంగా చేపట్టిన చౌడేశ్వరి ఆలయ నిర్మాణంలో శ్రీ చౌడేశ్వరి మాత విగ్రహం ప్రతిష్టాపన కార్యక్రమములో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పాల్గొన్నారు.



నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలి

- కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్

నవతెలంగాణ-కూకట్‌పల్లి

నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ ఉష ముళ్ళపూడి రోడ్డులోని ఇండియన్ బ్యాంక్ నుంచి ఎల్లమ్మ చెరువు వరకు రూ.2 కోట్ల అంచన వ్యయంతో చేపడుతున్న వరద నీటి కాల్వ, సీసీ రోడ్ల నిర్మాణ పనులను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా, త్వరితగతిన వరద నీటి కాల్వ, సీసీ రోడ్ల నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్మాణం పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడ రాజీ పడకూడదని, అవసరమగు చర్యలు, జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రత్యేక శ్రద్ధ పెట్టి ముంపుకు గురికాకండా ముందస్తుగా తగు చర్యలు తీసుకోని ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, గుడ్ల శ్రీనివాస్, పోశెట్టిగౌడ్, రాజు గౌడ్, ఏఈ శ్రావణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి కుమార్, కాంట్రాక్టర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేట్ ఏజెన్సీ ద్వారా లిఫ్ట్ ఇరిగేషన్ ఉద్యోగాలు

నియమించడం ఉపసంహరించుకోవాలి

- ప్రొఫెసర్ కేతిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి



నవతెలంగాణ-దుండిగల్

నీటి పారుదలశాఖ లిఫ్ట్ ఇరిగేషన్‌లో ప్రభుత్వం పాత కార్మికుల డిమాండ్లను విస్మరించి, ప్రయివేట్ ఏజెన్సీ ద్వారా లిఫ్ట్ ఇరిగేషన్ ఉద్యోగాలను భర్తీ చేయడం సరికాదని అట్టి నిర్ణయం పునఃపరిశీలించి ఉపసంహరించుకోవాలని బీజేపీ నాయకులు, ప్రొఫెసర్ కేతిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ప్రయివేట్ ఏజెన్సీ ద్వారా పోస్టులను భర్తీ చేయడంపై పలుమార్లు ఆందోళన లు జరిగినా ప్రభుత్వం వాటిని పట్టించుకోకపోవడం శోచనీయమని తెలిపారు. ఇరిగేషన్ శాఖలో ప్రయివే ట్ ఏజెన్సీని సృష్టించిందే కాంగ్రెస్ అని స్థానిక కాంగ్రెస్ నాయకుల సమక్షంలో పోస్టులను రూ 1.5 లక్షల నుంచి 2 లక్షల వరకు విక్రయించడం దారుణమన్నారు. సాక్షాత్తు నీటిపారుదల శాఖ మం త్రి జిల్లా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలోనే ఈ అక్రమాలు చోటు చేసుకోవడం గమనార్హమని తెలిపారు. ఇంత జరుగుతున్నా మంత్రికి తెలియ కుండానే జరుగుతుందా అనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. స్వయంగా మంత్రి ఈ అవకతవకల పై జోక్యం చేసుకొని విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా ప్రభుత్వం ప్రయివేట్ ఏజెన్సీ ద్వారా లిఫ్ట్ ఇరిగేషన్ ఉద్యోగాలను భర్తీ చేయాలన్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని వెల్లడి ంచారు. ఇప్పటికైనా పాత కార్మికుల ఉద్యోగాలను తిరిగి పునరుద్ధరించాలని, ఉద్యోగాల భర్తీ విషయంలో ప్రయివేట్ ఏజెన్సీలతో కాకుండా ప్రభుత్వమే భర్తీ చేసే విధంగా చేపడితే కార్మికులకు న్యాయం జరుగుతుందని, లేకుంటే పాత కార్మికుల జీవితాలను ప్రమాదంలో పడేస్తుం దని తెలిపారు. వీరి హక్కులను పరిగణన లోకి తీసుకోవడం ప్రభుత్వం బాధ్యతని ఆయన డిమాండ్ చేశారు.

మహాత్మా జ్యోతిరావు పూలే నేషనల్ ఫెలోషిప్ అవార్డు అందుకున్న శివకుమార్



నవతెలంగాణ-కూకట్‌పల్లి

భారతీయ దళిత్ సాహిత్య అకాడమీ న్యూఢిల్లీ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకమైన మహాత్మా జ్యోతిరావు పూలే నేషనల్ ఫెలోషిప్ అవార్డును తెలంగాణ రాష్ట్రం నుంచి ప్రగతి నగర్ జగద్గిరిగుట్టకు చెందిన శ్రీరామోజు శివ కుమార్ అందుకున్నారు. శివ మధ్యతరగతి కుటుంబంలో పుట్టి సమాజానికి తన వంతు సేవలందించాలనే ఉద్దేశ్యంతో 20 ఏండ్లుగా ప్రజా సమస్యలపై పోరాడుతూ.. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ అన్ని వర్గాల పురోగతికి పాటుపడుతున్నారు. విద్యార్థి నాయకుడిగా ప్రారంభించి అనేక సమస్యలపై ప్రశ్నిస్తూ.. సమస్యల పరిష్కారానికి పోరాడుతూ.. సామాజిక కార్యక్రమాలు చేస్తూ, ఒక ప్రయివేట్ కంపెనీలో ఉద్యోగం చేసుకుంటూ నెల వారి వేతనంతో జీవనం కొనసాగిస్తూన్నారు. ఎవరైనా పేదలు కష్టం వచ్చిందంటే నేనున్న అంటూ సహాయ సహకారాలు అందిస్తూ ముందుకు వెళ్తున్న, ఒక గొప్ప సమాజిక కార్యకర్త. శ్రీరామోజు శివకుమార్. అతని సేవలను గుర్తించి భారతీయ దళిత్ సాహిత్య అకాడమి న్యూఢిల్లీ వారు మహాత్మా జ్యోతి రావు పూలే నేషనల్ ఫెలోషిప్ అవార్డును తెలంగాణ రాష్ట్రం నుంచి ఆదజేశారు. ఈ సందర్భంగా శివ కుమార్ మాట్లాడుతూ, ఈ అవార్డ్ అదజేసిన భారతీయ దళిత్ సాహిత్య అకాడమీ-ఫౌండర్, జాతీయ అధ్యక్షులు సుమనక్షార్‌కి, సౌత్ ఇండియా ఆర్గనిసింగ్ సెక్రటరీ, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు జితేందర్ మనుకి, ఇన్ని ఏండ్లుగా నాకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.



విగ్రహ ప్రతీష్టాపన మహోత్సవంలో ప్రత్యేక పూజలు

- టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం

నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని బాగ్‌అమీర్‌లోని దేవాలయ కమిటీ ఆహ్వానం మేరకు యాదవ్‌ల దైవం శ్రీ చౌడేశ్వరి మాత విగ్రహ ప్రతీష్టా మహోత్సవానికి టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆపదల నుంచి ఆదుకునే మాహాదేవి అనుగ్రహంతో ప్రజలంతా సుఖసంతోషాలతో విరాజిల్లాలని కోరారు. ఆధ్యాత్మిక భావాలు, దైవ చింతన సమాజంలో శాంతికి దోహదం చేస్తాయని, ప్రతి ఒక్కరు భక్తి భావాలను అలవర్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షులు కృష్ణ రాజ్ పుత్, సోషల్ మీడియా కన్వీనర్ శేఖర్ గజానంద్ ఆలయ కమిటీ సభ్యులు, యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకాలు





నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ పరిధిలోని శోభన సంటర్‌లోని తెలంగాణ తల్లి విగ్రహానికి బాలానగర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ అధ్యక్షులు కేటీఆర్ ఆదేశాల మేరకు కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సూచనతో బుధవారం కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో శోభన సెంటర్ వద్ద బీఆర్ఎస్ పార్టీ నాయకులు తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మహిళలు, కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొని ప్లకార్డులను ప్రదర్శిస్తూ కాంగ్రెస్ తల్లి వద్దురా తెలంగాణ తల్లి ముద్దురా' అంటూ పెద్ద ఎత్తున నిరసనలు చేశారు.

నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గం మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలోని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కూకట్ పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాల మేరకు బుధవారం ఫతేనగర్ డివిజన్ పరిధిలోని ఫతేనగర్ ఫ్లైఓవర్ వద్ద ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి అదేవిధంగా హెచ్చి రోడ్డులో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సతీష్ గౌడ్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సీఎం రేవంత్ రెడ్డి పేర్లు మార్చడం, విగ్రహాలు మార్చడం తప్పితే పేద ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలను గాలికి వదిలి రోజుకు ఏదో ఒక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ ప్రజలను మభ్యపెడుతూ పబ్బం గడుపుతున్నా దని అన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి రేవంత్ రెడ్డికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పార్టీ అధ్యక్షులు కంచి బిక్షపతి, రాష్ట్ర నాయకులు కుతాడి రాములు, ప్రధాన కార్యదర్శి సుదర్శన్ రెడ్డి, గౌస్, తూము జగదీష్, నగేష్, అఫ్జల్, సీనియర్ నాయకుడు కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

గర్భసంచికి లాప్రోస్కోపిక్ పద్ధతిలో కుట్లు



నవతెలంగాణ-సిటీబ్యూరో

గర్భసంచి బాగా బలహీనంగా ఉన్న మహిళలకు గర్భస్థ శిశువును మోయగలిగే పరిస్థితి లేదు. ఇలాంటి యువతికి గర్భంతో ఉండగానే అత్యంత ఆధునిక పద్ధతిలో గర్భసంచికి లాప్రోస్కోపిక్ పద్ధతిలో కుట్లు వేసి, ఆమె గర్భాన్ని నిలబెట్టి పండంటి బాబును ఆ దంపతుల చేతు ల్లో పెట్టారు కిమ్స్ ఆస్పత్రి వైద్యులు. వివరాలను ఆస్పత్రికి చెందిన సీనియ ర్ కన్సల్టెంట్ గైనకాలజిస్టు, లాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ చీపురుపల్లి వసుంధర వెల్లడించారు. "నగరానికి చెందిన 27 ఏండ్ల యువతికి ఇప్పటికే నాలుగుసార్లు అబార్షన్లు అయ్యాయి. దాంతో ఈసారి గర్భం దాల్చడానికి ముందే ఒకసారి వస్తే, సమస్యను పూర్తిగా సరిచేయొచ్చని చెప్పాం. కానీ, ఆమె మరోసారి గర్భవతి అయ్యి, 9 వారాల సమయంలో వచ్చారు. 12 వారాల వరకు గర్భసంచిని ముట్టుకోవడానికి ఉండదు కాబట్టి అప్పటివరకు ఆగాం. తర్వాత లాప్రోస్కోపిక్ పద్ధతిలో గర్భసంచికి పైభాగంలో లాప్రోస్కోపిక్ పద్ధతిలో కుట్లు వేశాం. ఈ శస్త్రచికిత్సను లాప్రోస్కోపిక్ అబ్డామినల్ సర్క్లేజ్ అంటారు. దానివల్ల గర్భసంచికి బలం వచ్చింది. నాలుగు సార్లు గర్భసంచి బలహీనంగా ఉండటం వల్లే ఆమెకు అబార్షన్లు అయ్యాయి. ఐదోసారి మాత్రం అందుకు కారణాన్ని తెలుసుకుని, తగిన విధంగా చికిత్స చేయగలిగాం. దీంతో ఆ తర్వాత ఇక ఎలాంటి ఇబ్బంది లేకుండా పూర్తి 9 నెలలు నిండాయి. అప్పుడు ఆమెకు సిజేరియన్ పద్ధతిలో ప్రసవం చేశాం. పండంటి బాబు పుట్టాడు" అని తెలిపారు.



సికింద్రాబాద కుమ్మరి గూడ లోని ముత్యాలమ్మ దేవాలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ,హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్,కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ హాజరై ప్రత్యేక పూజలు హెూమలు చేశారు. మంత్రులు కొండా సురేఖ,పొన్నం ప్రభాకర్ లు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. వేదమంత్రాలతో,శాంతి హెూమాలతో శాస్త్రోక్తంగా అమ్మవారి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు.మంత్రి కొండా సురేఖ ఆలయం వద్ద మహిళలకు చీరలను పంపిణీ చేశారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో నార్త్ జోన్ డీసీపీ సాధన రేష్మి పెర్మాల్, కార్పొరేటర్ దీపిక, కాంగ్రెస్ సనత్ నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమ, మాజీ కార్పొరేటర్ రూప హరికృష్ణ అనేకమంది భక్తులు నాయకులు ఉన్నారు. నవతెలంగాణ-బేగంపేట్



సికింద్రాబాద్ కుమ్మరిగూడలోని ముత్యాలమ్మ దేవాలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం కన్నుల పండుగగా సాగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హాజరై ప్రత్యేక పూజలు హెూమలు చేశారు. నవతెలంగాణ-బేగంపేట్

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే దానం నాగేందర్

నవతెలంగాణ-బంజారా హిల్స్



మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు.బుధవారం నియోజకవర్గం పరిధిలోని మారుతి నగర్‌లో రూ.25 లక్షల వ్యయంతో సివరేజ్ పైప్ లైన్ పనులను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నో ఏండ్లుగా మురుగు నీరు ప్రవహిస్తూ ఇక్కట్లు ఎదుర్కుంటున్న వారి శాశ్వత సమస్యను అధిగమించడానికి ప్రస్తుత పనులు ఎంతో మేలు చేస్తాయని అన్నారు. సివరేజ్ పైప్ లైన్ పనుల్లో ఎటువంటి జాప్యం లేకుండా వాటర్ వర్క్స్ జీఎం షరీఫ్, మేనేజర్ నదీమ్లలు అన్ని శాఖల అధికారులతో మాట్లాడి నాణ్యతతో కూడిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పనులను ప్రారంభించడం పట్ల మారుతి నగర్ ప్రజలు ఎమ్మెల్యేకు కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మారుతి నగర్ అధ్యక్షుడు మహేష్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు జీ కష్ణ యాదవ్,ఎస్కే షరీఫ్, నాయకులు, మహేందర్ బాబు, లక్ష్మణ్ యాదవ్, ప్రసాద్,రమేష్ చారి,రాము దుర్గయ్య ప్రవీణ్, రాజు,గంగాధర్ యాదవ్,నరేందర్,విశాల్ బాబు, యూత్ కాంగ్రెస్ ఖైరతాబాద్ అసెంబ్లీ జనరల్ సెక్రటరీ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు



- గుండె వైద్య నిపుణులు ప్రమోద్ కుమార్

నవతెలంగాణ-బంజారాహిల్స్

వైద్య రంగంలో అందుబాటులోకి వస్తున్న ఆధునిక పద్ధతులతో రోగులకు మెరుగైన చికిత్సలు అందించగలు గుతున్నట్టు ప్రముఖ గుండె వైద్య నిధులు ప్రమోద్ కుమార్ అన్నారు. బుధవారం సోమాజిగుడా యశోద ఆస్పత్రిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో అడ్మినిస్ట్రేటివ్ వైద్య నిపుణులు డాక్టర్ విష్ణు రెడ్డితో కలసి మాట్లాడారు. ట్రాన్స్ కాథెటర్ అయోర్టిక్ వాల్వ్ ఇంప్లాంటేషన్ (టీఏవీఐ) విధానంలో ఓ 87 ఏండ్ల వద్ధ రోగికి నిర్వహించిన చికిత్సను వివరించారు. వద్ధుల్లో మాత్రమే కనిపించే సర్జికల్ వాల్వ్ సమస్యకు ఈ విధానంతో తక్కువ సమయంలో ఎలాంటి గాయాలు లేకుండా చికిత్స నిర్వహించవచ్చునని తెలిపారు. గతంలో ఈ సమస్యతో బాధపడుతున్న వారికి ఓపెన్ హార్ట్ సర్జరీ చేయాల్సి వచ్చేదని అన్నారు. ఈ సమస్యతో బాధపడుతున్న ఆ రోగికి స్వల్ప అనస్తీషియా ఇచ్చి కేవలం ఒక్క గంటలో ప్రక్రియ పూర్తి చేయవచ్చునని చెప్పారు. సత్ర చికిత్స ముగిసిన మరుసటి రోజు నుంచే రోగి సాధారణ జీవితాన్ని గడపవచ్చునని అన్నారు. సులభంగా నిర్వహించే తావి చికిత్స విధానంపై విస్తత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు.



'చెరువు పేరుతో మమ్మల్ని ముంచొద్దు'

ఇరిగేషన్ శాఖ ప్రధాన కార్యాలయం వద్ద బాధితుల ఆందోళన..

నవతెలంగాణ-బంజారాహిల్స్

అమీన్‌పూర్ పెద్ద చెరువులో తమను ముంచోద్దంటూ చెరువు ముంపు బాధితుల జేఏసీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. బుధవారం ఎర్రమంజిల్‌లోని జలసౌధ కార్యాలయం వద్ద ముంపు బాధితులు ఆందోళన చేపట్టారు. "అలుగును మూశారు తమ ప్లాట్లను ముంచారు, చెరువు విస్తీర్ణం 93 ఎకరాలు.. ముంచిన భూములు 460 ఎకరాలు, తమకు న్యాయం చేయండి" అన్న ప్ల కార్డులను ప్రదర్శిస్తూ ఇరిగేషన్ శాఖకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం తమ పాలిట శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మెన్ చిరునామా సత్యనారాయణ మాట్లాడారు. సుమారు 150 ఏండ్ల క్రితం స్థానిక అవసరాల కోసం అప్పటి నిజాం 93 ఎకరాల విస్తీర్ణంలో పెద్ద చెరువును ఏర్పాటు చేశారని తెలిపారు. స్థానిక రైతుల వ్యవసాయ అవసరాలతో పాటు అక్కడి ప్రజలకు ఆధారంగా నిలిచిన పెద్ద చెరువు అలుగును మూసి తమ భూములన్నింటిని ముంచేశారని కన్నీటి పర్యంతమయ్యారు. 2017లో అప్పటి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా అలుగును మూసేయటంతో ఈ దుస్థితి ఏర్పడిందని ఆరోపించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా చెరువులు కబ్జాలకు గురయితే చెరువు పేరుతో తమను ముంచేస్తున్నారంటూ వాపోయారు. ఈ విషయాన్ని హైడ్రా కమిషనర్ రంగనాథ్ దృష్టికి తీసుకువెళ్లగా పరిశీలించిన అధికారి సానుకూలంగా స్పందించారని చెప్పారు. కాగా చెరువులను రక్షించాల్సిన ఇరిగేషన్ శాఖ నిర్లక్ష్యం కారణంగా తమకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించి అమీన్‌పూర్ పెద్ద చెరువును రక్షించడంతో పాటు అన్యాయం అవుతున్న తమకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం ఇరిగేషన్ శాఖ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమం సంజయ్ కుమార్, సత్యమూర్తి, విజయ్ కుమార్ రెడ్డి, టీవీ రావు, సుబ్రహ్మణ్యం, నాగభూషణరావు, మల్లారెడ్డి, జీవ, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో జర్నలిస్టుల నిరసన



- మోహన్ బాబుపై ఏసీపీకి పిర్యాదు

నవతెలంగాణ-ఓయూ

సినీ నటుడు మోహన్ బాబు మీడియాపై చేసిన దాడిని ఖండిస్తు బుధవారం ఓయూ జేఏసీ, ఓయూ జర్నలిస్టులు బుధవారం ఓయూ ఆర్ట్స్ కాలేజ్ ఎదుట నిరస న వ్యక్తం చేశారు. రిపోర్టర్స్ పై దాడికి పాల్పడ్డ మోహన్ బాబు పై మా అసోసియేషన్‌తో పాటు పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మోహన్ బాబుపై ఉస్మా నియా యూనివర్సిటీ డివిజన్ ఏసీపీ జగన్‌కు ఫిర్యాదు చేశారు. ఓయూ జేఏసీ, ఉస్మానియా యూనివర్సిటీ జర్నలిస్టులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్సీ కవితకు ఎమ్మెల్యేలు వెంటనే క్షమాపణ చెప్పాలి'



నవతెలంగాణ-ఓయూ

ఎమ్మెల్సీ కవితకు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, యెన్నం శ్రీనివాస్ రెడ్డిలు వెంటనే క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్వీ నాయకులు కందుల మధు, కోతి విజయ్ డిమాండ్ చేశారు. బుధవారం బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కాలేజ్ సాక్షిగా వారు మెడికల్ కిట్టును, ఫినాయిల్‌ను నోరు శుభ్రం చేసుకోవడానికి వారికి పంపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, యెన్నం శ్రీనివాస్ రెడ్డిలు ఫినాయిల్‌తో నోరు శుభ్రం చేసుకోవాలన్నారు. ఇద్దరి మానసిక స్థితి బాగాలేదన్నారు. కాంగ్రెస్ నాయకులు ఇకనైనా తమ మానసిక పరిస్థితి సరిచేసుకోకపోతే ఎర్రగడ్డ మెంటల్ హాస్పిటల్‌లో చేర్పిస్తామన్నారు. మహిళలను గౌరవించాలన్నారు. జంగయ్య, కొంపెల్లి నరేష్, రామకృష్ణ, నాగేంద్ర, అవినాష్, పవన్ కుమార్, రవికిరణ్, క్రాంతి, వెంకటేష్, సత్తిరెడ్డి, యదాక్రాంతి ,హరీష్ , పాల్గొన్నారు.

ప్రజలకు విశ్వాసం పెరిగింది

- అదనంగా ఒక్క రూపాయి ఖర్చు లేకుండానే సత్ఫలితాలిస్తున్న 90 రోజుల స్పెషల్ డ్రైవ్
- పైపులైన్లు, మ్యాన్ హెూళ్లు శుభ్రం.. ఫిర్యాదులు తగ్గుముఖం
- 70 రోజుల్లో 1602 కిలో మీటర్ల మేర సీవరేజ్ పైపు లైన్
- 1.22 లక్షల మ్యాన్ హెూళ్లలో డీ-సిల్టింగ్ పనులు
- వచ్చే ఏప్రిల్ నాటికి సమస్యలు లేకుండా ప్రణాళిక
- జలమండలి ఎండీ అశోక్ రెడ్డి



నవతెలంగాణ-సిటీబ్యూరో

సమస్య తలెత్తిన తర్వాత తీసుకునే నివారణ చర్యలకంటే, అసలు సమస్యలు రాకుండా ముందే చర్యలు తీసుకోవడం మేలని, అదే స్ఫూర్తితో 90 రోజుల స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని చేపట్టామని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి తెలిపారు. జలమండలి మూడేండ్ల డేటాను తీసుకుని ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో బుధవారం ఎండీ సమావేశమై వివరాలు వెల్లడించారు.

ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో 'సీవరేజ్ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీ - హైదరాబాద్' లక్ష్యంగా 90 రోజుల స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం ప్రారంభించి నేటికి 70 రోజులు పూర్తయిందన్నారు. ప్రతినెలా వినియోగ దారుల నుంచి 70 వేల నుంచి 75 వేల ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. స్పెషల్ డ్రైవ్‌తో జలమండలిపై ప్రజలకు విశ్వాసం పెరిగిందన్నారు. గతంలో ఫిర్యాదు చేసినా వచ్చేవారుకారని, ప్రస్తుతం ఫిర్యాదు చేసిన వెంటనే అధికారులు, సిబ్బంది వచ్చి సమస్యలను పరిష్కరిస్తున్నారని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. 90 రోజుల్లో 3600 కిలో మీటర్ల సీవరేజ్ పైపు లైన్, 3 లక్షల మ్యాన్ హెూళ్లలో డీ-సిల్టింగ్ చేయడంతో పాటు, సీవరేజ్ పై రోజూ వచ్చే ఫిర్యాదుల్ని 30 శాతం తగ్గించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఆయన వివరించారు. ఇప్పటి వరకు నిర్దేశించుకున్న లక్ష్యాన్ని 50 శాతం చేరుకున్నట్టు తెలిపారు. బుధవారం నాటికి 12673 ప్రాంతాల్లో 1602 కిలోమీటర్ల మేర సీవరేజ్ పైపు లైన్, 1.22 లక్షల మ్యాన్ హెూళ్లలో పూడికతీత పనులు చేసినట్టు చెప్పారు. స్పెషల్ డ్రైవ్‌లో జలమండలికి రోజువారీగా వచ్చే ఫిర్యాదులను పరిష్కరించడంతో పాటు, ఒక్కో టీమ్ 100 నుంచి 200 మీటర్ల మేర పైపులైన్, 20 నుంచి 25 మ్యాన్ హెూళ్లను శుభ్రం చేస్తున్నట్టు ఎండీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించడానికి అదనంగా ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేదని తెలిపారు. మురుగు నీటి నిర్వహణలో రోజూవారీగా ఉపయోగించే 220 ఎయిర్ టెక్ మిషన్లు, 146 సిల్ట్ తరలింపు వాహనాలు, సీవరేజ్ సిబ్బందినే ఇందులోనూ వాడుకునేలా కార్యక్రమాన్ని రూపొందించామని చెప్పారు. ఇది సత్ఫలితాలిస్తున్నాయని, భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

రోజూ వారీ పర్యవేక్షణకు డాష్ బోర్డ్

స్పెషల్ డ్రైవ్ పనులను రోజూవారీగా పర్యవేక్షించేందుకు ప్రత్యేక డాష్ బోర్డ్ ఏర్పాటు చేశామని ఎండీ తెలిపారు. సీవరేజ్ ఓవర్ ఫ్లో, కలుషిత నీరు, రోడ్లపై సిల్ట్ తదితర వాటిపై ఎంసీసీకి వచ్చే ఫిర్యాదులను ఆయా క్యాన్ నెంబర్లను జీపీఎస్ ఆధారంగా గూగుల్ మ్యాప్‌లో నమోదు చేస్తున్నామన్నారు. ఈ నమోదు ఒక్కో ప్రాంతంలో ఎన్ని సార్లు ఫిర్యాదులు అందినవి, ఎన్నిసార్లు పరిష్కరించిన వివరాలను ఆ మ్యాప్‌లో ఒక బబుల్ (బుడగ) లా కనిపించేలాగా ఏర్పాటు చేశామన్నారు. ఫిర్యాదుల సంఖ్యను బట్టి ఆ బబుల్ పరిమాణం మారుతుందని చెప్పారు. ఈ ఏర్పాటు వల్ల సమస్య తీవ్రతను బట్టి అధికారులు దాన్ని పరిష్కరించే వీలుందన్నారు. అలాగే ఈ డాష్ బోర్డును ఇప్పటి వరకు శుభ్రం చేసిన పైపు లైన్ల పొడవు, మ్యాన్ హెూళ్ల సంఖ్య వివరాలు ఫొటోలతో సహా.. అప్ లోడ్ చేసేలా రూపకల్పన చేశామన్నారు. సిల్ట్ కార్టింగ్ వాహనాలు తిరిగే ప్రాంతాలు జీపీఎస్ సహకారంతో తెలుసుకునే వెసులుబాటు కల్పించామని చెప్పారు. దీంతో పనితీరు పెరగడం గుర్తించినట్లు తెలిపారు. ఎక్కడైనా కొత్త పైపులైన్ల నిర్మాణ ప్రతిపాదనను సైతం నమోదు చేసేలా రూపొందించినట్లు పేర్కొన్నారు. అన్ని రకాల రిపోర్టులను తయారు చేసి, వాటిని విశ్లేషించుకునే సౌకర్యం కల్పించామని తెలిపారు. వచ్చే వానాకాలం నాటికి సీవరేజ్ సమస్యలు గణనీయంగా తగ్గేలా, సీవరేజ్ ఓవర్ ఫ్లో సాఫీగా సాగేలా తదుపరి చర్యలు చేపడతామని ఎండీ వెల్లడించారు. వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి రూపొందించుకున్న పనులన్నీ పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించుకున్నట్లు తెలిపారు. ఈ స్పెషల్ డ్రైవ్ లో కొన్ని చోట్ల నూతన పైపు లైన్ నిర్మాణం అవసరాన్ని గుర్తించామన్నారు. ఆ పనులు సైతం చేపడతామని పేర్కొన్నారు. ఏప్రిల్ తర్వాత పూర్తిగా కలుషిత నీటి సరఫరా నివారణపై దృష్టి సారిస్తామన్నారు. ప్రధానంగా వినియోగదారుల ఇండ్లల్లో చోకేజీ, రోడ్లపై సీవరేజ్ ఓవర్ ఫ్లో సమస్యల్ని గుర్తించామన్నారు. రోజూ వచ్చే ఫిర్యాదుల్లో 60 శాతం ఇవే వస్తున్నాయని చెప్పారు. వీటిని తగ్గించడంపై దృష్టి సారించామన్నారు. అందుకు అనుగుణంగానే పనిచేస్తున్నట్టు వెల్లడించారు. మిగిలిన 20 రోజుల్లో మరింత ఉత్సాహంగా పనిచేసి ఫిర్యాదుల శాతాన్ని తగ్గించేందుకు ఎండీ కషి చేస్తామని చెప్పారు.

రిజర్వాయర్లపై నిరంతరం పర్యవేక్షణ

భవిష్యత్తులో మరిన్ని నూతన కార్యక్రమాలు చేపడుతున్నట్టు ఎండీ తెలిపారు. రిజర్వాయర్లను నిత్యం పర్యవేక్షించేందుకు మీటర్లు ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. దీని వల్ల రిజర్వాయర్లలో నీటి లభ్యత, ఎంత సరఫరా అవుతందనే విషయం ఎప్పటికప్పుడు తెలుస్తుందన్నారు. అలాగే మురుగు నీటి శుద్ధి కేంద్రాల పర్యవేక్షణ సైతం అమలు చేస్తామన్నారు. రోజూ ఎంత మురుగు నీరు శుద్ధి చేస్తున్నారు, శుద్ధి చేసిన నీటి నాణ్యత తదితర వివరాలు తెలుసుకుంటామని ఎండీ వివరించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్, ఈఎన్సీ, రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్, డైరెక్టర్ ఆపరేషన్స్-2 స్వామి, డైరెక్టర్ ఆపరేషన్స్-1 అమరేందర్ రెడ్డి, పాల్గొన్నారు.

పర్యావరణ రక్షణకు ఈ బైక్‌లను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం



- ఎమ్మెల్యే శ్రీ గణేష్
- ఎలక్ట్రికల్ బైక్ షోరూం ప్రారంభం

నవతెలంగాణ-కంటోన్మెంట్

పర్యావరణ రక్షణకు ఎలక్ట్రికల్ బైక్‌లను ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదనిఎమ్మెల్యే శ్రీ గణేష్ అన్నారు. తాడ్ బండ్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ప్యూర్ ఈ.వి ఎలక్ట్రిక్ బైక్ షో రూంను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసేపు ఎలక్ట్రిక్ వాహనం పై కూర్చుని వాహనానికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాలుష్య నియంత్రణకు ఎలక్ట్రిక్ వాహనాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల వాళ్ల ప్రజలకు మేలు చేకూరుతుందని తెలిపారు. ఎలక్ట్రిక్ వాహనాలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున రాయితీలను కూడా అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు. అనంతరం ప్యూర్ ఈ.వి సంస్థ ఎం.డి నిశాంత్ మాట్లాడుతూ హైదరాబాద్‌లోని మొట్టమొదటి షోరూమ్‌గా ప్రారంభించామని,ప్రజలంతా ఈ వాహనాలు కొనుగోలు చేసేందుకు ఆసక్తి కనపరు స్తున్నట్టు తెలిపారు. మొదటిసారిగా హైదరాబాద్‌లోనే వాహనాలను తయారు చేసి విక్రయిస్తున్నట్టు వెల్లడించారు. విద్యార్థులకు స్పోర్ట్స్ బైక్,కుటుంబం అనువుగా ప్రయాణించే విధంగా వివిధ రకాల వాహనాలను తయారు చేసినట్టు తెలిపారు.



రోడ్లపై ఆక్రమణలు తొలగించిన అధికారులు

నవతెలంగాణ-కంటోన్మెంట్

లాల్‌బజార్ నుంచి తిరుమలగిరి ఫుట్‌బాల్ గ్రౌండ్స్ వరకు ప్రధాన రహదారి రోడ్డు ఆక్రమించుకుని ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేస్తున్న దుకాణాలను డబ్బాలను తిరుమలగిరి పోలీసులు బుధవారం తొలగించారు. ట్రాఫిక్ పోలీసులు, కంటోన్మెంట్ అధికారులు సంయుక్తంగా నిర్ణయం తీసుకుని తొలగించారు. ఆక్రమణలతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారని, అంతేకాకుండా రోడ్డు ఇరుకవ్వడంతో రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో జేసీబీ సహాయంతో వాటిని కూల్చివేశారు. ఫుట్ పాత్‌లు, రోడ్లను ఆక్రమించి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా కంటోన్మెంట్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు. ఏసీపీ ట్రాఫిక్ శంకర్‌రాజు, సీఐ ట్రాఫిక్ మధుబాబు, సీఐ తిరుమలగేరి పీఎస్ నాగరాజు, కంటోన్మెంట్ శానిటరీ సూపరింటెండెంట్ దేవేందర్, అధికారులు పాల్గొన్నారు.

రీచింగ్ ది అన్ రీచ్డ్ లఘుచిత్రంతో

ఓయూ ఈఎంఆర్సీకి అంతర్జాతీయ గుర్తింపు



- అంతర్జాతీయ లఘుచిత్ర ఫెస్టివల్‌లో ఉత్తమ లఘుచిత్ర అవార్డు అందుకున్న ఈఎంఆర్సీ డైరెక్టర్
- అవార్డు ద్వారా వచ్చిన రూ. 50వేల నగదును వీసీ చేతుల మీదుగా గిరిజన విద్యార్థులకు అందజేత



నవతెలంగాణ-ఓయూ

ఓయూ ప్రతిష్టాత్మక యూజీసీ సీఈసీ 16వ అంతర్జాతీయ లఘుచిత్ర పోటీల్లో అవార్డు కైవసం చేసుకున్న ఈఎంఆర్సీ డైరెక్టర్ పి. రఘుపతిని ఓయూ వీసీ ప్రొ. కుమార్ మొలుగరం అభినందించారు. సమాజానికి దూరంగా అడవుల్లో బతుకుతున్న గుత్తికోయ చిన్నారుల బతుకు చిత్రంపై తీసిన "రీచింగ్ ది అన్ రీచ్" లఘుచిత్రానికి అభివృద్ధి విభాగంలో ట్రోఫీ, నగదుబహుమతి, ధ్రువపత్రం లభించటం, మానవహక్కుల విభాగంలో స్క్రీనింగ్‌కు ఎంపిక కావటం ఓయూకు గర్వకారణమని అభిప్రాయపడ్డారు. సామాజిక, అభివృద్ధి, విద్యా ఆధునిక సాంకేతికత, పరిశోధనలు ఇతివృత్తంగా మరిన్ని లఘుచిత్రాలు రూపొందించాలని సూచించారు. ఇంటర్నేషనల్ డాక్యుమెంటరీ ఫిల్మ్ ఫెస్టివల్‌లో వచ్చిన నగదు బహుమతి రూ.50 వేలను వీసీ చేతుల మీదుగా గుత్తి కోయ చిన్నారుల విద్యాభ్యాసం కోసం శ్రమిస్తున్న సంతోష్ ఇస్రం మిత్ర బందానికి విరాళంగా అందించారు. ఓయూ ఈఎంఆర్సీ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అంతర్జాతీయ వేదికపై మారుమూల గిరిజన ప్రాంతాల విద్యార్థులపై తీసిన లఘుచిత్రానికి గుర్తింపు రావటం పట్ల ప్రోగ్రాం ప్రొడ్యూసర్, ఈఎంఆర్సీ డైరెక్టర్ రఘుపతి ఆనందం వ్యక్తం చేశారు. అవార్డు సామాజిక బాధ్యతను మరింత పెంచిందని అన్నారు.

ప్రకృతి అంతర్జాతీయ లఘుచిత్ర పోటీల్లో ఓయూ ఈఎంఆర్సీకి అవార్డు దక్కటం ఇదే మొదటిసారి. మారుమూల గిరిజన విద్యార్థులను బాహ్య ప్రపంచానికి పరిచయం చేసే ఉద్దేశంతో తామంతా పనిచేస్తున్నామని తమ కష్టానికి అంతర్జాతీయ గుర్తింపు రావటం సంతోషంగా ఉందని సంతోష్ ఇస్రం, శశింధర్ రెడ్డి, దూడపాక నరేష్, చందా గున్మంతరావు తెలిపారు. ఓయూ నేర్పిన సామాజిక బాధ్యతను నెరవేరుస్తున్నామని అన్నారు.ఓయూ పరిపాలనా భవన్ లో జరిగిన కార్యక్రమంలో వీసీ తో పాటు రిజిస్ట్రార్ ప్రొ. నరేష్ రెడ్డి, ఓఎస్డీ ప్రొ. జితెంద్ర నాయక్, యూజీసీ డీన్ ప్రొ. లావణ్య, ప్రొ. ప్యాట్రిక్ జర్నలి జం విశ్రాంత ఆచార్యులు ప్రొ. స్టీవెన్ సన్, ప్రొ. నరెందర్ సహా పలువురు లఘుచిత్రాన్ని వీక్షించారు. ఓయూ విద్యార్థులు సామాజిక బాధ్యతగా భీం చిల్డ్రన్ హ్యాపినెస్ సెంటర్ల పేరుతో 9 ఏకోపాధ్యాయ పాఠశాలలు నడపడం అభినందనీయమన్నారు. లఘుచిత్ర ఇతివృత్తం. చత్తీస్ ఘడ్ అడవుల్లో నెలకొన్న రాజకీయ కారణాలతో ఏండ్ల క్రితమే వందలాది కుటుంబాలు వలస వచ్చి ములుగు, భూపాల పల్లి జిల్లాల్లోని అటవీ ప్రాంతంలో తాత్కాలిక ఆవాసాలను ఏర్పాటు చేసుకున్నాయి. అటవీ ఉత్ప త్తులపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నాయి. అయితే వారి పిల్లలకు ఓయూ విద్యార్థులు సంతోష్ ఇస్రం, దూడపాక నరేష్, శశింధర్ రెడ్డి, చందా గున్మంతరావులు ఏకోపాధ్యాయ భీం చిల్డ్రన్స్ హ్యాపినెస్ సెంటర్లను వీద్య కోసం ఏర్పాటు చేశారు. సారలమ్మ గుంపు, ముసలమ్మ పెంట, తక్కెళ్లగూడెం, ప్రాజెక్టు సాగర్, నీలంతోగు, బండ్ల పహడ్, దండుపల్లి, కాల్వపల్లి, ఐలాపురం తొమ్మిది ఆవాసాల్లో ఏకోపాధ్యాయ పాఠశాలలు ఎర్పాటు చేసి పిల్లలకు ప్రీ ప్రైమరీ విద్యను అందిస్తున్నారు. వారిని రెండుమూడేండ్ల పాటు సిద్ధం చేసి ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలల్లో చేరుస్తున్నారు. భీం చిల్డ్రన్ హ్యాపినెస్ కేంద్రాలపై ఈఎమ్మార్సీ రూపొందించిన 12 నిమిషాల షార్ట్ ఫిలిం విద్యాభివద్ధి విభాగంలో అగ్రగామిగా నిలిచి అంతర్జాతీయ అవార్డు దక్కించుకుంది. డిసెంబర్ 4 నుంచి 6వరకు రాజస్థాన్ లోని జోధ్ పూర్ లో జరిగిన 16వ ప్రకతి డాక్యుమెంటరీ ఫిల్మ్ ఫెస్టివల్ లో లఘుచిత్ర రూపకర్త పి. రఘుపతి అవార్డును అందుకున్నారు. బంగ్లాదేశ్, మియన్మార్, శ్రీలంక సహా పలు దేశాలు రాష్ట్రాల నుంచి పలు లఘుచిత్రాలు ఈ విభాగంలో పోటీ పడ్డాయి.

జర్నలిస్టులకు మోహన్ బాబు బహిరంగ క్షమాపణ చెప్పాలి

- దళిత జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర కమిటీ డిమాండ్

నవ తెలంగాణ-కంటోన్మెంట్



జర్నలికస్టులకు మోహన్ బాబు బహిరంగ క్షమాపణ చెప్పాలని, దళిత జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు మీసాల ఎల్లేష్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు దొమ్మాటి శివకుమార్‌లు డిమాండ్ చేశారు. బుధవారం కంటోన్మెంట్ లో వారు సమావేశమై మాట్లాడుతూ.. సినిమాలో రౌడీయిజం చేసినట్టు నిజ జీవితంలో జర్నలిస్టులపై రౌడీయిజం చేస్తూ, జర్నలిస్ట్ లపై దాడి చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తండ్రి కొడుకుల మధ్య ఆస్తి తగాదాలలో ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకోగా.. విధినిర్వహణలో ఉన్న జర్నలిస్టులను టార్గెట్ చేసి, దాడి చేయడమే కాకుండా దుర్భాషలాడి జర్నలిస్ట్ ల మనోభా వాలను దెబ్బతీసిన మోహన్ బాబు, తక్షణమే జర్నలిస్టులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అడుగడుగునా అడ్డుకుంటామని హెచ్చరిం చారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావతం కాకుండా, చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. తీవ్రమైన గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జర్నలిస్టుకు ఏం జరిగినా పూర్తి బాధ్యత మోహన్ బాబుదేనని తెలిపారు.



సికింద్రాబాద్ కుమ్మరిగూడలోని శ్రీ ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్టాపన కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖతో కలిసి కాంగ్రెస్ సనత్ నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి డా. కోట నీలిమ పాల్గొన్నారు. నవతెలంగాణ-బేగంపేట్

నవతెలంగాణ
మనసు తెలుగు దినపత్రిక
హైదరాబాద్
HMDA
గురువారం | డిసెంబర్ 12, 2024 | www.navatelangana.com

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన దరఖాస్తుల పరిశీలనను పకడ్బందీగా చేపట్టాలని రెవెన్యూ ,హౌసింగ్. సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా కలెక్టర్‌లను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన , గ్రూప్ -2 పరీక్షల నిర్వహణ, మెస్ ఛార్జీలపెంపు, సామాజిక సర్వే తదితర అంశాలపై బుధవారం సచివాలయం నుంచి ముఖ్యమంత్రి సలహా దారులు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ గౌతమ్ పాల్గొన్నారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గ్రూప్ 2 పరీక్ష కేంద్రాలుగా 116 సెంటర్లను ఎంపిక చేయడం జరిగిందని జిల్లాలో 72 వేల993 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాధిక గుప్త విజయేందర్ రెడ్డి డిఆర్ఓ హరిప్రియ సంబంధిత అధికారులు పాల్గొన్నారు

చదువుకునేవారికి గ్రంథాలయాలు అందుబాటులో ఉండాలి

- రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మెన్ రియాజ్
- హైదరాబాద్ నగర గ్రంథాలయ సంస్థ చైర్మెన్‌గా కె ఉపేందర్ రెడ్డి పదవీ బాధ్యతలు స్వీకరణ



నవతెలంగాణ-కల్చరల్

చదువుకునే వారికోసం గ్రంథాలయాలు అందుబాటులో వుండాలని అందుకు తగిన వసతులు కల్పించడంతో పాటు సిబ్బంది సహకారం కూడా అవసరమని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మెన్ రియాజ్ పేర్కొన్నారు. శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై హైదరాబాద్ నగర గ్రంథాలయ సంస్థ చైర్మెన్ గా కె ఉపేందర్ రెడ్డి పదవీ బాధ్యతలు స్వీకార మహోత్సవ కార్యక్రమంలో అధ్యక్షత వహించిన రియాజ్.. ఉపేందర్ రెడ్డిని అభినందిస్తూ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికార వికేంద్రీకరణ కు ప్రాధాన్యత ఇస్తుందని అలాగే అంకిత భావం తో క్రమ శిక్షణ తో పని చేసేవారికి గుర్తింపునిస్తుందని చెప్పారు. ఉపేందర్ రెడ్డి మంచి కార్యకర్త అనీ అందరం కలసి గ్రంథాలయ పునరుద్ధరణ ఉద్యమంగా చేపడతామని చెప్పారు.

పదవీ బాధ్యతలు స్వీకార అనంతరం ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ పెదవాళ్ళు చదువుకో వటానికి గ్రంథాలయాలు ఉప యోగ పడతాయని అన్నారు. అద్దె భవంతిలో ఉన్న గ్రంథాలయాలకు సొంత భవంతులు నిర్మాణం తో పాటు వున్న గ్రంథాలయాలను ఆధునీకరణ పనులు చేస్తామని తెలిపారు గ్రంథాలయ ఉద్యోగులు సమస్యలు పరిష్కారం లో చొరవ చూపు తామని హామీ ఇచ్చారు. ఎట్టి భేషజాలు లేకుండా సమన్వయం తో గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ నాయకురాలు ఉపేందర్ రెడ్డి కుమార్తె శిల్పా రెడ్డి మాట్లాడుతూ తమ తండ్రి విద్యకు ప్రాధాన్యత ఇస్తారని,మారుమూల జనగాం ప్రాంతం నుంచి వచ్చిన తాము హైదరాబాద్ లో పేద విద్యార్థులకు సహాయ సహకారాలు అందిస్తున్నామని, తమ తండ్రి కి ఈ పదవి సేవా కార్యక్రమాలను సహకారి కాగలదన్నారు. గ్రంథాలయ కార్యదర్శి పద్మజ మాట్లాడుతూ నగర గ్రంథాలయ సంస్థకు 82 శాఖ గ్రంథాలయాలు ఉన్నాయని, ఉద్యోగులు సమయ పాలన తెలుసుకొనే విధం గా యాప్ రూపొందించటం జరిగిందని తెలిపారు. 33 గ్రంథాలయాలు మరమత్తు కు, 13 భవంతులు నిర్మాణం లో ఉన్నాయని వివరించారు. జనగాం కాంగ్రెస్ నాయకులు శివరాజ్ యాదవ్ మాట్లాడుతూ తమ జిల్లాకు చెందిన ఉపేందర్ చైర్మెన్ కావటం జిల్లా ప్రజలకి గర్వంగా ఉందన్నారు. గ్రంథాలయ ఉద్యోగులు సంఘం నాయకులు అయోధ్య మాట్లాడుతూ గ్రంథాలయాల్లో ఖాళీ గా వున్న పోస్టులకు నియామకాలు చేపట్టాలని, పదోన్నతులు కల్పించాలని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేయాలని కోరారు. డిప్యూటీ మేయర్ మోతే శ్రీ లత శోభన్ రెడ్డి, కొమ్మూరి ప్రతాప్ రెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులతో పాటు గ్రంథాలయ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని ఉపేందర్ రెడ్డిని అభినందించారు

ఓయూ విద్యార్థులకు వీసీ అభినందనలు



నవతెలంగాణ-ఓయూ

హరియాణాలోని చౌదరి రణబీర్ విశ్వవిద్యాలయంలో నవంబర్ 12 నుంచి 18 వరకు జరిగిన 7 రోజుల జాతీయ సమైక్యతా శిబిరంలో విజయవంతంగా పాల్గొన్న ఆరుగురు విద్యార్థులను వీసీ ప్రొ. కుమార్ బుధవారం రాత్రి తన కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసి, శిబిరంలో చూపించిన ప్రదర్శనను ప్రశంసించారు. విద్యార్థులు రెగ్యులర్ చదువుతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాన్య జ్ఞానం, సివిక్ సెన్స్, రోడ్డు సెన్స్ వంటి అంశాలను అలవర్చుకోవాలని ఉద్బోధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "విద్య అనేది కేవలం పాఠశాలల్లో చదువుకోవడమే కాదు, బలమైన సమాజాన్ని నిర్మించడానికి అవసరమైన గుణాలను నేర్చుకోవడం కూడా అవశ్యకం. మీ ప్రదర్శన భవిష్యత్ పౌరులకి స్ఫూర్తిదాయకం" అని అన్నారు. ఈ శిబిరంలో ఓయూ విద్యార్థుల బందం అత్యుత్తమ ప్రదర్శన చేయడం ద్వారా మొత్తం బందంగా టాప్ స్థానంలో నిలిచింది. వీరిలో విద్యార్థి కార్తిక్ తన అసాధారణ ప్రతిభకు గాను గోల్డ్ మెడల్ సాధించడం విశేషం.

విద్యార్థులతో పాటు నగర కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. బి. కృష్ణ చైతన్య వారి బందాన్ని నడిపించారు. ఆయన నాయకత్వం, మార్గదర్శకత బంద విజయానికి కీలకంగా నిలిచింది. ఎన్ఎస్ఎస్ సెల్ ఓయూ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డా. సవీన్ సౌధా విద్యార్థులకు పూర్తి మద్దతు, ప్రోత్సాహాన్ని అందించారు. మరోవైపు, ఎంజేపీటిబిసిడబ్ల్యుఆర్డిసి, వర్గల్ నుంచి డా. ఎస్. రాధారాణి విద్యార్థుల విజయాన్ని అభినందిస్తూ, జాతీయ సమైక్యతా, ఐక్యత విలువలను ప్రతిబింబించిన విధంగా వారి ప్రతిభను ప్రశంసించారు. ఈ శిబిరం విద్యార్థులకు సాంస్కృతిక వైవిధ్యం అనుభవించడంలో, జీవన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడంలో, నాయకత్వ లక్షణాలను పొందడంలో ముఖ్యమైన వేదికగా నిలిచింది. విద్యార్థులు తమ అనుభవాలను పంచుకుంటూ, విశ్వవిద్యాలయం మార్గదర్శకతకు కృతజ్ఞతలు తెలిపారు. ఓయూ విద్యార్థుల సామాజిక బాధ్యతను పెంపొందించడం, వారి ప్రతిభను అన్ని రంగాల్లో ప్రోత్సహించడంపై తన నిబద్ధతను ఈ కార్యక్రమం ద్వారా సత్తా చూపరన్నారు.



హైదరాబాద్ జిల్లా మాదిగ విద్యార్థుల ఐక్య వేదికను విజయవంతం చేద్దాం

- ఎంఎస్ఎఫ్ నాయకులు

నవతెలంగాణ-ఓయూ

మాదిగ విద్యార్థి సమాఖ్య ఓయూ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 18న ఓయూ సైన్స్ కాలేజీ కాన్ఫరెన్స్ హాలులో జరగబోయే హైదరాబాద్ జిల్లా మాదిగ విద్యార్థుల ఐక్య వేదిక సభకు ప్రతి విద్యార్థి, మాదిగ మేధావులు, రీసెర్చ్ స్కాలర్లు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఎంఎస్ఎఫ్ నాయకులు పిలుపు ఇచ్చారు. మంద కృష్ణ మాదిగ హాజరవుతున్న క్రమంలో ప్రతి ఒక్కరు హాజరు కావాలని, మన హక్కులు మన భవిష్యత్తు కోసం కదిలి రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి డాక్టర్ పల్లెర్ల సుధాకర్ మాదిగ, రాష్ట్ర కార్యదర్శి రఘువరన్ మాదిగ, హైదరాబాద్ అధ్యక్షుడు మహేష్ మాదిగ, రాష్ట్ర నాయకులు సామ్రాట్ అజయ్ మాదిగ, హైదరాబాద్ ఉపాధ్యక్షుడు ప్రదీప్ మాదిగ,సెక్రటరీ శ్రీకాంత్ మాదిగ పాల్గొన్నారు.

సుష్మాస్వరాజ్ లేకుంటే రాష్ట్రమే రాకపోయేది..



- మాజీ ఎమ్మెల్సీ రాంచందర్ రావు

నవతెలంగాణ-ఓయూ

ఆ రోజున సుష్మా స్వరాజ్ పార్లమెంట్ లో లేకుంటే తెలంగాణనే రాకపోయేదని మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ సీనియర్ నాయకుడు అడ్వకేట్ నారపరాజు రాంచందర్ రావు అన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆదేశాల మేరకు "6 అబద్దాలు, 66 మోసాలు" పేరుతో సికింద్రాబాద్ సీతాఫల్ మండిలో బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి ఆధ్వర్యంలో సీతాఫల్ డివిజన్ అంబేద్కర్ విగ్రహం ఎదుట జరిగిన బహిరంగ సభకు ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. సోనియా గాంధీ ఇచ్చిందని కాంగ్రెస్ వాళ్లు, కేసీఆర్ తెచ్చాడని బీఆర్ఎస్ వాళ్ళు చెప్పుకుంటున్నారని తెలిపారు. కానీ పార్లమెంట్‌లో బిల్లు ఆమోదం పొందడం కోసం సుష్మా స్వరాజ్ పూర్తి మద్దతు వలనే తెలంగాణ సాకరమయ్యిందని అన్నారు. రెండు సార్లు బీఆర్ఎస్‌కు, ఒక సారి కాంగ్రెస్ కు అధికారం ఇచ్చి ప్రజలు మోసపోయారని, కానీ మార్పు కావాలంటే ఈ సారి ఏ ఎన్నికలు వచ్చినా బీజేపీకి అవకాశం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. 6 గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ 66 మోసాలు చేసిందని, కేవలం ఒక్క సంవత్సరంలోనే ఇంత వ్యతిరేకత ఎదుర్కొంటున్న ప్రభుత్వం ఇదేనని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలను రేవంత్ రెడ్డి మోసం చేశారని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో పార్టీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు శ్యామ్ సుందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాని, రవి ప్రసాద్, నాగేశ్వర్ రెడ్డి, కష్ణ మూర్తి, ప్రభు గుప్తా, హరి, రాజేశ్వర్ రావు, మేకల కీర్తి, శ్యామ్ సుందర్, రాము వర్మ శారదా మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



కంటోన్మెంట్ ప్రజలను మోసగిస్తున్న ప్రభుత్వాలు

- కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు జయరామకృ ష్ణ

నవతెలంగాణ-కంటోన్మెంట్

నాడు బీఆర్ఎస్ ప్రభుత్వం, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం కంటోన్మెంట్ ప్రజలను మోసగిస్తూనే ఉన్నాయని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు జయరామకృష్ణ అన్నారు. బుధవారం ఇందిరమ్మ నగర్‌లో పర్యటించి సీసీ రోడ్డు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. అంతకు ముందు స్థానికులతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కంటోన్మెంట్‌కు అవసరం ఉన్నన్ని నీళ్ల సరఫరా చేయకపోవడం వల్ల ప్రజలకు పూర్తి స్థాయిలో నీళ్లు ఇవ్వలేక పోతున్నామని తెలిపారు. కంటోన్మెంట్‌లో ఏ ప్రాంతానికి వెళ్ళినా ప్రజలు తాగునీరుపై రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలుదీస్తున్నారని, అరకొరగా వచ్చే నీటితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారి ఆవేదన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. కంటోన్మెంట్‌లో సరిపడ నీళ్లు రావడంలేదని ప్రజలు నిత్యం గోడును వెళ్ళబోసుకుంటుంటే, కాంగ్రెస్ ఇన్‌చార్జి మంత్రి, కాంగ్రెస్ నాయకులు సరిపడా నీళ్లు అందిస్తున్నామని ఏ సమస్యలేదని మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్ గెలిచిన ఏకైక ఎమ్మెల్యే స్థానమైన కంటోన్మెంట్‌లోనే సమస్యలు తీర్చడంలేదంటే ఇంకా రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన ఏవిధంగా ఉందనేది అర్థం చేసుకోవచ్చన్నారు. కాంగ్రెస్ నాయకులు ఇకనైనా ఫ్యాషన్ షోలు చేయడం మానుకొని కంటోన్మెంట్ ప్రజలకు సరిపడ నీళ్లు అందించేలా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని సూచించారు.లేని పక్షంలో కంటోన్మెంట్ ప్రజల తరపున పోరాడే బాధ్యత బీజేపీ తీసుకుంటుందన్నారు.కార్యక్రమంలో బీజేపీ స్థానికఅధ్యక్షులు మాదరపు అశోక్, నాయకులు జయ యాదవ్, మమతా, రేఖ, ప్రశాంత్, శ్యామ్, స్థానికులు లక్ష్మణ్ పాండు, రాజు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పద్య విద్యాధరుడు మేడసాని మోహన్



నవతెలంగాణ-కల్చరల్

తెలుగు వారికే సొంత మైన అవధాన ప్రక్రియ పద్య కవిత్వం శాశ్వతంగా భాషను నిలిపి ఉంచుతాయని సివిల్ సర్వీస్ విశ్రాంత ఉన్నతాధికారి డాక్టర్ కె వి రమణ అన్నారు. అలాటి ప్రక్రియ ల ఉపాసకుడు మేడసాని మోహన్ పద్య విద్యాధరుడు అని ప్రశంసించారు. రవీంద్ర భారతి ప్రధాన వేదిక పై రసమయి సాంస్కృతిక సంస్థ నిర్వహణలో డాక్టర్ మేడసాని మోహన్ అవధాన స్వర్ణోత్సవ వేడుక జరిగింది. డాక్టర్ తిరుమల శ్రీనివాసాచార్య డాక్టర్ మాసన చెన్నప్ప, డాక్టర్ అక్కిరాజు సుందర రామ కృష్ణ, డాక్టర్ శరత్ జ్యోత్స్న రాణి సాధన నరసింహా చార్య డాక్టర్ గౌరీ శంకర్ శంకర నారాయణ పృచ్ఛకులుగా పాల్గొనగా మేడసాని మోహన్ వారి ప్రశ్నలకు ఆసక్తి కర సమాధానలతో ప్రశంస అందుకున్నారు. నిందా స్తుతిలో రేవంత్ రెడ్డి కేసీఆర్ మధ్య వైరుధ్యాలు పద్యంలో చెప్పమని అడిగిన ఉదయవర్లికి చమత్కార సమాధానం శార్దూల పద్యంలో చెప్పేరు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో అధ్యక్షత వహించిన డాక్టర్ రమణ అవధాన సార్వభౌముడు మోహన్ అని అభివర్ణిస్తూ ధార ధారణ ధోరణి దిషన ముఖ్యంగా ధైర్యం అవధానీకి అవసరమన్నారు. ముఖ్య అతిథిగా విశ్రాంత సివిల్ సర్వీస్ అధికారి దాసరి శ్రీనివాసు ఇతర అతిథులు నరసింహప్ప జస్టిస్ నారాయణ లతో కలసి సత్కారం చేశారు. డాక్టర్ రాము కార్య క్రమం నిర్వహించగా అశా లత వ్యాఖ్యానం చేశారు

క్షమాపణ వద్దు తక్షణమే అరెస్టు చేయాలి

- మోహన్ బాబుపై హత్యాయత్నం నేరం కింద కేసు నమోదు చేయాలి
- వెస్ట్ జోన్ మీడియా ప్రతినిధులు..



నవతెలంగాణ - బంజారాహిల్స్

జర్నలిస్టుపై నటుడు మోహన్‌బాబు చేసిన దాడికి నిరసనగా ఫిలిం ఛాంబర్ ముందు వెస్ట్ జోన్ తో పాటు నగరంలోని మీడియా ప్రతినిధులు ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ప్ల కార్డులు చేతబూని మోహన్ బాబు కుటుంబాన్ని మా అసోసియేషన్ నుంచి శాశ్వతంగా తొలగించాలని, మోహన్‌బాబును హత్యాయత్న నేరం కింద వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లెజెండ్ సెలబ్రిటీ హోదాలో చెప్పుకునే మోహన్ బాబుకు సంస్కారం లేదని ఇంత దిగజారుడుతనం ఇంతవరకు ఏ వ్యక్తిలో చూడలేదన్నారు. మీకు అవసరం ఉన్నప్పుడు మీడియా కావాలి అవసరం లేనప్పుడు మెడలు బట్టి బయటకి నెట్టుతారా అసలు మీరు మనుషులేనా కొంచెం కూడా మానవత్వం లేదా అంటూ విలేకరులు ప్రశ్నించారు. క్షమాపణలు వద్దే వద్దు వెంటనే అరెస్టు చేసి విలేకరులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని, సీఎం రేవంత్ రెడ్డిని జర్నలిస్టు ప్రతినిధులు కోరారు.

ఏపీ సీఎం చంద్రబాబును కలిసిన పెరిక సురేష్



నవతెలంగాణ-అంబర్‌పేట

టీటీడీ ఆధ్వర్యంలో థార్మిక ప్రచారాన్ని మరింత విస్తృతంగా చేపట్టాలని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడును కోరినట్లు నమో వందే గోమాతరం ఆల్ ఇండియా ప్రెసిడెంట్ పెరిక సురేష్ తెలిపారు. అమరావతిలో ఏపీ సీఎం చంద్రబాబును కలిసి తిరుమలలో చేపడుతున్న కార్యక్రమాల పట్ల హర్షం వెలిబుచ్చారు. స్వచ్ఛందంగా విరాళంగా తన వంతుగా స్వామివారికి తిరుమలలో పది కాటేజీల ను నూతనంగా నిర్మించినట్లు తెలిపారు. భక్తుల నుంచి వచ్చే విరాళాలను హిందువులకే ఖర్చు చేయాలని కోరారు. తిరుమలలో వెంకటేశ్వర స్వామిని సందర్శించే భక్తులకు మెరుగైన సేవలు అందించడంలో ఏపీ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల పట్ల పెరిక సురేష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సురేష్ చంద్రబాబు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు.

పోస్టర్లు విడుదల



నవతెలంగాణ-ఓయూ

ప్రజా పాలన విద్యార్థి విజయోత్సవ సభ పోస్టర్‌ను టీపీసీసీ మీడియా కమిటీ చైర్మెన్ సామ రామ్మోహన్ రెడ్డి గాంధీభవన్‌లో సభ నిర్వాహకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కొప్పుల ప్రతాప్‌రెడ్డి, పూసల రమేష్, మండ్ల రవి, ఊట్కూరి లెనిన్, పల్స ఆంజనేయులు గౌడ్, బిక్షపతి నాయక్, శ్రీను నాయక్, మల్లేష్ నాయక్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ల సమస్యలను పరిష్కారించాలి

- చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి
- సీఐటీయూ ఆధ్వర్యంలో సీపీడీఓకు వినతిపత్రం



నవతెలంగాణ-ధూల్‌పేట్

అంగన్‌వాడి టీచర్స్ సమస్యలను పరిష్కారించాలని సీఐటీయూ హైదరాబాద్ సౌత్ కార్యదర్శి ఎం.శ్రావణ్ కుమార్, ఎం.మీనా, చాంద్రాయణగుట్ట జోన్ కార్యదర్శి ఎస్. కిషన్, కృష్ణలు అన్నారు. సీఐటీయూ సౌత్ కమిటీ ఆధ్వర్యంలో అంగన్‌వాడి టీచర్స్ సమస్యల పరిష్కారానికి జరిగే చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని టీచర్స్‌లకు పిలుపునిచ్చారు. సీపీడీఓ చార్మినార్ వినతి పత్రం అందజేసి వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్స్‌లు అనేక సమస్యలను, బాధలు ఎదుర్కొంటు విధులు నిర్వహిస్తున్నారన్నారు. చాలి చాలని జీతాలతో జీవనం సాగిస్తున్నారన్నారు. ప్రభుత్వం గత 11నెలలుగా సెంటర్ చెల్లించలేదని, నిధులు విడుదల చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా టీచర్స్‌లకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. సెంటర్ అద్దెలు ప్రతి నెల వచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పీఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని, రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ పెంచాలన్నారు. నూతన విద్య హక్కు చట్టాన్ని రద్దు చేయాలని, ఐసీడీఎస్‌ను ప్రయివేటీకరణ ఆపాలన్నారు. ప్రజా అవసరాల నిమిత్తం స్త్రీ శిశు సంక్షేమ శాఖను బలో పేతం చేయాలని డిమాండ్ చేశారు. 12న నేడు జరిగే చలో హైదరాబాద్‌ని అంగన్‌వాడీ టీచర్స్‌లు, ఆయాలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

గోషామహల్ నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యం..



- సీసీ రోడ్డు పనుల ప్రారంభంలో ఎమ్మెల్యే రాజాసింగ్

నవతెలంగాణ-ధూల్‌పేట్ సుల్తాన్‌బజార్

గోషామహల్ నియోజకవర్గం అభివృద్ధే నా లక్ష్యమని నియోజకవర్గం ఎమ్మెల్యే టి.రాజాసింగ్ అన్నారు. గోషామహల్ డివిజన్ కార్పొరేటర్ లాల్‌సింగ్ ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని అఘాపురా, పాన్‌మండి, గ్యాస్ బాగ్ కాలనీ, ప్రాంతాల్లో సుమారుగా రూ.49 లక్షల వ్యయంతో నూతనంగా చేపట్టిన సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అంతర్గత రోడ్లు, డ్రయినేజీ సమస్యలు పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం చేయకుండా పరిష్కరించాలన్నారు. సీసీ రోడ్డు పనులు వేగవంతంగా చేయాలని, నాణ్యత ప్రమాణాలు పాటించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాండు యాదవ్, అలా పూరషోత్తం, నరహరి, గోపాల్, జీవన్ సింగ్, సోంరాజ్, మహేష్, సాయి, అక్షయ్ సాహు స్థానికులు పాల్గొన్నారు.

'దత్తత తీసుకున్న తల్లిదండ్రులకు పిల్లలను అప్పగించాలి'

- తెలంగాణ సమాజ్ స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వినయ్ విప్లవ్



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

దత్తత తీసుకున్న తల్లిదండ్రులకు పిల్లలను అప్పగించాలని చైల్డ్ వెల్ఫేర్ కమిషన్‌కు హైకోర్టు సూచించిందని తెలంగాణ సమాజ్ స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వినయ్ విప్లవ్ తెలిపారు. బుధవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మే 22న జరిగిన పిల్లల అమ్మకాలు, కొనుగోలుకు సంబంధించిన ఇల్లీగల్ వ్యవహారంపై రాచకొండ సీపీ స్వయంగా ప్రెస్ మీట్ పెట్టి సంధ్యారాణి అనే ఫస్ట్ ఎయిడ్ సెంటర్ నడిపించే వ్యక్తి 47 మందిని ఇతరులకు అప్పగించిందని వెల్లడించడం జరిగిందని గుర్తు చేశారు. ఈ సంఘటనకు సంబంధించి 16 మందిని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ అధికారులు హ్యాండ్ ఓవర్ చేసుకోవడం జరిగిందని, ఈ 16 మందిలో 9 మంది పిల్లలను దత్తత తీసుకున్న వ్యక్తులు, తల్లిదండ్రులు జూలై ఫస్ట్ రోజు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించడం జరిగిందని చెప్పారు. హైకోర్టు దీనిపై రివ్యూ చేసి 23 సెప్టెంబర్ రోజున సింగిల్ బెంచ్ జడ్జి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం 36, 37, 38 యాక్ట్ ప్రకారం దత్తత తీసుకున్న వ్యక్తులు అన్ని విధాలుగా ఎలిజిబులిటీ అయి ఉంటే తిరిగి ఆ పిల్లల్ని వాళ్ళకి అప్పగించమని ఉద్దేశించి చైల్డ్ వెల్ఫేర్ కమిషనర్ కు ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందన్నారు. దీనిపై ప్రభుత్వాన్ని నివేదిక కోరినప్పుడు తగిన సమాచారాన్ని సేకరించి నవంబర్ 28న సెకండ్ రివ్యూలో డివిజన్ బెంజ్ కోర్టు పూర్తి స్థాయి ఎంక్వయిరీ చేసి ఈ పిల్లలను ఎక్కడికి వెళ్లి తీసుకొచ్చారని, తీసుకొచ్చిన పిల్లలు లీగల్‌గా తీసుకొచ్చారా లేదా అన్న విషయాలను తెల్చి ఇప్పుడు దత్తత తీసుకున్న పేరెంట్స్ ఎవరైతే 9 మంది కోర్టుకు వచ్చారో వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎలిజిబిలిటీ ఉంటే తిరిగి ఆ పిల్లలను దత్తత తీసుకున్న తల్లిదండ్రులకే అప్పగించాలని తీర్పు ఇవ్వడం జరిగిందన్నారు. చైల్డ్ వెల్ఫేర్ కమిషన్, హైకోర్టు ఇచ్చిన తీర్పును పక్కన పెట్టి, పోలీసులు పెట్టిన కేసును పరిగణలోకి తీసుకొని పూర్తిస్థాయి ఎంక్వయిరీ చేయకుండా దత్తత తీసుకున్న తల్లిదండ్రులను ఎంక్వయిరీ చేయకుండా నిర్లక్ష్యం చేస్తూ వారు దత్తత తీసుకున్న పిల్లలు అర్ఫన్ హెూమ్స్‌కు చెందుతారని చెప్పిఅర్ఫన్ హెూమ్ కు హ్యాండ్ ఓవర్ చేయడం జరిగిందని ఆయన చెప్పారు. మే నెల నుంచి జరుగుతున్న ఈ వ్యవహారంపై హైకోర్టు ఆదేశాలు అనుసరించకుండా నిర్లక్ష్యం వహిస్తున్న చైల్డ్ వెల్ఫేర్ ఆఎసర్లపై తగిన చర్యలు తీసుకొని, సంబంధించిన తల్లిదండ్రులకు పిల్లలను వెంటనే అప్పగించాలని కోరారు. నిర్లక్ష్యం చేయడం వల్ల 9 మంది తల్లిదండ్రుల్లో ఒక వ్యక్తి తమ పిల్లలను అక్రమంగా తీసుకుపోయారని, మనస్థాపం చెంది హార్ట్ ఎటాక్‌తో చనిపోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అక్షర జ్యోతి ఉమెన్ అండ్ చిల్డ్రన్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ అనుష, తెలంగాణ సమాజ్ స్టూడెంట్ యూనియన్ నాయకులు కొండేటి మధు, శశి తదితరులు పాల్గొన్నారు.

కుష్టు రహిత సమాజం కోసం కృషి చేయాలి



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

కుష్టు రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గాడికాన బస్తీ దవాఖాన మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రత్యూష అన్నారు. బుధవారం బస్తీ దవాఖాన పరిధిలో ఇంటింటి సర్వేలో భాగంగా 4 అనుమానిత కుష్టు కేసులను గుర్తించారు. వారికి మందులను ఉచితంగా అందజేశారు. ఈ సర్వే 15వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. డీపీఎంఓ కే.శ్రీనివాస్ రెడ్డి , ఆశా స్వరూప తదితరులు పాల్గొన్నారు.

'సుస్థిర ప్రజాస్వామిక పాలన కాంగ్రెస్‌తోనే నిరూపితమైంది'

- లక్ష మంది కార్మికులతో హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ
- ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షులు అంబటి కృష్ణమూర్తి



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన మాటను అధికారంలోకి వచ్చిన ప్రజా ప్రభుత్వం నూటికి నూరు పాళ్ళ నిలబెట్టుకుందని ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షులు అంబటి కృష్ణమూర్తి తెలిపారు. తొలి ఏడాదిలోనే సుస్థిర ప్రజాస్వామిక పాలనతో దేశంలోనే తెలంగాణను ఆదర్శంగా నిలబెట్టిందని, కేవలం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలకే పరిమితం కాకుండా దాదాపు ప్రజల ఆకాంక్షలు, అవసరాలు, అవకాశాలను బట్టి అనేక వినూత్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందని ఆయన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది ప్రజా పాలన విజయోత్సవల సందర్భంగా బుధవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో తెలంగాణ రాష్ట్ర ఐఎన్ టీయూసీ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఐఎన్ టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు గుంజ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గూడా ఐలయ్య గౌడ్, జాతీయ ఉపాధ్యక్షులు సత్యదేవ్, మహిళా విభాగం జాతీయ ప్రధాన కార్యదర్శి అంబటి వాణిలతో కలిసి అంబటి కృష్ణమూర్తి మాట్లాడుతూ పదేండ్ల విధ్వంసపు ఆనవాళ్లను రేవంత్ ప్రభుత్వం చెరిపేస్తూ తెలంగాణ పునర్ వైభవాన్ని కొనసాగిస్తూ అన్ని రంగాల్లో రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, అన్ని వర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తున్నదని వివరించారు. ముఖ్యంగా రైతులు, కార్మికులు, ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివిధ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని, తెలంగాణను ది ఫ్యూచర్ స్టేట్, హైద రాబాద్ ఫ్యూచర్ సిటీగా ప్రపంచానికి పరిచయం చేసేందుకు సీఎం చేసిన ప్రయత్నం తొలి ఏడాదిలోనే ఫలితాలను సాధించిందన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించాలని ఢిల్లీ సరిహద్దుల్లో నేటికీ కొనసాగుతున్న రైతు ఉద్యమాన్ని మోడీ ప్రభుత్వం అణిచి వేసేందుకు తీవ్ర ప్రయత్నం చేస్తుందని, రైతుల పోరాటాలకు ఐఎన్‌టీయూసీ పూర్తి మద్దతు తెలుపుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 2025 మార్చి నెలలో లక్ష మంది కార్మికులతో హైదరాబాద్ నిజాం కాలేజ్ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని అంబటి కృష్ణమూర్తి వెల్లడించారు. గుంజ శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరిగాయని, తొలి ఏడాదిలోనే 55,143 ప్రభుత్వ ఉద్యోగ నియామకాలతో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం లక్షలాది మంది నిరుద్యోగుల ఆకాంక్షలను నెరవేర్చిందని చెప్పారు. గూడ ఐలయ్య గౌడ్ మాట్లాడుతూ సంఘటిత, అసంఘటిత కార్మికుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, రాష్ట్రంలోని ఆశ వర్కర్లు, ఏఎన్ఎం, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలతో పాటు ఆటో, రవాణా రంగా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి ఐఎన్‌టీయూసీ తీసుకెళ్లిందని, సాధ్యమైనంత త్వరలో పరిస్కారమవుతాయని తెలిపారు. ఈ సమావేశంలో ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి బి.అమర్ బాబు, సంయుక్త కార్యదర్శి, ఎన్.నాగరాజు, మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు జనార్దన్, రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షులు జ్యోతి, నేతలు రాధక్క, సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

రూ.5వేలకే ఉన్నత విద్య..

- పేద, మధ్య తరగతి విద్యార్థుల విద్యనందిచడమే లక్ష్యం..
- అనుభవజ్ఞులైన అధ్యాపకులు..
- విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా నైపుణ్యత..
- జీకేఎస్కే ఫౌండేషన్‌తో ముందుకు..
- ఆ నలుగురు యువకుల కృషియే విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు..









నవతెలంగాణ-ధూల్‌పేట్

ప్రస్తుత కాలంలో వేలల్లో, లక్షల్లో విద్యకు ఫీజులు వసూళ్ల చేస్తున్న రోజులు.. సామాన్యుడు ప్రయివేట్ విద్య చదివించలేని పరిస్థితి. ఒక వేళ అందరితో నా పిల్లలు మంచిగా ప్రయివేట్ విద్య చదివించాలంటే ఫీజులు కట్టలేక, డ్రాప్ అవుట్ కావాల్సిందే.. దీంతో బాల్యంలోనే ఏ దుకాణాల్లో పని చేయడం, చదువుకునే క్రమాన్ని కోల్పోయి బంగారు భవిష్యత్ అక్కడే ఆగిపోయిన విద్యార్థుల కుటుంబాలు ఎన్నో.. అలా కాకూడదనే కృత నిశ్చయంతో ఉన్నత విద్యనభ్యసించిన ఆ నలుగురు యువకులే విద్యార్థుల విద్యకు బాటలు వేస్తున్నారు. అదే జీయాగుడ శ్రీ బాల చైతన్య మోడల్ స్కూల్..

చదువు కొనుక్కునే ఈ రోజుల్లో.. చదువు అందరికీ అందాలనే అనే ఆశయం ఉండటం అరుదు అనే చెప్పాలి. ఒకవేళ అనుకున్న.. చేద్దామన్నది క్రియల్లో కష్టమే.. వారి జీవితాల్లో చదువుకోసం పడ్డా కష్టాలు, ఇబ్బందులు అన్నింటిలో అధిగమిస్తూ ఉన్నత విద్యనభ్యసించిన ఆ నలుగురు ఆశయం, తపన పెట్టుబడిగా పెట్టారు. పేదవారుమధ్యలో విద్యను ఆపకూడదని భావించి, అతి తక్కువ ఫీజుతో రూ. 5వేలకు పేద, మధ్య తరగతి పిల్లలకు ఉన్నత ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్యను అభ్యసింప చేస్తూ ఉత్తీర్ణతలో రాణించేలా తీర్చిదిద్దుతున్నారు.

అందిపుచ్చుకునేలా..

విద్యార్థులకు విద్యతో పాటు మారుతున్న సాంకేతిక, వైజ్ఞానిక సైన్స్ పరిజ్ఞానాన్ని అందిస్తున్నారు. అంత మాత్రమే కాక అన్ని రకాల ఆటలు(స్పోర్ట్స్), పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, మానసిక వికాసం కల్పించేలా యోగ, కరాటే వంటి వాటిలో రాణిస్తున్నారు. విద్యార్థులలో ఉన్న జిజ్ఞాసను వెలికి ఆ దిశలో ప్రోత్సహిస్తూ విద్యా బోధనలు అందిస్తున్నారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో జాతీయ జెండాలు ప్రదర్శించి, జాతీయ గీతాలతో ఆకట్టుకున్నారు. టీచర్స్ డే, ఎన్నివల్ డే కార్యక్రమాల్లో విభిన్న సాంస్కృతిక కార్యక్రమాలు, ఆట, పాటలతో వారి ప్రతిభను కనబరుస్తూ ఆకర్షించి తమదైన ముద్ర వేసుకున్నారు.

సంకల్పంతోనే..

కరోనా సమయం 2019-20లో ఎంతో మంది విద్యార్థుల తల్లి దండ్రులు ఫీజులు కట్టలేక స్కూల్ మధ్యలో డ్రాప్ అవుట్ అయ్యారు. ఫీజు కట్టలేక, బయటకు వెళ్ల లేక కొందరు కూలి పని, కొందరు విడచి పెట్టిన ఘటనలు చూసి వారి చిన్న నాటి పరిస్థితులు గుర్తుకు వచ్చాయి. దీంతో యోగ నిర్వహిస్తూ ఉన్న వినోద్ కంద్రు అడుగు ముందుకు వేశాడు. తన తల్లి లోటు, తండ్రి పడ్డ కష్టం, ఏమి లేని స్థితిలో చదువుకున్న రోజులు గుర్తు చేసుకుని ఉద్యోగం వైపు కాకుండా డ్రాప్ అవుట్ కాకుండా పేద, మధ్య తరగతి పిల్లలకు నాణ్యమైన విద్యానందిచాలనే నిశ్చయంతో తోటి మిత్రులతో ధృడ సంకల్పంతో విధండిస్తున్నారు.

జీకేఎస్కే ఫౌండేషన్‌తో ..

విద్య, ఆరోగ్యం, ప్రాచీన భారతీయ కళలను సమాజానికి అందించాలని గురు కృప శిక్షణ కేంద్రం (జీకేఎస్కే ఫౌండేషన్) 2014లో స్థాపించి యోగ కార్యక్రమాలు ఫౌండర్ కంద్రు వినోద్ కుమార్ కొనసాగిస్తున్నారు. జనరల్ సెక్రటరీ అర్జున సుక్తే, జాయింట్ సెక్రటరీ ఉదయ కిరణ్, ట్రెజరర్ కునల్ సింగ్, ఈ నలుగురు సభ్యులు రితిక్, సూర్య తేజలతో కలిసి అడుగు ముందుకు వేశారు. వీరంతా 20 నుండి 30 సంవత్సరాల వయస్సులోనే ఈ మహత్తర కార్యక్రమానికి నడుం బిగించారు. వారి తృప్తి, ధృఢ సంకల్పం, సమాజ సేవ ఆవశ్యకతతో ఈ ఫౌండేషన్ నేడు ఒక ఆదర్శంగా నిలిచింది. ఈ ఫౌండేషన్ అనేక వ్యక్తులు, సమాజాలను సమగ్ర అభివృద్ధి చేసేందుకు తన ప్రయాణం మొదలుపెట్టింది.

గిన్నిస్ బుక్ రికార్డ్..

ఫౌండేషన్ మొదట పబ్లిక్, ప్రయివేటు పాఠశాలలో విద్యార్థులకు ప్రాచీన భారతీయ యుద్ధ కళలను పరిచయం చేసింది. ఒకే సంవత్సరంలో 2వేల మంది విద్యార్థులను శిక్షణ ఇచ్చి, గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్పోర్ట్స్ కేటగిరీలో ప్రపంచ రికార్డు సృష్టించింది. ఈ అద్భుతమైన విజయంతో పాటు, పాఠశాలలు జిల్లాకు, రాష్ట్రానికి, జాతీయ స్థాయిలో అనేక విజయాలను సాధించాయి. విద్యార్థులు శారీరక, మానసిక శక్తిని పెంచుకునే గొప్ప అవకాశం పొందారు.

స్కూళ్ల నిర్వహణలో నాయకత్వం..

వెనుకబడిన వారికి విద్యానందించాలనే ఆశయంతో ఫౌండేషన్ స్కూల్స్‌ను విజయవంతంగా నిర్వహించడానికి ప్రధానంగా చైర్మెన్ శ్రీనివాస్ కంద్రు, డైరెక్టర్ భార్గవ్ బచరండ నడుం బిగించారు. ప్రారంభంలో ఎన్నో అడ్డంకులు, అవరోధాలు ఎదురైనా సంకల్పంతో ఈ ఇద్దరూ అత్యంత ప్రతిభావంతులైన జట్టుతో కలిసి విద్యా ప్రణాళికలను రూపొందించారు. వాటిని అమలు చేయడం ద్వారా పాఠశాలల దశాబ్దాల విజయానికి బాటలు వేశారు.

స్లమ్ ప్రాంతాల్లో సేవలు..

ఫౌండేషన్ వృద్ధి చెందడం కొద్దీ, హైదరాబాదులోని స్లమ్ ప్రాంతాలకు దృష్టి మళ్లింది. కొన్నెండ్లలో జీకేఎస్కే ఫౌండేషన్ 20కి పైగా స్లమ్ ప్రాంతాలకు చేరుకుని సుమారు 2వేల కుటుంబాలను ప్రభావితం చేసింది. విద్యార్థులకు విద్య అందించడం, వృద్ధుల కోసం ఆరోగ్య శిబిరాలను నిర్వహించడం, మహిళలకు హైజీన్, ఆరోగ్యంపై అవగాహన పెంచేందుకు శానిటరీ ప్యాడ్స్ పంపిణీ చేయడం వంటి కార్యక్రమాలను చేపట్టింది. విద్యార్థుల అభివృద్ధికి పుస్తకాలు, బ్యాగులు, స్టేషనరీ, విద్య అవసరమైన అన్ని వస్తువులను సమకూర్చి వారికి అడ్డంకులు లేకుండా చదువుకునే అవకాశం కల్పించింది.

తక్కువ ఫీజుతో అందించాలనే..

తక్కువ ఫీజుతో అందించాలని సంకల్పంతో వెళ్తున్న వారికి ఆ ఫీజు కూడా చెల్లించలేని వారు లేకపోలేదు. దీంతో ఫౌండేషన్‌ను ఆధారంగా చేసుకుని డైరెక్టర్ వినోద్ కుమార్ అటు టీచర్స్, ఇటు విద్యార్థుల భవిష్యత్ అందించాలనే తపనతో యోగ, కరాటే వంటి కార్యక్రమాలు, తరగతులు బయట నిర్వహిస్తూ స్కూల్ ముందుకు నడిపిస్తున్నారు. రెండేళ్లలోనే 3 పాఠశాలలో, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, 15 వందల మంది విద్యార్థులకు విద్యనందిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకులు తెలంగాణ తల్లి గురించి మాట్లాడటం సిగ్గుచేటు

- కాంగ్రెస్ అధికార ప్రతినిధి గౌరీ సతీష్

నవతెలంగాణ-ముషీరాబాద్

పదేండ్ల పరిపాలనలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని అధికారికంగా ప్రకటించని బీఆర్‌ఎస్ నాయకులు నేడు మాట్లాడం సిగ్గుచేటని కాంగ్రెస్ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ అన్నారు. ఈ మేరకు బుధవారం పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న పది సంవత్సరాలు ఏనాడు కూడా తెలంగాణ తల్లిని తెలంగాణ గీతాన్ని అధికారికంగా ప్రకటించలేదన్నారు. ఇప్పుడు 1965 కు ముందు ఉన్న తెలంగాణ సాంప్రదాయంతో తెలంగాణ తల్లి విగ్రహం రూపుదిద్దుకుంటే విమర్శలు చేయడం హేయమైన చర్యగా అభిమానించారు. ఈ మీ చర్యలను యావత్ తెలంగాణ సమాజం క్షమించబోదని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం హంగులు ఆర్భాటాలకు పోకుండా ప్రజల మనోభావాలకు అనుగుణంగా తెలంగాణ తల్లిని రూపుదిద్దందని ప్రజల నుంచి తెలంగాణ గీతం పుట్టిందని అటువంటి తెలంగాణ తల్లిని విమర్శించడం మాని అంగీకరించాలని తెలంగాణ ఉద్యమకారులు కోరుకుంటున్నారని తెలిపారు.



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

ఎల్‌బి స్టేడియంలో సీఎంకప్-24 నాంపల్లి మండల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. కబడ్డీ, ఫుట్‌బాల్‌లను క్రీడాలను ప్రారంభించిన నాంపల్లి తహ శీల్దార్ ఎం.ప్రేమ్‌కుమార్, నాంపల్లి మండల స్పోర్ట్స్ అథారిటీ అధికారులు తదితరులు



సీఎం రేవంత్ రెడ్డి సోదరుడిని ఏనుముల కృష్ణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోలుపునూరి కృష్ణ గౌడ్

నవతెలంగాణ-అంబర్‌పేట

క్రీడాకారులను ప్రోత్సహిస్తాం



నవతెలంగాణ-ముషీరాబాద్

తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్స్ జనరల్ బాడీ ఎలక్షన్స్‌లో భారీ మెజారిటీతో ప్రెసిడెంట్, జితేందర్ రెడ్డి జనరల్ సెక్రెటరీ, మల్లారెడ్డి, ట్రెజరర్‌గా డి.సతీష్ గౌడ్ గెలుపొందారు. కోర్టులో వాయిదాల మీదుగా వాయిదా వేసుకుంటా ఈ ఎలక్షన్ ముందుకు సాగినందుకు ఎలక్షన్‌లో భారీ విజయంగా సాధించారు. క్రీడాకారులు వివిధ అసోసియేషన్ సంఘాలు అభినందనలు తెలిపారు. రాబోయే రోజులకు స్పోర్ట్స్ క్రీడాకారులకు అదేవిధంగా గ్రామాల్లోన్న క్రీడాకారులకు, అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగిస్తామని కుల మతం లేకుండా క్రీడాకారులకు మేము ముందుగా ఉండి ప్రోత్సహిస్తామన్నారు.



నవతెలంగాణ-ముషీరాబాద్

అడిక్‌మెట్ డివిజన్ జామిస్తానియా వద్ద గల దీక్ష స్కూల్‌లో గీత జయంతి ఉత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహించారు. చిన్నారులు గీత పారాయణాన్ని అద్భుతంగా చేశారు.

కులస్తులు ఐక్యంగా ఉన్నప్పుడే సమస్యలు పరిష్కారం



నవతెలంగాణ-అంబర్‌పేట

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ముదిరాజ్ కులస్తులు ఐక్యంగా ఉన్నప్పుడే సమస్యలు పరిష్కారం అవుతాయని తెలంగాణ ముదిరాజ్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టి యాదగిరి ముదిరాజ్ చెప్పారు. రాష్ట్ర జనాభాలో అత్యధికంగా ఉన్న ముదిరాజ్ కులస్తులు అన్ని రంగాలలో ఎంతో వెనుకబడి ఉన్నారని, ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. బుధవారం సంఘం కార్యాలయంలో మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా ధ్యాగా రమముదిరాజ్, ఉపాధ్యక్షురాలిగా వద్దవల్లి శ్రీదేవిముదిరాజ్, ప్రధాన కార్యదర్శిగా బిచాల తులసీ ముదిరాజ్, కార్యదర్శిగా బాషం దివ్యాముదిరాజ్, గౌరవ అధ్యక్షుడిగా నవీన్ ముదిరాజ్, ఉపాధ్యక్షులుగా చింతల సత్యనారాయణ ముదిరాజ్, కె. అనంతయ్య ముదిరాజ్, ప్రధాన కార్యదర్శిగా అంజయ్య ముదిరాజ్, మహబూబ్‌నగర్ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా శివ ప్రసాద్ ముదిరాజ్, నగర ప్రచార కార్యదర్శిగా గౌతం ముదిరాజ్, అంబర్‌పేట ప్రధాన కార్యదర్శిగా శ్రావణ్ కుమార్ ముదిరాజ్‌ను నియమించి, వారికి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు యాదగిరిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం సలహాదారు అంబర్‌పేట శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రికార్డు స్థాయిలో పెరిగిన పామాయిల్ ధర

- వైట్ రేషన్ కార్డుదారులకు వంట నూనెను సబ్సిడీపై ప్రభుత్వ అందించాలి
- టీడీపీ వాణిజ్య శాఖ సెక్రెటరీ కేడి దినేష్



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

రాష్ట్రంలోని నిరుపేద, బడుగు, బలహీన, సామాన్య, మధ్య తరగతి కుటుంబాలు నిత్యం వినియోగించే వంట నూనె పామాయిల్ ధరలు రికార్డు స్థాయిలో పెరగడంతో నిరుపేదలు రెగ్యులర్‌గా వంట నూనెలు వినియోగించాలేని పరిస్థితులు నెలకొన్నాయని టీడీపీ రాష్ట్ర వాణిజ్య శాఖ సెక్రటరీ కేడి దినేష్ అన్నారు. బుధవారం ఆయన మాట్లా డుతూ.. గత బీఆర్ ఎస్ ప్రభుత్వం 10 ఏండ్లలో రేషన్ కార్డుల ద్వారా రాష్ట్రంలోని నిరుపేదలకు సబ్సిడీపై ఫామాయిల్ నిలిపివేయడంతో విధిలేని పరిస్థితుల్లో బాధిత నిరుపేదలు బహిరంగ మార్కెట్‌లో ఫామాయిల్ వంట నూనెలు కొనుగోలు చేస్తూ వంటలు వండుకుంటున్నారని, గత 10 ఏండ్ల క్రితం బహిరంగ మార్కెట్‌లో లీటర్ ఫామా యిల్ ధర రూ.60లు ఉండగా, ఇప్పుడు వంద రూపాయలకు పైబడి పెరగగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన సంవత్సరం కాలంలో అట్టి ఫామాయిల్ ధర లీటర్‌కు మరో రూ.40ల మేర పెరగడంతో నిరుపేదలు వంట నూనెలు కొనుగోలు చేయలేని విపత్కర పరిస్థితులు నెలకొన్నాయని, సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు తక్షణమే స్పందించి వైట్ రేషన్ కార్డు దారులకు ప్రభుత్వ పరంగా సబ్సిడీపై ఫామాయిల్ వంట నూనెలు పంపిణి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

రూ.10 లక్షల వరకు ఆర్థికసాయం అందించాలి




నవతెలంగాణ-ధూల్‌పేట్

రజక వృత్తిదారులకు ఫెడరేషన్‌తో ప్రతి రజక కుటుంబానికి రూ.10 లక్షల వరకు ఆర్థిక సహకారం అందించాలని రజక వృత్తిదారుల సంఘం హైదరాబాద్ సెంట్రల్ జిల్లా నాంపల్లి జోన్ కమిటీ అధ్యక్షులు చారగొండ వెంకట స్వామి అన్నారు. తెలంగాణ రజక వృత్తిదారుల సం ఘం హైదరాబాద్ సెంట్రల్ జిల్లా నాంపల్లి జోన్ కమిటీ సభ్యులు వి.రమేష్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతంలో నేటికీ రజకవృత్తిదారులపై కుల వివక్షత, దౌర్జన్యాలు, సామాజిక దాడులు పెత్తందారి వర్గాలచే కొనసాగుతు న్నాయన్నారు. వాటి అరికట్టడానికి సామాజిక భద్రత ప్రత్యేక చట్టం కల్పించి ఆదుకోవాలన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నేటికి రజక వృత్తిదారులకు కులవృత్తి జీవన ఆధారంగా వేలాది కుటుంబాలు ఉన్నాయన్నారు. వీరం దరూ నిరుపేదలని, వారికి ఇందిరమ్మ ఇండ్లలో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. బీసీ(ఎ) ఉన్నటువంటి రజకులకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రభుత్వ సంస్థలలో ప్రభుత్వ కార్యాలయలో రజకులకే వృత్తి కాంట్రాక్టులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా కార్యదర్శి మరియాల గోపాల్ మాట్లాడుతూ.. హైదరాబాద్ సెంట్రల్ జిల్లా పరిధిలో ఉన్నటువంటి పాత రజక సంఘాలన్ని రెన్యువల్ చేసుకోవాలని కొత్త సంఘాలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.బీసీ సంక్షేమ సహకార సంఘానికి అనుసంధానం చేసుకోవాలన్నారు. రజక వృత్తిదారులకు 50 ఏండ్లకు పింఛన్ ఇవ్వాలని, వారికి రక్షణ చట్టం కల్పించాలన్నారు. హైదరాబాద్ సెంట్రల్ జిల్లా పరిధిలో ఉన్నటువంటి రజకులకు ప్రభుత్వ భూములలో మోడ్రన్ దోబీ గాట్లు, కమ్యూనిటీ హాల్ ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని నిర్మించి ఇవ్వాలన్నారు. ప్రభుత్వం రజక వృత్తి దారులని ఆదుకోవడానికి రజక పెడరేషన్‌తో ప్రతి కుటుంబానికి రూ.10 లక్షల వరకు ఆర్థిక సహకారం అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి రాపర్తి ప్రభాకర్, సోషల్ మీడియా కన్వీనర్ సిహెచ్ నగేష్, జిల్లా ఉపాధ్యక్షురాలు వి.యాదమ్మ, సిహెచ్ పద్మ, జోన్ సభ్యులు లక్ష్మి, మాధవి ,చంద్రమోహన్, విఠల్, యాదయ్య, జే బాబు, రవీందర్, పద్మ, ఎం చంద్రమోహన్, శివ, కామేష్, కేశవులు వెంకటేశ్వర్లు, పాండు, వెంకటేష్, బాబు, శ్రీకాంత్, భరత్ గమల్ తదితరులు పాల్గొన్నారు.

ఉల్లి ఆరోగ్యానికి చేసే మేలు ఇంతా అంతా కాదు. అందుకే ఉల్లి చేసే మేలు తల్లి కూడా చేయదంటారు. కోస్తే కన్నీళ్లు పెట్టించినా.. దానితో చేసే వంటలు అమోఘం. చద్దన్నంలో ఉల్లి పడితే చలువ చేస్తుంది... దోసెల్లోకి పచ్చడి చేస్తే కళ్లకు అద్దుకుని తినాల్సిందే! అంతెందుకు ఉత్తి ఉల్లిపులుసు పెట్టినా లొట్టలేయాల్సిందే. అంతే కాదు కొన్ని రోగాలను సైతం ఉల్లి అరికట్టగలదు. అటువంటి ఉల్లి వంటల గురించి తెలుసుకుందామా...



ఉల్లి రుచులు



ఆరోగ్య ప్రయోజనాలు

ఉల్లిలో ఉండే విటమిన్-సి రోగనిరోధక శక్తిని పెంచుతుంది. చర్మ ఆరోగ్యానికి ఉపయోగపడే కొల్లాజన్ ఉత్పత్తికి తోడ్పడుతుంది. పచ్చి ఉల్లిపాయ చెడు కొవ్వును తగ్గించి గుండె ఆరోగ్యాన్ని కాపాడుతుంది. దీంట్లో ఉండే క్రోమియం రక్తంలో చక్కెర స్థాయులను నియంత్రిస్తుంది. ఉల్లిగడ్డలో ఉండే ఫోలేట్ నిద్రపట్టేలా, ఆకలి వేసేలా చేస్తుంది. కుంగుబాటు తగ్గడానికీ తోడ్పడుతుంది. పచ్చి ఉల్లి నమలడం వల్ల నోటి దుర్వాసనను అరికట్టవచ్చు. దంతక్షయాన్నీ నివారించవచ్చు.

మసాలా కూర

కావాల్సినవి: ఉల్లిగడ్డ- ఆరు, ధనియాల పొడి- టీస్పూన్, జీలకర్ర పొడి- టీస్పూన్, ఉప్పు- తగినంత,



కారం- సరిపడా, నువ్వులు, పల్లీల పేస్ట్- కప్పు, అల్లంవెల్లుల్లి పేస్ట్- టీస్పూన్, తరిగిన పచ్చిమిర్చి- మూడు, చింతపండు గుజ్జు- రెండు టేబుల్‌స్పూన్లు, ఆవాలు- టీస్పూన్, జీలకర్ర- టీస్పూన్, ఎండుమిర్చి- రెండు, పసుపు- చిటికెడు, కరివేపాకు- కొద్దిగా, కొత్తిమీర తురుము- కొద్దిగా, నూనె- మూడు టేబుల్ స్పూన్లు.

తయారీ విధానం: నువ్వులు, పల్లీలను వేయించి పొడి చేసుకోవాలి. స్టవ్ వెలిగించి కడాయిలో నూనె పోసి వేడిచేయాలి. ఆవాలు, జీలకర్ర, ఎండుమిర్చి, పచ్చిమిర్చి, కరివేపాకు వేసి వేయించాలి. తర్వాత పసుపు, కారం, అల్లంవెల్లులి, కొంచెం ఉప్పు కలిపి పచ్చివాసన పోయేంతవరకు వేయించాలి. ఇప్పుడు మిక్సీ పట్టిన నువ్వులు, పల్లీల మిశ్రమం, జీలకర్ర, ధనియాల పొడి, సరిపడా ఉప్పు, చింతపండు గుజ్జు వేసి కొన్ని నీళ్ల పోసి అన్నీ కలిసేట్టుగా బాగా కలపాలి. తర్వాత ఉల్లిగడ్డ, ధనియాలు, జీలకర్రపొడి వేయాలి. తగినన్ని నీళ్ల పోసి మూతపెట్టి పదిహేను నిమిషాలపాటు తక్కువ మంట మీద ఉడకనివ్వాలి. దించిన తర్వాత కొత్తిమీర తురుము వేసుకోవాలి. ఈ కూర అన్నం, చపాతీల్లోకి ఎంతో బాగుంటుంది.

ఉల్లిపొరక ఉక్కిరి

కావాల్సినవి: ఉల్లిపొరకలు- రెండు కట్టలు, నూనె- రెండు టేబుల్ స్పూన్లు, జీలకర్ర- అర టీస్పూన్, ఉల్లిగడ్డ- ఒకటి, పచ్చిమిర్చి- ఆరు, పసుపు- అర టీస్పూన్, అల్లంవెల్లుల్లి పేస్ట్- అర టీస్పూన్, ఉప్పు- తగినంత, కొత్తిమీర తురుము- టేబుల్ స్పూన్.




తయారీ విధానం: ఉల్లిపొరకలు, ఉల్లిగడ్డ, పచ్చిమిర్చిని చిన్నముక్కలుగా తరగాలి. కడాయిలో నూనె పోసి వేడిచేసి జీలకర్ర వేసి, అది చిటపటలాడాక ఉల్లిగడ్డ, పచ్చిమిర్చి ముక్కలు వేయాలి. ఇందులో పసుపు, అల్లంవెల్లుల్లి పేస్టు వేసి పచ్చివాసన పోయేంతవరకు వేయించాలి. తర్వాత ఉల్లిపొరకలు, ఉప్పు వేసి మూతపెట్టి పది నిమిషాలు మగ్గనివ్వాలి. ఉల్లిలో నీరు ఉంటుంది కాబట్టి ప్రత్యేకంగా నీళ్ల పోయాల్సిన పని లేదు. నీరంతా ఇంకిపోయి కూర దగ్గరకు వచ్చిన తర్వాత దించి కొత్తిమీర చల్లుకోవాలి. ఇష్టమైతే కొంచెం కారం కూడా వేసుకోవచ్చు.

పచ్చడి

కావాల్సినవి: ఉల్లిగడ్డ - రెండు, ఎండుమిర్చి- ఇరవై, చింతపండు- పెద్ద నిమ్మకాయంత, ధనియాలు- మూడు టీస్పూన్లు, మెంతులు- అర టీస్పూన్, వెల్లుల్లి రెబ్బలు- పది, ఆవాలు- అర టీస్పూన్, మినపప్పు- టీస్పూన్, పసుపు- పావు టీస్పూన్, ఇంగువ- చిటికెడు, ఉప్పు- తగినంత, నూనె- మూడు టేబుల్‌స్పూన్లు, కరివేపాకు రెబ్బ- ఒకటి, కొత్తిమీర- కొద్దిగా.

తయారీ విధానం: స్టవ్ వెలిగించి కడాయిలో కొద్దిగా నూనె పోసి వేడిచేయాలి. ఎండుమిర్చి, మెంతులు, ధనియాలు వేసి తక్కువ మంట మీద దోరగా వేయించాలి. వీటిని పక్కకు తీసి చల్లారబెట్టుకోవాలి. అదే కడాయిలో కొద్దిగా నూనె పోసి వేడెక్కాక ఉల్లిగడ్డ ముక్కలు వేయాలి. చిటికెడు ఉప్పు వేస్తే ఉల్లిగడ్డల్లోని నీరు బయటకు వచ్చి త్వరగా వేగుతాయి. ఇప్పుడు నానబెట్టిన



చింతపండును నీటితోపాటుగా వేసి ఉడకనివ్వాలి. వేయించిన ఎండుమిర్చిని మిక్సీ పట్టి పొడిచేసి పెట్టుకోవాలి. ఉల్లిగడ్డలు ఉడికి మిశ్రమం దగ్గరకు వచ్చిన తర్వాత పసుపు, కారం, ఉప్పు, ఎండుమిర్చి పొడి వేయాలి. ఇప్పుడు కొన్ని నీళ్ల పోసి తక్కువ మంట మీద నూనె పైకి తేలేంతవరకు ఉడికించాలి. చల్లారిన తర్వాత ఈ మిశ్రమాన్ని మిక్సీలో వేసి నీళ్ల కలపకుండా మెత్తగా చేసుకోవాలి. చివరగా కడాయిలో నూనె పోసి వేడెక్కాక తాలింపు దినుసులన్నీ వేసి వేయించాలి. ఇందులో పచ్చడి వేసి రెండు, మూడు నిమిషాల పాటు ఉడికించాలి. నూనె కొంచెం ఎక్కువగా వేస్తే వారం రోజులపాటు నిల్వ ఉంటుంది. ఈ పచ్చడిని ఒక్కరోజు కోసం చేసుకుంటే నూనె తక్కువగా వేసుకోవచ్చు. ఇది అన్నంలోకే కాకుండా ఇడ్లీ, దోసెల్లోకి కూడా బాగుంటుంది.

పులుసు

కావాల్సినవి: చిన్నముక్కలుగా కోసిన ఉల్లిగడ్డలు- నాలుగు, చింతపండు- నిమ్మకాయంత, పొడవుగా కోసిన పచ్చిమిర్చి- మూడు, ధనియాల పొడి- టేబుల్‌స్పూన్, వెల్లుల్లి రెబ్బలు- ఆరు, కరివేపాకు, కొత్తిమీర- కొద్దిగా, పసుపు- పావు టీస్పూన్, మెంతులు- టీస్పూన్, కారం- టేబుల్‌స్పూన్, నూనె- రెండు టేబుల్‌స్పూన్లు, ఉప్పు- సరిపడా.

తయారీ విధానం: చింతపండును నీళ్లలో నానబెట్టుకోవాలి. స్టవ్ వెలిగించి కడాయి పెట్టి నూనె పోసి వేడిచేయాలి. దీంట్లో మెంతులు, చిదిమిన వెల్లుల్లి వేసి ఇవి వేగాక పచ్చిమిర్చి, ఉల్లిగడ్డలు వేసి వేయించాలి. దీంట్లో కొద్దిగా ఉప్పు వేస్తే త్వరగా వేగుతాయి. తర్వాత మంట తగ్గించి మూత పెడితే త్వరగా మగ్గుతాయి. ఇప్పుడు కరివేపాకు వేసి ఉల్లిగడ్డలను రంగు మారేంత వరకు వేయించాలి. తర్వాత పసుపు, కారం, చింతపండు పులుసు వేసి కలపాలి. పులుసు చిక్కగా ఉంటే కొన్ని నీళ్ల పోయాలి. దీంట్లో ధనియాల పొడి వేసి ఉప్పు, కారం సరిచూసుకోవాలి. ఇప్పుడు సన్నని మంట మీద పులుసును ఉడకనివ్వాలి. నూనె పక్కలకు వచ్చిందంటే ఉడికినట్టే. ఉల్లిగడ్డలను సన్నగా తరిగితే పులుసు చిక్కగా ఉంటుంది. చివరగా కొత్తిమీర తురుము వేసుకోవాలి.

బరువు పెరిగితే..



ఊబకాయం.. ఇటీవల ఈ సమస్య సర్వసాధారణంగా మారిపోయింది. మారుతోన్న జీవన విధానం, తీసుకుంటున్న ఆహారంలో మార్పుల కారణంగా చాలా మంది ఈ సమస్యతో బాధపడుతున్నారు. ఇక శారీరక శ్రమ పూర్తిగా తగ్గిపోవడం వల్ల కూడా చిన్నారులు సైతం ఊబకాయం బారిన పడుతున్నారు. ఊబకాయం వల్ల గుండె సంబంధిత సమస్యలు వస్తాయని మనందరికీ తెలిసిందే. అయితే ఊబకాయంతో మరికొన్ని అనారోగ్య సమస్యలు కూడా తప్పవని నిపుణులు చెబుతున్నారు. ఇంతకీ ఊబకాయంతో వచ్చే ఆ అనారోగ్య సమస్యలు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం..

ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, అధిక బరువు డయాబెటిక్‌కు కారణమవుతుందని నిపుణులు చెబుతున్నారు. రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు ఎక్కువగా ఉన్నప్పుడు టైప్-2 మధుమేహం వస్తుంది. అధిక బరువు సమస్య దాని బారిన పడిన ప్రతి 10 మందిలో 9 మందిలో ఈ సమస్య కనిపిస్తుంది. అధిక రక్త చక్కెర కాలక్రమేణా పెరుగుతుంది, ఇది గుండె జబ్బులు, స్ట్రోక్, మూత్రపిండాల వ్యాధి, కంటి సమస్యలు, నరాల రుగ్మతలను పెంచుతుందని నిపుణులు చెబుతున్నారు.

ఊబకాయం వల్ల కాలేయ ఆరోగ్యానికి కూడా హాని కలుగుతుంది. అధిక బరువు కొవ్వు కాలేయ ప్రమాదాన్ని పెంచుతుంది. ఇది కాలేయం దెబ్బతినడానికి, కాలేయ సిర్రోసిస్, కాలేయ వైఫల్యానికి కూడా దారితీస్తుంది. ప్రపంచవ్యాప్తంగా వేగంగా పెరుగుతున్న నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్‌కి ఊబకాయం ఒక కారణమని పరిశోధకులు చెబుతున్నారు.

ఇక సాధారణం కంటే ఎక్కువ బరువు ఉన్న వ్యక్తులు రక్తపోటు సంబంధించిన సమస్యలకు ఎక్కువగా గురవుతుంటారు. రక్తపోటు ఎక్కువగా ఉన్నప్పుడు, రక్తం ఒత్తిడి రక్త నాళాల గోడలపై కూడా చాలా ప్రభావం చూపుతుంది. ఈ కారణంగా అధిక రక్తపోటు మూత్ర పిండాలను దెబ్బ తీస్తుందని చాలా అధ్యయనాలు ఉన్నాయి.

ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసై..

నవతెలంగాణ-తాండూర్



గుండెలపై అప్పుల కుంపటి ఓ వైపు.. నలుగురిలో తలెత్తుకోలేకపోతున్నామనే బాధ మరో వైపు ఆ కుటుంబాన్ని ఉక్కిరిబిక్కిరి చేశాయి. ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసై చేసిన అప్పులు తీర్చే మార్గం లేక తనువు చాలించడమే మేలని భావించి కుటుంబంలోని నలుగురు మంగళవారం రాత్రి పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందారు. ఈ ఘటన మంచిర్యాల జిల్లా తాండూర్ మండలం కాసిపేట గ్రామంలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి..సముద్రాల మొండయ్య(60) పాల వ్యాపారం చేసేవాడు. భార్య శ్రీదేవి(50) ఇంటి వద్ద చిన్న కొట్టు నడిపిస్తుండేది. కొడుకు శివప్రసాద్(35) మొదట్లో చిరు వ్యాపారం చేస్తూ కాలం గడిపేవాడు. మొండయ్య-శ్రీదేవి దంపతులకు శివప్రసాద్‌తో పాటు మానసిక వైకల్యం గల కూతురు చైతన్య(30) ఉంది. శివప్రసాద్ కొంత కాలంగా ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడ్డాడు. బెట్టింగ్ కోసం బంధువులు, గ్రామస్తుల వద్ద అప్పులు చేశాడు. ఇలా సుమారు రూ.50లక్షల వరకు అప్పులు చేసినట్టు తెలుస్తోంది. ఆన్‌లైన్ బెట్టింగ్‌లో డబ్బంతా పోగొట్టుకోవడం, అప్పులు ఇచ్చిన వారు తిరిగి ఇవ్వాలని ఒత్తిడి చేయడంతో కుటుంబ సభ్యులు మానసికంగా కుంగిపోయారు. ఈ క్రమంలో మంగళవారం కుటుంబం లోని నలుగురు పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గమనించిన గ్రామస్తులు వారిని మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లారు. అయినా ఫలితం లేకపోయింది. మంగళవారం రాత్రి మొండయ్య, శ్రీదేవి, చైతన్య మృతి చెందారు. శివప్రసాద్ బుధవారం చనిపోయాడు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఆత్మహత్య చేసుకోవడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. పాల వ్యాపారం ద్వారా జీవనాన్ని కొనసాగించే మొండయ్య గ్రామస్తులతో కలివిడిగా ఉండేవాడు. అందరినీ ఆప్యాయంగా పలకరించే వాడు. ఇంటి వద్ద చిల్లర కొట్టు వ్యాపారం చేసే భార్య శ్రీదేవి మహిళలతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉండేది. అప్పుల కుంపటి నుంచి తప్పించుకోవడానికి ఇంటి స్థలం అమ్మినా బాగుండేదని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. వడ్డీ వ్యాపారుల వేధింపులే కుటుంబ సభ్యులను బలి తీసుకున్నాయని అంటున్నారు.



ఉత్తమ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు అవార్డులిస్తాం

(మొదటిపేజి తరువాయి)

గడ్డం ప్రసాద్ కుమార్, శాసన సభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, డిప్యూటీ చైర్మెన్ బండా ప్రకాష్ తదితరులు జ్యోతి ప్రజ్వలనంతరం ప్రారంభించారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాప్రతినిధికి పదవి మహోన్నతమైందన్నారు. గత పదేండ్లలో ఎప్పుడూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించలేదని తెలిపారు. ప్రమాణస్వీకారం రోజునే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఐడీకార్డులతో పాటు రూల్స్ అండ్ రెగులేషన్స్‌కు సంబంధించిన పుస్తకాలను ఇస్తారనీ, వాటిని ఎవరూ చదవడం లేదని అన్నారు. ఇప్పుడు ఉన్న 119 మంది ఎమ్మెల్యేల్లో 57 మంది నూతనంగా ఎన్నికైన వారే ఉన్నారనీ, వారందరూ కచ్చితంగా ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 'ఎంబీబీఎస్ చదివితే డాక్టర్ అవుతారు . ఇంజినీరింగ్ చదివితే ఇంజినీర్ అవుతారు. అలాగే ప్రజల మనస్సు చదివితేనే ప్రజా ప్రతినిధులం అవుతాం' అని గుర్తు చేశారు. ఐదేండ్లపాటు ప్రజలతో మమేకమైతేనే భవిష్యత్తులో గెలుస్తామన్నారు. ప్రస్తుతం ఎన్నికల ఖర్చు పెరిగిపోవడం సమాజానికి మంచిది కాదని తెలిపారు. అతి సామాన్యుడు కూడా పోటీ చేసేలా ఉండాలని అభిప్రాయపడ్డారు. రాజకీయాల్లో విమర్శలకు భయపడకుండా ప్రతివిమర్శతో ముందుకుపోవాలని సూచించారు.

సినిమా రిలీజ్ వాయిదా వేసుకున్న చరిత్ర : స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

గతంలో శాసనసభ సమావేశాల సమయంలో సినిమాల రిలీజ్‌లు వాయిదా వేసుకున్న చరిత్ర ఉన్నదని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గుర్తు చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో చర్చలను ప్రజలు అంత ఆసక్తిగా గమనించేవారని తెలిపారు. అందులో రజబ్‌అలీ, రోశయ్య, బోడేపూడి వెంకటేశ్వరరావు, చెన్నమనేని విద్యాసాగర్‌రావు, ఓంకార్, వైయస్ రాజశేఖర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, నర్రా రాఘవరెడ్డి తదితరులు గొప్ప వక్తలుగా పేరు తెచ్చుకున్నారని తెలిపారు. సభలో మాట్లాడేందుకు సమాచారం, వాగ్ధాటితోపాటుగా సభా వ్యవహారాలు, నిబంధనలపై కూడా సభ్యులకు అవగాహన ఉండాలన్నారు. అప్పుడే సభ్యులు సభలో అర్థవంతంగా ప్రసంగిస్తారని గుర్తు చేశారు. నూతన సభ్యులతోపాటుగా సభ్యులందరికీ అవగాహన కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతున్నదని తెలిపారు. ప్రజాస్వామ్యంలో చట్టసభలది క్రియాశీల పాత్ర అన్నారు. ప్రజల ఆకాంక్షలకనుగుణంగా చట్టాలను రూపొందించాల్సిన బాధ్యత సభ్యులపై ఉందన్నారు. శాసన సభ్యులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని సూచించారు. శాసనసభ సమావేశాలు జరుగుతున్నప్పుడు రాష్ట్ర ప్రజలు ఆసక్తిగా గమనిస్తుంటారనీ, దాని గురించి చర్చించుకుంటా రని వివరించారు. సమావేశాలు ప్రత్యక్ష ప్రసారం కావడంతో సభ్యులు ఏం మాట్లాడుతున్నారో ప్రజలకు సులభంగా తెలిసిపోతుందన్నారు. జీరో అవర్, క్వశ్చర్ అవర్, తీర్మానాలు, అడ్జర్న్‌మెంట్ మెన్షన్స్, పాసింగ్ ఆఫ్ బిల్స్, పాసింగ్ ఆఫ్ బడ్జెట్, సభ్యుల మర్యాదలు, ప్రొటోకాల్, వ్యవహారాలు వంటి ముఖ్యమైన కార్యకలాపాలపై సభ్యులకు పూర్తి స్థాయి అవగాహన ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ నరసింహా చార్యులు, 65 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు.

ఉన్నా లేనట్టే !

(మొదటిపేజి తరువాయి)

లేరు. జాతుల ఘర్షణలతో అట్టుడికిపోతున్న మణిపూర్‌లో హక్కుల కమిషన్‌కు ఆగస్ట్ నుండి అధిపతే లేడు. తెలంగాణ, మిజోరంలో కూడా ఇదే పరిస్థితి.

తెలంగాణలో మరీ దారుణం

తెలంగాణ హక్కుల కమిషన్ పరిస్థితి మరీ ఘోరంగా ఉంది. 2022 డిసెంబర్ నుండి దానికి ఛైర్‌పర్సన్ కానీ, సభ్యులు కానీ లేరు. జస్టిస్ జి.చంద్రయ్య పదవీకాలం ముగిసిన తర్వాత ఎవరినీ ఛైర్‌పర్సన్‌గా నియమించలేదు. కమిషన్ వద్ద పది వేలకు పైగా కేసులు పెండింగులో ఉన్నాయి. దాని వెబ్‌సైటును పరిశీలిస్తే సుమారు రెండు సంవత్సరాల నుండి అది ఒక్కటంటే ఒక్క ఆదేశం కూడా జారీ చేయలేదు. గత నెలలో తెలంగాణలో అనేక మానవ హక్కుల ఉల్లంఘన ఘటనలు జరిగాయి. లైంగిక వేధింపులకు గురైన ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఉదంతం వాటిలో ఒకటి. లగచర్ల గ్రామంలో గిరిజనులను బలవంతంగా భూముల నుండి ఖాళీ చేయించిన సందర్భంగా వారిపై పోలీసులు వేధింపులకు పాల్పడ్డారు. ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు చనిపోయిన ఘటన మరొకటి.

బీజేపీది వక్రీకరణే

(మొదటిపేజి తరువాయి)

అంతర్జాతీయ సంస్థ ద్వారా ఆ దేశ విదేశాంగ శాఖ నిధులు సమకూరుస్తోందని బీజేపీ ఎంపీ సంబిత్ పాత్రా ఓ విలేకరుల గోష్టిలో ఆరోపణలు గుప్పించారు. బీజేపీ వాదనలకు షరా మామూలుగానే సామాజిక మాధ్యమాలలో విస్తృత ప్రాచుర్యం లభించింది. కుట్రకు అమెరికా ప్రభుత్వమే కారణమని బీజేపీ తన అధికారిక ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. కాగా ఇలాంటి ఆరోపణలు చేయడం విచారకరమని మన దేశంలో పనిచేస్తున్న అమెరికా రాయబారి వ్యాఖ్యానించారు.

ఆర్బీఐ గవర్నర్‌గా సంజయ్ మల్హోత్రా

బాధ్యతలు స్వీకరణ

ముంబయి : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నూతన గవర్నర్‌గా రెవెన్యూ కార్యదర్శి సంజయ్ మల్హోత్రా బాధ్యతలు స్వీకరించారు. ఆర్బీఐ 26వ గవర్నర్‌గా బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకూ గవర్నర్‌గా సేవలందించిన శక్తికాంత దాస్ పదవీకాలం మంగళవారంతో ముగిసింది. ఈ హోదాలో మల్హోత్రా మూడేండ్ల పాటు కొనసాగనున్నారు.

పెరిగిన మానవ అక్రమ రవాణా

(మొదటిపేజి తరువాయి)


వెలువరించింది. 2019లో కరోనా ముందు నాటి స్థాయితో పోల్చితే 2022లో ఈ అక్రమ రవాణా బాధితుల సంఖ్య 25శాతం మేరా పెరిగిందని పేర్కొంది. వ్యక్తుల అక్రమ రవాణాపై 2024 గ్లోబల్ రిపోర్ట్‌ను మాదకద్రవ్యాలు, నేరాలపై ఐక్యరాజ్య సమితి కార్యాలయం (యుఎన్‌ఓడిసి) ప్రచురించింది. ఇందుకు దారిద్ర్యం, ఘర్షణలు, వాతావరణ విపత్తులు వంటి అంశాలను కారణాలుగా చూపింది. వీటివల్ల ప్రజలు దోపిడీకి గురి కావడానికి అవకాశాలు పెరిగాయని పేర్కొంది. బాలల రవాణా, బలవంతంగా కార్మికులను తరలించడం, అలాగే బలవంతంగా నేరాలు చేయించడం వంటి అంశాలు కూడా ఇదే కాలంలో పెరిగాయని ఆ నివేదిక పేర్కొంది. అంతర్జాతీయంగా చూసినట్లైతే వెట్టి చాకిరి కోసం తరలించే బాధితుల సంఖ్య 2019తో పోలిస్తే 2022లో 47 శాతం పెరిగింది. బాలల బాధితుల సంఖ్య 31 శాతం పెరిగింది. ఇక బాలికల అక్రమ రవాణా 38 శాతం పెరిగిందని నివేదిక పేర్కొంది. 156 దేశాలకు చెందిన డేటాను ఈ నివేదిక విశ్లేషించింది. ప్రపంచవ్యాప్తంగా 2022లో ఈ అక్రమ రవాణా బాధితుల్లో మహిళలు, బాలికలు 61 శాతం వున్నారని వెల్లడించింది. వీరిలో 60శాతం మంది బాలికలను లైంగిక దోపిడీ కోసమే బలవంతంగా తరలించారని పేర్కొంది. ఆన్‌లైన్ కుంభకోణాలతో సహా బలవంతంగా నేరాలకు పాల్పడేలా చేయడం కూడా బాగా పెరిగిందని పేర్కొంది. 2016లో ఇటువంటి నేరాల సంఖ్య కేవలం ఒక్క శాతమే వుండేదని 2022నాటికి 8శాతానికి పెరిగిందని నివేదిక తెలిపింది. ఇందుకు పాల్పడేవారిని జవాబుదారీగా చేయడానికి బలోపేతమైన క్రిమినల్ జస్టిస్ చర్యలు తీసుకోవాల్సి వుందని యుఎన్‌ఓడిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఘడా వాలీ పిలుపిచ్చారు. బాధితులను కాపాడేందుకు, దీన్నుండి బయటపడిన వారికి సాయమందించేందుకు దేశాల మధ్య సహకారం కూడా పెరిగాల్సి వుందన్నారు.

సివిల్స్ మెయిన్స్‌లో తెలంగాణ అభ్యర్థుల సత్తా

(మొదటిపేజి తరువాయి)

20 మంది తాజాగా యూపీఎస్సీ మెయిన్స్ ఫలితాల్లోనూ విజేతలుగా నిలిచారు. వరంగల్ అర్బన్ జిల్లాకు చెందిన ఈ సాయి శివాని, రాహుల్ శంకేషి, పోతరాజు హరి ప్రసాద్, విక్రమ్ బేతి, ఖమ్మం జిల్లాకు చెందిన నల్లమల సాయికుమార్, బానోతు నాగ రాజా నాయక్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాకు చెందిన కడారి శ్రీవాణి, గాదె శ్వేత, రాపర్తి ప్రీతి, మెదక్ జిల్లాకు చెందిన కుమ్మరి శ్రవణ్ కుమార్, రంగారెడ్డి జిల్లాకు చెందిన మహమ్మద్ అశ్ఫాక్, తొగరు సూర్యతేజ, మహబూబాబాద్ జిల్లాకు చెందిన బెస్త ప్రియాంజలి, సిద్దిపేటకు చెందిన నరిగె స్వామి, నాగర్‌కర్నూల్‌కు చెందిన గోకమల్ల ఆంజనేయులు, ఆదిలాబాద్‌కు చెందిన ఆర్ ప్రమోద్ కుమార్, వికారాబాద్‌కు చెందిన బి ప్రహ్లాద్, జగిత్యాలకు చెందిన బురుగుపెల్లి నీరజ్ కుమార్, భద్రాద్రి కొత్తగూడెంకు చెందిన జస్వంత్ కుమార్, ఆసిఫాబాద్ కొమురంభీం జిల్లాకు చెందిన రామ్టెంకి సుధాకర్ మెయిన్స్ ఫలితాల్లో అర్హత సాధించిన వారి జాబితాలో ఉన్నారు. ఇంటర్వ్యూలోనూ ఉత్తమ ప్రతిభను కనబరిచి సివిల్స్ ఫలితాల్లో విజయం సాధించాలనీ, తెలంగాణకు మంచిపేరు తేవాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు.

బియ్యం కుంభకోణం



నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వానికి మిల్లర్లు ఇవ్వాల్సిన కస్టమ్ మిల్లింగ్ రైస్‌కు సంబంధించి భారీ కుంభకోణం బయటపడింది. రెండు మిల్లుల నుంచి ప్రభుత్వానికి అందాల్సిన రూ.217 కోట్ల బియ్యం ఎగవేత వెలుగులోకొచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యాన్ని ఐకేపీ, పీఏసీఎస్, మెప్మాల ద్వారా కొనుగోలు చేసి రైస్ మిల్లులకు కేటాయిస్తుంది. అయితే, కస్టమ్ మిల్లింగ్ పద్ధతి ఒప్పందం ప్రకారం ప్రభుత్వానికి ఇవ్వాల్సిన బియ్యాన్ని ఇవ్వకుండా బయట మార్కెట్‌లో అమ్ముకున్న వ్యవహారం బయటపడింది. సూర్యాపేట జిల్లా గరిడేపల్లి, నేరేడుచర్ల మండలం దిర్సంచెర్ల మిల్లుల్లో రూ.217 కోట్ల కస్టమ్ మిల్లింగ్ బియ్యం కుంభకోణం వెలుగులోకి వచ్చింది. వీటి నిర్వాహకులు ఇద్దరూ తండ్రీకొడుకులు. దీనిపై కేసులు నమోదయ్యాయి.

గరిడేపల్లిలో సంతోషిమా రైస్ మిల్లు కార్పొరేషన్ యజమాని బి.వెంకటేశ్వర్లు 2022-23 ఖరీఫ్, రబీ, 2023-24 ఖరీఫ్ పంటలకు చెందిన 33వేల 938 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంది. దాని విలువ రూ.110 కోట్లు. నేరేడుచర్ల మండలం దిర్సంచర్ల గ్రామంలోని తిరుమల రైస్ మిల్ కార్పొరేషన్‌కు చెందిన జి.రాజేష్ 2022 -23 ఖరీఫ్, రబీ, 2023-24 ఖరీఫ్ పంటకు సంబంధించిన 32వేల 779 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉంది. దీని విలువ రూ.107 కోట్లు. అయితే, ప్రభుత్వానికి ఇవ్వాల్సిన సీఎంఆర్ ఇవ్వాలని మూడు మాసాలుగా ఆయా రైస్ మిల్లుల యజమానులకు పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ ప్రసాద్ 12 సార్లు నోటీసులు జారీ చేశారు. అయినా ఎలాంటి స్పందనా లేకపోవడంతో డీటీసీఎస్ హుజూర్‌నగర్, డీసీఎస్ తహసీల్దార్ గరిడేపల్లి, హైదరాబాద్ ఈటిఎఫ్ బృందం సంతోషిమా, తిరుమల రైస్ కార్పొరేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. అక్కడ నిల్వ ఉన్న ధాన్యం బస్తాలు, ప్రభుత్వానికి చెల్లించాల్సిన కస్టమ్ మిల్లింగ్ రైస్‌కు తగ్గ లెక్క సరిపడలేదు. ప్రభుత్వానికి ఇవ్వాల్సిన బియ్యాన్ని వ్యక్తిగతంగా అమ్ముకున్నట్టు తేలింది. దీంతో అధికారులు జిల్లా కలెక్టర్ సూచన మేరకు గరిడేపల్లి, నేరేడుచర్ల మండల పరిధిలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూర్యాపేట జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ ప్రసాద్ ఫిర్యాదు చేశారు. అయితే, ఈ రెండు రైస్ మిల్లుల యజమానులు వెంకటేశ్వర్లు, రాకేష్ గతంలో కూడా ఇలాంటి వ్యవహారం సూర్యాపేట జిల్లాలో బయటపడింది. ఉద్దేశపూర్వకంగా తండ్రీకొడుకులు రూ.217 కోట్లు విలువగల బియ్యాన్ని పక్కదారి పట్టించినట్టు ఆరోపణలొస్తున్నాయి.

12 నోటీసులు ఇచ్చినా స్పందించలేదు

పౌరసరఫరాల శాఖ సూర్యాపేట జిల్లా మేనేజర్ ప్రసాద్

గరిడేపల్లిలో సంతోషిమా రైస్ కార్పొరేషన్ మిల్లు యజమాని బి.వెంకటేశ్వర్లు 33వేల 938 మెట్రిక్ టన్నులు, నేరేడుచెర్ల మండలం దిర్సంచెర్ల తిరుమల రైస్ మిల్ కార్పొరేషన్ యజమాని జి.రాజేష్ 32వేల 779 మెట్రిక్ టన్నుల బియ్యం ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉంది. ఇందుకోసం మూడు నెలల్లో 12సార్లు నోటీసులు ఇచ్చినా స్పందించలేదు. చివరకు ఆయా రైస్ మిల్లుల్లో అధికారులతో కలిసి ఈనెల 10న తనిఖీ నిర్వహించాం. మిల్లుల యజమానులు ఒప్పందాన్ని ఉల్లంఘించి ధాన్యం నిల్వను మొత్తానికి దుర్వినియోగం చేశారు. కస్టమ్ మిల్లింగ్ రైస్‌ను సకాలంలో ప్రభుత్వానికి అప్పగించడంలో విఫలమవ్వడంతోపాటు బయట అమ్ముకున్నట్టు తేలింది. పై అధికారుల సూచనతో చట్టపరమైన చర్యల కోసం పోలీసులను ఆశ్రయించాం. పెనాల్టీ, సంవత్సరానికి 12శాతం వడ్డీ సహా, నేరపూరిత విశ్వాస ఉల్లంఘన జరిగినట్టు ఫిర్యాదులో పేర్కొన్నాం.

సమాజానికి జ్ఞాన భాండాగారాన్ని అందించాలి

- హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ అధ్యక్షులు డా.యాకూబ్
- అందుబాటులో అన్ని రకాల భాషల పుస్తకాలు : సొసైటీ కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ (వాసు)

ఈ నెల 19 నుంచి 29 వరకు 37వ హైదరాబాద్ బుక్ ఫెయిర్



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

బుక్ ఫెయిర్ అంటే పుస్తకాలు అమ్ముకోవడం కాదని, జ్ఞాన భాండాగారాన్ని సమాజానికి అందించడమని హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ అధ్యక్షులు డా.యాకుబ్ షేక్ అన్నారు. సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లో ప్రతి ఏడాదీ జరిగే ఈ బుక్ ఫెయిర్ ఒక ముఖ్యమైన సాహిత్య పుస్తకాల పండుగగా రూపుదిద్దుకుంటోందని చెప్పారు. ఈ నెల 19 నుంచి 29వ తేదీ వరకు 37వ హైదరాబాద్ బుక్ ఫెయిర్ ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ బుక్ ఫెయిర్ ఉంటుందని, అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ బుక్ ఫెయిర్‌లో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక దేశ విదేశాల నుంచి ప్రచురణకర్తలు, పంపిణీదారులు దాదాపు 380కు పైగా స్టాళ్లలో పుస్తకాలను ప్రదర్శిస్తారని చెప్పారు. తమ సొంత రచనలు, ప్రచురణలను పాఠకులకు పరిచయం చేసుకోవడానికి రచయితలకు ప్రత్యేక రైటర్ స్టాల్స్ కేటాయిస్తున్నామని, ప్రత్యేక మీడియా సెంటర్లు, వివిధ ప్రభుత్వ శాఖల స్టాల్స్ కూడా ఉంటాయని వివరించారు. ఈ 37వ హైదరాబాద్ బుక్ ఫెయిర్ ప్రాంగణానికి దాశరథి కృష్ణమాచార్య, సభ కార్యక్రమాల వేదికకు బోయి విజయభారతి, పుస్తకాల ఆవిష్కరణ వేదికను తోపుడుబండి సాధిక్ పేర్లతో ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. బుక్ ఫెయిర్ సొసైటీ కార్యక్రమాలను పర్యవేక్షించడానికి, కార్యక్రమ నిర్వహణలో సూచనలు ఇవ్వడానికి సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎం.కోదండరామ్, సీనియర్ ఎడిటర్ కె.రామచంద్రమూర్తి, రిటైర్డ్ ప్రొఫెసర్ ఆచార్య రమామేల్కొటే సలహాదారులుగా ఉన్నారన్నారు.

బుక్ ఫెయిర్‌లను వ్యాపారం కోసం కాకుండా తెలంగాణ భాష, సంస్కృతి, సంప్రదాయాల సమ్మేళనం కోసం నిర్వహిస్తున్నామన్నారు. నేటి సెల్‌ఫోన్ యుగంలోనూ పుస్తక పఠనం తగ్గలేదన్నారు. ప్రతి ఊరిలో ఒక లైబ్రరీ ఉంటే ఆ ఊరు జ్ఞాన సమాజం వైపు పయనిస్తుందని చెప్పారు. జ్ఞాన సమాజం ఏర్పడటానికి ఈ హైదరాబాద్ బుక్‌ఫెయిర్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులు, యువతలో జ్ఞానాన్ని ప్రభావితం చేయడమే తమ సొసైటీ ముఖ్య ఉద్దేశమని చెప్పారు.

సొసైటీ కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ (వాసు) మాట్లాడుతూ.. ఢిల్లీ, మద్రాస్, కలకత్తా నగరాల్లో బుక్ ఫెయిర్‌లు నడుపుతున్నారని, వాటికి దీటుగా తమ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే హైదరాబాద్ బుక్‌ఫెయిర్ ఉంటుందని, దీన్ని ఎంతో వినూత్నంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. అన్ని రాష్ట్రాలు, దేశ విదేశాల నుంచి పంపిణీదారులు, ప్రచురణకర్తలు, రచయితల పుస్తకాలు, అన్ని రకాల భాషల పుస్తకాలు ఇందులో అందుబాటులో ఉంటాయన్నారు. ఇందులో 171 ఇంగ్లీష్, 168 తెలుగు, ఉర్దూ, హిందీ స్టాల్స్ ఉంటాయన్నారు. పది రోజులపాటు జరిగే ఈ బుక్‌ఫెయిర్‌లో సందర్శకులకు తెలంగాణ వంటకాలు, హైదరాబాద్ బిర్యానీ, ఇరానీ చాయ్, పావ్‌బాజీ వంటి తదితర వంటకాలు అందుబాటులో ఉంటాయ న్నారు. బుక్ ఫెయిర్ ప్రారంభోత్సవం రోజున బుక్ వాక్‌ను నిర్వహిస్తున్నామని చెప్పారు. బుక్ ఫెయిర్‌లో పలు కంపెనీల సీఈవోలు, ప్రభుత్వ ప్రతినిధులు, అన్ని పత్రికల సంపాదకులను భాగస్వామ్యం చేయనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో సొసైటీ ట్రెజరర్ పి.నారాయణరెడ్డి, ఎగ్జిక్యూటివ్ కమిటీ ఉపాధ్యక్షులు కె.బాల్ రెడ్డి, బి.శోభన్ బాబు, సంయుక్త కార్యదర్శులు కె.సురేష్, ఎం.సూరిబాబు, సభ్యులు ఎ.జనార్దన్ గుప్త, జి.విజయరావు, ఎస్.మధుకర్, ఎస్.కోటేశ్వరరావు, ఆర్.శ్రీకాంత్,యు.శ్రీనివాసరావు, టి.సాంబశివరావు, స్వరాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంధాన శతకబాదినా..!

మూడో వన్డేలోనూ భారత్ పరాజయం



పెర్త్ : భారత మహిళల జట్టు పరిపూర్ణ పరాజయం చవిచూసింది. ఆస్ట్రేలియా మహిళలతో వన్డే సిరీస్‌ను 0-3తో కోల్పోయింది. బుధవారం పెర్త్ వాకా గ్రౌండ్‌లో జరిగిన మూడో వన్డేలో ఆసీస్ అమ్మాయిలు 83 పరుగుల తేడాతో విజయం సాధించారు. ఆస్ట్రేలియా తొలుత 50 ఓవర్లలో 6 వికెట్లకు 298 పరుగులు చేసింది. అనాబెల్ (110) సెంచరీ బాదగా.. గార్డ్నర్ (50), మెక్‌గ్రాత్ (56) అర్ధ సెంచరీలతో మెరిశారు. ఛేదనలో ఓపెనర్ స్మృతీ మంధాన (105) సెంచరీతో మెరిసినా ఇతర బ్యాటర్లు తేలిపోయారు. 45.1 ఓవర్లలోనే భారత్ 215 పరుగులకు కుప్పకూలింది. ఆసీస్ బౌలర్ సోఫీ (5/30) ఐదు వికెట్ల ప్రదర్శన చేసింది.

గుకేశ్ మెరిసినా..!

డ్రాగా ముగిసిన 13వ గేమ్
ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్



సింగపూర్ : 2024 ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్‌లో మరో గేమ్ డ్రాగా ముగిసింది. గత రెండు గేముల్లో స్పష్టమైన ఫలితాలు రావటంతో బుధవారం జరిగిన 13వ గేమ్‌పై ఉత్కంఠ కనిపించింది. తెల్ల పావులతో ఆడిన భారత గ్రాండ్‌మాస్టర్ డి. గుకేశ్ దూకుడు ప్రదర్శించినా.. డ్రాతో ముగించక తప్పలేదు. డిఫెండింగ్ చాంపియన్, చైనా గ్రాండ్‌మాస్టర్ డింగ్ లిరెన్ నల్ల పావులో ఎత్తులు వేసి కీలక గేమ్‌ను డ్రా చేసుకున్నాడు. 13 గేముల అనంతరం గుకేశ్, లిరెన్‌లు 6.5-6.5తో సమవుజ్జీలుగా నిలిచారు. 68 ఎత్తుల పాటు ఉత్కంఠ రేపిన గుకేశ్ ఆకట్టుకున్నాడు. కానీ ఒత్తిడిలో డింగ్ లిరెన్ మరింత ప్రమాదకరంగా కనిపించాడు. గుకేశ్ ఎత్తులను సమర్థవంతంగా ఎదుర్కొని కీలక గేమ్‌ను డ్రా చేశాడు. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో క్లాసికల్ ఫార్మాట్‌లో 14 గేములు ఉంటాయి. నేడు 14వ గేమ్ జరుగనుంది. క్లాసికల్ ఫార్మాట్‌లో జరుగుతున్న చివరి గేమ్‌లో గుకేశ్, లిరెన్‌లు స్పష్టమైన ఆధిక్యం సాధిస్తే చెస్ రారాజు ఎవరనే పోటీ ఇక్కడితో ముగుస్తుంది. 14వ గేమ్ సైతం డ్రాగా ముగిస్తే.. ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ రేసు టైబ్రేకర్లతో తేలనుంది. సంప్రదాయ క్లాసికల్ ఫార్మాట్‌లో గుకేశ్‌కు మంచి పట్టుంది. ఏడాది పాటు క్లాసికల్ గేమ్‌లో తిరుగులేని జోరు చూపించాడు. చివరి గేమ్‌లో లిరెన్ తెల్ల పావులతో ఆట మొదలెట్టనున్నాడు. ఇది గుకేశ్‌కు కాస్త ప్రతికూలమే.. అయినా డ్రాగన్ గ్రాండ్‌మాస్టర్‌ను నిలువరించగల సత్తా యువ ఆటగాడిలో ఉంది. ప్రపంచ చాంపియన్‌షిప్ ఫలితం టైబ్రేకర్‌లో తేలాల్సి వస్తే.. అప్పుడు కచ్చితంగా గుకేశ్‌కు కాస్త ప్రతికూలత ఉండనుంది. గతంలో డింగ్ లిరెన్ టైబ్రేకర్‌లోనే ప్రపంచ చెస్ కిరీటం దక్కించుకున్నాడు.

అనుమతులిచ్చిన అధికారుల నుంచే
పరిహారం ఇప్పిస్తాం : హైకోర్టు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం నార్కుడ గ్రామంలోని మంగర్షికుంట ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లో నిర్మాణాలు చేపట్టేందుకు అనుమతులు ఇచ్చిన అధికారులు, కొన్నేండ్ల తర్వాత అవి అక్రమమని నోటీసులు ఎలా ఇస్తారని హైకోర్టు ప్రశ్నించింది. ఇలాంటి నిర్మాణలకు అనుమతులిచ్చిన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాల్సివుంటుందని హెచ్చరించింది. కూల్చివేత చర్యలు తీసుకుంటే బాధితులకు పరిహారం ప్రభుత్వ ఖజానా నుంచి కాకుండా అనుమతులిచ్చిన అధికారుల నుంచి ఇప్పిస్తామని హెచ్చరించింది. పర్మిషన్లు ఇచ్చిన ఆఫీసర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఇప్పటికే ఉత్తర్వులు ఇచ్చామని గుర్తు చేసింది. తిచిన్ జైశ్వాల్ ఇతరులు వేసిన కేసును జస్టిస్ భాస్కర్‌రెడ్డి బుధవారం విచారించారు. నార్కుడ గ్రామం మంగర్షికుంట ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో నిర్మాణాలు ఉన్నాయనీ, వారంలోగా వాటిని తొలగించాలని నీటిపారుదల శాఖ అధికారులు తమ ఇండ్ల గోడలపై నోటీసులు అతికించారని పిటిషనర్లు చెప్పారు. ఆ నోటీసుల మేరకు పిటిషనర్ల ఆస్తుల విషయంలో కఠిన చర్యలు తీసుకోరాదని న్యాయమూర్తి ఆదేశించారు. వారు పొందిన అనుమతి పత్రాలను అధికారులకు అందజేయాలనీ, ఆ తర్వాత అధికారుల చర్యలు చట్ట ప్రకారం ఉండాలన్నారు. నోటీసులపై పిటిషనర్లు 15 రోజుల్లో అన్ని ఆధారాలు, పత్రాలతో సమాధానం ఇవ్వాలన్నారు.

పెట్రోల్ బంక్‌లో అగ్నిప్రమాదం

- ట్యాంకులో చెలరేగిన మంటలు
- తప్పిన పెను ప్రమాదం
- బంక్ పక్కనే రైల్వే స్టేషన్



నవతెలంగాణ -సుల్తాన్ బజార్/మెహిదీపట్నం

హైదరాబాద్ లోని నాంపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో ఓ పెట్రోల్ బంక్ వద్ద అగ్నిప్రమాదం జరిగింది. పెట్రోలియం ట్యాంకు నుంచి ఒక్కసారిగా మంటలు రావడంతో స్థానికులు పరుగులు తీశారు. వివరాల్లోకెళ్తే.. నాంపల్లిలోని ఏక్‌మినార్ కూడలి వద్ద బుధవారం హెచ్‌పీ పెట్రోల్ బంకులో ఆయిల్ నింపడానికి హిందూస్థాన్ పెట్రోలియం ట్యాంకర్ వచ్చింది. ఆ సమయంలో ట్యాంకర్ మూత నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన డ్రైవర్ వెంటనే వాహనాన్ని రోడ్డు వైపుకు మళ్లించాడు. స్థానికులు భయాందోళనతో పరుగులు తీశారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చింది. అంతకుముందు బంక్ సిబ్బంది ఫైర్ గ్యాస్ ఉపయోగించినా మంటలు అదుపులోకి రాలేదు. నాంపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పెట్రోల్ బంక్ సమీపంలోనే రైల్వేస్టేషన్ ఉంది. బంక్‌కు మంటలు వ్యాపించి ఉంటే భారీ ప్రమాదం సంభవించి ఉండేది.

అధ్యక్షుడిగా ఏపీ జితేందర్‌రెడ్డి

ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన పి.మల్లారెడ్డి
తెలంగాణ ఒలింపిక్ సంఘం ఎన్నికల ఫలితాలు



నవతెలంగాణ-హైదరాబాద్ : తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ (టీఓఏ) అధ్యక్షుడిగా రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి ఎన్నికయ్యారు. నవంబర్ 21న టీఓఏ ఎన్నికలు నిర్వహించగా.. న్యాయస్థానం స్టే ఉత్తర్వులతో ఫలితాలు వెల్లడించలేదు. తాజాగా సిటీ సివిల్ కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇవ్వటంతో బుధవారం ఎల్బీ స్టేడియంలోని ఒలింపిక్ భవన్‌లో ఓట్లను లెక్కించి, ఫలితాలు వెల్లడించారు. అధ్యక్ష పదవి కోసం పోటీపడిన చాముండేశ్వరనాథ్‌కు 9 ఓట్లు రాగా.. ఏపీ జితేందర్ రెడ్డికి 43 ఓట్లు పడ్డాయి. 34 ఓట్ల తేడాతో ఏపీ జితేందర్ రెడ్డి ఘన విజయం సాధించారు. ప్రధాన కార్యదర్శిగా పి.మల్లారెడ్డి ఎన్నికయ్యారు. బాబారావుకు 12 ఓట్లు లభించగా, మల్లారెడ్డి 40 ఓట్లు సాధించారు. కోశాధికారిగా సతీశ్ గౌడ్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్ష (4), సంయుక్త కార్యదర్శి (4) సహా ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు (15) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొత్తగా ఎన్నికైన ఆఫీస్ బేరర్లు నాలుగేండ్ల పాటు పదవిలో కొనసాగనున్నారు. రిటర్నింగ్ ఆఫీసర్ విశ్రాంత న్యాయమూర్తి సి. ప్రవీణ్ కుమార్ ఆఫీస్ బేరర్లుగా ఎన్నికైన వారికి ధ్రువపత్రాలు అందజేశారు.

ఉత్సాహంగా సీఎం కప్ పోటీలు

ములుగులో కబడ్డీ ఆడిన మంత్రి సీతక్క



నవతెలంగాణ - హైదరాబాద్ : సీఎం కప్ 2024 పోటీలు రాష్ట్ర వ్యాప్తంగా ఉత్సాహభరిత వాతావరణంలో సాగుతున్నాయి. రెండు రోజుల పాటు సాగిన తొలి అంచె గ్రామ స్థాయి పోటీలు ముగియగా.. మంగళవారం నుంచి రెండో అంచె మండల స్థాయి పోటీలు జరుగుతున్నాయి. అథ్లెటిక్స్, వాలీబాల్, యోగ, ఖోఖో, కబడ్డీ సహా పలు క్రీడాంశాల్లో మండల స్థాయిలో క్రీడాకారులు పోటీపడుతున్నారు. ములుగు మండల కేంద్రంలో బుధవారం జరిగిన సీఎం కప్ పోటీలకు రాష్ట్ర మంత్రి సీతక్క హాజరయ్యారు. క్రీడాకారులతో కలిసి కబడ్డీ ఆడిన మంత్రి సీతక్క అథ్లెట్స్‌లో క్రీడా స్ఫూర్తి నింపారు. మండల స్థాయిలో సీఎం కప్ పోటీలు గురువారంతో ముగియనున్నాయి.

మండల స్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులను జిల్లా స్థాయి అంచె పోటీలకు ఎంపిక చేస్తారు. జిల్లా స్థాయి సీఎం కప్ పోటీలు ఈ నెల 16 నుంచి ఆరంభం కానున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న మండల స్థాయి సీఎం కప్ పోటీలను తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (శాట్) చైర్మన్ కే. శివసేనా రెడ్డి, ఉన్నతాధికారులు ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కేంద్రీకృత మానిటరింగ్ సెల్ నుంచి పర్యవేక్షిస్తున్నారు. పోటీల వివరాలు, ఫలితాలు, ప్రతిభ చాటిన క్రీడాకారుల వివరాలను శాట్ యంత్రాంగం ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తుంది.

నవచిత్రం



'దండోరా' మొదలైంది

నేషనల్ అవార్డ్ గెలుచుకున్న చిత్రం 'కలర్ ఫోటో', 'బెదురులంక 2012' వంటి విజయవంతమైన చిత్రాలను నిర్మించి, అందరి దృష్టిని ఆకర్షించిన లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత రవీంద్ర బెనర్జీ ముప్పానేని మరో సినిమాకు శ్రీకారం చుట్టారు. ఈ నిర్మాణ సంస్థలో 'దండోరా' సినిమా రూపొందనుంది. మురళీకాంత్ దర్శకత్వంలో తెరకెక్కబోతున్న ఈ మూవీ బుధవారం రామానాయుడు స్టూడియోలో పూజా కార్యక్రమాలను లాంఛనంగా పూర్తి చేసుకుంది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత సాహు గారపాటి క్లాప్ కొట్టగా, 'బేబీ' నిర్మాత ఎస్‌కేఎన్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. ప్రొడ్యూసర్ సూర్యదేవర నాగవంశీ గౌరవ దర్శకత్వం వహించారు.

తెలంగాణ గ్రామీణ నేపథ్యంతో 'దండోరా' సినిమాను రూపొందించనున్నారు. మన పురాతన ఆచారాలు, సాంప్రదాయాలను ఆవిష్కరిస్తూనే వ్యంగ్యం, చక్కటి హాస్యం, హృదయాన్ని హత్తుకునే భావోద్వేగాల కలయికగా ఈ సినిమా తెరకెక్కనుంది. విలక్షణ నటుడు శివాజీతో పాటు నవదీప్, రాహుల్ రామకృష్ణ, రవికృష్ణ, మనీక చిక్కాల, అనూష తదితరులు ప్రధాన పాత్రలతో మెప్పించనున్నారు అని చిత్ర బృందం తెలిపింది.

ఈ చిత్రానికి నిర్మాత: రవీంద్ర బెనర్జీ ముప్పానేని, దర్శకత్వం: మురళీకాంత్, సినిమాటోగ్రఫీ: వెంకట్ ఆర్.శాఖమూరి, ఎడిటర్: గ్యారీ బి.హెచ్, మ్యూజిక్ డైరెక్టర్: మార్క్ కె.రాబిన్, ఆర్ట్ డైరెక్టర్: క్రాంతి ప్రియం, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎడ్వర్డ్ స్టీవెన్‌సన్ పెరెజీ, కో ప్రొడ్యూసర్: అనీష్ మరిశెట్టి.

అర్థవంతమైన పాత్ర చేశా



అమృత అయ్యర్

హీరో అల్లరి నరేష్ నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'బచ్చల మల్లి'. సుబ్బు మంగాదేవి దర్శకుడు. 'సామజవరగమన, ఊరు పేరు భైరవకోన' బ్లాక్‌బస్టర్స్ తర్వాత హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా, బాలాజీ గుత్తా ఈ చిత్రాన్ని నిర్మించారు. క్రిస్మస్ సందర్భంగా ఈ నెల 20న ఈ సినిమా విడుదల కానుంది.

ఈ సందర్భంగా హీరోయిన్ అమృత అయ్యర్ మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

- 'హనుమాన్' చిత్రీకరణ సమయంలో ఈ కథ విన్నాను. స్క్రిప్ట్, క్యారెక్టర్ చాలా నచ్చింది. ఈ కథలో నా క్యారెక్టర్‌కి చాలా ఇంపార్టెన్స్ ఉంది. మొదటి నుంచి మీనింగ్ ఫుల్ క్యారెక్టర్స్ చేయాలనేదే నా ఆలోచన. ఇందులో కూడా అలాంటి పాత్ర చేయటం హ్యాపీగా అనిపించింది. చాలా మంచి ఎమోషన్స్, కంటెంట్ ఉన్న సినిమా ఇది.
- 80ల బ్యాక్‌డ్రాప్‌లో జరిగే కథ ఇది. టౌన్ అమ్మాయి అయినప్పటికీ సిటీ కల్చర్ ఉన్న లుక్‌లో కనిపిస్తాను. తను చాలా సెన్సిటీవ్, వెరీ ఎమోషనల్. ఫ్యామిలీకి చాలా ఇంపార్టెన్స్ ఇచ్చే అమ్మాయి. ఇందులో నాకు, హీరో నరేష్ మధ్య మంచి ఎమోషనల్ సీన్స్ ఉన్నాయి. ఇప్పటివరకూ నేను చేసిన క్యారెక్టర్స్‌కి డిఫరెంట్‌గా ఉండే పాత్ర చేశా. నరేష్ అద్భుతమైన యాక్టర్. ఎలాంటి భావోద్వేగాన్ని అయినా సరే పండించగలరు. ఆయనతో వర్క్ చేయడం చాలా మంచి ఎక్స్‌పీరియన్స్.
- దర్శకుడు సుబ్బు చాలా క్లియర్ విజన్ ఉన్న డైరెక్టర్. చాలా ఫోకస్డ్‌గా ఉంటారు. ఎమోషన్స్‌ని చాలా అద్భుతంగా తీశారు. 'సీతారామం' ఫేం విశాల్ చంద్రశేఖర్ అందించిన పాటలన్నీ సూపర్‌హిట్ అయ్యాయి. సినిమా రిలీజ్ తర్వాత ఈ పాటలు మరింతగా కనెక్ట్ అవుతాయి. నిర్మాత రాజేష్ దండా ప్రొడక్షన్‌లో వర్క్ చేయడం చాలా హ్యాపీగా ఉంది.




అల్లుఅర్జున్

కేవలం 6 రోజుల్లో రూ.1000 కోట్లు

భారతీయ సినిమా చరిత్రలో 'పుష్ప 2 : ది రూల్' సినిమా సరికొత్త రికార్డ్‌ని క్రియేట్ చేసింది. ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా కేవలం 6 రోజుల్లోనే రూ.1000 కోట్లకి పైగా కలెక్షన్లను కొల్లగొట్టింది. తక్కువ రోజుల్లో వెయ్యి కోట్ల క్లబ్‌లోకి చేరిన సినిమాగానే కాకుండా ఇప్పటివరకు గత సినిమాలు చేసిన రికార్డులను ఇది సరికొత్తగా తిరగరాసి నూతన అధ్యాయానికి నాంది పలికింది.

అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో రూపొందిన 'పుష్ప 1' చిత్రానికి సీక్వెల్‌గా 'పుష్ప-2 ది రూల్' తెరకెక్కింది. ఈనెల 5వ తేదీన ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా దాదాపు 12 వేల థియేటర్లలో విడుదలైంది. మైత్రీ మూవీమేకర్స్‌తో సుకుమార్ రైటింగ్ సంస్థ కలిసి సంయుక్తంగా నిర్మించిన ఈ సినిమా విడుదలకు ముందే ప్రీరిలీజ్ బిజినెస్‌లోనూ మన దేశంలో సరికొత్త రికార్డును నెలకొల్పింది.

అలాగే విడుదలకు ముందు రోజు వేసిన పెయిడ్ ప్రీమియర్స్ నుంచే సెన్సేషనల్ బ్లాక్‌బస్టర్ టాక్‌ని సొంతం చేసుకుంది. అల్లు అర్జున్ నట విశ్వరూపం, సుకుమార్ వరల్డ్ క్లాస్ టేకింగ్‌కి ప్రపంచ సినీ ప్రేమికులు ఫిదా అయిపోయారు అని మేకర్స్ తెలిపారు.

మొదటి రోజు, రెండవ రోజు, మూడవ రోజు.. నాలుగవ రోజు.. ఐదవ రోజు.. ఆరవ రోజు వసూళ్లలో వరుసగా ఇండియా ఆల్‌టైమ్ రికార్డులు సృష్టించిన ఈ చిత్రం ఆరు రోజుల్లో రూ.1002 కోట్లు వసూలు చేసి భారతీయ సినిమా చరిత్రలోనే అత్యంత వేగవంతగా రూ.1000 కోట్లు కలెక్ట్ చేసిన తొలి చిత్రంగా సరికొత్త రికార్డును నెలకొల్పిందని, అలాగే ప్రతి భాషలో సునామీలా దూసుకపోతున్న ఈ సినిమా బాలీవుడ్‌లో సైతం జైత్రయాత్రను కొనసాగిస్తోందని, బాలీవుడ్‌లో ఆరు రోజులకు రూ. 375 కోట్లు కలెక్ట్ చేసి, తక్కువ రోజుల్లోనే భారీ వసూళ్ళని కలెక్ట్ చేసిన తొలి హిందీ చిత్రంగానూ నిలిచిందని మేకర్స్ సంతోషం వ్యక్తం చేశారు.



బాలకృష్ణ

నందమూరి బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో రూపొందుతున్న 4వ చిత్రం 'అఖండ 2: తాండవం'. ఇది వారి మునుపటి బ్లాక్‌బస్టర్ 'అఖండ'కు సీక్వెల్. ఎం.తేజస్విని నందమూరి సమర్పణలో 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

ఇటీవలే ఘనంగా ఈ సినిమా ప్రారంభమైంది. బాలకృష్ణ ప్రారంభం రోజునే జాయిన్ కావడంతో 'అఖండ 2' రెగ్యులర్ షూటింగ్ కూడా స్టార్ట్ అయ్యింది. బోయపాటి తనదైన స్టయిల్‌లో బ్రెత్ టేకింగ్ ఫైట్ సీక్వెన్స్‌తో షూటింగ్‌ని ఆరంభించారు. స్టంట్ మాస్టర్లు రామ్-లక్ష్మణ్ ఈ ఫైట్ సీక్వెన్స్‌ని సూపర్ వైజ్ చేస్తున్నారు. హైదరాబాద్‌లోని ఆర్ఎఫ్‌సీలో చిత్రీకరణ జరుగుతోంది.

ఈ సందర్భంగా మేకర్స్ లాంచింగ్ ఈవెంట్ నుంచి గ్రిప్పింగ్ మూమెంట్‌ను ప్రజెంట్ చేస్తూ ఒక వీడియోను రిలీజ్ చేశారు. 'ఈ నేల అసురుడిది కాదు రా... ఈశ్వరుడిది... పరమేశ్వరుడిది... కాదని తాకితే జరిగేది తాండవం... అఖండ తాండవం..' అంటూ బాలకృష్ణ చెప్పిన పవర్‌ఫుల్ డైలాగ్ అందరిలోనూ విపరీతమైన క్రేజ్‌ని క్రియేట్ చేసింది. తమన్ కంపోజ్ చేసిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ద్వారా సీన్ ఇంటెన్సిటి మరింత పెంచింది. మ్యూజిక్ ఎడిషినల్ ఎనర్జీ, ఎగ్జైట్‌మెంట్‌ని యాడ్ చేసింది. వచ్చే ఏడాది దసరా కానుకా సెప్టెంబర్ 25న సినిమా విడుదలవుతుందని వీడియో ద్వారా మేకర్స్ రివీల్ చేశారు.

ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: బోయపాటి శ్రీను, నిర్మాతలు: రామ్ ఆచంట, గోపి ఆచంట, సమర్పణ: ఎం తేజస్విని నందమూరి, సంగీతం: తమన్ ఎస్, డీవోపీ: సి. రాంప్రసాద్, సంతోష్, ఆర్ట్: ఏఎస్ ప్రకాష్, ఎడిటర్: తమ్మిరాజు.

నేల మీది నక్షత్రమా..


ఐశ్వర్య శర్మ, ధర్మ

ధర్మ, ఐశ్వర్య శర్మ హీరో, హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా 'డ్రింకర్ సాయి'. బ్రాండ్ ఆఫ్ బ్యాడ్ బాయ్స్ అనేది ట్యాగ్ లైన్.

ఈ చిత్రాన్ని ఎవరెస్ట్ సినిమాస్, స్మార్ట్ స్క్రీన్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్స్ పై బసవరాజు శ్రీనివాస్, ఇస్మాయిల్ షేక్, బసవరాజు లహరిధర్ నిర్మిస్తున్నారు.

కొన్ని వాస్తవ ఘటనల ఆధారంగా దర్శకుడు కిరణ్ తిరుమలశెట్టి ఈ చిత్రాన్ని రూపొందించారు. ఈ నెల 27న ఈ సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ నేపథ్యంలో ఈ సినిమా నుంచి 'నేల మీది నక్షత్రమా..' అంటూ సాగే లిరికల్ సాంగ్‌ను రిలీజ్ చేశారు.

ఈ సాంగ్‌ను శ్రీ వసంత్ ఆకట్టుకునేలా కంపోజ్ చేయగా, చంద్రబోస్ అందమైన సాహిత్యం అందించారు. అనుదీప్ దేవ్ మంచి ఫీల్‌తో పాడారు. పోసాని కృష్ణమురళి, శ్రీకాంత్ అయ్యంగార్, సమీర్, ఎస్ఎస్ కాంచి, భద్రం, కిర్రాక్ సీత, రీతు చౌదరి, ఫన్ బకెట్ రాజేశ్, రాజ ప్రజ్వల్ తదితరులు నటించిన ఈచిత్రానికి ఆర్ట్ - లావణ్య వేములపల్లి, డీవోపీ - ప్రశాంత్ అంకిరెడ్డి, ఎడిటింగ్ - మార్తాండ్ కె వెంకటేష్, లైన్ ప్రొడ్యూసర్ - లక్ష్మీ మురారి, మ్యూజిక్ - శ్రీ వసంత్.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

ప్రభుత్వ మూలధన వ్యయాల్లో పతనం..!

- కేంద్ర, రాష్ట్ర పీఎస్‌యూల పెట్టుబడుల తగ్గింపు
- మందగమనం ప్రభావం : నిపుణులు



న్యూఢిల్లీ : దేశ ఆర్థిక వ్యవస్థలో చోటు చేసుకుంటున్న మందగమనం పరిణామాలు ప్రభుత్వ రంగ సంస్థల మూలధన వ్యయాలపైనా పడుతోందని స్పష్టమవుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024-25లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ కంపెనీలు, సంస్థలు తమ మూలధన వ్యయాలను భారీగా తగ్గిస్తున్నాయని జాతీయ మీడియాల్లో రిపోర్టులు వస్తోన్నాయి. జీడీపీలో పెట్టుబడుల వ్యయం ఐదేండ్ల గరిష్ట స్థాయి 5.87 శాతం నుంచి పడిపోయే అవకాశం ఉందని అంచనా. దీంతో వృద్ధి మందగింపు సంకేతాలు స్పష్టమవుతోన్నాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2024-25లో మొత్తం మూలధన వ్యయం లక్ష్యాన్ని చేరుకోవచ్చని లేదా దగ్గరగా చేరుతుందని అంచనా వేసినప్పటికీ.. వృద్ధి గత ఆర్థిక సంవత్సరం కంటే తక్కువగా ఉండవచ్చు" అని ఈ వ్యవహారంతో సంబంధం కలిగిన వ్యక్తులు పేర్కొన్నట్లు మింట్ రిపోర్ట్ చేసింది.

2023-24లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల మూలధన వ్యయం రూ.17.35 లక్షల కోట్లకు పెరిగింది. ఇంతక్రితం ఏడాది 2022-23లో ఇది రూ.13.57 లక్షల కోట్లుగా ఉంది. కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ తాజా సమాచారం ప్రకారం.. 2024-25 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్‌తో ముగిసిన ప్రథమార్థంలో కేంద్ర ప్రభుత్వ మూలధన వ్యయం 15.4 శాతం పతనమై రూ.4.15 లక్షల కోట్లకు పరిమితమయ్యింది. ద్వితీయార్థంలో మరిన్ని సవాళ్లు ఉండొచ్చని అంచనా. బడ్జెట్ లక్ష్యం రూ.11.11 లక్షల కోట్ల మూలధన వ్యయం చేరాలంటే ప్రస్తుత ద్వితీయార్థంలో 52 శాతం వృద్ధిని సాధించాల్సి ఉంటుంది.

కఠిన పరిస్థితులను చక్కబెట్టుకోవడానికి వచ్చే జనవరి- మార్చి త్రైమాసికంలో పెట్టుబడులను వేగవంతం చేయాలని ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం సంబంధిత శాఖలు, మంత్రిత్వ శాఖలను ఆదేశించింది. ఆర్థిక వృద్ధిని పెంపొందించడానికి రాబోయే బడ్జెట్‌లో కేంద్రం తన మూలధన వ్యయాన్ని కొనసాగించనుందని.. అదే విధంగా రాష్ట్రాలను ఆదేశించనుందని ఓ ఉన్నతాధికారి పేర్కొన్నట్లు మింట్ తన కథనంలో పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి ఎనిమిది నెలల్లో మూలధన వ్యయాన్ని వేగవంతం చేయడానికి ఉపయోగించేందుకు 'స్పెషల్ అసిస్టెన్స్ ఫర్ కాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్' స్కీమ్‌లో భాగంగా రాష్ట్రాలకు రూ.50,571.42 కోట్లను కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ విడుదల చేసింది. 2024-25కు గాను రాష్ట్రాలకు ప్రత్యేక పెట్టుబడుల పథకం కింద రూ.1.5 లక్షల కోట్ల నిధులు కేటాయిస్తున్నట్లు జులైలో జరిగిన మధ్యంతర బడ్జెట్ సమావేశాల్లో ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్న విషయం తెలిసిందే. పెట్టుబడులు మందగించడం ద్వారా ప్రధానంగా ఉపాధి కల్పన దెబ్బతిననుంది. దీంతో ఆర్థిక వ్యవస్థలో బలహీనతలు మరింత పెరగనున్నాయి.

భారత వృద్ధి 6.5 శాతమే..

- అంచనాలకు ఏడీబీ కోత



న్యూఢిల్లీ : భారత జీడీపీ అంచనాలకు ఏసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఏడీబీ) కోత పెట్టింది. దేశంలో బలహీన డిమాండ్, నివాసాలకు గిరాకీ తగ్గడంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024-25లో వృద్ధి 6.5 శాతానికే పరిమితం కావొచ్చని పేర్కొంది. ఇంతక్రితం ఈ అంచనా 7 శాతంగా ఉంది. అదే విధంగా వచ్చే 2025-26 వృద్ధి అంచనాలను 7.2 శాతం నుంచి 7 శాతానికి కోత పెట్టింది. సెప్టెంబర్ త్రైమాసికంలో జీడీపీ వృద్ధి తగ్గుదలను గుర్తు చేసింది. డిమాండ్ లేక తయారీ రంగం పేలవ ప్రదర్శన, ప్రభుత్వ వ్యయాలు తగ్గడాన్ని ఎత్తి చూపింది. 2024-25కు భారత జీడీపీ అంచనాలను 7.2 శాతం నుంచి 6.6 శాతానికి కోత పెడుతూ ఇటీవల ఆర్‌బీఐ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే.

మారుతి సుజుకి 500వ నెక్సా షోరూంలకు విస్తరణ

ముంబయి : దేశంలోనే అతిపెద్ద కార్ల కంపెనీ మారుతి సుజుకి తన నెక్సా షోరూంలను 500కు విస్తరించినట్లు వెల్లడించింది. నూతన పాయింట్‌ను గోవాలో ఏర్పాటు చేయడం ద్వారా ఈ మైలురాయికి చేరుకున్నట్లు పేర్కొంది. 2017లో తొలి తొలి నెక్సా షోరూంను తెరిచిన మారుతి సుజుకి.. గడిచిన 2023-24లో కొత్తగా 90 నెక్సా సర్వీసు సెంటర్లను ఏర్పాటు చేసింది. 2030-31 నాటికి 800 అవుట్‌లెట్‌లకు పెంచాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది.

గెలాక్సీ ఎస్24 అల్ట్రా ఆవిష్కరణ

గూర్‌గావ్ : ప్రముఖ ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ సామ్‌సంగ్ కొత్తగా గెలాక్సీ ఎస్24 అల్ట్రా, గెలాక్సీ ఎస్24 స్మార్ట్‌ఫోన్లను విడుదల చేసినట్లు తెలిపింది. అసమాన భద్రతతో పాటు మూడేళ్ల వారంటీతో వీటిని అందిస్తున్నట్లు పేర్కొంది. ఏడేండ్ల వరకు ఆపరేటింగ్ సిస్టమ్ అప్‌డేట్, సెక్యూరిటీ మెయింటనెన్స్ హామీ ఇస్తున్నట్లు పేర్కొంది. గెలాక్సీ ఎస్24 ధరలు రూ.78,999 నుంచి ప్రారంభమవుతాయని పేర్కొంది. 8జీబీ ర్యామ్, 256 జీబీ స్టోరేజ్ ఎంపిక ఉంటుందని పేర్కొంది.

జియో నుంచి న్యూఇయర్ ప్లాన్

న్యూఢిల్లీ : రిలయన్స్ జియో వచ్చే నూతన సంవత్సరం 2025ను పురస్కరించుకుని కొత్త ప్లాన్‌ను ఆవిష్కరించింది. రిలయన్స్ జియో వెల్‌కమ్ ప్లాన్‌లో భాగంగా రూ.2025 రీచార్జ్‌పై దీర్ఘకాల గడువుతో పాటు రూ.2,150 విలువైన కూపన్ ప్రయోజనాలను అందిస్తోన్నట్లు ఆ సంస్థ పేర్కొంది. ఈ ప్లాన్‌లో 200 రోజుల వాలిడిటీతో పాటు రోజుకు 2.5 జీబీతో పాటు 5జీ డేటాను అందిస్తున్నట్లు పేర్కొంది.

రాయల్‌ఓక్ ఉత్పత్తులపై 70 శాతం వరకు తగ్గింపు



హైదరాబాద్ : ప్రముఖ ఫర్నీచర్ ఉత్పత్తుల కంపెనీ రాయల్‌ఓక్ ఏడాది ముగింపు సేల్‌ను ప్రకటించింది. ఇందులో ఫర్నీచర్, డెకరల్ ఉత్పత్తులపై 70 శాతం వరకు తగ్గింపును అందిస్తున్నట్లు పేర్కొంది. దేశంలోని 200 స్టోర్లలో సోఫాలు కేవలం రూ.21,990 నుంచి, బెడ్‌లు రూ.14,990 నుంచి ప్రారంభమవుతాయని వెల్లడించింది. ఈ ఆఫర్ 2025 జనవరి ముగింపు వరకు ఉంటుందని పేర్కొంది.

కాజీపేట్‌లో ఇంటిగ్రేటెడ్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీపై స్పష్టత ఇవ్వండి

ప్రశ్నించిన ఎంపీ కడియం కావ్య

- ఇంజిన్, కోచ్, వ్యాగన్‌ల సమగ్ర ఉత్పత్తి యూనిట్‌గా అభివృద్ధి : కేంద్ర మంత్రి వైష్ణవ్



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఏపీ విభజన చట్టం 2014లో పొందుపరిచినట్టు తెలంగాణలోని కాజీపేట్‌లో ఇంటిగ్రేటెడ్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మిస్తున్నారా? లేదా? అనే అంశంపై స్పష్టత ఇవ్వాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య కేంద్రాన్ని నిలదీశారు. ఈ అంశంపై ఇటీవల కేంద్రం తనకు పంపిన లేఖలో కాజీపేట్‌లో రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు సమాధానం ఇచ్చారన్నారు. అలాగే నష్కల్-హసన్‌పర్తి, నష్కల్- చింతలపల్లి బైపాస్ రీ అలైన్మెంట్ అంశాలను లేవనెత్తారు. ఈ విషయంలో రైతులకు నష్టం జరగకుండా చూడాలని సభ ద్వారా కేంద్రాన్ని కోరారు. వీటితో పాటు కాజీపేట రైల్వే స్టేషన్‌లో అదనపు ప్లాట్ ఫామ్‌లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మౌఖిక సమాధానం ఇస్తూ కాజీపేట్‌లో రైల్వే వ్యాగన్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ సమగ్ర ఇంజిన్, కోచ్, వ్యాగన్‌ల ఉత్పత్తి యూనిట్‌గా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. ప్రస్తుతం రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌లను అన్ని రకాల మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌లుగా అభివృద్ధి పరుస్తున్నామని, అదే కోవలో కాజీపేట్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌లో సమగ్ర కార్యాచరణతో కూడిన పరిశ్రమను డెవలప్ చేస్తున్నామని అన్నారు.

రైల్వే డివిజన్ ఏర్పాటుపై ఎంపీ ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ...గత ప్రభుత్వాలు విడుదల చేసిన నిధులతో పోలిస్తే ప్రస్తుతం రూ.5 వేల కోట్ల పైచిలుకు నిధులు తెలంగాణ రాష్ట్రానికి రైల్వే పనుల కోసం కేటాయించామని చెప్పారు. రైల్వే అభివృద్ధి విస్తరణ ప్రస్తుతం సునాయాసంగా జరుగుతున్నందున ఆ అంశంపై ఆలోచించటం లేదన్నారు. దీనిపై ఎంపీ కావ్య స్పందిస్తూ... బైపాస్ రైల్వేలైన్‌లు వ్యవసాయ రంగ కార్యకలాపాలకు అవరోధంగా నిలుస్తూ రైతులకు ఇబ్బందులు సృష్టిస్తున్నాయని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశంలో ఎంపీ కావ్య చేసే సూచనలు పరిగణనలోకి తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. అలాగే కాజీపేట్ స్టేషన్ ప్లాట్ ఫామ్‌ల విస్తరణకు సంబంధించి జాతీయ కార్యాచరణలో భాగంగా చేపట్టిన అమృత్ తరహా అభివద్ధిని అమలుపరుస్తున్నామని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ సభకు తెలిపారు.

నేడు ఉన్నత విద్యారంగంపై సమీక్ష

- రేపు వీసీలతో సమావేశం : హాజరు కానున్న విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి శ్రీధర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉన్నత విద్యారంగంపై గురువారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ఎస్ శ్రీధర్ సమీక్ష నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో ఉన్నత విద్యామండలి చైర్మెన్ వి బాలకిష్టారెడ్డి, వైస్ చైర్మెన్లు ఇటిక్యాల పురుషోత్తం, ఎస్‌కే మహమూద్, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, కళాశాల, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన పాల్గొంటారు. ఉన్నత విద్యారంగంలో తాజా పరిస్థితులు, ప్రభుత్వ విధానాలు, భవిష్యత్‌లో చేపట్టబోయే చర్యలపై చర్చించనున్నారు. శుక్రవారం విశ్వవిద్యాలయాల ఉపకులపతుల (వీసీ)తో ఉన్నత విద్యామండలి సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఈ సమావేశానికి విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ఎస్ శ్రీధర్ హాజరవుతారు. రాష్ట్రంలో వచ్చే విద్యాసంవత్సరం (2025-26)లో డిగ్రీ సిలబస్‌లో మార్పు గురించి ప్రధానంగా చర్చించ నున్నారు. ప్రయివేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో బీ కేటగిరీ సీట్ల భర్తీకి సంబంధించి కీలక నిర్ణయం తీసుకునే అవకాశమున్నది. బీ కేటగిరీ సీట్లను ఆన్‌లైన్‌లో భర్తీ చేయాలని ఉన్నత విద్యామండలి భావిస్తున్నది. అందుకు సంబంధించిన విధివిధానాలను చర్చించి ఖరారు చేసే అవకాశమున్నది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ఉద్యోగ విరమణ వయస్సును రాష్ట్ర ప్రభుత్వం 61 ఏండ్లకు పెంచింది. అయితే విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్ల ఉద్యోగ విరమణ వయస్సు 60 ఏండ్లు ఉన్నది. కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో పని చేస్తున్న ప్రొఫెసర్ల ఉద్యోగ విరమణ వయస్సు 65 ఏండ్లు. రాష్ట్రంలోనూ ప్రొఫెసర్ల ఉద్యోగ విరమణ వయస్సును 65 ఏండ్లకు పెంచాలన్న డిమాండ్ ఉన్నది. దీనిపైనా ఓ నిర్ణయం తీసుకుని రాష్ట్ర ప్రభుత్వ ఆమోదానికి పంపించే అవకాశమున్నది.

కేసీఆర్ పాలనలో క్రీడలు నిర్వీర్యం

- ఢిల్లీ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కేసీఆర్ హయాంలో తెలంగాణలో క్రీడలు పూర్తిగా నిర్వీర్యం అయ్యాయని ఢిల్లీ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి విమర్శించారు. స్పోర్ట్స్ అవసరమా అంటూ నిర్లక్ష్యం వహించారని మండిపడ్డారు. బుధవారం ఢిల్లీలో మీడియాతో జితేందర్ రెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి స్వతహాగా క్రీడా ప్రేమికుడని. క్రీడాకారుడని అన్నారు. అందుకే కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద నిధులు సేకరించి క్రీడాకారుల సంక్షేమం, సదుపాయాల కల్పన కోసం ఖర్చు చేస్తామని తెలిపారన్నారు. తమ ప్రభుత్వం ఉద్యోగ నియామకాల్లో స్పోర్ట్స్ కోటా అమలు చేస్తోందన్నారు. ప్రోత్సాహకాలూ ఇస్తున్నట్టు వెల్లడించారు. ఈ మధ్యనే నిఖత్ జరీన్కు ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చినట్టు గుర్తు చేశారు. ఫిఫా ఫ్రెండ్లీ మ్యాచ్, బ్యాడ్మింటన్ అంతర్జాతీయ క్రీడలు, హాకీ.. ఇలా అనేక క్రీడలు నిర్వహిస్తున్నా మన్నారు. గ్రామీణ స్థాయి నుంచి క్రీడాకారులను తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. ఒలింపిక్స్‌లో ఉన్న 38 రకాల క్రీడల్లో క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్నామని, హైదరాబాద్‌లో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నామని అన్నారు. ఇందుకోసం ఆస్ట్రేలియా క్వీన్స్ ల్యాండ్ వెళ్లి అధ్యయనం కూడా చేసినట్టు తెలిపారు. మరోవైపు 2026లో జరిగే ఒలింపిక్స్‌లో తెలంగాణ నుంచి క్రీడాకారులు పాల్గొనేలా చేయాలని సంకల్పంతో ఉన్నామని చెప్పారు. పాఠశాలల్లో స్పోర్ట్స్ ఫ్యాకల్టీ ఉండేలా చూస్తామన్నారు. పీఈటీ ఖాళీలు భర్తీ చేయనున్నట్టు వెల్లడించారు. తెలంగాణలోని ప్రయివేట్ పాఠశాలల్లో ఇకపై క్రీడా మైదానం లేకుంటే అనుమతులు ఇచ్చేది లేదన్నారు. గతంలో అడ్డగోలుగా ప్రయివేట్ పాఠశాలలకు క్రీడా మైదానం లేకపోయినా అనుమతులు ఇచ్చారని గుర్తు చేశారు. ఇకపై కచ్చితంగా స్పోర్ట్స్ గ్రౌండ్ ఉండాలని, లేకపోతే అద్దె మైదానం ఉండాలనే నిబంధన పెడుతున్నామని చెప్పారు.

తెలంగాణలో పర్యాటక అభివృద్ధికి సహకరించండి

తెలంగాణలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి సహకరించాలని ఏపీ జితేందర్ రెడ్డి కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌ను కోరారు. బుధవారం ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి పలు విజ్ఞప్తి పత్రాలు అందజేశారు. ఇందులో భాగంగా తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న పలు పర్యాటక ప్రాజెక్ట్‌ల పురోగతికి నిధులు విడుదల చేయాలని కోరారు. అలాగే 'సురభి నాట్యమండలి' 140వ వార్షికోత్సవం సందర్భంగా డిసెంబర్ 14న సాయంత్రం ఢిల్లీ తెలంగాణ భవన్‌లో నిర్వహించే థియేటర్ ఆర్ట్ ఫెస్టివల్‌కు ముఖ్య అతిథిగా రావాలని ఆహ్వానించారు.

సిరియాపై ఇజ్రాయిల్ విధ్వంసకాండ

- 350కిపైగా వైమానిక దాడులు
- సిరియా నేవీ విధ్వంసం
- దేశం లోపలకు చొచ్చుకుపోయిన ఇజ్రాయిల్ బలగాలు





డమాస్కస్ : సిరియా వ్యాప్తంగా ఇజ్రాయిల్ భారీగా విధ్వంసానికి తెగబడుతోంది. సిరియా భూభాగం లోపలకు ఇజ్రాయిల్ బలగాలు చొచ్చుకుపోయాయని సిరియా ప్రతిపక్ష యుద్ధ పర్యవేక్షక సంస్థ తెలిపింది. సిరియా నావికాదళాన్ని మొత్తంగా నాశనం చేశామని ఇజ్రాయిల్ రక్షణ మంత్రి ప్రకటించారు. దక్షిణ సిరియాలో నిస్సైనికీకరణ మండలాన్ని ఏర్పాటు చేస్తామని రక్షణ మంత్రి ఇజ్రాయిల్ కట్జ్ పేర్కొన్నారు. సిరియాలో తీవ్రవాదం వేళ్ళూనుకోకుండా నివారించేందుకే ఈ చర్యలని చెప్పారు. అసద్ పంథాను ఎవరు అనుసరించినా వారికి అసద్‌కు పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. అసద్‌ను పదవీచ్యుతుడిని చేసిన తర్వాత బఫర్ జోన్‌లోకి ప్రవేశించామని ఇజ్రాయిల్ ఇప్పటికే ప్రకటించింది. అయితే ఆ ప్రాంతాన్ని దాటి ఇంకా ముందుకెళ్లాయా లేదా అనేది స్పష్టంగా తెలియరాలేదు. ఈ బఫర్ జోన్‌ను 50ఏళ్ళ క్రితం ఏర్పాటు చేశారు. అయితే రాజధాని డమాస్కస్ లోపలకు చొచ్చుకు వెళ్ళామనడాన్ని ఇజ్రాయిల్ తిరస్కరిస్తోంది. గత 48గంటల్లో 350కి పైగా వైమానిక దాడులకు పాల్పడ్డామని మిలటరీ ప్రకటించింది. దేశంలోని వ్యూహాత్మక ఆయుధ నిల్వల కేంద్రాలను చాలావరకు ధ్వంసం చేసేశామని తెలిపింది. తీవ్రవాదుల చేతుల్లోకి ఆ ఆయుధాలు వెళ్ళకూడదనే ఉద్దేశ్యంతోనే ఈ దాడులు జరిపామంటూ సమర్ధించుకుంది. సిరియా నావికాదళానికి చెందిన రెండు నౌకాశ్రయాలపై ఒకేసారి క్షిపణి నౌకలతో దాడి చేశామని మిలటరీ తెలిపింది. అక్కడ మొత్తంగా 15నౌకలు వున్నాయని పేర్కొంది. అయితే వాటిల్లో ఎన్ని నౌకలపై దాడి చేశామన్నది వివరించలేదు. సోవియట్ శకానికి చెందిన ఆరు క్షిపణి నౌకలు దాడికి గురయ్యాయని ప్రైవేట్ సెక్యూరిటీ సంస్థ అంబ్రే వెల్లడించింది.

కాగా ప్రస్తుతం సిరియాలో ఎక్కువ భాగాన్ని నియంత్రిస్తున్న హయత్ తహ్రీర్ అల్ షామ్ (హెచ్‌టిఎస్) నేతృత్వంలోని తీవ్రవాద గ్రూపుల నుండి ఎలాంటి స్పందన వెలువడలేదు. రెబెల్ అలయన్స్ ఏర్పాటు చేసే సాల్వేషన్ గవర్నమెంట్‌కు నాయకత్వం వహించే మహ్మద్ అల్ బషీర్ సారధ్యంలోని కొత్త కేబినెట్‌కు పాత ప్రభుత్వ సభ్యులు క్రమంగా అధికారాలను బదిలీ చేస్తారు. మార్చి ప్రారంభం వరకు ఈ బదిలీ కొనసాగుతుందని బషీర్ విలేకర్లకు చెప్పారు. మరోవైపు రాజధాని డమాస్కస్‌లో జన జీవితం నెమ్మదిగా సాధారణ స్థాయికి వస్తోంది. అన్ని దుకాణాలు, కార్యాలయాలు తెరుచుకుంటున్నాయి.

దేశాన్ని పునర్నిర్మిస్తాం : తాత్కాలిక ప్రధాని హామీ

సిరియాను మొత్తంగా పునర్నిర్మిస్తామని తాత్కాలిక కొత్త ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన బషీర్ హామీ ఇచ్చారు. అయితే నగదు సంక్షోభం తీవ్రంగా వుందని వ్యాఖ్యానించారు. లక్షల సంఖ్యలోని శరణార్థులందరినీ వెనక్కి రప్పిస్తామని చెప్పారు. పౌరులందరికీ రక్షణ కల్పిస్తామని, మౌలిక సేవలందిస్తామని హామీ ఇచ్చారు. విదేశీ కరెన్సీ కొరత చాలా తీవ్రంగా వున్నందున కష్టం కాగలదన్నారు. 35వేల సిరియన్ పౌండ్లు పెడితే ఒక్క డాలరును కొనుగోలు చేయగలమని చెప్పారు. ఇక రుణాలు, బాండ్ల గురించి డేటా సేకరిస్తున్నామని చెప్పారు. ఆర్థికంగా అయితే పరిస్థితి చాలా అధ్వాన్నంగా వుందన్నారు.

పథకం ప్రకారమే అసద్ ప్రభుత్వ కూల్చివేత : ఖమేని

అమెరికా, ఇజ్రాయిల్ ఒక ప్రణాళిక ప్రకారమే అసద్ ప్రభుత్వాన్ని కూల్చివేశారని ఇరాన్ మత పెద్ద ఆయతుల్లా అలీ ఖమేని బుధవారం వ్యాఖ్యానించారు. సిరియా పొరుగుదేశాల్లో ఒకరికి కూడా ఇందులో పాత్ర వుందన్నారు. ఆ దేశం పేరును ఆయన వెల్లడించలేదు. అయితే అసద్ వ్యతిరేక రెబెల్స్‌కు మద్దతిచ్చే టర్కీ గురించే ఆయన ప్రస్తావిస్తున్నట్లు కనిపిస్తోంది. మధ్య ప్రాచ్యంలో ఇజ్రాయిల్, అమెరికా ప్రాబల్యాన్ని తీవ్రంగా వ్యతిరేకించే రాజకీయ, సైనిక ప్రతిఘటనా కూటమికి అసద్ ప్రభుత్వం కూలిపోవడమనేది పెద్ద ఎదురుదెబ్బగా భావిస్తున్నారు. 'సిరియాలో చోటు చేసుకున్న పరిణామాలన్నీ అమెరికా, ఇజ్రాయిల్ కమాండ్ రూమ్‌ల్లో పథకం ప్రకారం రచించినవే. ఇందుకు మా దగ్గర సాక్ష్యాధారాలున్నాయి. సిరియా పొరుగు ప్రభుత్వం కూడా ఇందులో పాలు పంచుకుంది." అని ఖమేని తన ప్రసంగంలో చేసిన వ్యాఖ్యలను ఇరాన్ ప్రభుత్వ మీడియా వెల్లడించింది. సిరియా కుర్దిష్ వైపిజి మిలీషియాకు వ్యతిరేకంగా సరిహద్దుల్లో పోరాడుతూ ఉత్తర సిరియాలో కొంత భూభాగాన్ని ఆక్రమించుకున్న టర్కీ, సిరియా రెబెల్స్‌కు ప్రధాన వెన్నుదన్నుగా వుంది. 2011లో సిరియాలో అంతర్యుద్ధం చెలరేగినప్పటి నుండి అసద్ ప్రభుత్వాన్ని కూల్చివేయాలన్నది టర్కీ లక్ష్యంగా వుంది. మరోవైపు యుద్ధ సమయంలో అసద్ ప్రభుత్వ రక్షణ కోసం ఇరాన్ వందల కోట్ల డాలర్లు ఖర్చు చేసింది. రక్షణ కోసం తన రివల్యూషనరీ గార్డులను సిరియాలో మొహరించింది. అసద్ ప్రభుత్వం కూలిపోయిన గంటల వ్యవధిలో ఇరాన్ స్పందిస్తూ దూరదృష్టితో, వివేచనా దృక్పథంతో కూడిన సంబంధాలను డమాస్కస్‌తో కొనసాగించాలని భావిస్తున్నట్లు వ్యాఖ్యానించింది. సిరియా సమాజంలోని అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం వహించేలా ప్రభుత్వ ఏర్పాటు జరగాలని పిలుపిచ్చింది.

ప్రపంచం.. భారత్ వైపు చూస్తోంది

- 2026 జూన్‌లో భోగాపురం ఎయిర్‌పోర్టు పనులు పూర్తి
- భవిష్యత్‌లో మరో 50 విమానాశ్రయాలు ఏర్పాటు : శంషాబాద్ నోవాటెల్‌లో ఎయిర్‌పోర్ట్ ప్రిడిక్టివ్ సెంటర్ ప్రారంభోత్సవంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు



నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

ప్రపంచ దేశాలన్నీ భారత్ వైపు చూస్తున్నాయని, ప్రజా రవాణ వ్యవస్థకు కేంద్రం ప్రాధాన్యత ఇస్తోందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లా శంషాబాద్ నోవాటెల్‌లో ఎయిర్‌పోర్ట్ ప్రిడిక్టివ్ సెంటర్‌ను రామ్మోహన్ నాయుడు ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. భోగాపురం విమానాశ్రయం 2026 జూన్ వరకు పూర్తవుతుందన్నారు. మరో ఐదేండ్లలో 50 విమానాశ్రయాలు పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు వెనక ఏపీ సీఎం చంద్రబాబు శ్రమ ఎంతో ఉందని చెప్పారు. ఎయిర్‌పోర్టు నిర్మాణ కోసం 5వేల ఎకరాల భూ సేకరణ సామాన్యమైన విషయం కాదన్నారు. గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుల కాన్సెప్ట్ చంద్రబాబుదని తెలిపారు. దేశంలో ఐటీ విప్లవం వెనక చంద్రబాబు కృషి ఉందన్నారు. దేశాభివృద్ధికి ఐటీ చోదకశక్తి అని చంద్రబాబు నమ్ముతారని తెలిపారు. విమానాశ్రయాల నిర్వహణలో అత్యున్నత సాంకేతికతను వాడుతున్నట్టు చెప్పారు. దేశంలో 24 విమానాశ్రయాల్లో డీజీ యాత్ర టెక్నాలజీ వాడుతున్నామని తెలిపారు. డేటా అనలటిక్స్ వాడి సేవలు మరింత మెరుగ్గా అందిస్తామన్నారు.

14న జాతీయ లోక్‌అదాలత్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సివిల్, కాంపౌండబుల్ క్రిమినల్ కేసుల సామరస్యపూర్వక పరిష్కారం కోసం ఈ నెల 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు తెలంగాణ లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్య కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు హైకోర్టు నుంచి మొదలుకుని కింది స్థాయి కోర్టుల వరకు ఉన్న సివిల్, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు పరిష్కరించడం జరుగుతుందని పేర్కొన్నారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ మార్గదర్శకత్వంలో జాతీయ లోక్ అదాలత్ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించుకోవడానికి సిద్ధంగా ఉన్న వ్యక్తులు, సంబంధిత జిల్లా కోర్టు, లీగల్ సర్వీసెస్ అథారిటీ, న్యాయ సేవా సదన్‌ను సంప్రదించాలని కోరారు.

టీజీపీఎస్సీ బలోపేతానికి చర్యలు

- 18న యూపీఎస్సీ, 19న స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ చైర్మెన్లతో సమావేశం : టీజీపీఎస్సీ చైర్మెన్ బుర్రా వెంకటేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) తరహాలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) పునర్నిర్మాణం, బలోపేతానికి చర్యలు తీసుకుంటామని టీజీపీఎస్సీ చైర్మెన్ బుర్రా వెంకటేశం ప్రకటించారు. టీజీపీఎస్సీ యూపీఎస్సీ విధానాలపై అధ్యయనం చేస్తున్నామని వివరించారు. పారదర్శకంగా నియామకాలను చేపట్టే పద్ధతులను అనుసరిస్తామని చెప్పారు. అందులో భాగంగా బుధవారం ఆయన యూపీఎస్సీ చైర్మెన్ ప్రీతి సుదన్‌తో ఫోన్‌లో మాట్లాడారు.ఉద్యోగాల భర్తీ విధానం, ఇతర అంశాలపై మాట్లాడారు. ఈనెల 18న న్యూఢిల్లీలోని యూపీఎస్సీ చైర్మెన్ ప్రీతి సుదన్‌తో టీజీపీఎస్సీ చైర్మెన్, సభ్యులు సమావేశమవుతారు. పరీక్షల విధానం, మూల్యాంకనం, నియామకాల ప్రక్రియ, ఎంపిక విధానంపై సమగ్రంగా చర్చిస్తారు. యూపీఎస్సీ అనుసరిస్తున్న విధానాలను టీజీపీఎస్సీ కూడా అమలు చేస్తుందని బుర్రా వెంకటేశం వివరించారు. స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ (ఎస్‌ఎస్‌సీ) చైర్మెన్ ఎస్ గోపాల కృష్ణన్‌తో కూడా బుర్రా వెంకటేశం ఫోన్‌లో మాట్లాడారు. ఈనెల 19న న్యూఢిల్లీలో నియామకాల ప్రక్రియపై సమగ్రంగా చర్చించేందుకు ఆయనతో సమావేశమవుతామని చెప్పారు. టీజీపీఎస్సీ చైర్మెన్ బుర్రా వెంకటేశంతోపాటు సభ్యులు అనితా రాజేంద్ర, అమీర్ ఉల్లాఖాన్, నర్రి యాదయ్య, యరబాది రామ్మోహన్‌రావు, పాల్వాయి రజనీకుమారి ఈనెల 18, 19 తేదీల్లో ఢిల్లీ పర్యటను వెళ్లనున్నారు.

బీసీలకు ఇచ్చిన హామీలను విస్మరిస్తే ఊరుకోం

- ఎంబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏమైంది? : వడ్డెర సంఘం సమావేశంలో ఎమ్మెల్సీ కవిత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీసీలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తే ఊరుకునేది లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌తోపాటు ఇతర హామీలను త్వరగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. వడ్డెర సంఘం నాయకులు బుధవారం హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో కవితను కలిశారు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల పెంపుపై బీసీ డెడికేటెడ్ కమిషన్‌కు తెలంగాణ జాగృతి తరఫున నివేదిక సమర్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు. త సందర్భంగా కవిత మాట్లాడుతూ ఎంబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రతిరోజూ ఏదో ఒక చోట ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు ఆస్పత్రులపాలవుతున్నారని అన్నారు. సంక్షేమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రుల్లో వారి పిల్లల క్షేమం పట్ల భయాందోళన నెలకొందని చెప్పారు. పిల్లలకు నాణ్యమైన ఆహారం అందించకపోవడం ప్రభుత్వ చాతగానితనానికి నిదర్శనమని విమర్శించారు. జగిత్యాల జిల్లా సారంగాపూర్ కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం ఘటనపై ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖ మంత్రిగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి ఏడాది కాలంలో ఒక్క సారి కూడా సంక్షేమ పాఠశాలలకు వెళ్లి అక్కడి పరిస్థితులను, విద్యార్థుల సమస్యలను తెలుసుకోలేదని చెప్పారు. ఆయన తక్షణమే సంక్షేమ పాఠశాలలను సందర్శించాలని కోరారు. వాటి పరిస్థితులపై సమీక్ష చేసి ఇలాంటివి పునరావృతం కాఉండా చర్యలు చేపట్టాలని ఆమె డిమాండ్ చేశారు.

కాంగ్రెస్‌తో పొత్తు ఉండదు

- కేజ్రీవాల్ పునరుద్ఘాటన

న్యూఢిల్లీ : ఢిల్లీలో వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో తాము కాంగ్రెస్ పార్టీతో పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని ఆమాద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ మరోమారు చెప్పారు. ఈ మేరకు బుధవారం సామాజిక మాధ్యమాల్లో ఆయన పోస్టు చేశారు. వచ్చే ఎన్నికల్లో ఆమాద్మీ పార్టీ తన సొంత బలంతోనే బరిలోకి దిగుతుందని అని పునరుద్ఘాటించారు. కాగా, అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఆప్ పార్టీ రెండు విడతలుగా అభ్యర్థుల జాబితాను విడుదల చేసిన సంగతి తెలిసిందే.

పీఆర్ శాఖలో ప్రమోషన్లు

- సీఈలుగా ఐదుగురికి
- ఈఈలకు త్వరలోనే

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖలో పలువురు ఇంజినీర్లకు ప్రమోషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఈమేరకు గురువారం ప్రభుత్వ కార్యదర్శి డిఎస్ లోకేష్‌కుమార్ జీవో నెంబరు 75 విడుదల చేశారు. ఆయా ప్రాంతాల్లో ఎస్ఈలుగా విధులు నిర్వర్తిస్తున్న పి. జోగారెడ్డి, కె.తిరుపతయ్య, జి సమంత, ఎస్.రామకృష్ణ, జె సుదర్శన్‌రావుకు చీఫ్ ఇంజినీర్లుగా పదోన్నతి కల్పించారు. 2024-25 ప్యానల్ ఇయర్‌కుగాను పదోన్నతులు వర్తిస్తాయి. వీరంతా 15 రోజుల్లోగా కొత్త పోస్టుల్లో చేరాలి. ఆయా కోర్టు కేసులకులోబడి తాత్కాలిక ప్రమోషన్లు కల్పిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ ఇంజినీర్ ఇన్ చీఫ్ వి.కనకరత్నంను ఆదేశించారు.

ఈఈలకు రెండేండ్ల రిలాక్సేషన్

పంచాయితీరాజ్ ఇంజినీరింగ్ శాఖలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న 16 మందికి పదోన్నతి కోసం రెండు సంవత్సరాల రిలాక్సేషన్ కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు ప్రభుత్వం కార్యదర్శి డిఎస్ లోకేష్‌కుమార్ జీవో నెంబరు 791 ఇచ్చారు. వీరిలో ఎస్. భావన, బి. మంగ్యా, కె.రామచంద్రారెడ్డి, జె. ప్రకాష్, టి. జగదీశ్వర్, టి. విష్ణువర్ధన్‌రావు, ఎటీఎంఏ ముజీబ్, మేరెడ్డి నరేందర్‌రెడ్డి, కె.లచ్చయ్య, ఎస్.రామనుజ స్వామి, జి.శ్రీనివాసరావు, కె.విద్యాసాగర్, బి.శ్రీనివాస్‌రెడ్డి, టీపీ చక్రవర్తి, ఎల్.దామోదర్‌రావు, పి. శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు. 2024-25 ప్యానల్ ఇయర్‌గాను ఈ ఉత్తర్వులు వర్తిస్తాయి.

సమగ్ర శిక్ష ఉద్యోగుల దీక్షకు టీపీటీఎఫ్ మద్దతు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల రిలే నిరసన దీక్షకు టీపీటీఎఫ్ మద్దతు ప్రకటించింది. బుధవారం హైదరాబాద్‌లో ఆ సంఘం కార్యాలయంలో టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఎస్ తిరుపతి, ఉపాధ్యక్షులు మార్పల్లి లక్ష్మయ్య యాదవ్‌ను తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం అధ్యక్షులు దుండిగల్ యాదగిరి, ఇతర నాయకులు కలిసి సమ్మెకు మద్దతు ఇవ్వాలని కోరారు.

ఈ సందర్భంగా అనిల్‌కుమార్, తిరుపతి మాట్లాడుతూ నిరవధిక దీక్షలు, సమ్మెకు మద్దతు ఇస్తున్నామని ప్రకటించారు. హక్కుల సాధన కోసం ఉద్యమాలు మాత్రమే మార్గమని చెప్పారు. సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు సమగ్ర శిక్ష ఉద్యోగులు ఉద్యమాన్ని తీవ్రతరం చేయాలని సూచించారు. ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలబడతామని హామీ ఇచ్చారు.

కోడంగల్‌లో పశువైద్యకళాశాల భవన నిర్మాణం

- ఆర్ అండ్ బీతో ఒప్పందం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కోడంగల్‌లో కొత్తగా ఏర్పాటవుతున్న పశువైద్య కళాశాల భవనాల నిర్మాణానికి రోడ్లు, భవనాల శాఖ మధ్య ఒప్పందం చేసుకుంది. బుధవారం హైదరాబాద్‌లోని బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో పశువైద్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కార్యాలయంలో విశ్వవిద్యాలయ ఉపకులపతి సబ్యసాచి ఘోష్, రోడ్లు భవనాల శాఖ చీఫ్ ఇంజినీర్ (భవనాలు) బీ.రాజేశ్వర్‌రెడ్డి, వసంతనాయక్ మధ్య ఒప్పందం కుదిరింది. ఈ కొత్త పశువైద్య కళాశాల ప్రాంగణంలో ప్రధాన భవనం, పశువైద్యశాల, బాలికల, బాలుర వసతి గృహం, ఇతర భవనాలు నిర్మించనున్నారు.

మొత్తం 38 ఎకరాల విస్తీర్ణంలో, సుమారు రూ.171 కోట్ల అంచనా వ్యయంతో ఈ భవనాలను నిర్మించనున్నట్టు తెలిపారు.ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శరత్ చంద్ర, ఎస్టేట్ ఆఫీసర్ ప్రొఫెసర్. చిన్ని ప్రీతం తదితరులు ఉన్నారు.

అత్యవసర పరిస్థితిలో సిద్ధంగా ఉండాలి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఫీల్డ్ ఇంజినీర్లు అత్యవసర పరిస్థితిలో వారికి సంబంధించిన హెడ్ క్వార్టర్స్‌లో అందుబాటులో ఉండాలని రాష్ట్ర ఇంధనశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఆదేశించారు. బుధవారం ఆయన ఉన్నతాధికారులతో ప్రస్తుత విద్యుత్ సరఫరాపై హైదరాబాద్‌లోని విద్యుత్ సౌధాలో సమీక్షించారు. రాబోయే వేసవిలో అవసరమైన విద్యుత్ పై అంచనాకు రావాలనీ, గత వేసవిలో ఎదురైన సమస్యలను మళ్లీ ఎదురు కాకుండా ముందుగానే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో టీజీ ట్రాన్స్‌కో సీఎండీ డి.కృష్ణ భాస్కర్, టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ, టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ కె.వరుణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారత్ గౌరవ్ అయోధ్య - కాశీ : పుణ్య క్షేత్ర యాత్ర

- టూరిస్ట్ రైలు సికింద్రాబాద్ నుంచి ప్రారంభం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భారత్ గౌరవ్ అయోధ్య - కాశీ : పుణ్య క్షేత్ర యాత్ర టూరిస్ట్ రైలు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి తన ప్రయాణాన్ని బుధవారం నుంచి ప్రారంభించింది. ఇండియన్ రైల్వేస్ క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ గ్రూప్ జనరల్ మేనేజర్ పి.రాజ్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ రైలు గయ, వారణాసి, అయోధ్య , ప్రయాగ్‌రాజ్‌లోని దివ్య/తీర్థ స్థలాలను దర్శింపజేస్తుందని తెలిపారు. డిసెంబర్ 11 నుంచి 20 వరకు 9 రాత్రులు / 10 రోజులు సాగే ఈ దివ్య దక్షిణ్ యాత్ర తెలంగాణ , ఆంధ్రప్రదేశ్‌లోని రైలు ప్రయాణీకులందరికీ రామ జన్మభూమి (అయోధ్య), జ్యోతిర్లింగాలలో ఒకటైన (కాశీ విశ్వనాథ్ ఆలయం) సందర్శించడానికి, ఆధ్యాత్మిక జ్ఞానోదయం కోసం లేదా గయలో పిండ్ ప్రధానం (తమ పూర్వీకులకు నివాళులు అర్పించడం) చేయడానికి ఒక ప్రత్యేక అవకాశాన్ని అందిస్తుందని చెప్పారు. సికింద్రాబాద్‌తో పాటు, తెలంగాణలోని భువనగిరి, జనగాం, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర, ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, తుని, దువ్వాడ, వైజాగ్ (పెందుర్తి), విజయనగరంలో మార్గ మధ్యంలో ఇరువైపులా ప్రయాణికుల కోసం రైలు ఎక్కేందుకు /దిగేందుకు సౌకర్యం కల్పించారు. దక్షిణ మధ్య రైల్వే నుండి నడుపబడుతున్న భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలుకు ప్రయాణికుల నుండి మంచి స్పందన లభించడం పట్ల దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ సంతోషం వ్యక్తం చేశారు. ఐ.ఆర్.సి.టి.సి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి ప్రారంభమయ్యే "మహా కుంభ పుణ్య క్షేత్ర యాత్ర" భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు అనే మరో కొత్త పర్యాటక ప్యాకేజీని ప్రకటించింది.

డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌గా వైద్య విధాన పరిషత్

- అసెంబ్లీలో బిల్లు కోసం ఉద్యోగుల ఎదురుచూపు
- త్వరలోనే ఉత్తర్వులు వెలువడే అవకాశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌గా వైద్య విధాన పరిషత్ మారడం కోసం ఆ విభాగంలో పని చేస్తున్న దాదాపు 11 వేల మంది ఉద్యోగులు ఎదురుచూస్తున్నారు. ఈ సారి అసెంబ్లీ సమావేశంలో బిల్లు పెడతారనీ, ఆ మేరకు త్వరలోనే ఉత్తర్వులు వస్తాయని ఆశిస్తున్నారు. వైద్యారోగ్యశాఖలో వైద్య విధాన పరిషత్ విభాగంలో పని చేస్తున్న వారిది విచిత్రమైన పరిస్థితి. ఈ విభాగంలో డాక్టర్లు, నర్సులు, మెడికల్ స్టాఫ్ అంతా ప్రభుత్వం ద్వారానే నియమించబడతారు. ప్రభుత్వాస్పత్రుల్లోనే పని చేస్తారు. వీరికి జీతభత్యాల కోసం ప్రభుత్వమే నిధులిస్తుంది. పదవీ విరమణ తర్వాత పెన్షన్ కూడా ప్రభుత్వమే ఇస్తున్నా వీరు మిగిలిన వారిలా ప్రభుత్వ ఉద్యోగులు కాదు. ప్రభుత్వం ప్రత్యేకంగా కేటాయించే 'గ్రాంట్ ఇన్ ఎయిడ్' ద్వారా జీతభత్యాలు పొందుతారు. తమను కూడా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఎన్నో ఏండ్లుగా వారు ప్రభుత్వాలకు మొరపెట్టుకుంటున్నారు.

తెలంగాణ ఉద్యమ సమయంలో వీరి డిమాండ్‌ను నెరవేరుస్తామని బీఆర్ఎస్ (నాడు టీఆర్ఎస్) హామీ ఇచ్చింది. పదేండ్ల ఆ పాలనలో హామీ



నెరవేర్చలేదు. ఏడాదిగా కాంగ్రెస్ పాలనలో డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌ను మార్చే దానిపై ఉన్నత స్థాయిలో కదలికలు కనిపిస్తుండటంతో ఉద్యోగుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఈమారు అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు పెడతారనీ, త్వరలోనే ఉత్తర్వులు వెలువడ తాయని సమాచారం.

వైద్యారోగ్యశాఖలో వీవీపీ కీలక విభాగం. సీహెచ్‌సీ నుంచి జిల్లా ఆస్పత్రుల వరకు దీని పరిధిలోకి వస్తాయి. దాదాపు 175 ఆస్పత్రుల వరకున్నాయి. ఆయా ఆస్పత్రుల్లో డాక్టర్లు, నర్సులు, ఇతర స్టాఫ్ ఇందులో పని చేస్తున్నారు. సెకండరీ హెల్త్‌గా మార్పు కోసం ఆయా సంఘాలు జేఏసీగా ఏర్పడ్డాయి. ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తదితరులను కలిసి విన్నవించాయి..

జేఏసీ ఏర్పాటు ప్రభుత్వంపై ఒత్తిడికి పని చేసింది. సెకండరీ హెల్త్‌గా మార్పు అంశంపై వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఉన్నతాధికారులతో సమీక్షించారు. గతంలో రోగుల నుంచి యూజర్ చార్జీలు వసూలు చేసి జీతాలిచ్చేవారు. మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి హయాంలో వీవీపీ ఉద్యోగులకు గ్రాంట్ ఇన్ ఎయిడ్ నుంచి జీతభత్యాలిచ్చే ప్రక్రియ మొదలైంది. తెలంగాణ ఏర్పాటు తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికే వీవీపీని ప్రభుత్వంలో విలీనం చేశారు.

మా పోరాటం ఫలించింది : బైరపాక శ్రీనివాస్

వైద్యారోగ్యశాఖలోకి వైద్య విధాన పరిషత్‌ను తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తుండటంతో తమ పోరాటానికి ఫలితం దక్కిందని జేఏసీ కమిటీ మెంబర్ బైరపాక శ్రీనివాస్ (సీఐటీయూ) తెలిపారు. వైద్యవిధాన పరిషత్‌లోని అన్ని ట్రేడ్ యూనియన్లు, క్యాడర్ యూనియన్లు జేఏసీ ఏర్పడి రెండున్నరేండ్ల నుంచి ఉద్యోగ సంఘాలతో జేఏసీగా ఏర్పడి పోరాటాన్ని తీవ్రతరం చేసినట్టు తెలిపారు. దాదాపు 20 సంఘాలు జేఏసీలో భాగస్వాములుగా ఉన్నాయని చెప్పారు.



వరంగల్ నగరాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి : జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



వరంగల్ నగరాభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఆ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో జిల్లా అభివృద్ధిపై మంత్రి కొండా సురేఖ, ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా పర్యటనలో అక్కడి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఇచ్చిన హామీలను ప్రాధాన్యతా క్రమంలో చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఐఆర్ఆర్, ఓఆర్ఆర్, భద్రకాళి చెరువు, విమానాశ్రయం తదితర పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రతి ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్‌లను త్వరితగతిన తయారు చేయాలని వారికి సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. రింగ్ రోడ్డుకు, జాతీయ రహదారులతో కనెక్టివిటీ ఉండేలా చూడాలని కోరారు. ప్రాజెక్టుల భూసేకరణను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని సూచించారు. భద్రకాళి చెరువు శుద్దీకరణ పనులను వేగవంతంగా చేపట్టాలని ఆదేశించారు. ఈ సమీక్షలో మున్సిపల్ శాఖ కార్యదర్శి దానకిశోర్, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ శ్రీదేవి, మైనింగ్ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, వరంగల్, హన్మకొండ జిల్లాల కలెక్టర్లు డాక్టర్ సత్య శారదా, పి.ప్రావీణ్య తదితరులు పాల్గొన్నారు.

"నెట్-జీరో తెలంగాణ" నివేదికను ఆవిష్కరించిన గవర్నర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఢిల్లీకి చెందిన స్వానితి ఇనిషియేటివ్ సంస్థ రూపొందించిన "జస్ట్ ట్రాన్సిషన్ పాత్‌వేస్ ఫర్ ఎ నెట్-జీరో తెలంగాణ" పేరుతో రూపొందించిన నివేదికను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ బుధవారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. రాష్ట్రంలోని బొగ్గు ఆధారిత జిల్లాలైన పెద్దపల్లి, మంచిర్యాలలో అభివృద్ధి, భవిష్యత్తు, పునరుత్పాదక శక్తి, కొత్త పరిశ్రమలను ప్రోత్సహించడం, ఉపాధి తదితర అంశాలపై తీసుకోల్సిన చర్యలను నివేదికలో పొందుపర్చారు. "మూడింట ఒక వంతు కుటుంబాలు బొగ్గుపై ఆధారపడి జీవిస్తున్నారు. బొగ్గు రవాణా రంగంలో ఉద్యోగాలు. గృహాలే కాకుండా వ్యాపారాలు కూడా అభివృద్ధి చెందాయి. మంచిర్యాల జిల్లాలో 24 శాతం గృహాలు ఎన్టీపీసీ, సింగరేణి ద్వారా వైద్య బీమా కార్డులను కలిగి ఉన్నాయి.

ఈ రెండు జిల్లాల్లో ప్రతి పది గృహాల్లో ఒకరు సింగరేణి నీటి కనెక్షన్‌లపై ఆధారపడి ఉన్నారు. నివేదికపై చర్చించి భవిష్యత్ తెలంగాణకోసం తగు నిర్ణయాలు తీసుకునేందుకు ప్రభుత్వం టాస్క్‌ఫోర్స్ ఏర్పాట చేయాలి" అని నివేదిక పేర్కొంది. నెట్-జీరో ఆర్థిక వ్యవస్థ వైపు తెలంగాణకు ఈ నివేదిక ఒక రోడ్‌మ్యాప్‌లా ఉపయోగపడుతుందని స్వానితి ఇనిషియేటివ్ డైరెక్టర్ సందీప్ పాయ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి సురేష్‌ప్రభు. ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి జయేష్ రంజన్, స్వానితి ఇనిషియేటివ్ సందీప్ పాయ్, నివేదిక రూపకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సేవకుల్లా పనిచేయండి



- మాది పొలిటికల్ గవర్నెన్స్
- 15శాతం వృద్ధిరేటు లక్ష్యం
- జిల్లాల సమగ్రాభివృద్ధికి చొరవ చూపాలి : కలెక్టర్ల సదస్సులో చంద్రబాబు దిశా నిర్దేశం

అమరావతి :అధికారుల్లా కాకుండా ప్రజా సేవకుల్లా పని చేయాలని జిల్లా కలెక్టర్లకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దిశా నిర్దేశం చేశారు. సచివాలయంలో బుధవారం ప్రారంభమైన కలెక్టర్ల సదస్సులో వివిధ శాఖల పనితీరును ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రాధాన్యతలను, లక్ష్యాలను వివరించారు. ప్రజా ప్రతినిధులు కలెక్టర్ల దృష్టికి తీసుకొచ్చే సమస్యలకు ప్రాధాన్యమిచ్చి వెంటనే పరిష్కరించాలని అన్నారు. 'మాది పొలిటికల్ గవర్నెన్స్ .. ప్రతి సమస్యను పరిష్కరించాల్సిందే. ఆర్థికేతర సమస్యలన్నీ పరిష్కారం కావాలి.

ఈ విషయంలో రాజీ లేదు' అని చెప్పారు. 'వచ్చిన అర్జీలను ఆర్‌డిఓకో, తహసిల్దార్‌కో పంపితే సమస్య పరిష్కారమైనట్టు కాదు. సంతృప్తి కరమైన పరిష్కారం చూపాలి. ప్రజల్లో సంతృప్తస్థాయి తగ్గుతోందంటే ఆలోచించుకోవాల్సిన పరిస్థితి వస్తుంది.' అని చెప్పారు. ఈ విషయాలన్నింటిని దృష్టిలో పెటుకుని పని చేయాలని అన్నారు. ప్రజల నుంచి వచ్చే వినతుల్లో అత్యధికంగా 60శాతం భూ సంబంధితమైనవే ఉంటున్నాయని, అందుకే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దుచేసి దాని స్థానంలో ల్యాండ్ గ్రాబింగ్ ప్రొహిబిషన్ యాక్టును తీసుకొచ్చినట్లు తెలిపారు. పాలనలో కూడా స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ రావాలని, ప్రభుత్వ నిర్ణయాలను వేగంగా అమలు చేయాలని కలెక్టర్లకు సూచించారు. క్షేత్రస్థాయిలో పనిచేయని వాళ్లతో పనిచేయించాలని, అవసరమైతే కఠిన చర్యలు తీసుకోవాలని సిఎం స్పష్టం చేశారు. అమరావతి అభివృద్ధికి రూ.31వేల కోట్లు సమకూర్చామని, 2027నాటికి పోలవరం పూర్తి చేస్తామని తెలిపారు.

'వారి'ని క్షమించొద్దు...

ఎపి బ్రాండ్‌ను దెబ్బతీసిన వారిని ఎటువంటి పరిస్థితుల్లోనూ క్షమించవద్దని చంద్రబాబు అన్నారు. గత ప్రభుత్వంలో భూ అక్రమాలు, లిక్కర్ మాఫియా, ఇసుక దోపిడీ, గంజాయిసాగు, డ్రగ్స్ సరఫరా, ఎర్రచందనం స్మగ్లింగ్, రేషన్ బియ్యం విదేశాలకు అక్రమ రవాణా ఇలా అన్ని రంగాల్లోకి మాఫియా చొచ్చుకుపోయిందని, దానిని కూకటి వేళ్లతో సహా పెకిలించి వేయాల్సిన బాధ్యత కలెక్టర్లదేనని చెప్పారు. 'ఎక్కడా గత ప్రభుత్వ పాలనకు సంబంధించిన ఆనవాళ్లు కనిపించకూడదు' అని అనారు. విశ్వసనీయతను, నమ్మకాన్ని తిరిగి నిలబెట్టి రాష్ట్రానికి బ్రాండ్ ఇమేజ్ తీసుకురావాలని సూచించారు. గత పాలకులు పోర్టులు, సెజ్‌లు కూడా కబ్జా చేశారని, ఒకొక్క దానిని సరిదిద్దుతున్నామని చెప్పారు. కొన్నిసార్లు ఫలితాలు వెంటనే రాకపోవచ్చని, అలా అని నిరుత్సాహ పడకుండా పనిచేస్తే ఎప్పటికైనా అనుకున్నది సాధిస్తామని అన్నారు. పిడిఎస్ బియ్యం రీ సైక్లింగ్ చేసి కాకినాడ పోర్టు ద్వారా ఎగుమతులు చేస్తున్నారని, ఇటువంటి అక్రమ కార్యక్రమాలను నియంత్రించేందుకు అవసరమైతే పిడి యాక్ట్‌ను కూడా వినియోగించాలని అన్నారు.

13న విజన్-2047 ఆవిష్కరణ

స్వర్ణాంధ్ర విజన్ -2047ను ఈనెల 13న ఆవిష్కరిస్తున్నట్లు సిఎం చెప్పారు. రాష్ట్రం, జిల్లా, మండలం, పంచాయతీ స్థాయిలో విజన్ రూపొందించామని, దానికి అనుగుణంగానే పాలన సాగాలని అన్నారు. 15శాతం వృద్ధి రేటును లక్ష్యంగా పెట్టుకుని జిల్లాల కలెక్టర్లు ఫలితాలు రాబట్టాల్సి ఉంటుందన్నారు. 2022-23లో విశాఖపట్టణం జిడిపిఎస్ రూ.1,19,268 కోట్లు ఉండగా, అది 2028-29 నాటికి రూ.2,64,78 కోట్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు.

వెంటనే మేడిగడ్డ రిపేర్ పనులు పూర్తి చేయాలి

- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వెంటనే మేడిగడ్డ రిపేర్ పనులు పూర్తి చేసి రైతులకు యాసంగి పంటలకు సాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీ, బీఆర్ఎస్ నేత బోయినపల్లి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాదలోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎస్సారెస్పీ ఫేస్ 1,ఫేస్ 2కు నీళ్లు ఇవ్వలేము యాసంగి పంట తక్కువ వేసుకోవాలని అధికారులు చెబుతున్నారని తెలిపారు. ఇది పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం అని విమర్శించారు. రైతులకు యాసంగి పంట ముఖ్యమైనదనీ, మేడిగడ్డ ప్రాజెక్టుపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎందుకు నిర్ణయం తీసుకోవడం లేదని ప్రశ్నించారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ చేతిలో నిర్ణయం ఉందని ప్రభుత్వం అంటోందని ప్రభుత్వం చెబుతున్నదాంట్లో వాస్తవం లేదని కొట్టిపారేశారు. డ్యామ్ సేఫ్టీ చట్టంలో ఎక్కడా ప్రాజెక్టు రిపేర్లు చేయడానికి నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ పర్మిషన్ తీసుకోవాలని లేదని స్పష్టం చేశారు. వేల టీఎంసీల నీళ్లు సముద్రం పాలయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల యాసంగి పంటకు చివరి తడి నీళ్లు ఇవ్వలేని పరిస్థితి వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై పూర్తి అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని తేల్చిచెప్పారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీకి సూచనలుచేసే అధికారం మాత్రమే ఉందని వివరించారు. వేల టీఎంసీల నీళ్లు వెళ్లినా మేడిగడ్డ ప్రాజెక్టుకు ఏం కాలేదన్నారు. రిక్టర్ స్కేల్‌పై 5 .3 భూకంపం వచ్చినా మేడిగడ్డ ప్రాజెక్టుకు ఏం కాలేదని గుర్తుచేశారు. కేసీఆర్ ను బద్నాం చేయడానికే మేడిగడ్డ ప్రాజెక్టు కుంగింది అని చెప్పి కాంగ్రెస్ నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్ద ప్రాజెక్టు నిర్మాణంలో చిన్న తప్పులు జరగడం సహజమన్నారు. తప్పు జరిగితే చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధికారులతో వెంటనే సమీక్ష సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ తదితరులు పాల్గొన్నారు.

కేరళపై కేంద్రం వివక్ష

సంఘీభావ సభలో ఎఐకెఎస్ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్



అమరావతి : కేరళలోని వామపక్ష ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల ఆ రాష్ట్ర ప్రజల జీవన ప్రమాణాలు మెరుగ్గా ఉన్నాయని, అటువంటి రాష్ట్రంపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కత్తిగట్టినట్టు వ్యవహరించడం దారుణమని అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్ విమర్శించారు. కేరళ వామపక్ష ప్రభుత్వానికి, ఆ రాష్ట్ర ప్రజలకు మద్దతుగా సిఐటియు, ఎఐకెఎస్, ఎఐఎడబ్ల్యుయు ఆధ్వర్యాన సంఘీభావ సభ విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో బుధవారం జరిగింది. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి విజూ కృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అన్ని రంగాల్లో ప్రత్యామ్నాయ విధానాలతో కేరళ ముందుకు సాగుతోందన్నారు. అక్షరాస్యత, వైద్య సౌకర్యాలు, కనీస వేతనాలు, భూ పంపిణీ, పౌరసరఫరాల వ్యవస్థ, రైతు పంటకు మద్దతు ధర, కార్మికులు, వ్యవసాయ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలులో దేశంలోనే అగ్రగామిగా ఉందన్నారు. ఎనిమిది రకాల కూరగాయల పంటలతో సహా అన్ని పంటలకూ మద్దతు ధరలు ఇచ్చి అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రమని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో రైతు భరోసా పేరుతో ఇటీవల రైతులకు సహాయం చేస్తోందని, కానీ కేరళలో మొదటి నుంచి పంచాయతీల ద్వారా రూ.32 వేలు ఆర్థిక సహాయం రైతులకు అందిస్తోందన్నారు. వ్యవసాయ కార్మికులకు రోజువారీ వేతనం రూ.700, అసంఘటిత కార్మికులకు వెయ్యి రూపాయల కనీస వేతనం అమలు చేస్తుందన్నారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు రూ.14 వేల వేతనాన్ని అమలు చేస్తోందని చెప్పారు. ఎయిర్‌పోర్టును ప్రైవేట్‌వారికి కాకుండా తమకు అప్పగించాలని కేరళ ప్రభుత్వం కోరినా కేంద్రం నిరాకరించిందన్నారు. రాజ్యాంగం ప్రకారం కేరళకు కేంద్రం నుంచి రావాల్సిన నిధుల్లో కోతలు విధిస్తుందని అన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను స్తంభింపజేయడం వల్ల ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయాలన్న ఉద్దేశంతోనే ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. ఎపికి జగన్ ప్రభుత్వ హయాంలో రుణ పరిమితులు విధించని కేంద్రం, కేరళకు మాత్రం విధించిందని చెప్పారు. వయనాడ్‌లో సంభవించిన ప్రకృతి విపత్తులో వందల మంది మరణించడంతో పాటు వేలకోట్ల ఆస్తి నష్టం జరిగిందని, అయినా జాతీయ విపత్తు నిధి నుంచి కేరళ రాష్ట్రానికి కేంద్రం రూపాయి కూడా సహాయం చేయలేదన్నారు. కేరళ సహకార వ్యవస్థను ధ్వంసం చేసి సహకార రంగాన్ని తన గుప్పెట్లో పెట్టుకునేందుకు కేంద్రం నేషనల్ మల్టీస్టేట్ కో-ఆపరేటివ్ విధానాన్ని ముందుకు తీసుకొస్తోందని, దీనిని ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. అసెంబ్లీలో ప్రభుత్వం చేసిన చట్టాలను ఆమోదించకుండా గవర్నర్ ద్వారా అడ్డుకుంటూ ఆ వ్యవస్థను దుర్వినియోగం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ రాజ్యాంగ వ్యతిరేక, నిరంకుశ విధానాలను ప్రతిఘటించి కేరళ ప్రజలకు సంఘీభావంగా నిలవాలని ఆయన కోరారు.ఎపి రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అన్ని రంగాల్లో కార్పొరేట్ అనుకూల, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ సంపదను అదాని, అంబానీలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ కట్టబెడుతున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి... మోడీ, అమిత్‌షా చేతిలో తోలుబొమ్మలుగా ఉన్నారని విమర్శించారు. నూతన విద్యా విధానాన్ని అమలు చేయలేదని తమిళనాడుకు ఇవ్వాల్సిన నిధులను కేంద్రం ఇవ్వడం లేదన్నారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు దడాల సుబ్బారావు మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకాన్ని పట్టణాల్లో కూడా అమలు చేస్తున్న రాష్ట్రాల్లో కేరళ, తమిళనాడు మాత్రమే ఉన్నాయని చెప్పారు. ఈ సభలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కార్యదర్శి పి ప్రభాకర్ రెడ్డి, ఎపి కౌలు రైతు సంఘాల కార్యదర్శి ఎం హరిబాబు ప్రసంగించారు.